# శ్రీబృందావన మహిమామృతము

## తృతీయ భాగము





శ్రీ రాధాదేవి



శ్రీ ప్రబోధానంద సరస్వతీపాదులు



శ్రీ రాధికా ప్రసాద్ మహరాజ్

# శ్రీబృందావన మహిమామృతము

తృతీయ భాగము

మూలము

**శ్రీప్రబోధానంద సరస్వతీపాదులు**

అనువాదము

**రసమణి**

ప్రకాశకులు

**శ్రీరాధా మహాలక్ష్మి ఆశ్రమం**

శ్రీ బృందావన ధామం, మధురజిల్లా

ఉత్తరప్రదేశ్

సర్వస్వామ్య సంకలితము
ప్రథమ ముద్రణ **జనవరి, 2021**
ప్రతులు : 100

**వెల : అమూల్యము**

ప్రతులకు
**1) శ్రీరాధాకృష్ణ మందిరము**
5/5 అరండల్‌పేట,
గుంటూరు - 522 002
ఫోన్ : 0863-2233933

**2) శ్రీరాధా మహలక్ష్మి ఆశ్రమ్**
బడేకుంజ్, గోపేశ్వర్ ఆలయ వీధి,
బృందావన్ **(U.P.)** - 281 121
ఫోన్ : 0565-2442583

ముద్రణ : **శ్రీలక్ష్మీగణపతి ఆర్ట్ ప్రింటర్స్,** 2/4, బ్రాడీపేట, గుంటూరు.
ఫోన్ : 0863-2235036

డి.టి.పి. : **శ్రీవల్లి గ్రాఫిక్స్,** గుంటూరు. సెల్ : 9966043946.

శ్రీరాధే

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| | అమ్మమాట | v |
| | ముందుమాట | viii |
| 1. | పన్నెండవ శతకము | 1 – 39 |
| 2. | పదమూడవ శతకము | 40 – 87 |
| 3. | పదునాల్గవ శతకము | 88 – 130 |
| 4. | పదిహేనవ శతకము | 131 – 177 |
| 5. | పదహారవ శతకము | 178 – 216 |
| 6. | పదిహేడవ శతకము | 217 – 267 |



శ్రీరాధే

# అమ్మమాట

**12.7.2020, 5.20 A.M.,**

**గుంటూరు ఆశ్రమం.**

పరమపూజ్యులైన నాన్నగారి దివ్య ఆశీస్సులతో! ఆయన పొందిన బృందావన రసామృతం, ఆధామము యొక్క విశేషం, ఆ బృందావన ధామం రాధాజీ రూపమని మనకి తెలియపరిచారు. “బృందావనమే నీ రూపంబు కాదే” అంటూ బృందావనం అమ్మరూపమని చెప్పారు. రాధాజీ రసప్రదాయిని! ఆ అమ్మ రసంతో పరిపూర్ణంగా నిండిన ధామం బృందావనం! అందుకనే నాన్నగారు ఆధామం యొక్క ప్రేమభావంతో “ధన్యనైతిని దేవి రాధరో” అని మొట్టమొదట బృందావనం దర్శించినపుడు ఆ ధామ విశేషాన్ని పొందుపరిచారు.

“నీ ప్రేమ మహిమచే రారాజులెందరో అశ్రుధారలు గార్చు జోగులగు చున్నారు” అంటూ నాన్నగారు అమ్మ ప్రేమభావాన్ని పొందిన రాజులు, రసికమహాత్ములు, భావుకులు, ఆశ్రితులు అందించిన రసానుభవమును అందించారు. నాన్నగారు ఆ ధామంలో అమ్మ యొక్క అనుభూతులు ఎన్నో పొంది ఉన్నారు.

మహాత్ములైన ప్రబోధానందసరస్వతీపాదులు బృందావన మహిమామృతాన్ని ఎంత వర్ణించినా, ఎంత రసానుభూతిని పొందినా తనివి తీరక; దానిని గురించి అనేకమైన సరళగతులతో భావాన్ని భావానుసారంగా వారు తిరిగి తిరిగి వర్ణించి వ్యక్తపరిచారు. ఏ శ్లోకం చూచినా మళ్లీ మళ్లీ అదే వచ్చిందని అనిపిస్తున్నా, భావరీతిలో చాలా లోతుకి వెళ్లిపోతున్నది.

బృందావనం యోగ్యతలేనివానికి కూడ యోగ్యతను కల్పిస్తున్నది. బృందావనం రాధాకృష్ణులకు అనుగుణంగా, వారి భావానుసారంగా వారికి సేవ చేసుకుంటున్నది. ఆ భావం, ఆ దివ్యమైన వైభవం, దివ్యమైన శోభ, ఆ మాధుర్యం శ్యామాశ్యాముల యొక్క దివ్యమైన లీలా విశేషం చేతనే అన్నీ బృందావన ధామంలో నిండి ఉన్నాయి. అక్కడ సూర్యుడు లేడు, చంద్రుడు లేడు, అగ్ని లేదు. ఎప్పుడూ దివ్య ప్రకాశంతో విరాజమానమై ఉన్నది. ఇలా ఉండటానికి కారణం రాధాగోవిందుల యొక్క దివ్యప్రకాశం ఉండటం, వారి లీలా విశేషం! అచట ఉన్న స్థావర జంగమములు, వృక్షములు, పక్షులు, సరస్సులు, బావులు, కుండ్లు ఇవి అన్నియు వారికి ఆనందమును చేకూర్చుటకై భావంతో సేవ చేస్తూ ఉంటాయి.

బృందావనంలో నివసించవలెనంటే ఏకైక మార్గం రాధానామం! రాధానామాన్ని స్మరిస్తేనేకాని ఆధామంలో నివసించటానికి అవకాశం దొరకదు. ఎందుకంటె బృందావనం అంటే రాధ, రాధ అంటే ధార, ధార అంటే నిరవధికంగా ప్రవహించే ఒకానొక రసధార! రసధారయైన రాధను స్మరిస్తేనే బృందావనానికి ప్రీతి! అచట నివసించటానికి అవకాశం!

అధములైన జీవులను సంబోధిస్తూ శ్రీప్రబోధానందులు తమ మీద ఆరోపించుకుంటూ, జీవులను ఉద్ధరించటానికై కర్కశంగాను, కఠినంగాను, ప్రేమగాను, లాలింపుగాను చెప్తూ; బృందావనంలో నివసించటానికి, స్మరించటానికి అమృతమైన వాక్కులను అందించారు. వారు రాధాగోవిందులను దర్శించి, సేవించుకొనటానికి ఎంతో భావయుక్తంగా వ్యక్తపరచిన విథము హృదయానికి హత్తుకొనినది. “బృందావన మహిమామృతం” గ్రంథం మొత్తం చూస్తే, రాధాజీ అనుగ్రహాన్ని పొందితేనే బృందావనంలో నివసించటానికి

యోగ్యత కలుగుతుందని స్పష్టం ఔతుంది. శ్రీరాధాజీ కరుణామయి, దయామయి, ప్రేమమయి, వాత్సల్యమయి! యోగ్యతాయోగ్యతలు చూడకుండ అక్కున చేర్చుకొనే తల్లి!

ప్రబోధానంద సరస్వతీపాదులు రాధాజీకి, బృందావనానికి అనుసంధానం కలిగించారు. ఎంత చిత్రమో చూడండి! రాధాజీ శ్యామసుందరునికే కాక; సఖియలకి, బృందావనానికి, రసికభక్తులకి, ఆశ్రితులకి, యోగ్యత లేనివారికి అందరికీ రసాన్ని ప్రసాదించింది. అలాంటి రాధాజీయే బృందావన స్వరూపం! కాబట్టి రసప్రదాయిని శ్రీరాధ! శ్యామసుందరుడికి ఆనందాన్ని చేకూర్చే ఆనంద ప్రదాయిని! ఎందుకంటే ఇంతమందికి ఇన్ని విధాలుగా రసాన్ని ప్రసాదిస్తుంటే ఆయనకి మహా ఆనందం! అందుకే అమ్మకి నమస్కరిస్తున్నాడు. పాదధూళిని శిరసున ధరిస్తున్నాడు.

శ్యామసుందరుడు రసాన్ని పొంది, ఆ రసానుభూతి వలన రాధా భావయుక్తుడైపోతున్నాడు. ఆయన పొందుతున్న ఆ భావం, ఆ ఆనంద రసానుభూతియే అమ్మకి ప్రీతి! ఈ అన్యోన్య రసానుభూతియే ఏక స్వరూపం అయింది. ఆ ఏక స్వరూపం యొక్క రూపమే బృందావనం! అట్టి బృందావనానికి, ప్రబోధానంద సరస్వతీపాదులు ఇచ్చిన అమృతరస ప్రవాహానికి కోటికోటి నమస్కారాలు!

**జయ జయ శ్రీరాధే!**

**శ్రీరాధాసఖీచరణ కమల రేణువు**

శ్రీరాధే

# ముందుమాట

**"నమామి వృందావనమేవ మూర్ధ్నా వదామి వృందావనమేవ వాచా**
**స్మరామి వృందావనమేవ బుద్ధ్యా వృందావనాదన్యదహం న జానే"**
**17-95**

'నేను శిరసువంచి బృందావనానికే నమస్కరిస్తాను. బృందావనాన్నే కీర్తిస్తాను. నా బుద్ధి బృందావనాన్నే స్మరిస్తుంది. శ్రీబృందావనం తప్ప అన్యమేదీ నాకు తెలియదు.'

శ్రీ ప్రబోధానందుల బృందావననిష్ఠ దాదాపు అన్ని శ్లోకాలలోను ప్రకటితం అయింది. బృందావన మహిమను, గరిమను ఎంత వర్ణించినా ఆ మహాత్మునికి తనివితీరలేదు. యోగులకు, మహర్షులకు, బ్రహ్మర్షులకు, బ్రహ్మాదిదేవతలకు కూడ శ్రీబృందావనం అలభ్యమని వారు 17 శతకాలలోను చాటి చెప్పారు. రసగురుదేవులైన నాన్నగారి దివ్య సంకల్పం వలననే ఆ గ్రంథం కంటపడింది. దానిని చదివి అందరం ఆ ఆనందాన్ని పంచుకొనే భాగ్యం అంజనీ అమ్మ వలన మనకు కలిగింది.

శ్రీరాధారసోపాసనా మార్గంలోకి ప్రవేశించటానికి అనుమతి పత్రం శ్రీబృందావనం! బృందావన స్పర్శలేకుండా, ఆ రుచి తెలియకుండా శ్రీరాధాగోవిందుల జీవకల్యాణ లీలల లోతు తెలియటం అసంభవం! శ్రీయుగళానికి అత్యంత ప్రీతికరమైన బృందావనం కేవల జడవస్తువుకాదు, మహా చైతన్య స్వరూపం! "బృందావన మహిమామృతము" ద్వారా అమ్మ మనని బృందావనానికి రమ్మని పిలుస్తున్నది. గురుకృపతో మనం ఆ పిలుపుని వినగలగాలి! 'ఎప్పటి వరకు శ్రీబృందావనం పట్ల పూర్ణనిష్ఠ కలుగదో అప్పటి వరకు శ్రీరాధా చరణ కృప కూడ పూర్ణరీతిలో లభించదు' అని శ్రీ ప్రబోధానందులు స్పష్టంగా చెప్పారు. కనుక శ్రీరాధ, శ్రీబృందావనం,

శ్రీరాధాసఖిరూప గురుదేవులు అన్యోన్య ఆశ్రితమై ఉన్నారు. శ్రీరాధలోనే శ్రీకృష్ణచంద్రుడు, సఖీమణులు వెలుగొందుతున్నారు.

సద్గురు కృప వలన బృందావనం పట్ల మహాప్రీతి కలిగితే బృందావనేశ్వరియైన శ్రీరాధాజీ తప్పక లభిస్తుంది. ఇది మహాత్ముల వాణి! శ్రీబృందావన పరిక్రమ చేస్తే చాలు, కోటి తీర్థయాత్రలు చేయటం కన్న అధిక ఫలము! శ్రీబృందావనము మీదుగా వీచిన వాయు స్పర్శ మాత్రమున ఘోర నరకం నుండి విముక్తి లభిస్తుందట! ఇక బృందా పరిక్రమ మహాఫలాన్ని ఊహించగలమా!

"శ్రీబృందావన మహిమామృతము" దివ్య రసగ్రంథము! అటువంటి గ్రంథాన్ని చదవగలగటం గొప్పభాగ్యం! చదవటం కన్న శ్రవణం చేయటం వలన మరింత ఆనందం కలుగుతుంది. ఇక గురుముఖతః వింటే, ఆ వినటం కూడా వ్యాఖ్యానపూర్వకంగా ఉంటే అదెంత మహాభాగ్యమో చెప్పలేము. మన గురుమాత అంజనీ అమ్మ ఆ శ్లోకాల భావాన్ని వ్యాఖ్యానించి చెప్తుంటే వినగలిగిన మహా అదృష్టవంతులం మనం! సాక్షాత్తు శ్రీరాధాకృష్ణులే "జయహో" అంటూ శ్రీబృందావనాన్ని స్తుతిస్తూ ఉంటారుట! ఏలీలను శ్రీరాధాకృష్ణులు ప్రకటిస్తారో అది బృందావనముతోను, సఖీబృందముతోను కూడి ఉంటుంది. ఈ నలుగురితో కూడి ఉన్న లీల రసపరిపుష్టమై ఉంటుంది. అటువంటి రసపరిపుష్టలీలలు 'శ్రీబృందావన మహిమామృత' గ్రంథం అంతట నిండి ఉన్నాయి.

"శ్రీబృందావన మహిమామృతము" అనే సంస్కృత గ్రంథాన్ని గురుదేవుల అనుగ్రహంతో తెలుగులోకి అనువదించుకున్నాము కదా! ఇది 12వ శతకము నుండి 17వ శతకము వరకు ఉన్న మూడవ భాగము! శ్రీ ప్రబోధానందులు ఈ దివ్యగ్రంథాన్ని నూరు శతకాలుగా రచించారు. దురదృష్టవశాత్తు కాల ప్రవాహంలో కొట్టుకొనిపోయినవిపోగా, అదృష్టవశాత్తు

కనీసం పదిహేడు శతకాలు లభించాయి. పరిష్కర్తలు ఎంతో శ్రమించి ఈ గ్రంథాన్ని మనకి అందించారు. దానిని మనం పఠన సౌకర్యార్థం మూడు భాగాలుగా ప్రింటు చేసుకున్నాము. మొదటి రెండు భాగాలలో వలెనే ఇందులో కూడ చాలా చోట్ల ఛందోభంగము జరిగినది. కాల ప్రవాహంలో ఎన్నో అక్షరాలు అక్కడక్కడ లుప్తమై ఉంటాయి. లభించినది లభించినట్లు అందించటమే పరిష్కర్తల అభిప్రాయమై ఉండవచ్చును. ఈ గ్రంథము మూడు భాగములలోను అచ్చుతప్పులు అనివార్యమైనాయి. మన్నింప ప్రార్థన! శ్రీబృందావన మహాత్ములైన శ్రీశ్యామదాసజీ ఈ దివ్య గ్రంథ శ్లోకాల భావాన్ని హిందీలో అందించారు. వారు 17వ శతకమునకు మాత్రము ప్రతి శ్లోకానికి వ్రజభాషలో కూడ భావం వ్రాశారు. అటువంటి మహాత్ముల కృషివలననే ఈ దివ్యగ్రంథం లభించింది. వారికి వినయపూర్వక నమస్కృతులు!

ఈ మహాభాగ్యమునకంతటికీ మన రసగురుదేవులైన శ్రీరాధికాప్రసాద్ మహరాజ్ మూల కారణము! రాధాసఖియైన వారి చరణ సన్నిధికి చేరటమంటే బృందావన సన్నిధికి చేరటమే! మనందరికీ గురుచరణ సన్నిధి లభించును గాక అని గురుదేవులను ప్రార్థిస్తున్నాను.

సంస్కృత శ్లోకములలో సందేహ నివృత్తికి శ్రీమతి స్వరాజ్యలక్ష్మి భక్తిశ్రద్ధలతో సహకరించారు. ఆమెపై నిరంతరం గురుకృప వర్షించాలని కోరుకుంటున్నాను.

**భగవన్మందిరకాంతిపుంజములు భావప్రోజ్వలజ్యోతులై**
**నిగమాంతోపరి తత్వసుందరికి శ్రీనీరాజనమ్మిచ్చునే**
**సగుణమ్మోమరి నిర్గుణమ్మోరస సచ్చారిత్రమున్ దెల్పునౌ**
**నె! గుణాతీతము భావమోహనము వర్ణింపంగరాదేరికిన్**

**సదా శ్రీరాధాసఖీ చరణకమల సన్నిధిలో,**

**రసమణి**

# పన్నెండవ శతకము

**రాధాఽఽరాధన నిష్ఠస్యాంతస్తాపో నయాతి మే శాంతిమ్**
**వృందావనతః పరతోఽన్యరుజామివకిం భవేచ్చికిత్సాఽన్యా** 1

శ్రీబృందావనమును విడచి అన్యప్రదేశములో నివసిస్తూ, శ్రీరాధా ఆరాధనను నిష్ఠతో చేస్తున్నా కూడ నా అంతఃకరణలో తాపము శాంతించుట లేదు. ఒక రోగముతో పీడింపబడుతున్న వ్యక్తికి ఆ రోగమునకు నిర్దిష్టమైన ఔషధమును ఇచ్చుట కాక, అన్యమును ఇచ్చుట ద్వారా చికిత్స జరుగుతుందా ?

శ్రీరాధాజీకి రెండవ రూపమైన శ్రీబృందావనములోనే శ్రీరాధా ఆరాధన పరమశాంతిని ఇస్తుంది. అన్యత్ర ఎన్ని నియమ నిష్ఠలతో రాధాజీని ఆరాధించినా తాపము తీరదు. కనుక, బృందావనములోనే జీవిస్తూ, బృందావనేశ్వరిని సేవించాలి అని భావము!

**శ్రీరాధామాధవయోర్యథా కదాచిన్న సంభవేత్ విరహః**
**తద్రస వృందావనయో స్తథైవ పరమోఽవినాభావః** 2

శ్రీరాధామాధవులకు వియోగమన్నదే ఎట్లు సంభవము కాదో అదే విధముగా శ్రీయుగళకిశోరుల మధుర రసమునకు, బృందావనమునకు నడుమ పరమ అవినాభావ సంబంధము వెలుగుతూ ఉంటుంది.

అనగా శ్రీయుగళమునకు, శ్రీబృందావనమునకు ఎన్నటికినీ వియోగమన్నదే లేదు. వారు లేకుండ బృందావనము లేదు, బృందావనము లేకుండ వారు లేరు.

**అలంతే శాస్త్రౌఘైరపి సువిదితై ర్వ్యక్త వచనైః**
**మహద్భిశ్చాలం తేయ ఇహ న విదోవేత్య నిగరః**
**అలం చ స్వాభ్యూహైరతి పరమ దుర్గ ప్రసరణైః**
**అనాశంకం వృందావన భువి నివాసం కురు సఖే** 3

ఓ సఖా! నీకు అనేక శాస్త్రములు తెలుసుకొనవలెనను ఆవశ్యకతలేదు. శ్రీబృందావన విషయములో పాండిత్యము అక్కరలేదు. వాక్యములను నేర్పుగా కూర్చు మహాపురుషుల మాటలతో ఏమియు ప్రయోజనము లేదు. అత్యంత కఠినమైన తర్క, వితర్కముల ఆవశ్యకత కూడ లేదు. కేవలం శ్రీబృందావనములో ఏశంకలు లేని చిత్తముతో నివసించు!

శ్రీబృందావనములో నివసించుటకు కావలసిన ఏకైక యోగ్యత శ్రీరాధాకృష్ణుల పట్ల ప్రేమభక్తియే!

**అధీతం కిం శాస్త్రం గృణదమితి వృందావన గుణమ్**
**స్వధీతం కిం తత్వం ద్వయమధుర వృందావన రతిః** **4**

శ్రీబృందావనము యొక్క అనంతగుణములను విస్తరింపజేయు శాస్త్రమును నీవు చదివితివా ? శ్రీయుగళ కిశోరులను గూర్చిన, శ్రీబృందావనమును గూర్చిన ప్రీతిరీతి తత్వమును తెలుపు శాస్త్రమును కూడ నీవు చాలా చక్కగా చదివితివా ఏమి ?

అనేక శాస్త్రముల పఠనము వలనను, తర్కవితర్కములతోను శ్రీరాధాకృష్ణులు, శ్రీబృందావనము లభించుట కల్ల! ఆ ప్రీతిరీతిని బృందావన అనుగ్రహముతో లోలోన అనుభూతి చెందవలసినదే తప్ప, దానిని నిర్వచించు శాస్త్రములు లేవు. వేదములే 'నేతి నేతి' అంటూ నమస్కరించాయి.

**వృందావనే జలదజాల సమాకులాయామ్**
**దిశ్యుల్లసత్తడితి కృష్ణరసోన్మదానామ్**
**ఆదావభూత్ విరలోద్గలదంబుధారమ్**
**నేత్రాంబుజమ్ గగన మండలమాస పశ్చాత్** **5**

శ్రీబృందావనములో విద్యుల్లతతో ఆవరింపబడిన మేఘమాల వెలుగొందుతున్నది. దాని నుండి అన్ని దిక్కులలోను శ్రీకృష్ణ రసోన్మత్తులైన జీవుల

నేత్రకమలములనుండి అశ్రువులు జాలువారుతున్నాయి. ఇంకను, గగన మండలము నిరంతరముగా జలవృష్టిని (జలధారలను) కురిపిస్తున్నది.

శ్రీబృందావనములో ఏర్పడు విద్యుల్లతలు, మేఘములు, ఆకాశము అన్నియు అప్రాకృతికమైన దివ్యసాధనములే! ఆ సాధనములతో శ్రీకృష్ణప్రేమికులు ఎంతగా రసోన్మత్తులై వివశత్వమును పొందుతారో శ్రీప్రబోధానందులు ఆలంకారిక శైలితో వర్ణించినారు.

**ఆయుర్విత్క్య చపలాచపలాయమానం**
**స్త్రీ పుత్ర విత్త భవనాద్యమసన్నిరుప్య**
**రాధాంకభూషణమనన్య వశం విమృశ్య**
**వృందావనం సహ హృదాఽనుసరంతి ధన్యాః 6**

ఆయువు మెరుపు తీగ వలె అతి చంచలమని ఎరిగి; భార్యాపుత్రులు, ధన గృహాదికములు అసత్యములని (మిధ్య అని) తెలుసుకొని; శ్రీరాధాజీకి భూషణమైన శ్రీశ్యామసుందరునికి అనన్యముగా వశమైయుండు మహాభాగ్యశాలియే మనసులో శ్రీబృందావనమును అనుసరిస్తాడు. అనగా అతడు మానసికముగా నిరంతరము బృందావనములోనే ఉంటాడని తాత్పర్యము!

**నేమద్దూరాత్ వృందావనమను సకృత్ యస్య హి**
**శిరః స వైకుంఠ కుంఠీకృత కఠిన మాయే నివసతి**
**ప్రవిశ్యై తత్ యేనోజ్జ్వల మదనగోపాల వదనాం**
**బుజం దృగ్భ్యాం పీతం తమిహ ఖలు రాధా కృపయతి 7**

శ్రీబృందావనమునకు దూరము నుండియే శిరసు వంచి ఒక్కమారు నమస్కరించిన వ్యక్తి వెంటనే కఠినమైన మాయ నుండి బయటపడి, వైకుంఠములో నివసింపగలుగుతాడు. శ్రీబృందావనములో ప్రవేశించి, శ్రీమదనగోపాలుని ముఖకమల దర్శనామృతమును పానము చేసిన వ్యక్తి అక్కడే, అప్పుడే శ్రీరాధా కృపను పొందుతాడు.

**కుర్వన్నైవ వృథాగ్రహం క్వచిదపి ద్వైతేఽత్ర మాయామయే**
**స్వస్యాత్యంత సుదుఃఖతోఽపి జనయన్ కస్యాపి నైవాప్రియమ్**
**నిత్యాంతర్ముఖ దృష్టిరేక రసధీః శ్రీరాధికాకృష్ణయోః**
**శ్రీవృందావనమావసామి సకల ప్రాణ్యైక సద్వల్లభః 8**

'మాయామయమైన ఈ ద్వంద్వ వస్తువుల యందు ఎన్నడును వృథా కుతూహలము వలదు. దుస్సహమైన దుఃఖము కలిగినను ఇతరులకు కొద్దిపాటి హానిని కూడ చేయరాదు. అంతర్దృష్టిని కలిగి, శ్రీరాధాకృష్ణుల రసమునందే ఏకమాత్రముగ చిత్తమును నిలుపుకొనాలి. సమస్తప్రాణులకును మంచినే చేయాలి'. ఈ విధముగా ప్రవర్తించి నేను బృందావన నివాసమును పొందగలను!

శ్రీబృందావన నిత్యనివాసము లభింపవలెనన్న ద్వంద్వములకు అతీతమై, అంతర్దృష్టితో శ్రీయుగళము నందే మనసును నిలుపుకొనవలెనని శ్రీప్రబోధానందులు తెలిపినారు.

**స్త్రీషు స్తన్యప తోకవత్ స్వతిథివత్ గేహేఽథ దేహేఽపి చ**
**ద్వేషం సంతతమాచరత్స్వపి తను వాణీ హృదా మిత్రవత్**
**రాధాపన్నఖచంద్రికాంచిత లతా వృక్షే చకోరశ్చరన్**
**శ్రీవృందావిపినే భవాని సకల ప్రాణిష్వహ మాతృవత్ 9**

స్త్రీల పట్ల పాలు త్రాగు బాలునివలెను, తన ఇంటిలో తానే అతిథిగను, నిరంతరము ద్వేషించు వారిపట్ల త్రికరణశుద్ధిగా మిత్రుని వలెను ఉండాలి! శ్రీరాధా పద నఖ చంద్రికలచేత వృద్ధి చెందుతున్న లతలు, వృక్షముల పట్ల చకోరమువలె సంచరిస్తూ, సమస్త ప్రాణుల పట్ల తల్లివలె స్నేహశీలియై ఉంటే బృందావనములో నివసింపగలనా!

ఈ శ్లోకములో కూడ శ్రీ ప్రబోధానందులు బృందానిత్యనివాసభాగ్యము లభింపవలెనన్న ఉండవలసిన లక్షణములను చెప్పినారు.

**పీయూషద్రవసార వృష్టిభిరివ బ్రహ్మామృతౌఘైరివ**
**ప్రాలేయాంశు మరీచి వీచిభిరివస్వర్ సింధుపాతైరివ**
**తీవ్రోదార రసాసరిదివ లసత్ కర్పూర పూరైరివాఽ ఽ**
**పూర్ణా మే మతిరస్తు జీవనతయా వృందాటవీసేవినః 10**

జీవన ధనమైన శ్రీబృందావనము పట్ల సేవక బుద్ధితో ఉన్నాను. అమృత సారవృష్టిగాను, బ్రహ్మామృత ప్రవాహముగాను, చంద్రకిరణ తరంగములుగాను, గంగానదీ ధారగాను, ఉదారమైన రస సుధాప్రవాహముగాను, ఉజ్వలమైన కర్పూర ప్రవాహముగాను, పూర్ణస్వరూపిణిగాను నామనసు ఉండునుగాక!

**శ్రీవృందావన తద్గత స్థిరచరాన్ స్వానంద సచ్చిద్ఘనాన్**
**త్రైగుణ్యాస్పృశ ఆప్లుతాన్ హరిరసోద్వేలామృతైకాంబుధౌ**
**పశ్యంతో విలసంతి సంత ఇహ కోఽ ప్యాశ్రిత్య సర్వాత్మనా**
**శ్రీరాధా చరణారుణాంబుజదల చ్ఛాయాం మహాయోగినః 11**

శ్రీబృందావనము, అందలి స్థావర జంగమములు స్వానంద సచ్చిద్ఘన స్వరూపములై, మాయాతీతములై, హరిరసమునందు ఎగసిపడుచున్న అమృత సాగరములో తేలియాడుచుండును. అది చూచి ఎందరో మహాయోగులు శ్రీరాధా చరణ కమల ఛాయను సర్వాత్మనా ఆశ్రయించి శ్రీబృందావనములో ఉండిపోయినారు.

**ధిక్ ధిజ్ మామిహ దేహ గేహ మమతావిష్టం తథైవా సుతృప్**
**లోకారాధన సాధన ప్రణయినం క్షుద్ర స్తవోత్ఫుల్లితమ్**
**హస్తప్రాప్యమిదం మహారసఫలం శ్రీశాదిభిర్దుర్లభమ్**
**శ్రీవృందావన నామ నిత్యరుచిమన్నాదాయ సంస్వాదయే 12**

శ్రీబృందావనములో నివసిస్తూ కూడ దేహ, గృహాదుల పట్ల మమతతో ఉన్న నాకు ధిక్కారమగునుగాక! (అనగా అందరును ఛీ అని తిరస్కరింతురుగాక

అని భావము.) మనసుకు తృప్తి కలిగించు లోకమును ఆరాధించుట నాకు ఇష్టము. వారు చేయు సామాన్యమైన ప్రశంసకే నేను ప్రఫుల్లితుడినౌతాను. నాకు శతశత ధిక్కారములగును గాక! ఎందుకంటే లక్ష్మి, నారాయణాదులకు కూడ దుర్లభమైన ఈ మహారసఫలరూపము నాచేతికి అందినది. నిరంతరము రుచికరమైన అట్టి శ్రీబృందావన నామక వస్తువును పొంది కూడ నేను దానిని సమ్యక్ ప్రకారముగ ఆస్వాదింపలేకపోతున్నాను.

**రే లోకా ఉపదిశ్యతేఽతి కృపయా కించిన్మయా శ్రూయతామ్**
**సర్వార్థాన్ సహసాఽఽద్రుతాన్ యది మహైశ్వర్యాపితానీశథ**
**నిర్మర్యాద విచిత్ర శక్తిభిరిహ స్వచ్ఛంద ఖేలం సదా**
**శ్రీవృందావనమస్తి తత్ వ్రజ సకృద్రాధేశ్వరీ నిర్భయమ్** **13**

ఓ జీవులారా! నేను ఒక ఉపదేశం చేస్తున్నాను, దయతో దానిని వినండి! ఒకవేళ మీకు మహైశ్వర్యరూపమైన సమస్త పురుషార్థములను శీఘ్రముగ పొందవలెనను ఇచ్ఛ ఉన్నదా! ఉంటే ఎల్లలు లేని విచిత్రశక్తితో కూడిన స్వచ్ఛంద భావముతో క్రీడించుచు బృందావనములో విరాజమానమైన శ్రీరాధాజీ యొక్క అభయమును పొందండి!

**అహో వృందారణ్యోజ్జ్వల మదన గోపాల వదనో**
**ల్లసచ్చంద్రాలోకాత్ బత కిమిహ లోకా విరమత**
**అయం మూర్ధాఽత్యద్ధా సకల ఫల సిద్ధానుదయతా**
**ముపాయానాం పంచస్వపి చ పురుషార్థేషు పరమః** **14**

ఓ మానవులారా! శ్రీబృందావనములో మదనగోపాలుని ముఖచంద్రుని దర్శనము నుండి వంచితులు ఔతున్నారా ? (అనగా దర్శించుకొనలేకపోతున్నారా.) అత్యంత శీఘ్రముగ సకల ఫలములను ప్రాప్తింపజేయగల సమస్త సాధనలలో అదియే (శ్రీమదనగోపాలుని దర్శనము) సర్వప్రధానము! అయిదు పురుషార్థములలోను అదియే పరమ పురుషార్థము!

**అయే మదనమోహనోద్ధసిత వక్త్రచంద్రచ్ఛటా**
**సుధౌఘ కృత సేచనం కురుత లోచనం జన్మినః**
**అమంద రసమందిరే తదతి లుబ్ధముగ్ధేందిరే**
**సుతప్తమతి నిర్వృత్తిం నయత మంక్షు వృందావనే 15**

ఓ జీవులారా! మదనమోహనుని నగుమోము నుండి వెలువడుతున్న చంద్ర కాంతి సుధా ప్రవాహములో కన్నులను తడుపుకొనండి! లక్ష్మీదేవిని కూడ మోహింపజేయు మనోహరము, మహారసభాండాగారమునైన శ్రీబృందావనములో అత్యంత శీఘ్రముగా తపస్సు చేసి జీవితములో శాంతిని పొందండి!

**అశోక తరురేష మే సమ ఇహాఽస్తి వృందావనే**
**ఝణత్కృతి సునూపురం చరణాఘాత ఆప్తో యతః**
**తవాపి వృషభానుజే యది ముదైష రోషాదహమ్**
**తతః కిమపి సుందరం స్మర రసాతి నిష్యందిని 16**

నాతో సమానమైన ఈ అశోకవృక్షము శ్రీబృందావనములో విరాజమానమై ఉన్నది. (అశోక వృక్ష దోహదమునకు పదతాడనము ముఖ్యము.) కనుకనే ఇచటనే శ్రీరాధా మనోహరనూపుర ఝంకారముతో కూడిన చరణస్పర్శ లభించినది. హే అనంగ రస ప్రవాహినీ! వృషభానునందినీ! నీవు కోపముతోనైనను, ఆనందముతో నైనను నాకు కూడ నీ చరణ స్పర్శను ప్రదానము చేయుము! అట్లు జరిగినచో ఎంత సుందరముగా ఉంటుంది!

**రాధా పదారవిందా నందం వృందావనం హరేర్హృదపి**
**పూర్వత్ర సైవ ధత్తే పరత్ర హరిణాఽర్ప్యతే బలాత్ ధృతి యత్ 17**

శ్రీరాధా పదకమలములు ఆనందమును అనుగ్రహిస్తాయి. ఒకటి శ్రీబృందావనమునకు, రెండవది శ్రీహరి హృదయమునకు ఆనందమును ఇస్తాయి. ముందు శ్రీబృందావనముపై శ్రీరాధయే తన పదకమలమును మోపుతుంది.

కాని, రెండవవైపు శ్రీహరి స్వయముగా బలపూర్వకముగా ఆ శ్రీచరణమును తన హృదయముపై ధరిస్తాడు.

**మీనా జాలేన దాసైః సరసి మృగగణా వాగురాభి స్వరణ్యే**
**హింస్రైః సంసార చక్రే హరివిముఖనరా మాయయా మోహపాశైః**
**కారాగారేషు గాఢోద్ధత నృపతి భటై స్తస్కరాః శృంఖలాభిః**
**వృందారణ్యే వయంచాద్భుత రస వలితైస్తద్గుణౌఘైర్నిబద్ధాః 18**

సరోవరములోని చేపలు జాలరి వలలో చిక్కినట్లు, గంభీరమైన అరణ్యములోని మృగములు పెద్దపులికి చిక్కునట్లు సంసార చక్రములో మోహవశులై హరివిముఖులైన వారు మాయ చేత బంధితులు ఔతారు, కారాగారములో రాజభటులచే చోరులు బంధితులు ఔతారు. అదే విధముగ శ్రీబృందావనములో అద్భుతమైన, రసార్ద్రమైన బృందావన గుణముల చేత మేము బంధితులమైనాము.

**భవ బంధమతి సుతుచ్ఛం ఛేత్తుం వృందావనేఽహమాయాతః**
**హరి హరి తత్ర మమాభూద్బంధోఽప్యచాల్య ఈశేన 19**

అతి తుచ్ఛమైన భవ బంధనములను ఛేదించుటకై నేను బృందావనమునకు వచ్చాను. హరిహరీ! ఈశ్వరుడు నన్ను ఇక్కడ (బృందావనములో) దృఢమైన బంధాలతో బంధించాడు.

**కామీవ మిలితయువతి ర్మదిరాం పీత్వేవ పానసంయుక్తః**
**అధన ఇవాప్త మహాధన ఆసం వృందావనం సమేత్యాఽహమ్ 20**

స్త్రీ సాంగత్యము చేత కాముకుడు సంతోషిస్తాడు. మదిరాపానము చేత త్రాగుబోతు ఉల్లాసమును పొందుతాడు. దరిద్రుడు మహాధనమును పొంది సుఖమును పొందుతాడు. నేను అట్లు శ్రీబృందావనమునకు వచ్చి సుఖముగా ఉన్నాను.

**దివ్యా నవ్యా మధుర మధురాశ్చర్యలీలా వినోదైః**
**కాచిత్ పద్మిన్యతి రసనిధిః కాంచనీ సంచరిష్ణుః**
**వృందారణ్యే లసతి తదుపర్యంబుజే కృష్ణ భృంగః**
**పీత్వా మాద్యత్ రసమహమిహాలి స్త్వధో రక్తపద్మే 21**

మధురాతి మధురమైన, ఆశ్చర్యపూర్ణమైన, లీలా వినోదియైన, దివ్య స్వర్ణ రంజిత రసనిధియైన ఒకానొక పద్మిని (శ్రీరాధ) బృందావనములో విలాసముగ అటునిటు సంచరిస్తున్నది. ఆ పద్మిని యొక్క ఉపరిభాగమైన ముఖకమల మధువును పానము చేస్తూ ఒక కృష్ణ భ్రమరము (శ్రీకృష్ణుడు) ఉన్మత్తమైనది. నేను కూడ భ్రమరమునై ఆచరణ కమలముల చెంత ఉన్మత్తమైనాను.

ఇట శ్రీ ప్రబోధానందులు సఖీభావమును పొంది, శ్రీరాధా పదపద్మ రసపానమును చేయుచు ఉన్మత్తులగుట వర్ణితమైనది.

**రాధే కిమైంద్రీం దిశమాకులా త్వం విలోకయస్యంబుజ పత్ర నేత్రే**
**నిశ్శంకమేఒంకం కురు కాంతమేత్య ముగ్ధే ముఖం తే నను కోటి చంద్రాః 22**

హే పద్మపత్ర నేత్రా! రాధా! నీవు వ్యాకులవై తూర్పు దిశగా ఎందుకు చూస్తున్నావు ? ఓ ముగ్ధా! నిశ్శంక చిత్తముతో వచ్చి కాంతుని అంకస్థలిపై కూర్చుండుము. నీ ముఖములో కోటి చంద్రులు వెలుగుచున్నారు.

తూర్పుదిశలో వచ్చు సూర్యుని రాకకై పద్మము ఎదురు చూస్తుంది. ఆతని రాకతో సంపూర్ణముగా వికసిస్తుంది. శ్రీశ్యామసుందరుని రాకతో శ్రీరాధాముఖ చంద్రుడు వికాసమును పొందినది.

**రాధే త్వయాఒఒక్షేప వచోభిరేష నిష్కాసితో వల్లభఆత్మహరీ**
**బహిర్నికూజత్ కలకంఠకంఠీవర వాత్రసన్ యాతి నవైతిముగ్ధః 23**

రాధే! నీవు నీ ఆక్షేపవచనములతో దాగియున్న నీ ప్రియతముని బయటకు వచ్చునట్లు చేసితివి. కాని, హంస, పావురము మున్నగునవి చేయుచున్న శబ్దములకు

భయభీతుడై విముగ్ధుడైన అతడు అట నుండి వెళ్లనూ వెళ్లుట లేదు, లోనుండి వచ్చుటయును లేదు.

శ్రీ ప్రబోధానందులు ఎట్టి అద్భుత లీలా దర్శనమును చేసినారో! శ్రీకృష్ణచంద్రుడు హంసలు, పావురములు చేయు శబ్దములకే భయభీతుడైనాడట! శ్రీయుగళము నడుమ నడచిన ఇట్టి మధురలీల ఎంత మాధుర్యపూర్ణమో!

**అంతర్దృష్టిః పశ్య వృందావనస్థ శుద్ధం జ్యోతిః కామరాజాత్మకస్య**
**శోభా లోభాల్లోల నేత్రాంజలీ భిర్నిత్యా పేయా రాధికా మాధవాభ్యామ్ 24**

అంతర్దృష్టితో కామరాజాత్మకమైన శ్రీబృందావన శుద్ధజ్యోతిని దర్శించు! శ్రీరాధామాధవులు నిరంతరము లోభవశులై చంచలనేత్రముల నమస్కారముతో ఆ శోభను పానము చేస్తూ ఉంటారు.

సాక్షాత్తు శ్రీరాధాగోవిందులకే శ్రీబృందావన శోభను చూచిన కొద్దీ చూడవలెనని లోభము కలుగుతుందట! వారు తమ కన్నులతోనే నమస్కరిస్తూ ఉంటారట! అట్టి యెడ, ఇక "బృందావన మహిమ వర్ణింపతరమా"!

**మధుర మధుర నానా పుష్ప సౌరభ్యలౌభ్యమ్**
**మధుర మధుర భృంగ శ్రేణీ ఝంకార రమ్యమ్**
**మధుర మధుర గాయత్ కోకిలం శారి కీరైః**
**మధుర మధుర ఘుష్ట ప్రాణబంధు ప్రబంధమ్ 25**

మధుర మధురమైన అనేకవిధ పుష్ప సౌరభము చేత లోభనీయమై; మధుర మధురమైన భ్రమరముల ఝంకారము చేత రమణీయమై; మధుర మధురమైన గీతాలాపన చేయు కోకిలల కూజితముల చేతను, శుక శారికాదుల మధుర ధ్వని చేతను; ప్రాణబంధువైన యుగళ కిశోరుల యొక్క ప్రబంధ పాఠము చేతను (బృందావనము) ప్రతిధ్వనిస్తున్నది.

పుష్ప సౌరభము, భ్రమర ఝంకారము, కోకిల కూజితములతోపాటు శ్రీరాధాగోవిందులు బృందావనములోని సమస్తమునకును నేర్పుచున్న చక్కని పాఠములతో బృందావనము ప్రతిధ్వనిస్తున్నదట!

**మధుర మధుర రాధా కింకరీ క్లప్త శయ్యమ్**
**మధుర మధుర రాధా కృష్ణకేలి నికుంజమ్**
**మధుర మధుర తత్ ప్రేమోన్మదాంధాలివృందమ్**
**మధుర మధుర వృందారణ్యమేవాஉஉశ్రితోஉస్మి 26**

శ్రీరాధా దాసీమణులచే రచింపబడిన మధురాతి మధురమైన శయ్యతోను, అతిమధురమైన శ్రీరాధాకృష్ణుల విలాస నికుంజలతోను శ్రీబృందావనము అలంకృతమైనది. మధుర మధురమైన యుగళకిశోరుల ప్రేమ యందు ఉన్మత్తులైన సఖీబృందములచే పరివేష్టితమైన ఇట్టి మధురాతి మధురమైన బృందావనమును నేను ఆశ్రయిస్తున్నాను.

**సచ్చిత్ స్వచ్ఛ జ్యోతి రానంద సాంద్రా**
**నిస్త్రైగుణ్యా భాతి వృందాటవీయమ్**
**త్యక్త్వా దృష్టిం మూఢ పాపీయసీం త్వమ్**
**పశ్యాశ్చర్యాం తాం స్వమర్యాద మూర్తిమ్ 27**

శ్రీబృందావనము త్రిగుణాతీతము! అది సచ్చిత్ స్వరూపము, స్వచ్ఛ జ్యోతిర్మయము, ఆనందఘనమూర్తి! అట్టి బృందావనము ప్రకాశమానముగ ఉన్నది. ఓ మూఢుడా! నీవు పాప దృష్టిని వదలి, ఆశ్చర్యమయమైన ఈ స్వీయ మహిమాన్విత మూర్తిని దర్శించు!

**రాధే భ్రుకుటి మనోహర నవకాంచన కుంజ మంజులం వదనమ్**
**సౌందర్యసార సదనం స్వస్తన మద్యాஉపి కిం న దర్శయసి 28**

హే రాధా! కనుబొమలను పైకెత్తి, మనోహరమైన నవస్వర్ణ కమలము వంటి నీ మంజుల వదనమును; సౌందర్య సారమునకు నిలయమైన నీ వక్ష స్థలమును ఇప్పటికిని ఏల దర్శింపజేయవు ?

**ఇతి వృందావన కుంజే రాధామంకే నిధాయ ధృతచిబుకః**
**ప్రణయోక్తి జనితహాస్యం పశ్యన్నాస్యం హరిర్మమ స్ఫురతు 29**

ఇట్లు శ్రీబృందావన కుంజలో శ్రీకృష్ణుడు శ్రీరాధాజీని తన అంకస్థలిపై కూర్చుండబెట్టుకొని, ఆమె చిబుకమును (గడ్డమును) పట్టుకొని ప్రణయపూర్ణమైన పలుకులను పలికినాడు. ఆ మాటలకు నవ్వుతో శోభిస్తున్న శ్రీరాధా ముఖమును దర్శిస్తూ వెలుగుచున్న శ్రీహరి నా హృదయములో స్ఫురించునుగాక!

**జానంబుదమయ మంబుజమివో పరిష్ఠాత్ భ్రమద్భ్రమర నిచయమ్**
**అద్యస్వస్తన స భ్రుకుటి కుపితముఖం తే స్మరామ్యహం రాధే 30**

హే రాధా! నీ వక్షస్థలముపై భ్రమరములు ఎగురుచు, వాలుచునున్నవి. అట్టి యెడ భ్రుకుటి ముడిచి, కుపితవైన నీ ముఖకాంతిని ఇప్పటికీ నేను స్మరిస్తున్నాను.

**స్మర కృష్ణ సారమేకం శ్రీరాధా ప్రేమవాండరాబద్ధమ్**
**వృందావనైక గోచరమనిశం సాయేన ఖేలనం కురుతే 31**

శ్రీకృష్ణుడు శ్రీరాధా ప్రేమ జాలమునందు బద్ధుడైనాడు. శ్రీరాధాజీతో క్రీడిస్తున్న అతడు శ్రీబృందావనములో మాత్రమే గోచరిస్తాడు. అట్టి సారస్వరూపమైన శ్రీకృష్ణుని స్మరింపుము!

**శ్రీమద్బృందావన రస మత్తా రాధాఽసాధారణ రతిమత్తా**
**శ్రీకృష్ణేఽత్యున్మద రతితృష్ణే లీలా ధత్తే స్మరణ శీలా 32**

శ్రీరాధ శ్రీబృందావన రసమునందు మత్తిల్లి, అసాధారణమైన ప్రీతిరీతితో ఉన్మాదినియైనది. అట్టి ఆదేవి అత్యంత రతిలంపటుడైన శ్రీకృష్ణునికై ప్రేమలీలను ప్రకటించినది.

**ప్రేమోదారగుణైరనన్య కలితం వందీకృతం సుందరమ్**
**శ్యామం స్వే పదపంజరే నియమితం చిత్రైః స్వయం రాధయా**
**ప్రోక్తుంగోపనిషద్రస లసద్వర శాఖాస్థం పరై దుర్గ్రహమ్**
**వందే నందిత తత్సఖీసముదయం దివ్యైక పుంస్కోకిలమ్ 33**

ఇతరులకు ఎవ్వరికినీ వశీభూతుడు కాని శ్రీశ్యామసుందరుడు శ్రీరాధాజీ యొక్క ప్రేమోదార రజ్జువునకు (తాడు) మాత్రమే బంధితుడు ఔతాడు. శ్రీరాధా పద పంజరమునందు చిత్రముగా బద్ధుడై ఉంటాడు. ఆమె శ్రీపాదములకు నమస్కరిస్తాడు. ఉపనిషత్తు అనెడు ఎత్తైన రసాల (మామిడి) వృక్షపు ఉత్తమ శాఖపై అధివసించియుండు శ్రీకృష్ణుడు సామాన్యజనులకు అందరానివాడు. కాని, శ్రీరాధా సఖీ బృందమునకు మాత్రము ఆనందమును ప్రదానం చేస్తాడు. ఇట్టి సుందర, దివ్య, శ్యామవర్ణ పుంస్కోకిలకు (శ్యామసుందరునకు) నమస్కారం చేస్తున్నాను.

**శ్యామమనోహర కీరం వృందారణ్యేఽద్భుతం స్మరాధీరమ్**
**రాధాధరం దశంతం బింబఫల శంకయా మధురతరమ్ 34**

శ్రీబృందావనములో అద్భుత అనంగునకు వశీభూతమై అధీరమైన ఒకానొక శ్యామ వర్ణములోనున్న మనోహరమైన శుకము (శ్రీకృష్ణుడు) వెలుగొందుతున్నది. ఆ శుక రాజము (శ్యాముడు) బింబఫలము (దొండపండు) అనుకొని శ్రీరాధా మధుర అధరములను ఆస్వాదిస్తున్నది. ఇట్టి అద్భుత శ్యామకీరమును స్మరింపుము!

**కాంచన కాంచన లతికామ్ రతికామామ వశమాలింగ్య**
**వృందావన భువి జంగమ తమాల తరుమేకమాలంబే 35**

శ్రీబృందావనములో రతియందలి అభిలాషతో వివశయైన ఒకానొక స్వర్ణలతికను (రాధను) కౌగిలించుకొనిన ఒక జంగమ తరుణ తమాల వృక్షమును (శ్రీశ్యామసుందరుని) నేను ఆశ్రయిస్తున్నాను.

శ్రీ ప్రబోధానందులకు శ్రీబృందావనమునందలి స్థావర జంగమములు అన్నియు శ్రీరాధామాధవులుగా దర్శనమిచ్చినవి. సఖీభావములోనున్న ఆ మహాత్మునకు బృందావనమంతటియందును శ్రీయుగళ దర్శనమే!

**వృందావనగహన వనే రాధే మమ హారితం మనోరత్నమ్**
**లబ్ధం త్వయైవ నూనం స్మితమధురం దేహి దాసోఽస్మి 36**

హే రాధా! శ్రీబృందావనములోని గహన వనములో నా మనస్సు అనెడు రత్నము జారిపోయినది. నీవే దానిని తప్పక స్వీకరిస్తావు! కనుక (అట్లు స్వీకరించి) నీ మృదుమధుర మందహాసము అనెడు అమృతమును దానము చేయుము. నేను నీ దాసుడను!

తన మనసు అనెడు రత్నమును స్వీకరించి, శ్రీరాధ చిరునవ్వు అనెడు అమృతమును అనుగ్రహింపవలెనట! బృందావనములో చేజారిన వస్తువులు బృందావనేశ్వరికే కదా చెందుతాయి!

**సా చిత్రాస్యాక్షి వక్షోరుహ జఘన సునాభ్యంఘ్రి హస్తాది కాంగైః**
**ఏషా దివ్యాబ్జఖేలన్మృగ గిరి పులిన శ్రీసరః పల్లవాద్యైః**
**సోద్యత్ కందర్పలోలాకృతిరియమభితః ప్రోల్లసత్ స్వర్ణ వల్లీః**
**సా శింజద్భూషణేయం మధుర ఖగకులారావ రమ్యా చకాస్తి 37**

శ్రీరాధాజీ చిత్రమైన ముఖము, కన్నులు, వక్షస్థలము, జఘనములు, నాభి, హస్తములు, పాదములు మున్నగు అంగములతో శోభిస్తున్నది. అదే ప్రకారముగ శ్రీబృందావనము కూడ దివ్య కమలములు, క్రీడా పరాయణమైన మృగములు,

పర్వతములు, తీరములు, సుందర సరోవరములు, పల్లవములు మున్నగు వానితో శోభిస్తున్నది. శ్రీరాధ అనంగ చేష్టాదికముతో చంచలముగా ఉన్నది. అట్లే శ్రీబృందావనము కూడ నాలుగు దిక్కులలోను స్వర్ణ లతికలను కలిగి ఉల్లాసముతో ఉన్నది. శ్రీరాధాజీ సుందరమైన ధ్వనిని చేస్తున్న ఆభరణములతో అలంకృతయై ఉన్నది. శ్రీధామము పక్షులు చేయుచున్న మధుర గుంజారవముతో మనోహరముగా విరాజమానమైనది.

శ్రీరాధాజీ యొక్క దివ్యమైన అంగాంగములను శ్రీబృందావనమందలి కమలములు, నదీనదములు మున్నగు వానితో పోల్చుచు శ్రీప్రబోధానందులు ఆ యిరువురి నడుమ అభిన్నత్వమును దర్శించినారు. ఆయన మహాకవి కూడ అగుటచే ఆ దివ్య అభిన్నత్వమును ఆలంకారిక శైలిలో అందించినారు.

**సానీల స్నిగ్ధ వక్రోజ్జ్వల వహల కచే చారువేణీం దధాతి**
**కాలిందీ రమ్యవేణీ స్త్వియమిహ న వియుగ్మాధరా సా తథేయమ్**
**సాఽఽనందస్యంది వాణీమియమతి శిశిరాన్ నిర్ఝరాన్ విభ్రతీయమ్**
**రాధా వృందాటవీ వా యుగపదురుతర స్నేహతో మే హృదేతి 38**

శ్రీరాధాజీ నల్లని, దట్టమైన, ఉజ్వల కేశపాశముతో సుందరమైన జడను కలిగి ఉన్నది. శ్రీవృందాటవి కూడ యమునానది అనెడు రమ్యమైన జడతో ఉన్నది. రాధాజీకి మాధవునితో వియోగము ఎన్నడును లేనట్లే బృందావనమునకును వియోగములేదు. శ్రీరాధ ఆనందమయ వాక్యవిన్యాసము చేస్తుంది, శ్రీధామము కూడ శీతలమైన ప్రవాహములతో శబ్దాయమానముగ ఉంటుంది. ఈ విథముగ శ్రీరాధాజీ, శ్రీబృందావనము పరస్పరము అత్యంత స్నేహశీలురై నా హృదయములో ప్రకాశిస్తున్నారు.

శ్రీ ప్రబోధానందులు ఈ శ్లోకములో కూడ రాధాజీకి, బృందావనమునకు కల అభిన్నత్వమును స్పష్టము చేసినారు.

**గోవిందస్తార తారం రణయతి మురలీం రాధికా హస్తతాలీమ్**
**దత్తేమత్తేహ వృందావన భువి శిఖినాం మండలీతాండవితాని**
**యర్వాశ్చర్యాని కుర్యాత్ స్థగిత సకల తత్సత్వ వృందాని లక్ష్మీ**
**తత్కాంతాక్రాంత చిత్తాన్యహహ ధృతి మధాత్తర్హి వృందావనే కః ? 39**

శ్రీగోవిందుడు తాళ స్వర ప్రస్తారములతో మురళిని మ్రోగిస్తున్నాడు. శ్రీరాధాజీ చేతులతో తాళం వేస్తున్నది. శ్రీబృందావనములో నెమ్మళ్లు మత్తిల్లి తాండవ నృత్యం చేస్తున్నాయి. లక్ష్మీకళలతో వెలుగుచుండు రాధాజీ, ఆమె ప్రియతముడైన శ్రీశ్యామసుందరులచే ఆకర్షితమైన అచటి సమస్త ప్రాణులు నిశ్చేష్టమై ఆశ్చర్యముతో నిలచిపోయినవి. ఇక శ్రీబృందావనములో ఎవడు ధైర్యమును వహింపగలడు ?

అనగా బృందావనము కూడ సర్వాత్మనా శ్రీరాధా గోవిందులచే ఆకర్షితమై, అంకితమైనదని భావము!

**వృందారణ్యేఽతి చిత్రం ప్రకటయతి నిజరూపమాశ్చర్య వేశౌ**
**రాధాకృష్ణౌ యదాఽఽలీతతిభిరతిరసం రాసరంగ ప్రవిష్టౌ**
**సర్వే నిర్వేద మాపుర్విధి, ప్రముఖ సురా స్థత్కృత బ్రహ్మాభావా**
**శించంతాం ఛేత్తుం మునీంద్రా విభురపి రమయా విహ్వాల స్తర్హయ లురత్ 40**

సఖీమండలిచే సుసజ్జితమైన, రసాత్మకమైన రాసవేదిక చెంతకు ఆశ్చర్య పూర్ణమైన వేషములతో భూషితులైన శ్రీరాధాకృష్ణులు ప్రవేశించినారు. శ్రీబృందావనము అతి విచిత్రమైన నిజరూపముతో ప్రకటితమైనది. అపుడు బ్రహ్మాది దేవతలు మోక్షానందమును తిరస్కరించి శాంతిని పొందినారు. మునీంద్రులు ధ్యానమును త్యజించి నిర్వేదమును పొందినారు. లక్ష్మీసహితుడైన శ్రీనారాయణుడు విహ్వాలుడై (నేలపై) వాలిపోయినాడు.

**శ్రీమద్బృందావనేఽస్మిన్ నిజరస విభవైర్వ్యక్తి మాయాతిలోకే**
**లోకేశాః శక్రముఖ్యా య ఇహ భువి భువోయేఽతలేఽథ స్వయంభూః**
**సర్వే కృష్ణానురాగ ప్రమథిత హృదయాద్రష్టుమన్యన్న శేకు**
**విస్మృత్యాధీశ భావం స్వభువి స భగవాన్ కృష్ణ మగ్నశ్రియాఽభూత్ 41**

పరమ శోభాశాలియైన శ్రీబృందావనము తన రసవైభవముతో పృథివిపై ప్రకటితమైనది. అపుడు ఇంద్రాదిగా కల లోకపాలకులు, భూలోకములోనివారు, క్రింది లోకములలోని వారు, స్వయంభూ ఆదిగా కలవారందరును శ్రీకృష్ణుని పట్ల అనురాగ చిత్తులై, శ్రీబృందావన శోభను కన్నులలో నింపుకొనినారు. అప్పటి నుండి వైకుంఠాధిపతియైన శ్రీమన్నారాయణుడు తన ధామములో "నేను అధీశుడను" అను భావమును మరచి, శ్రీలక్ష్మీదేవితో కలసి శ్రీకృష్ణభావము నందు మగ్నుడైనాడు.

**యస్యాం సమ్ముక్తి విరక్తీ కరణ పటు మహాముక్తిధారా సమంతాత్**
**సర్వైర్లభ్యేవ చింతామణి నికర పరాః ఖర్పరాణాంచ ఖండాః**
**యత్రాత్యుచ్చైస్తృణ్యా న్యపృహహా విహసితానల్ప కల్పద్రు వృందా**
**న్యేతాం వృందాటవీం క స్త్రిజగతి తనుభృత సేంద్రియో నో భజేత్ 42**

శ్రీబృందావనములో ఉత్కృష్టమైన మోక్షవాంఛను తుచ్ఛమనిపింపజేయు మహాభోగములు అందరికిని ప్రాప్తిస్తాయి. అచట మహాచింతామణులు చిన్నచిన్న తునకలుగా అక్కడ, ఇక్కడ పడి ఉంటాయి. అచటి తృణము కూడ ఫలయుక్తములైన అనేక కల్పవృక్షములను పరిహసిస్తుంది. అట్టి బృందావనమును త్రిభువనములలోని (ఇంద్రియ సహితులైన) ఏ జీవులు భజింపకుందురు ? అనగా, భజింతురని భావము!

**సౌఖ్యానాం సౌఖ్యమేతన్ మధుర తరమిదం వర్యం మాధుర్యతోఽపి**
**స్వాశ్చర్యానామిదం స్వద్భుత తమ మఖిల శ్రేయసాం శ్రేయ ఏతత్**
**దివ్యానాం దివ్యమేతత్ సదఖిలచిత్ చిజ్జ్యోతిషాం జ్యోతిరేతత్**
**యద్బృందారణ్య నామ స్ఫురతి రసమయం రాధికా కృష్ణ ధామ 43**

శ్రీబృందావనము సుఖములకు సుఖ స్వరూపము, శ్రేష్ఠములైన మాధుర్యములకు మాధుర్యము! ఆశ్చర్య జనకములైన వస్తువులకే అది అద్భుతమును కలిగించునది. సమస్తములైన మంగళములకును మంగళకర స్వరూపము, దివ్య వస్తువులకు దివ్య స్వరూపము! నిఖిలమైన చిత్, జడ, జ్యోతిర్మయ పదార్థములకు జ్యోతియైనట్టిది. రసమయమైన, శ్రీరాధాకృష్ణులధామమైన అట్టి శ్రీబృందావన నామము స్ఫురించునుగాక!

**బుధా ముధా క్లిశ్యతః సాధనేషు దుఃఖాత్మ సందిగ్ధ ఫలేషు సక్తాః**
**పంచాపి వృందా విపినే పుమర్థా లుఠంతి తానప్యలసా గ్రహీతుమ్ 44**

ఓ బుద్ధిమంతులారా! దుఃఖాత్మకములు, ఫలమునిచ్చుటలో సందిగ్ధమైనవి అయిన సాధనలయందు ఆసక్తితో ఏల వృథా క్లేశము (కష్టము)ను పొందుతారు ? శ్రీబృందావనములో ధర్మ, అర్థ, కామ, మోక్ష, ప్రేమలు అను పంచ పురుషార్థములు దొరలుచున్నవి. వానిని పొందుటలో ఏల అలసత్వమును (పట్టించుకొనకపోవుట) చూపుచున్నారు ? (అనగా తేలికగా లభించునవిగా ఉన్నవి.)

**ఇహైవ విద్యాద్రవినాది సర్వమపూర్వమేవాస్తి కరస్థమేవ**
**తథాపి మందాన భజంతి వృందాటవి మహోదేవ మునీంద్రవంద్యామ్ 45**

ఇచటనే అపూర్వమైన విద్య, ధనము ఇత్యాది సమస్త వస్తువులు చేతులలో కలిగి ఉంటాయి. కాని, హా! అట్లయ్యు మూర్ఖులైన మనుష్యులు దేవతలచేత, మునీంద్రుల చేత నమస్కరింపబడుచున్న శ్రీబృందావనమును భజించుటలేదు.

**ఉదారమస్యా అసమోర్ధ్వమేవ కారుణ్యమస్యా స్త్వవిగణ్యమేవ**
**విభూతిరస్యా హసితేశభూతి ర్వృందాటవీంతత్ కిమునాఽఽశ్రయధ్వమ్46**

శ్రీబృందావనము యొక్క ఔదార్యము సాటిలేనిది, కారుణ్యము కూడ అగణితము! దీని సంపద భగవంతుని సంపదను పరిహసిస్తుంది (అంటే

భగవంతుని సంపదకన్నను మించిన అనంత సంపద కలది అని భావము). మరి ఎందుకు నీవు శ్రీబృందావనమును ఆశ్రయించుట లేదు ?

**ఛిత్వాఽఽంతరేఽహం మమకార గాఢ గ్రంధి నిమీల్యేక్షతి సంభ్రమేణ**
**విశంతు శ్రుతి మౌలి గూఢాం వృందాటవీం మాఽస్తు విచారణాఽత్ర 47**

మూర్ఖుడు కూడ తన అంతరంగములో "అహమ్, మమ" (నేను, నాది) అను దృఢమైన గ్రంథులను ఛేదించుటకు అతి సంభ్రమముతో కన్నులు మూసికొని ప్రయత్నిస్తున్నాడు. అట్టివాడు కూడ సర్వోత్తమమైన వేదములకును గోపనీయమైన (రహస్యమైన) శ్రీబృందావనములో ప్రవేశిస్తున్నాడు. ఇందులో ఎట్టి ఇతర ఆలోచనకును తావు లేదు.

**కింరే మహానందరసాబ్ధిఖేలాం హిత్వార్తి సింధ్వావబుధాః పతధ్వే**
**విహాయ వృందావనమత్యసాధ్యం తత్సాధనేయత్ కురుతాభియోగమ్ 48**

ఓ బుద్ధిహీనులారా! మీరు మహానందరససాగరము నందలి క్రీడా సుఖమును వదలి, దుఃఖసాగరములో ఎందుకు పడి ఉంటున్నారు ? శ్రీబృందావనమును వదలి, అతి అసాధ్య సాధనలలో ఇష్టమును చూపుచున్నారేమి ?

శ్రీబృందావనమును విడచి, అన్యత్ర చేయుసాధనలు అన్నియు నిరర్థకములు! సమస్త సాధనా ఫలమైన ఆనందరసము బృందావనములో ఉన్నది.

**హంత స్వార్థేషుఖిద్యంతే మహాంతోఽపిర్భవద్విధాః**
**యత్ స్వచ్ఛందం సమస్తార్థం వృందారణ్యం న పశ్యత 49**

హా! మహా పురుషులైనవారు కూడ తాము కోరినది లభింపనిచో ఎందుకు ఖేదమును పొందుతున్నారు ? స్వచ్ఛందముగా (కోరకుండగనే) సర్వార్థములను లభింపజేయు శ్రీబృందావనము వైపునకు ఎందుకు చూచుట లేదు ?

**వృందారణ్యం సమస్తార్థ వర్షణం రోమహర్షణమ్**
**శ్రీశయోరపి భజత త్యక్త్వా తుచ్ఛార్థ తర్షణమ్ 50**

సమస్త ప్రయోజనములను వర్షించు శ్రీబృందావనములో శ్రీలక్ష్మీ నారాయణులు కూడ పులకితులు ఔతున్నారు. కనుక, తుచ్ఛమైన కోరికలను త్యజించి శ్రీబృందావనమును భజింపుము!

**యదా సఖి విచిన్వతీ కుసుమమత్ర వృందావనే**
**సకృచ్చకిత మీక్షితాత్వమసి పింఛ సన్మౌలినా**
**తదైవ సుదురంత తృట తవ రసే స్మ దందహ్యతే**
**మనోఽస్య తత ఉత్థితో మదన వహ్నిరత్యుల్బణః 51**

హే సఖీ (సఖీ రాధా!) నీవు శ్రీబృందావనములో పూవులు కోస్తున్నప్పుడు మయూర పింఛధారియైన శ్రీశ్యామసుందరుడు ఒక్కసారిగా చకితుడై నిన్ను చూచాడు. తక్షణమే నీ యొక్క రసమునందు అత్యధికమైన తృష్ణతో ఆతని మనస్సు జ్వలింపనారంభించింది. అత్యుగ్రమైన మదనాగ్ని అతనిలో ప్రజ్వలించింది.

శ్రీరాధాగోవిందుల దివ్య, మధుర శృంగారలీలను వర్ణించిన ప్రతిసారి ఏకస్వరూపమైన ప్రేమతత్వము జీవుల నుద్ధరించుటకై రెండు రూపములను ధరించి, దివ్యప్రేమలీలను ప్రకటిస్తున్నది అను విషయమును మరువరాదు.

**అభూత్ ప్రథమమేవ మే స్మరవిషానల జ్వాలయా**
**ముధాకృత సుధాధరే కిమపి దగ్ధ దగ్ధం మనః**
**సమస్త మతి మోహన క్వణిత కింకిణీ నూపురే**
**త్వమక్షి పథమాగతా తదను ధన్యవృందావనే 52**

మదనాగ్ని జ్వాలలో జ్వలిస్తున్న నా మనస్సు అనెడు చంద్రుడు వృథాగా ఆజ్వాలకు కొంత అర్పితమైనది. కాని, తరువాత అతి మనోహరమైన కింకిణీ నూపురాదుల శబ్దమును విని నా మనస్సు అత్యంతముగా మోహితమైనది. అటుపై నీవు కన్పించగనే ఈ ధన్య బృందావనములో నా మనసు సంపూర్ణముగా నీకు అర్పితమైనది. (అని శ్రీకృష్ణుడు శ్రీరాధాజీతో పలుకుచున్నాడు.)

**ఫుల్లాం మల్లీ మతల్లీం విసృజతి న భజేద్రమ్యకం కేలివల్లీ**
**ముజ్జృంభారంభోజినీం నో భజతి న చ భవేన్మాలతీ గంధలుబ్ధః**
**వాసంతీం నో హసంతీం కలయతి మధుపః కోఽపి వృందావనేఽస్మిన్**
**రాధే త్వత్పాద పంకేరుహ యుగమభితః సంభ్రమీ బంభ్రమీతి 53**

శ్రీబృందావనములో ఒకానొక భ్రమరము (శ్రీకృష్ణుడు) ప్రశస్తమైన వికసిత మల్లిక (మల్లెపూవు)ను త్యజించినాడు. రమణీయమైన క్రీడావల్లిని సేవించుటలేదు. వికసించిన కమలము చెంతకు కూడ వెళ్లుటలేదు. మాలతీ సుగంధము ఆతనిని లోభింపజేయుటలేదు. నవ్వుచున్న వాసంతి వైపునకు కనులెత్తియైనను చూచుటలేదు. కాని, హే రాధా! నీ చరణకమలములపై అతడు మాటిమాటికిని అత్యంత సంభ్రమముతోను, వినయపూర్వకముగను పరిభ్రమించుచున్నాడు.

ఇచట సఖి శ్రీకృష్ణుని రాధా అనన్యనిష్ఠను గూర్చి శ్రీరాధాజీకి చెప్పుచున్నది.

**ఇదానీమప్యానందయతి బత వృందావన యశః**
**సుధాధార యేషామిహ వదన చంద్రాద్విగలితా**
**గతానాం స్వం లోకం పరమ మపి తేధామతు మహా**
**గురూణామాణృన్యం కథమహహ యామోవయమమీ 54**

ఓహో! శ్రీబృందావనయశస్సు అనెడు అమృతధార సమస్తలోకముల ముఖతః, నీ పరమధామమైన మహాగురుజనుల ముఖతః వెలువడుచున్నది. అది ఇప్పటికినీ మాకు ఆనందము నిచ్చుచున్నది. మేము ఎట్లు వారి ఋణమును తీర్చుకొనగలము!

**గరీయో మౌలీనామహమహహ తేషాం చరణయోః**
**కృతః స్వాత్మన్యాసః సుసుఖమిదమాయుః క్షపయితా**
**అహోయేషాం రాధా ప్రియ రసమయం దివ్యం చరితాఽ**
**మృత స్రోతో వృందావన మిదమహో మామనయత 55**

ఓహో! శ్రీరాధా ప్రియతముడైన శ్రీశ్యామసుందరుని రసమయ దివ్య చరితామృతము నాకు శ్రీబృందావనములో లభించినది. ఆ మహత్ శిరోమణియైన పరమపురుషుని చరణయుగళమునకు ఆత్మసమర్పణము చేసికొంటిని. ఈ శ్రీబృందావనము నందే నా జీవన పర్యంతము సుఖినై నివసిస్తాను!

**ఆహో వృందాటవ్యాః పరమ రస సర్వస్వ చరణా**
**హరేః శ్రీరాధావోల్లసతి హృది వాణీష్యథ దృశోః**
**అతో నూనం చంద్రావలి నిరవకాశా వయమయమ్**
**వృథా పాదాలంబైస్తవ సఖి విడంబం వితనుతే 56**

ఓహో! శ్రీబృందావనములోని సమస్త ఉజ్వల రసమునకు శ్రీరాధాకృష్ణులు ఆశ్రయము! వారి కన్నులు, మనసు, వాక్కు అన్నియు ఉల్లసితములై ఉన్నవి. కనుక, చంద్రావళీ! ఇక్కడ మనకు స్థానమేది ? ఇపుడు ఇక్కడ ఉండుటవలన ప్రయోజనము లేదు. ఓ సఖీ! ఆలస్యమైన కారణమున నీకు విసుగు కలుగవచ్చును.

ఒక సఖి చంద్రావళి అను మరొక సఖితో పలికిన పలుకులు ఇవి! శాశ్వత సహజయుగళమైన శ్రీరాధాకృష్ణుల నడుమ మరొకరికి స్థానము లేదు.

**చంద్రావల్యేవాస్తే మమహృది పద్మే తదేకరస వశమే**
**చాతుర్యేణైవ గదితం ప్రథమం రాధాపదేఽతి రుపాంశు 57**

'నాకు ఏకమాత్ర ప్రేమాధీనయైన చంద్రావళియే నా హృదయపద్మములో విరాజిల్లుచున్నది'. ఈ విధముగా శ్రీరాధాచరణప్రీతిని లోలోపల దాచి, చతుర శిరోమణియైన శ్రీశ్యామసుందరుడు పలికినాడు.

అలిగి, అచటి నుండి వెళ్లనున్న చంద్రావళి మనసుకు ఆనందము కలుగునట్లు రసిక నాగరుడైన శ్రీకృష్ణుడు పలికినాడు.

**మహానందస్యైషా పరతరచమత్కార పదవీ**
**మహాప్రీతే రత్యద్భుత సరణిరేషా సుఖమయీ**
**మహౌదార్యైశ్వర్యాదిక పరమనిష్ఠోపనిషదామ్**
**మహాగుప్తం విత్తం యదుదయతి వృందావన మిదమ్** **58**

మహానందము యొక్క పరమ చమత్కారపదవి అయినట్టి, మహాప్రీతికి అత్యద్భుత సుఖమయ మార్గము అయినట్టి శ్రీ బృందావనము ప్రకాశిస్తున్నది. ఆ ధామము మహా ఔదార్య, ఐశ్వర్యాదికములకు పరమ అవధి, ఉపనిషత్తులకు మహాగుప్త ధనము!

**యే సంస్వాద్య శ్రుతిగమమృతస్యంది వృందావనేతి**
**ప్రేమావిష్టాః పదమతి రసోదంచి రోమాంచ పుంజాః**
**మూర్ఛామాపుర్నిరవధి మహానంద సాంద్రాబ్ధిలీనా**
**స్తే యాతాః కిం వయమిహ హతానాం భావైక సంగాః** **59**

అమృతవర్షిణియైన శ్రీబృందావనములో ఎవరు శ్రుతుల యొక్క ఉత్కృష్టమైన మాధుర్యమును ఆస్వాదించి, మిక్కిలి ప్రేమావిష్టులైనారో, అత్యంత రసావేశములో పులకితులై, నిరంతరము మహానందగాఢ సముద్రములో మూర్ఛితులై పడిపోయెడివారో అట్టి మహాభావుక శిరోమణి అంతర్ధానమైనారు. హా! ఇక్కడ మేము అదృష్టహీనులమై జీవించియుండలేదా!

శ్రీ ప్రబోధానందులు ఈ శ్లోకములోను, తరువాతి రెండు శ్లోకములలో కూడ తమ గురుదేవులైన శ్రీచైతన్యమహాప్రభువును స్మరించినారు.

**శ్రీమద్బృందావనగత లసన్మంజు గుంజావలీం యే**
**కీరీరం వాఽద్భుతగుణ ఫలం ప్రేక్ష్య వైవశ్యభాజః**
**హా కృష్ణేతి ప్రతిపదమహో గద్గదోక్త్యాగృణంతః**
**పంకీకుర్వంత్య వని మురుభిః ప్రేమబాష్పాంబుపూరః** **60**

హా! శ్రీబృందావనములోని మనోహరమైన గుంజావళిని (ఒక రకమైన గింజలు), అద్భుత గుణముతో కూడిన కరీల ఫలములను చూచి (ఆ మహాత్ముడు) మాటిమాటికి 'హా కృష్ణా! హా కృష్ణా' అని గద్గద స్వరముతో అనుచు ప్రేమాశ్రుధారలతో భూమిని తడిపివేసెడివారు.

**తే శ్రీవృందావన రసమయ స్వాంత విశ్రాంత రాధా**
**కృష్ణ శ్రీమచ్చరణ కమలాస్తత్పదం ప్రాప్త వంతః**
**త్యక్త్వా లోకం కలి విషధర గ్రస్తమత్రాతి శుష్య**
**చ్చిత్తాస్తాదృక్ జన సుమిలితా నో వయం జీవితార్హాః 61**

వారు (ఆ మహనీయుడు) శ్రీబృందావన రసమయ ప్రదేశములో తమ చరమ విశ్రాంత స్థలమైన శ్రీరాధాకృష్ణుల చరణకమలములను పొంది, శ్రీయుగళ కిశోరుల చరణ సేవకు అధికారి అయినారు. కలియుగమనెడు సర్పమునకు చిక్కిన మేము ఈ జగత్తును త్యజించి, వారి వలెనే మహాజనులతో పాటు సుందర రూపముతో కలియవలెను. మేము జీవించియుండుట కూడ ఉచితము కాదు.

ఈ శ్లోకములలో తమ గురుదేవులైన శ్రీచైతన్యుల వియోగముతో శ్రీ ప్రబోధానందులు ఎంత తపించుచున్నారో స్పష్టమగుచున్నది. అట్లయ్యు తమ గురుదేవుల ఆజ్ఞ, ఆదేశములతోనే వారు ఆ వియోగబాధను సహించుకొని శ్రీబృందావన మహిమామృతము వంటి మహత్తర రస గ్రంథమును మానవాళికి అందించినారు.

**రే మూఢ! గూఢమఖిలోపనిషత్ స్వగాధ**
**ప్రేమ్ణావగాఢమఖిలార్థ శిరోఽధిరూఢమ్**
**ఆనంద సింధు మన పాశ్రయ దీనబంధుమ్**
**వృందావనం వ్రజ హఠాత్ కలితాత్మబంధః 62**

అరే మూర్ఖుడా! శ్రీబృందావనము సమస్త ఉపనిషత్తులకును గుప్తమైనది. గాఢమైన ప్రేమచేత పొందతగినది. సమస్త పురుషార్థములకును శిరోమణి వంటిది. ఆనంద సాగరము, పరమాశ్రయము, దీనబంధువులైన శ్రీబృందావనమునకై నీ బంధనములను బలపూర్వకముగ వదలించుకొని అచటికి వెళ్లుము!

**వృందాటవీ భువన పావన కీర్తివృందా**
**వృందారకైర సులభా యది భాగ్యలబ్ధా**
**ఆరాధయాత్ర రసతః సహ రాధయా శ్రీ**
**గోవింద మిందు చయనింది ముఖారవిందమ్ 63**

శ్రీబృందావనము మూడు లోకములను పవిత్రము చేయుకీర్తికలది, దేవతలకు కూడ దుర్లభమైనది! అట్టి బృందావనము నీ అదృష్టము కొలది లభిస్తే; శ్రీరాధా సహితుడైన, కోటి చంద్రులను తిరస్కరించు ముఖారవిందమును కలిగిన శ్రీగోవిందుని అనురాగముతో ఆరాధింపుము!

**వృందావనం సకల భాగ్యవతాం వరిష్ఠైః**
**లభ్యం సురభ్యనిల పావిత సర్వసభ్యమ్**
**లోభ్యం పరేశ రమయోరపి సర్వ భావా**
**క్షోభ్య ప్రశాంత హృదయేన సదా వసంతు 64**

శ్రీబృందావనము మహాభాగ్యశాలురైన సమస్త పురుషులకును పొందతగినది. ఆధామము తన సుగంధ పూర్ణమైన వాయువుచేత అచటనున్న వారినందరిని పవిత్రము చేస్తున్నది. శ్రీమన్నారాయణుడు కూడ లక్ష్మీ సహితుడై ఈ ధామమును పొందుటకు లోభమును కలిగి ఉంటాడు. నీవు అన్ని విధములుగ, అచంచల చిత్తముతో, ప్రశాంతమైన మనసుతో అచట నివసింపుము.

**యద్యాప్తమిచ్ఛసి మహాపరమం పుమర్థమ్**
**నైవాప్తమిచ్ఛసి పరిశ్రమమల్పకంచ**
**వృందావనం ఝటితి తత్ప్రియ యాహియాహి**
**మాయాహి లంభిత భయాన్ హి విధీశముఖ్యాః 65**

ఒకవేళ నీవు పరమ పురుషార్థమును పొందవలెనను ఇచ్ఛతో ఉంటే, కొద్దిపాటి పరిశ్రమ (ప్రయత్నము)నైన చేయలేకపోయినను వెంటనే బృందావనమునకు వెళ్లుము! అచటికి వెళ్లుటకు కూడ భయగ్రస్తులు అయ్యేదు బ్రహ్మ, ఈశ్వరుడు మున్నగు సామాన్య ఫలములనిచ్చువారి సమీపమునకైనను పోవలదు.

**యా యా శక్తిర్విచరతి పరా ప్రాకృతాఽప్రాకృతేషు**
**తాం తత్కార్యాన్యపి కలయతోనైవ వృందావనేశౌ**
**శుద్ధ ప్రేమోజ్జ్వల రసమయానంద లీలైక మగ్నౌ**
**తావేవైతాదృశి వనవరేఽత్రైవ తాదృక్ భజస్వ 66**

ఏయే ప్రాకృత, అప్రాకృత వస్తువులయందు ఏ పరమ శక్తి సంచరిస్తున్నదో ఆవైపునకుగాని; దాని కార్యక్రమములవైపునకు కాని చూడకు! శుద్ధము, ప్రేమోజ్వలము, రసమయము, ఆనందమయమునైన లీలయందు మాత్రమే ఏకమాత్రముగ మనసును లగ్నము చేయుము! శ్రీబృందావనేశ్వరులైన శ్రీయుగళ కిశోరులు ఎట్టివారో శ్రేష్ఠవనమైన శ్రీబృందావనము కూడ అట్టిదే! ఆధామమును మధుర భావముతో సేవింపుము!

త్రిభువనములను పవిత్రీకృతము చేయు శ్రీబృందావనము సమస్త జీవులకును ఏకమాత్ర ఆశ్రయము! పరమ పురుషార్థమైన శ్రీయుగళ ప్రేమను అనుగ్రహింపగల దయాళువు! ఎట్టి అధమ జీవులనైనను బృందావనము తల్లివలె ఆదరించునని శ్రీప్రబోధానందులు పలుకుచున్నారు.

**కుంభీపాకాఽధికతర మహాదుఃఖ సంభారగేహా**
**రంభీ దంభీ న భయచకితః స్త్ర్యాఖ్యకుంభీ న శీతః**
**గంభీరాంతః ప్రణయరహితో మాధవే సాధులంభే**
**స్తంభీభూతస్తదపి న రసోజ్జృంభి వృందావనంభోః 67**

కుంభీపాక నరకమున కంటెను అధికతరమైన మహా దుఃఖములకు నెలవైన గృహస్థజీవనము గడిపెడు అహంకారి, భయరహితుడు, స్త్రీరూప సర్పము చేత చిక్కినవాడు, కపటి, శ్రీమాధవుని పట్ల ప్రీతి లేనివాడు, సాధుసజ్జనుల దర్శనము చేయనివాడు, జడమతి అయినవాడు – అట్టి మానవులకై రసప్రకాశమును ప్రసరింపజేయు బృందావనము కూడ, హా! ఏమియును చేయులేక స్తంభీభూతమైనది.

శ్రీబృందావనమే ఏమియు చేయలేకపోయినచో, ఇక గతి ఏది ?

**న శమదమాద్యమస్తి విదితం నహి స్వధర్మ స్థితి**
**హరిచరణారవిందయుగళే సదైవ మందామతిః**
**ఉపరమణంచ నాస్తి కలుషాన్మహత్కృపా దుర్లభా**
**తదశరణోఽహమద్య శరణం వ్రజామి వృందావనమ్ 68**

శమదమాది విషయములను నేను ఎరుగను. స్వధర్మము నందు కూడ స్థిరత్వము లేదు. హరి పాదపద్మములయందు సదా మందమతిని! పాపముల నుండి నాకు నివృత్తిలేదు. మహత్పురుషుల కృప కూడ నాకు దుర్లభమే! కనుక అనన్య శరణాగతుడనైన నేను నేడు శ్రీబృందావనమును శరణ వేడుచున్నాను.

శ్రీబృందావనమును అనన్యముగా శరణువేడినచో దయగల ఆ తల్లి జీవుల యోగ్యతాయోగ్యతలను పట్టించుకొనక అనుగ్రహమును వర్షిస్తుంది.

**హరి హరి రాక్షసీయమబలా మన్మనశ్చ కర్షతి**
**ప్రసరతిమిష్ట వస్తురసనాం మనాక్ చ నా వర్తతే**
**నిరవధిలోక రంజనపరో భవోదరార్థే క**
**థమధమోఽధికార రహితో వసామి వృందావనే 69**

హరిహరీ! ఈ స్త్రీరూప రాక్షసి నా మనసును ఆకర్షిస్తున్నది. మధుర పదార్థముల పట్ల నాలుక లోలుపత్వముతో ఉన్నది. వృద్ధాప్యము కూడ పై బడినది. ఉదరపోషణకై నిరంతరము లోకమును మెప్పింపవలసి వచ్చుచున్నది. ఇట్లు అధముడను, అనధికారిని అయిన నేను ఏవిధముగ బృందావనములో నివసింపగలను ?

**చరత యథేష్ట మింద్రియగణా వయం న యుష్మత్ రిపుః**
**కథమపి శక్తిరస్తి న చ వో వినిగ్రహే మాదృశామ్**
**కలయత వాక్యమేకమిహ న స్తథా విధేయం యథా**
**హతమతి రేష యాతి న బహిర్విహాయ వృందావనమ్ 70**

హే ఇంద్రియములారా! మీరు యథేచ్ఛగా విహరింపుడు! మేము మీకు శత్రువులము కాము. మిమ్ము నిగ్రహించుటకు మాకు శక్తి లేదు. మా మాట ఒకటి వినుడు. నా వంటి బుద్ధిహీనుడు శ్రీబృందావనమును విడచి అన్యత్ర వెళ్లకుండ చూడుము!

**జీవన్నేవ శవాయితోఽంత సదసద్దేహేంద్రియ వ్యాపృతిః**
**శ్రీరాధాపదపద్మసీధు సురసాస్వాదోన్మదాంధా కృతిః**
**శ్రీరాధాప్రియ నాగరేంద్ర లలితాద్యాపుష్ట నర్మోత్సవః**
**శ్రీరాధారతికేలి కౌతుకవనే కోఽప్యహో ధన్యో వసేత్ 71**

జీవించియుండియు మరణించినవానివలె నున్నట్టి; సత్, అసత్ దేహ, ఇంద్రియముల పనులన్నియు లుప్తమైనట్టి స్థితిలో నుండి; శ్రీరాధా పదపద్మ సుధారసాస్వాదనమును చేయుచు ఉన్మత్తుడై ఉండవలెను. అట్లు జీవించుచు, శ్రీరాధా ప్రియతముడైన నాగరచూడామణి (శ్రీకృష్ణుడు) వలనను, లలితాది సఖీమణుల వలనను పుష్టిని పొంది నర్మోత్సవపూర్ణమైన శ్రీరాధా రతికేళీవనము నందు నివసించువాడే మిక్కిలి భాగ్యశాలి!

**శ్రీమద్రాధా మధురిమ నిధి ర్యద్రసేనాతి మత్తా**
**చిత్రం చిత్రం నిజనటవర ప్రేయసా నానటీతి**
**దృష్ట్వా దృష్ట్వా పులకిత తనుః స్వప్రియా ధామ శోభామ్**
**చిత్రన్యస్తాలిభిరపి వృతా ధ్యేమి వృందాటవీం తామ్ 72**

మాధుర్య సాగరమైన శ్రీరాధ శ్రీకృష్ణుని రసమునందు మిక్కిలి మత్తిల్లి ఆ నటవర ప్రియతమునితో కలసి శ్రీధామములో విచిత్ర నాట్యరంగమును ఏర్పరిచినది. తన ప్రియతమయైన శ్రీరాధా రూపకాంతిని దర్శించి శ్రీశ్యామ సుందరుడు పులకితుడైనాడు. సఖీగణము చిత్రిత ప్రతిమల వలె వారిని పరివేష్ఠించినారు. అట్టి శ్రీబృందావనమును నేను ధ్యానిస్తున్నాను.

ఆహా! శ్రీరాధ, శ్రీకృష్ణుడు, శ్రీసఖీమండలి, శ్రీబృందావనము – అద్భుత రంగస్థలి!

**గండాభోగే మృగమదరసైః క్లప్త సచ్చిత్రలేఖా**
**లఖాధీశాద్యనఘ రమణీబృంద మౌల్యార్ధ రేఖా**
**సా శ్రీరాధా స్వదయితతమేనాఽత్య ధైర్యా యదీయై**
**ర్మాధుర్యైషైరటతి పరితోఽధ్యేమి వృందాటవీం తామ్ 73**

శ్రీరాధా కపోలముల (చెక్కిళ్ల)పై కస్తూరీసుగంధ ద్రవ్యముచే చిత్రితమైన రేఖలు ఒప్పుచున్నవి. దేవాధీశుడైన ఇంద్రుని రమణీమణులకు శిరోమణి శ్రీరాధ! అట్టి మాధుర్యరాశియైన రాధాజీ తన ప్రియతమునితో కలసి అధీరయై బృందావనములో అటునిటు సంచరిస్తున్నది. ఆ బృందావనమును నేను ధ్యానిస్తున్నాను.

**శ్రీశాద్యైరపి యస్య సద్రసనిధే రాశాఽపినాసాద్యతే**
**నాశామప్యవసాయ యంతి నిగమా స్త్రాసాత్ సదోదాసతే**
**భాసాయస్య తిరోహితాశ్చిత చిదాత్మార్కేందు వహ్న్యోదయో**
**వాసాయానుమతిం దదాతు కృపయా తన్మేఽద్య వృందావనమ్ 74**

లక్ష్మీనారాయణాదులు కూడ శ్రీబృందావన ఉత్కృష్ట రససాగరమును పొందుటకు ఆశింపనైనను ఆశింపలేరు. వేదసమూహము భయభీతమై శ్రీధామము యొక్క సమగ్ర నిశ్చితరూపమును నిరూపింపలేక తమ అశక్తతను అంగీకరించినది. చిత్ జడాత్మకమైన సూర్య, చంద్ర, అగ్ని మున్నగునవి కూడ శ్రీబృందావన కాంతి ముందు వెలవెలబోయినవి. అట్టి శ్రీబృందావనము నాకు తన యందు నివసించుటకు కృపతో అనుమతినిచ్చునుగాక!

**శ్రీవృందా విపిని తవ ప్రభామాత్ర**
**ప్రోన్మీలత్ ప్రణయరస ప్రవర్షధౌతమ్**
**శ్రీరాధాపదనఖ చంద్రికోచ్ఛలంతీ**
**సాంద్రేయం మమఖలు నింపతీవ చేతః 75**

హే బృందావనమా! నీ కిరణములమాత్రం చేత ప్రకాశమానమైన ప్రణయరసవర్షములో నా మనసు కొట్టుకొనిపోయినది. (నా మనసు నా అధీనములో లేదు.) శ్రీరాధా పద నఖముల నుండి ఎగసిపడుతున్న సాంద్రమైన చంద్రికలతో నా చిత్తము నిండిపోయినది.

**శ్రీవృందావన వసతిం విధిత్సతో మే**
**దేహాంతావధి బధిరాయితే శ్రుతీస్తామ్**
**దోషానాం శ్రవణవిధౌ పరస్య జిహ్వే**
**మూకాస్తాం భణితిషు ధీర్గృహే జడాఽస్తు 76**

బృందావనములో మృత్యుపర్యంతము నివసించాలి! నా చెవులు పరదోషములను వినుటలో చెవిటివి కావాలి. ఇతరులను గూర్చి చెప్పుటలో నాలుక మూగపోవాలి. పరదోషములనెంచునపుడు నా బుద్ధి జడముగ ఉండాలి. ఇదియే నా ప్రార్థన!

బృందావనములో శాశ్వతముగ నుండదలచు వ్యక్తి ఎట్లు జీవింపవలెనో ఇట స్పష్టము చేసినారు.

**శ్రీవృందావన నీల కుట్టిమోర్వ్యాతారా**
**సు ప్రతిఫలితా సు పుష్ప బద్ధయా**
**చిన్వానాం సపది హసన్నుపాలి రాధామ్**
**కృష్ణోఽవ్యాత్ ప్రసృతకరార్థిత ప్రసూనః 77**

శ్రీబృందావనము యొక్క నీలమణి విరచిత భూమిపై నక్షత్రముల నీడలో ప్రతిఫలిస్తున్న పుష్పములను రాధాజీ కోయసాగినది. శ్రీకృష్ణుడు హఠాత్తుగా సఖియల నడుమ నిలచి; నవ్వుతూ నవ్వుతూ చేయి చాచి, రాధాజీ కోరుకున్న పుష్పమును అందించినాడు. అట్టి కృష్ణుడు రక్షించునుగాక!

**శ్రీవృందావన మమ పావనం త్వమేవ**
**శ్రీవృందావన మమ జీవనం త్వమేవ**
**శ్రీవృందావన మమ భూషణం త్వమేవ**
**శ్రీవృందావన మమ సద్యశస్త్వమేవ 78**

హే శ్రీబృందావనమా! నీవే నన్ను పవిత్రము చేయుదానవు! నీవే నా జీవనము, నీవే నా ఆభరణము! నీవే నా మహాయశస్సు! (నా సర్వము నీవే అని భావము).

**యా కైశోరక మాత్ర దివ్య వయసోస్తుంగైరనంగోత్సవైః**
**స్వాస్మిన్నున్మదవత్ సదా విహరతోః శ్రీరాధికా కృష్ణయోః**
**వర్ధ స్పర్ధితయేవవృద్ధి ముపయాత్యుచ్చైర్మిథోఽంగ శ్రియా**
**శ్రీవృందావన సాఽస్తు తే మమ లోభాయ శోభాతతిః 79**

హే బృందావనమా! శ్రీరాధాకృష్ణులు ఏకమాత్ర కైశోర రూప దివ్యవయో యుక్తులై, అనంగోత్సవములో నీయీ వనమునందు ఉన్మత్తులై విహరిస్తూ ఉంటారు. వారి అంగాంగముల సౌందర్యముతో ప్రతిక్షణ వర్ధనశీలమైన నీ శోభారాశి పోటీపడుతూ ఉంటుంది. అట్టి దాని పట్ల నా మనసు మిక్కిలి లోభముతో ఉన్నది.

అనగా అట్టి బృందావనములో ఎప్పటికిని నివసింపవలెనని యున్నదనుట!

**లీలాః శ్రీపురుషోత్తమస్య సకలాః స్వానంద సాంద్రాస్తథా**
**శ్రీమన్మూర్తి పరస్పరాపి పరమా రామాశ్చతాస్తా అపి**
**సత్యం కింతు మమైక ఏవమధురో రాధైక ధీ నాగరః**
**యత్రైవ స్వైకరూపతోఽస్తి యదతో వృందావనం మే గతిః 80**

శ్రీపురుషోత్తముని సమస్త లీలలు స్వానంద పూర్ణములు! శ్రీమూర్తులు కూడ అట్లే ఆనందమయములు. వారి రమణీమణులు కూడ మిక్కిలి ఆనందకరములైన వారే! ఇది సత్యము! కాని, నాకు మాత్రము ఏకమాత్ర మధుర స్వరూపుడైన శ్రీరాధాచిత్తచోరుడే ఆనంద ప్రదాత! అతడు శ్రీబృందావనములో నిజ స్వరూపముతో విరాజమానుడై ఉంటాడు. కనుక నాకు శ్రీబృందావనమే శరణ్యము!

**యో లోకోత్తర నాగరీషు సు చమత్కారీ విశేషః పరః**
**సర్వోఽసౌ వ్రజసుందరీషు సకలస్తాసాం మమ స్వామినీమ్**
**అత్యాశ్చర్య చమత్కృతిః శ్రయతి సా తత్రైవ వృందావనే**
**నిత్యం ఖేలతి మోహనేన తదిహైవాత్మా మమాఽఽస్తాం స్థిరః 81**

దివ్యనారీమణులలో విశేషభావముతో గోచరించు పరమచమత్కారము పరిపూర్ణరూపముతో వ్రజసుందరీమణులలో విరాజమానమై ఉంటుంది. వారిలో ఉండు అత్యంత ఆశ్చర్య జనకములైన చమత్కారములు నా స్వామినియైన రాధాజీని ఆశ్రయించి ఉంటాయి. ఆ దేవి మోహనునితో కలసి నిరంతరము ఈ శ్రీబృందావనములో క్రీడిస్తున్నది. కనుక నా ఆత్మ శ్రీబృందావనములో స్థిరముగ నిలచియుండునుగాక!

**పూర్ణప్రేమ రసార్ణవేఽఖిల జగన్నిర్మజ్జయంతీ మహో**
**కందర్పోదయ దర్పతో వ్రజభృతాం నిర్లజ్జయంతీ వధూః**
**క్రీడామాత్ర రసేఽప్యశేష పరమస్యాఽఽసజ్జయంతీ మనః**
**సర్వేషాం పరివర్జయంత్యపి పరం ప్రోదేతి వృందాటవీ 82**

శ్రీబృందాటవి సమస్త జగత్తులను ప్రేమరస సాగరములో ముంచెత్తుతున్నది. మహాకందర్పుని (మన్మథుని) గర్వమునకు కారణమైన వ్రజవనితల సిగ్గును నశింపజేస్తున్నది. అందరి మనసులను శ్రేష్ఠమైన తన లీలారసమునందు ఆసక్తమగునట్లు చేస్తున్నది. ఇతరములైన సమస్త విశేషములను త్యజింపజేసి, శ్రీబృందావనము స్వయముగా ప్రకృష్టరూపముతో ప్రకాశిస్తున్నది.

**తత్తద్దివ్య సునాయికా విలసితైః ప్రాణేశ్వరీ మే సదా**
**తత్తన్నాయక దివ్యరూప లలితాత్మైకానుగా ప్రేయసా**
**దివ్యానంత విచిత్రఖేలన రతా వృందావనేఽత్రైవ తత్**
**స్వేచ్ఛారూపిని తద్వినా మమ మనో వస్త్వేవ నా మన్యతే 83**

నా ప్రాణేశ్వరి (శ్రీరాధ) సమస్త ప్రసిద్ధ, దివ్య, ఉత్తమ నాయికల విలాసాదులతో భూషితయైనది. అనగా ఆయా నాయికల దివ్యలక్షణములన్నియు రాధాజీలోనే ఉన్నవి అని తాత్పర్యము! ప్రసిద్ధమైన నాయకోచిత దివ్యరూప, లలిత స్వభావము కూడ ఆమెయందే ఉన్నది. ఆదేవి ఏకమాత్ర వశవర్తియైన ప్రియతమునితో కలసి స్వేచ్ఛారూపిణియైన శ్రీబృందావనములో విరాజమానమైనది. ఇది తప్ప, మరి ఏ యితర సారవస్తువును నా మనసు అంగీకరించదు!

అనగా రాధాజీ వినా, సార వస్తువు మరొకటి లేనేలేదు అని భావము!

**అహో శేషాశేషాఽఖిల విదుర హృద్విస్మయకరీ**
**శరీరిణ్యత్రైవ ప్రణయరస మాధుర్య లహరీ**
**వరీయో భాగ్య శ్రీభరిత జనతా హృన్మధుకరీ**
**పరీతం వృందాటవ్యుదయతి మమాశార్ణవ తరీ 84**

ఓహో! శ్రీబృందావనము ఈశ్వరునితో సహా సమస్త పదార్థముల స్వభావము నెరిగిన వారి హృదయములను కూడ ఆశ్చర్యపరుస్తున్నది. ఇక్కడే ప్రణయ రస మాధుర్యతరంగము రూపుధరించి విరాజితమైనది. ఉత్తమ భాగ్యలక్ష్మీపూర్ణులైనవారి

హృదయమునకు భ్రమర స్వరూపమై, నా ఆశా సముద్రమునకు నౌకయై శ్రీబృందావనము నాలుగు దిక్కులలోను ప్రకాశిస్తున్నది.

**అమర్యాద ప్రేమామృత జలధి సంవర్ధన శరత్**
**విధుజ్యోత్స్నా వీచిర్మధుర రస సంసిక్త వసుధా**
**బుధానామప్యన్యార్థకమధి ముధా భ్రామణకరీ**
**శరీరం వృందాటవ్యవతు మమ రమ్యాత్మని సదా 85**

శ్రీబృందావనము ఎల్లలులేని ప్రేమామృతసాగరమును ఎగసిపడునట్లు చేయు శరచ్చంద్ర చంద్రికల మధురరసముతో భూమిని తడుపుతుంది. విద్వాంసులకు కూడ ఇతర సాధనలు వృథా అను భావమును కలిగిస్తుంది. అట్టి శ్రీబృందావనము యొక్క ఒడిలో నా శరీరము నిరంతరము సురక్షితముగా ఉండునుగాక!

శ్రీబృందావనము తల్లివలె జీవులను సురక్షితముగ ఉంచుతుంది.

**విముక్తానామప్యన్మథిత హృదయాఽనంకుశ దయా**
**నిధిః సర్వాశ్చర్య ప్రచుర సుషమా వైభవఖనిః**
**సమంతాచ్ఛ్రీ రాధాలలిత పద విన్యాస మధురా**
**దురాపార్థాశాం మే సఫలయతు వృందావనమహీ 86**

శ్రీబృందావనము ముక్త జనుల హృదయమును కూడ మథిస్తుంది. (ఏ కోరికలు లేని ముక్త స్థితిలో నున్నవారికి బృందావనము పట్ల ఆసక్తి కలుగునట్లు చేస్తుంది.) ఆ ధామము ఏదియును ఆశించని దయా సాగరము! ఆశ్చర్య పూర్ణములైన సమస్త శోభావైభవములకు గని. సర్వత్ర శ్రీరాధా సుకుమార చరణ విన్యాసముల చేత మాధుర్యముతో నిండియున్నది. అట్టి శ్రీబృందావనము దుర్లభమైన నా ఆశలను సఫలీకృతము చేయునుగాక!

**ప్రసార్యాక్షి శ్రోత్రే కిమతి సువిచిత్రేఽతి మధురో**
**న్మద ప్రేమావిష్టమునైన యుగళ రససాగరమునకు**
**వసన్ వృందారణ్యే తదమితగుణాన్ సన్ముఖరితాన్**
**యథాభాతం రూపామృతమపి చ యాస్యామ్యవితృషః 87**

అతిసుందరము, అతి విచిత్రము, అతిమధుర ఉన్మాద ప్రేమావిష్టమునైన యుగళ రససాగరమునకు ప్రాణప్రియమైన బృందావనములో వసించాలి! సాధుజనుల ముఖతః ఎల్లలు లేని గుణములను గూర్చి, బృందావన ప్రకటిత రూపామృతమును గూర్చి వినుచు, దర్శిస్తూ; ఇక ఏ కోరికలు లేనివాడనై నా చిరకాలపు తృష్ణను తీర్చుకొనగలనా!

శ్రీబృందావనములోనే ఉంటూ, బృందావన గుణమణులగాథలను వింటూ, ఆ దివ్యరూపమాధుర్యమును గ్రోలుతూ జీవుడు తరించాలి!

**శ్రీబృందావిపిన మయా శరీరమేతత్**
**విక్రీతం త్వయి ఖలు సేంద్రియం సచిత్తమ్**
**శ్రీరాధారమణ పదారవింద భక్తి**
**మూల్యేన శ్రుతివచసా దదాసి నో కిమ్ 88**

శ్రీబృందావనమా! నేను నా ఇంద్రియములు, మనసు, శరీరముతో సహా నీకు అమ్ముడైపోయాను. వేదవాక్యానుసారము శ్రీరాధారమణుని చరణ కమల భక్తియే దీనికి మూల్యము! నీవు దీనిని (మూల్యమైన ఆభక్తిని) ఈయవా ?

**శ్రీమద్బృందావన తవగుణైః పూర్యతాం శ్రోత్రరంధ్ర**
**స్త్వచ్ఛ్రీ వీక్ష్యామృతరసనిధౌ మజ్జతాం చక్షుషీమే**
**అత్యుల్లాసాద్రటతు రసనా వర్ణనే త్వన్మహిమ్నామ్**
**త్వత్ ప్రేమ్ణామేవపుషి సతతం సాత్వికాః సంతుభావాః 89**

హే బృందావనమా! నీగుణ శ్రవణము చేత నా చెవులు పూరింపబడాలి! నీ శోభాదర్శనము చేత నా కన్నులు అమృతరససాగరములో తేలియాడాలి!

నీ మహిమను వర్ణిస్తూ నా నాలుక ఉల్లాసంగా నాట్యం చేయాలి! నీ యందలి ప్రేమ చేత నా శరీరములో సాత్వికభావములు (ప్రీతి చేత కలిగెడు భావములు) ఉదయించాలి! ఇదియే నా ప్రార్థన!

**శ్రీమద్బృందావన మమ వినా మూల్యమేతచ్ఛరీరమ్**
**క్రీణాహి త్వం కిమిహ బహునా త్వత్పదే క్షిప్తమేవ**
**ధర్మాధర్మాద్యమిత కృతిభిర్నాస్య పోషేఽస్మి శక్తో**
**మందాక్రాంతా గురుతరధురాః సాధుభిశ్చానుకంప్యాః 90**

హే బృందావనమా! మూల్యము చెల్లింపకయే నీవు ఈ శరీరమును క్రయము (కొనుట) చేయుము. అంతకన్న మించినది ఏమున్నది ? నేను నా యీ శరీరమును నీ చరణముల చెంత సమర్పిస్తున్నాను, ధర్మము, అధర్మము మున్నగు సాధనలతో నేను దీని పాలన, పోషణములను చేయుటలో అసమర్థుడినైనాను. మందగతితో మిక్కిలి బరువును మోయువారిపై సాధుపురుషులు తప్పక దయ చూపుతారు!

అనగా సాధుసజ్జన స్వరూపిణియైన శ్రీబృందావనము దుర్బలులపై దయ చూపుతుందని భావము!

**శ్రీమద్బృందా విపిన శరణాపన్నమేతం కదాపి**
**త్యక్తుం నార్హస్యహహ నారకాత్యంధ కూపే పతంతమ్**
**అంఘః సంఘ ప్రతిహతమతిం లంఘితేశాఖిలాభమ్**
**ప్రాజ్ఞమ్మన్యం త్రిజగతి న మామజ్ఞమన్యోఽవతీహ 91**

హే శ్రీబృందావనమా! అత్యంత అంధకూప నరకములో పడనున్న ఈ శరణాగతుడిని త్యజించుట ఎన్నటికిని నీకు ఉచితము కాదు. పాపములతో నా బుద్ధి తలక్రిందులై పోయింది. భగవంతుని ఆజ్ఞలను ఉల్లంఘిస్తున్నాను. ప్రాజ్ఞుడనను భావములోనున్న నా వంటి అజ్ఞానిని త్రిభువనాలలోను రక్షించువారు లేరు. (నీవు వినా మరి దిక్కులేదు అని ప్రార్థన!)

**త్వమానందా పరాంబుధిరసమ దుఃఖీహ జగతీ**
**త్వమంత్యంతం సత్యావనతమ ఇహోఽహం త్వఘమయః**
**తవానాథ త్రాణ వ్రతమిహ మమాన్యన్న శరణమ్**
**విచార్యై తద్బృందావన విరచితాశస్త్వయి పరమ్ 92**

హే శ్రీబృందావనమా! నీవు అపారమైన ఆనందసాగరానివి, నేను ఈ జగత్తులో అంతులేని దుఃఖ స్వరూపుడను. నీవు సత్యమును అత్యంతము రక్షించు దానవు, నేను మహాపాపిని. నీవు అనాథలను రక్షించు వ్రతము కలదానవు, నేను నిన్నే ఏకమాత్రముగ శరణుచెందియున్నాను. ఇది యంతయు ఆలోచించి, నేను నీ యందు గొప్ప ఆశతో (రక్షింతువను ఆశతో) ఉన్నాను.

**శ్రీమద్బృందావిపిన విముఖా యే మహామంద భాగ్యా**
**స్తేషాం నామాన్యహహ నహిమే కర్ణమూలం ప్రయాంతు**
**యచ్ఛ్రీరాధారసిక విమల ప్రేమ భక్త్యుషరాజ్ఞాః**
**పశ్యంత్యేతత్ సదృశమపి కం కించిదప్రాకృతేఽపి 93**

ఓహో! మందభాగ్యుడైన వ్యక్తియే బృందావనం పట్ల విముఖునిగ ఉంటాడు. అట్టి వారి నామము కూడ నా చెవులలోనికి వెళ్లుటలేదు. శ్రీరాధారసికుడైన శ్రీశ్యామసుందరుని విమల ప్రేమభక్తిలేని వాడు అజ్ఞాని! ఈ ప్రకారముగా ఉండు అట్టి వ్యక్తి అప్రాకృతిక జగత్తులో కొంచెమైనను సుఖమును చూడగలడా! (పొందగలడా అని భావము).

**ధ్యాత్వా ధ్యాత్వా మ్రియంతాం కథమపి న మనాక్ రాధికా కృష్ణతత్వ**
**స్ఫూర్తిఃవైకుంఠ ముఖ్యాఖిల పరమ మహాధామమహో సత్యమేతత్**
**నూనం నందవ్రజే సంభవతి సచల తత్ పూర్ణమాధుర్యధుర్య**
**స్తస్మాదస్మాకమస్మిన్ పరమచలరతిః శ్రీల వృందావనేఽస్తు 94**

ధ్యానం చేస్తూ, చేస్తూ మరణించినప్పటికీ ఏ విధంగాను శ్రీరాధాకృష్ణ తత్వంలోని అణుమాత్రం కూడ స్ఫురింపదు. ఓహో! శ్రీబృందావనము వైకుంఠాది

సమస్త ధామములకన్నను పరమధామమనుట పరమసత్యము! నంద వ్రజములో ఆధామము మాధుర్య పూర్ణమై సచల రూపముతో నిశ్చయంగా ఉన్నది. అందువలన శ్రీబృందావనమునందే మాకు నిశ్చలమైన పరమ ప్రీతి ఉండుగాక!

**మాయా చంద్రాభిరామోజ్జ్వల కలిత మహాబీజచిజ్జ్యోతిరేక**
**స్వచ్ఛ స్వచ్ఛంద కామోన్మద రసజలధౌ సత్వరేఽనంత పారే**
**దివ్యద్వీపాయమానం విలసతి మధురామండలం నందగోష్ఠమ్**
**తత్రాప్యస్మాచ్చ విస్మాపయతి రసభరై శ్రీల వృందాటవీయమ్ 95**

మాయ (లక్ష్మి) కంటెను, చంద్రునికంటెను అధికముగ రమణీయమైనది నందగోష్ఠ మధురామండలము! అది ఉజ్వల మహాబీజమైన "క్లీం" అను బీజాక్షరముతో కూడినది. చిత్, జ్యోతిర్మయ, స్వచ్ఛ, స్వచ్ఛంద స్వరూపమైనది. ఉన్మదమై, కేవలము సద్వస్తువులతో భూషితమై, అనంత రససాగరము నందలి దివ్యద్వీపము వలె నందగోష్ఠము విరాజమానమైనది. దానికన్నను శ్రీబృందావనము అత్యధిక విస్మయ జనకమై, రసపూర్ణమై వెలుగొందుచున్నది.

అట్టి భావ బృందావనము భక్తానుగ్రహ కాతరయైన శ్రీరాధా అద్భుత కృప వలన భౌమ్యబృందావనముగ వెలుగుచున్నది.

**వేదాః ఖేదాయ నానా సరణిమనుసరద్వాక్యజాలం వహంతః**
**సంతః సంతప్తి శాంత్యై న మమ హరిరసైకాశయా దందహస్య**
**శ్రౌతం స్మార్తంచ యత్ సాధనమిహ కలయన్ సర్వమేతద్విరుద్ధమ్**
**హా వృందారణ్య రాధారతి భవనమమాలంబనం స్యా స్త్వమేవ 96**

వేదములు అనేక ప్రకారములైన అనుశ్రుత వాక్యములను విస్తరింపజేయుచు కేవలము ఖేదమునే మిగిల్చినవి. హరిరసమునకై దగ్ధచిత్తముతోనున్న నా సంతాపమును శాంతింపజేయుటలో సాధుసమాజము అసమర్థమైనది. శ్రౌత, స్మార్త సాధనాసంపత్తిలో సర్వత్ర పరస్పర విరుద్ధతయే గోచరించుచున్నది. హా బృందావనమా! శ్రీరాధారతి భవనమా! నీవు మాత్రమే నాకు ఏకైక ఆశ్రయము!

**కో రాగః కో విరాగః కిమిహ వరయశో దుర్యశో వా కిమిత్ర**
**కో ధర్మః కోన్వధర్మః సదసదురుకృతిః ప్రాసనా వాసనా కా ?**
**కే దోషాః కే గుణా వా కిమిహబహువిథ దుఃఖమస్మిన్ సుఖం కిమ్**
**శ్రీవృందారణ్య మామృత్యహహ న జహతాం కోటిశో వజ్రపాతైః 97**

రాగము ఏమిటి, విరాగమేమిటి ? శ్రేష్ఠమైన యశస్సు, దుర్యశస్సు; ధర్మము, అధర్మము; సత్కర్మ, అసత్కర్మలు ఏమి ? నిష్కామ్యత, వాసనలు; దోషములు, గుణములు; అనేక ప్రకారములైన దుఃఖములు, సుఖములు – ఈ యన్నిటితోను నాకు పనిలేదు. ఓహో! కోటి వజ్రాయుధపు దెబ్బలు కొట్టనిమ్ము, మృత్యుపర్యంతము శ్రీబృందావనమును విడచి నేను ఎప్పటికి ఎచటికి వెళ్లను!

మృత్యు పర్యంతము బృందావనములోనే జీవించు భాగ్యశాలికి ద్వంద్వము లన్నిటికిని అతీతమైన దివ్యస్థితిని బృందావనము దయతో అనుగ్రహిస్తుంది!

**పుష్పాసారే పతతి గగనాత్ దుందుభౌ దేవతానామ్**
**దివ్యోన్మాదే మలయపవనే వాతి భాత్యద్భుతేందౌ**
**వృందారణ్యే విపుల పులినే ప్రోత్సరత్ గంధచూర్ణే**
**రాధాకృష్ణౌ స్మర నిజసఖీ మండలీ చిత్రనృత్యౌ 98**

'ఆకాశము నుండి పూవులు వర్షిస్తున్నాయి. దేవతా సమూహములు దుందుభిని మ్రోగిస్తున్నారు. దివ్యమైన ఉన్మత్తతను కలిగించే మలయమారుతం వీస్తున్నది. అద్భుతమైన చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. గంధపరాగము అన్నివైపులకు వ్యాపిస్తూ, విశాలమైన తీరములతో శోభిస్తున్న బృందావనములో తమ సఖీమండలి మధ్య విచిత్ర నృత్య పరాయణులైయున్న శ్రీరాధాకృష్ణులను స్మరింపుడు!

శ్రీ ప్రబోధానందులు పరమాద్భుతమైన ఈ శ్లోకముతో పన్నెండవ శతకమును పూర్తి చేశారు. బృందావన ప్రేమికుల కన్నుల ముందు ఒక రసపూర్ణమైన దివ్యదృశ్యాన్ని ఆ మహనీయుడు సాక్షాత్కరింపజేశారు. అది వారి దర్శనమే కదా!

# పదమూడవ శతకము

**వృందారణ్యే౭ద్భుత రసమయే యత్ర యత్రైవ రాధా**
**కృష్ణౌ నిత్యోన్మద రతికలాపార తృష్ణౌ ప్రయాతః**
**గాయత్ భృంగీగణ శుకపికాద్యున్నటద్బర్హి వృందమ్**
**తత్రైవానువ్రజదవనిజాః పుష్పమాలాద్య వర్షన్ 1**

అద్భుత రసమయ బృందావనములో ఎక్కడెక్కడ నిత్యోన్మదమైన ప్రేమకేళిలో అవధులు లేని తృష్ణతో శ్రీరాధాకృష్ణులు సంచరిస్తూ ఉంటారో అక్కడక్కడ భ్రమరములు, శుకపికాదులు కూడ గానం చేస్తూ అనుసరిస్తాయి; మయూరాలు నాట్యం చేసస్తూ శ్రీయుగళమును అనుగమిస్తాయి. వృక్షరాజములు పుష్పమాల్యాదులను అచట వర్షిస్తాయి.

12వ శతకము, చివరి శ్లోకములో సాక్షాత్కరించిన దివ్యదృశ్యము 13వ శతకములోని మొదటి శ్లోకములో ఇట్లు మరింతగా రసపుష్టిని పొందినది.

**యావద్రాధా పదనఖమణి చంద్రికా నావిరాస్తే**
**తావత్ వృందావనభువి ముదం నైతి చేతశ్చకోరీ**
**యావత్ వృందావనభువి భవేన్నాపి నిష్ఠా గరిష్ఠా**
**తావత్ రాధాచరణకరుణా నైవ తాదృశ్యుదేతి 2**

ఎప్పటి వరకు శ్రీరాధా పదనఖ చంద్రికలు శ్రీబృందావనభూమిపై ప్రకటితం కావో అప్పటి వరకు మనస్సు అనెడు చకోరమునకు ఆనందం లభించదు. (అంటే, శ్రీరాధాపద నఖచంద్రికల వలననే మనఃచకోరమునకు ఆనందం కలుగుతుంది.) ఎప్పటి వరకు శ్రీబృందావన భూమిపై పూర్ణనిష్ఠ ఉండదో అప్పటి వరకు శ్రీరాధా చరణ కృప కూడ పూర్ణరీతిలో కలుగదు. (అంటే, పరిపూర్ణమైన ప్రేమనిష్ఠతో ఉన్నప్పుడే శ్రీరాధాచరణ కృప ప్రసరిస్తుంది)!

**ముక్తాహారాః సురుచిరగుణాః స్వచ్ఛతామాదధానాః**
**కృష్ణస్యూతాః స్వయముపహితారాధయా కంఠపీఠే**
**త్వంచేత్ వృందావన భువిలుఠంస్తాదృశః స్యాం మహాత్మన్**
**నూనం తాదృక్ పదమపి న తే దుర్లభం హంత భావి** **3**

అత్యంత మనోహరమైన, నిర్మలమైన ముత్యాలహారమును శ్రీకృష్ణుడు కూర్చగా; రాధాజీ స్వయముగా తన మెడలో ధరించినది. ఓ మహాత్మా! నీవు కూడ శ్రీబృందావనభూమిపై దొరలుచు, ఈ ప్రకారముగా సేవకుడివైనచో ఆ సేవా దాస్యము నీకు కూడ లభించుట దుర్లభముకాదు. (అనగా, తప్పక సేవాభాగ్యము లభింపగలదు.) ఇది నిశ్చయమని గ్రహించు!

**శ్రీవృందావన కుంజ మంజుల తమః పుంజే కలానాం చతుః**
**షష్టైః కోఽపినిధిః సదోజ్జ్వల తమ శ్యామః శశిమోహనః**
**ఆశ్చర్యైక నవీన హేమ కమలిన్యార్ధ్వాంబుజం చుంబతి**
**ప్రేక్ష్యప్రేక్ష్య తదేవ విస్మితమనాః సౌఖ్యాంబుధౌ మజ్జతు** **4**

శ్రీబృందావన కుంజలలోని మంజులమైన చీకటిలో చతుష్షష్టి కళానిధి (64 కళలలో నిధి)యైన ఒకానొక ఉజ్వల శ్యామవర్ణ మోహన చంద్రుడు (శ్రీకృష్ణుడు) నిరంతరము విరాజమానుడై ఉంటాడు. అతడు ఒకానొక ఆశ్చర్యపూర్ణమైన నవ నవ కమలినీ (శ్రీరాధా) ముఖ కమలమును ముద్దుగొనుచున్నాడు. దీనిని దర్శిస్తూ, విస్మితుడవై సుఖసాగరములో ఓలలాడుము!

చంద్రవదనుడైన శ్రీశ్యామసుందరుని, కమలముఖియైన శ్రీరాధాజీని వారి ప్రేమ పూర్ణమైన లీలల ద్వారా నిరంతరము స్మరింపుడని శ్రీప్రబోధానందులు జీవులను ప్రేమతో పిలుచుచున్నారు.

**అరక్త రుచిరారుణాధర కరాంఘ్రి పంకైరుహా**
**మనంజిత సునీలదృక్ కువలయామ మృష్టోజ్జ్వలామ్**
**అసంస్కృత సుచిక్కణ ప్రచుర కుంతలాం రాధికా**
**మభూషణ విభూషితాం స్మర సదాఽత్ర వృందావనే 5**

ఎరుపు రంగుతో అలంకరింపబడకపోయినను శ్రీరాధా అధరములు, కరకమలములు, పదపద్మములు సహజసుందరమైన ఎరుపు రంగుతో శోభిస్తున్నాయి. కాటుకను తీర్చకపోయినను ఆమె నేత్ర యుగళి కలువలవలె ఉజ్వలముగ ఉన్నవి. చక్కగా సంస్కరింపకపోయినను (దువ్వకపోయినను) ఆమె కేశరాశి వంకీలు తిరిగి శోభిస్తున్నది. ఈ విధముగా భూషణములు లేకయే శ్రీరాధాజీ విభూషితయై వెలుగుచున్నది. అట్టి రాధాజీని నిరంతరము శ్రీబృందావనములో స్మరింపుము!

**"బినుభూషణ భూషిత శ్రీరాధాజీ"**కి జయహో!

**శ్రీవృందావన జీవనా ఇహ మహాభాగా యదా జీవనా**
**దప్యేతే బత వల్లభా నహి తదా వృందాటవీ దుర్లభా**
**తాదృక్ సత్తమ సత్కృపాత ఉదితా వృందావనే చేన్మహా**
**ప్రీతిస్తర్హ్యచిరేణ సాపి సులభా వృందావనాధీశ్వరీ 6**

శ్రీబృందావనమే ప్రాణసమానమైనవారు మహాభాగ్యశాలురు! తమ ప్రాణములకన్నను అత్యంత ప్రియముగ బృందావనమును ప్రేమించువారికి ఆ శ్రీధామము లభించుట ఎంతమాత్రము దుర్లభము కాదు. ఈ విధముగ మహాపురుషుల కృపచేత బృందావనము పట్ల మహాప్రీతి కలిగితే, శీఘ్రముగానే బృందావనేశ్వరియైన శ్రీరాధాజీ లభిస్తుంది!

బృందావనమును అత్యంతముగా ప్రేమించు ధన్యులకు రాధాజీ పదసన్నిధి తప్పక లభించునని శ్రీప్రబోధానందులు స్పష్టము చేయుచున్నారు. ఏలనన, బృందావనమునకు, తదధీశ్వరికి భేదము లేదు కదా!

**న రాకా రాకాయాః పతిరయముదీతే న సరసీ**
**సరోజం ప్రోత్ఫుల్లం విపులపులినం భాతి న నదీ**
**చమత్కుర్వంత్యేతే తడిత ఇహ మేఘా నహి జయ**
**త్యహో శ్రీరాధా విస్మయ కృదిహ వృందావన వనే 7**

పూర్ణిమ లేదు, కాని పూర్ణిమాపతియైన చంద్రుడు ఉదయించాడు. సరోవరము లేదు, కాని పద్మము వికసించింది. నది లేకపోయినా అనేకమైన తీరములు శోభిస్తున్నాయి. మేఘము లేదు, అయినా మెరుపుతీగ తళుక్కుమంటున్నది. ఓహో! ఈ బృందావనములో విస్మయకారిణియైన శ్రీరాధాజీకి జయము! జయము!

అప్రాకృతికమైన దివ్యబృందావనములో భావపరామయియైన శ్రీరాధా సన్నిధిలో ప్రకటితమైన ఆదృశ్యములు అన్నియు అప్రాకృతికములు, భావనాగమ్యములు! శ్రీప్రబోధానందుల దర్శనానుభూతికి నమస్సులు!

**కాంతే! తల్పమిదం కృతార్థయ నహి ప్రేష్ఠేఽపరాధేఽస్య కః**
**శ్యామే తచ్చరితం న భద్రమపి కిం వక్ష్యామి తత్తే కియత్**
**క్షంతవ్యంసకలం నహి త్యజ పదం త్వత్యక్త తల్పేస్వపి**
**మ్యంఘ్రీ తే ఉపలాలయే న నిపుణో స్యాం శిక్షతాం కింకరః 8**

"హేప్రియా! ఈ శయ్యను కృతార్థము చేయుము". "వలదు". "ప్రియతమా! ఈ దాసుని అపరాధమేమి ?" "హే శ్యామ్! నీయీ చరిత (లక్షణము) నాకు నచ్చలేదు". "హా! అదేమి ?" "మరి, నీ చరిత్ర చెప్పనా ?"

"అన్నిటినీ క్షమించు! నీవు నన్ను వదలి వెళ్లవద్దు. శయ్యను త్యజింపకు. నీవు శయ్యపై శయినిస్తే, నేను నీ చరణములను సేవించుకుంటాను". "నీవు ఈ విద్యలో నిపుణుడవు కావు". "అయితే, ఈ సేవకునికి నీవే శిక్షణనీయవచ్చును కదా!".

శ్రీరాధాకృష్ణుల సంభాషణా శైలితో వెలుగుతున్న ఈ శ్లోకభావము ఆపాత మధురమై ఉన్నది. శ్రీప్రబోధానందులు వారి సంభాషణను వింటూ, ఆ దివ్య లీలను దర్శిస్తూ అందించి, మనలను కూడ ధన్యులను చేశారు.

**నష్టా తే ఖలు బుద్ధిరున్మద నహి త్వం తామహార్షీర్ధృతా**
**కృ స్వాంగే వద యత్ర కిం మమకరం చోల్యాంతరేన్యాక్షిపః**
**అత్రైవేతి శుకార్భకాన్ నిగదితాన్ హుంకార పుష్పాహతైః**
**స్మిత్వోపాలి నివారయంత్యవతుమాం రాధాఽత్ర వృందావనే 9**

"ఓ ఉన్మదా! నీ బుద్ధి నశించినదా ఏమి ?"

"లేదు. నీవు దానిని దొంగిలించావు."

"అయితే నేను దానిని ఎక్కడ ఉంచాను ?"

"నీ అంగములలో". (నీలో అని భావము).

"నా చేయి ఎక్కడ ? అదేనా ?"

"నీ కంచుకములో ఉన్నది". (శ్రీకృష్ణుడు ఇట్లు అనుచుండ) చిన్ని చిలుకలు "అక్కడే ఉన్నది" అన్నాయి. ఈ మాటలను విని అక్కడికి వచ్చిన సఖియలు నవ్వసాగినారు. ఇది చూచి రాధాజీ హుంకరించి, వారిని పూవులతో కొట్టుచు నివారించినది. అట్టి శ్రీరాధ శ్రీబృందావనములో నన్ను రక్షించునుగాక!

ఈ శ్లోకము కూడా శ్రీరాధా కృష్ణుల దివ్యరసాత్మక సంభాషణా శైలిలో ఉన్నది.

**సేయం ప్రాప్తిః కోటీ చింతామణీనామ్**
**సేయం తృప్తిః కోటీ పీయూషపానాత్**
**సేయం సమ్యక్ భక్తి సన్ముక్తి కోటీ**
**ర్యచ్ఛీ వృందారణ్య ఆత్మార్పణేచ్ఛా** **10**

శ్రీబృందావనమునకు ఆత్మ సమర్పణ చేసికొనవలెనను ఇచ్ఛను కలిగి ఉండుటయే కోటి చింతామణులను పొందుటతో సమానము! కోటి అమృతములను పానము చేయుటకన్నను అధికముగ తృప్తిదాయకము! సమ్యక్ భక్తిని, కోటి మోక్షములను ప్రాప్తింపజేయుటవంటిది!

**సేయం దీక్షా ఉచ్ఛభావైర్వ్రతేషు సేయం శిక్షా రాధికారాధనేషు**
**సేయం ప్రేమాధీశ పూర్ణ్యోలకక్షాయచ్ఛీ వృందారణ్య సౌభాగ్య వీక్షా** **11**

సౌభాగ్య పూర్ణమైన శ్రీబృందావనమును దర్శింపవలెనను ఇచ్ఛను కలిగియుండుటయే అత్యుత్తమమైన భావయుక్త వ్రతములను చేయవలెనని దీక్ష వహించుట వంటిది, శ్రీరాధా ఆరాధనకై దీక్షగొనుట వంటిది! అదియే ప్రేమాధీశుడైన భగవంతుని పట్ల పరాకాష్ఠ స్థితి!

**యస్యైవోన్మద చారు చంద్రిక శిఖాచూడో యదిందీవర**
**శ్రేణీ శ్యామల కోమలద్యుతి తనుర్యత్ పుష్పమాలాదివాన్**
**యద్దివ్యోజ్జ్వల ధాతు చిత్రిత వపుర్యన్మంజు గుంజావలీ**
**హారః శ్రీహరి రత్యశోభత భజే తద్ధన్య వృందావనమ్** **12**

శ్రీబృందావనము ఉన్మాదమును కలిగించు సౌందర్యముతో కూడిన మయూర పింఛముతో శ్రీహరికి శిరోభూషణమైనది. నీలి కమలముల శ్యామల వర్ణముతో, కోమలత్వముతో జ్యోతిపూర్ణమై శ్రీహరి రూపముగనైనది. వికసించిన

పూవులతో కూర్చిన దండలను శ్రీహరి ధరించుట చేత ఆధామము భూషితమైనది. అచటి దివ్య, ఉజ్వల ధాతువులతో శ్రీహరి తనదేహమును చిత్రితము చేసికొనినాడు. మనోహరమైన గుంజావలితో కూర్చిన హారములను ధరించి శ్రీహరి తన శోభను వృద్ధి చేసికొనినాడు. అట్టి మహాభాగ్యశాలియైన శ్రీబృందావనమును నేను భజించుచున్నాను.

శ్రీబృందావనము శ్రీకృష్ణునకు శిరోభూషణమైనది, ఆయన రూపముగనైనది, మెడలో మాలగనైనది. ఇట్లు అనుచు శ్రీప్రబోధానందులు శ్రీకృష్ణుని శోభ బృందావనము వలన వృద్ధి పొందినదనుట ద్వారా శ్రీధామ మహిమను స్తుతించినారు.

**వృందాటవ్యామటనమిహ చేత్ కోటి తీర్థాటనైః కిమ్**
**పక్ష్యాదీనాం యది రుతమిహాకర్ణి తత్తు శ్రుతైః కిమ్**
**వృక్షాద్యాఖ్యా ప్రకథనరుచౌ స్తోత్రమంత్రాదికైః కిమ్**
**దృష్టిర్యత్ర క్వచిదిహ రతాచేదలం ధ్యానలక్షైః 13**

నీవు శ్రీబృందావన పరిక్రమ చేయగలిగితే, కోటి తీర్థయాత్రలతో ఏమి ప్రయోజనము ? అచటి పక్షుల కిలకిలారావములు నీ చెవులలో పడితే ఇక వేదాభ్యాసముతో ఫలమేమి ? అచటి వృక్షముల నామములను పలికినచో స్తోత్రమంత్రాదుల పఠనము అవసరములేదు. ఈ ధామములోని ఏ ఒక్క ప్రదేశము పై నైనను నీ దృష్టి పడినచో లక్షల లక్షల ధ్యానరీతులతో ఏమి లాభము ?

శ్రీబృందావనములోని అణువణువుతోను ప్రేమానుబంధమును కలిగి ఉంటే ఇక తీర్థయాత్రలతోకాని, వేదస్తోత్ర మంత్రాదుల పఠనముతోకాని; తుదకు ధ్యానము చేయుటతో కాని అవసరము లేదు. అనగా ఈయన్నిటికన్నను బృందావనము పట్ల ప్రగాఢమైన ప్రీతిని కలిగియుండుటయే సమస్త సాధనల సారమని భావము!

**యం యం దేశం సరతి పవనః శుద్ధ సచ్చిత్ సుఖాత్మ**
**శ్రీమద్బృందావిపిన విలసత్ వల్లివృక్షాదిసంగీ**
**సర్వానర్థాన్ కృమితను భృతో వైష్ణవం ధామ తత్ స్థాన్**
**నేతుం తిష్ఠంత్యవసరదృశో ద్వారి సజ్జా విమానాః 14**

శుద్ధ సచ్చిదానందఘనమైన శ్రీబృందావనములోని లతా వృక్షాదులను స్పృశించిన వాయువు ఏయే దేశములలో వీస్తుందో ఆయా ప్రదేశములలోని సమస్త నికృష్ట క్రిమికీటకాదులతో సహా అందరు వైష్ణవధామమునకు చేరుతారు. వారిని తీసికొని వెళ్ళుటకై ద్వారము చెంత అలంకృతమైన విమానము వేచి ఉంటుంది.

**యత్ సన్మృత్ర సరేణుకం యదణుచిత్ పుష్పాదిగంధం వహన్**
**వాతః పూతతమః సమేత్య యదవచ్ఛిన్నాం కలిందాత్మజామ్**
**యైరస్పర్శ్య నివృత్తి ర్భిర్నరకతో దేశేఽ ప్యహో కీంకటే**
**తేషామప్యతి భుక్తి ముక్తిదమిదం వృందావనం తన్నుమః 15**

ఆహా! శ్రీబృందావన రజరేణువును, చిన్మయములైన పుష్పాదుల సుగంధమును, యమునా జలములను స్పృశించి వాయువు అత్యంత పవిత్రము ఔతుంది. అట్టి వాయువు కీకటాది ప్రదేశములలో పడియుండి, అనంతమైన నరకముననుభవిస్తున్న వ్యక్తులను స్పృశించుట ద్వారా వారికి భుక్తిని, ముక్తిని ప్రదానం చేస్తుంది. అట్టి బృందావనమునకు నమస్కరిస్తున్నాను.

శ్రీబృందావనము మీదుగా వీచిన వాయుస్పర్శ మాత్రమున ఘోర నరకము నుండి విముక్తి లభించునన, ఇక బృందానిత్యనివాస ఫలమును ఊహింపగలమా!

**భుక్తం వృందావనగత ఫలం లోభనం యైః పరస్యాఽ**
**ప్యుక్తం వా తత్ శ్రుతిహర మహామంగలం నామతస్య**
**దృష్టం కించిత్తదపహృత దృక్ స్పృష్టం స్యాంగ కర్షి**
**స్తోతుం శక్తః క ఇహ బత తాన్ భాగ్యపుంజైక మౌలీన్ 16**

శ్రీబృందావనము పరమ పురుషునికి కూడ లోభనీయమైన దివ్య స్వరూపము! అందలి ఒక్క ఫలమును ఆస్వాదించినను, వీనుల విందుగా మహామంగళకరమైన ఆ నామావళిని ఒక్క మారైన కీర్తించినను, ఆ సౌందర్యముచే ఆకర్షితుడై అందలి ఏదో ఒక వస్తువుపై దృష్టిని సారించినను లేదా స్పృశించినను చాలును! మహా అదృష్టవంతులకు శిరోమణి వంటి ఆ వ్యక్తిని స్తుతించుట ఎవరికి సాధ్యము ?

అనగా ఆ మహాభాగ్యము వర్ణనాతీతమని తాత్పర్యము!

**యచ్ఛబ్ద స్పర్శ రూపాదికమహహ హరేరప్యహార్షీద్ధఠేన**
**శ్రోత్రత్వక్ చక్షురాద్యం కరణమశరణస్యైకమేవాఽరణం యత్**
**యచ్ఛక్తిర్ముక్తి తిక్తీకరణ పటు మహాభక్తిరత్నం వ్యనక్తి**
**త్వం వృందారణ్య తత్ యత్ కరణపథగతం వ్యథా ధ్ధన్యమౌలిమ్ 17**

ఓహో! శ్రీబృందావన శబ్ద, స్పర్శ, రూపాదులు శ్రీహరి యొక్క శ్రవణ, స్పర్శ, నేత్రాది ఇంద్రియములను కూడ బలీయముగ లాగివేసినవి. ఆ ధామము నిరాశ్రయులకు ఏకమాత్ర ఆశ్రయము! దానియందలి శక్తి ముక్తిని కటువస్తువువలె అనిపింపజేసి, మహాభక్తిరత్నమును ప్రకాశింపజేస్తుంది. తాను ఇంద్రియ మార్గములోనికి చొచ్చుకొని వెళ్లి, లోకులను ధన్యశిరోమణిగ మార్చి వేస్తుంది. హే బృందావనమా! నీవే ఆ పరమవస్తువు!

**రాధాకృష్ణౌ విపుల పులకావున్మదోల్లాస హాసౌ**
**దృష్ట్వా దృష్ట్వా మధుర మధురం గాయతో యస్యనామ**
**ఆదౌ శ్రీయుజ్జ్యయుతమిదం హాది వృందావనేతి**
**తస్మిన్ యేషాం వలిత రసనా తైః కిమప్రాప్యమస్తి 18**

ఉన్మద, ఉల్లాస, హాస పరాయణులైన శ్రీరాధాకృష్ణులు మిక్కిలి పులకితులైనారు. వారు శ్రీబృందావనమును దర్శిస్తూ; మధుర మధురమైన స్వరముతో “శ్రీ” (శ్రీబృందావనమా) అని, “జయ” (జయ బృందావనమా) అని, “హా” (హా బృందావనమా) అనుచు బృందావన నామమునుగానం చేస్తున్నారు. అట్టి బృందావన నామము ఎవరి నాలుకపై నిరంతరం నర్తిస్తూ ఉంటుందో అతడు పొందలేనిది ఏమున్నది ?

సాక్షాత్తు శ్రీరాధాకృష్ణులే ‘జయహా’ అనుచు శ్రీబృందావనమును స్తుతిస్తున్నారు, గానం చేస్తున్నారు. అట్టి బృందావనమునకు అంకితమైన ధన్యునకు సమస్తము అరచేతిలో నున్నట్లే!

**చిజ్జ్యోతిర్మయ భూరహస్యమఖిలోపర్యుచ్చకైర్జాజ్జ్వలీ**
**త్యానందామృత పూర్ణచంద్ర ఇవ యద్దివ్యం భువో మండలమ్**
**వృందారణ్యమిహాద్భుతం రస సరస్యత్రేవ గౌరాసితౌ**
**దివ్యౌ ద్వౌ కలహంసకౌ స్మరగుణేస్తస్యైవ వాఽచాలితౌ 19**

ఆనందామృత పూర్ణచంద్రునితో సమానమైన, చిజ్యోతిర్మయమైన పృథివి యొక్క గుప్త స్థలములో ఒక దివ్య భూమండలము విరాజమానమైయున్నది. అది సమస్త ధామములకన్నను పైన దేదీప్యమానముగ వెలుగుచున్నది. అదియే అద్భుతమైన శ్రీబృందావనము! అందలి రస సరోవరములో గౌరశ్యామాత్మకమైన రెండు కలహంసలు శ్రీబృందావన గుణములచే బంధింపబడి, నిశ్చేష్టమై శోభిస్తున్నాయి. అట్టి యుగళ కిశోరులను స్మరింపుము!

శ్రీబృందావన గుణమణులకు శ్రీశ్యామశ్యాములే బందీలైనారట! (గుణము అనగా రజ్జువు అని కూడ అర్థము.) ఎంతగా బంధితులైనారంటే వారు క్షణము కూడ బృందావనమును విడువలేరు!

**అరే మూఢాః ప్రాప్యేంద్రియమవికలం కిం ను నిగమైః**
**నిగూఢాః శ్రీవృందావన భువమిమాం నైవ భజత**
**పదౌ యాత్రావ్యగ్రౌ కురుత వదనం నామభిరతమ్**
**కథా పీయూషాబ్ధౌ శ్రుతిమపి మనోధ్యాన నిరతమ్ 20**

ఓ మూఢుడా! ఇంద్రియ సుఖాలను పొందుచు, వేదములో గుప్తముగనున్న శ్రీబృందావనమును ఎందుకు భజించుటలేదు ? శ్రీబృందావనమునకు యాత్రచేయి. నోటితో నామమును పలుకు. ఆ కథా సాగరములో నీ చెవులను నిమగ్నం చేయి. నీ మనసును శ్రీబృందావన ధ్యానములో నిలుపు!

అట్లు చేయనివాడు పరమ మూఢుడని ఫలితార్థము!

**అరే శీఘ్రం శీఘ్రం సుతధన కలత్రాది మమతా**
**ప్రతానే కాలోఽయం నహి వపురిదం మృత్యనుగతమ్**
**సమస్తాలభ్యానాం పరమిదమలభ్యం స్వకృపయా**
**భువి వ్యక్తం వృందావిపినమభిధావాఽతి హరతః 21**

ఓరీ! స్త్రీ, పుత్ర, ధనాదుల పట్ల మమతను పెంచుకొనుటకు సమయము లేదు. ఈ శరీరమును మృత్యువు వెన్నంటి ఉన్నది. సమస్త దుర్లభ వస్తువులలోను సుదుర్లభమైన శ్రీబృందావనము కృపతో ఈ భూమిపై ప్రకటితమైనది. కనుక శీఘ్రాతి శీఘ్రముగ శ్రీబృందావనము వైపునకు పరుగున వెళ్లుము!

శ్రీ ప్రబోధానందులు తాము పొందుచున్న దివ్య ప్రేమరసానుభూతిని అందరును పొందవలెనను కాతరత్వముతో జీవులను పిలచుచున్నారు.

**అహో మందా వృందావిపిన ఇదమీయ స్థిరచరమ్**
**చిదానందాకారే గుణమయ ధియా సాధనధియః**
**వయంతు శ్రీరాధా మురలిధర దాస్యైకరస సం**
**పదామేతత్ కందం ద్వయమఖిలవంద్యం వివృణుమః 22**

ఓహో! మందమతియైనవాడు చిదానందరూపమైన శ్రీబృందావనములోని స్థావర జంగమాత్మకమైన వస్తువులను గుణమయములు (మాయతో కూడినవి) అనుకొని, సాధన చేస్తూ ఉంటాడు. కాని మాకు మాత్రము శ్రీరాధా మాధవుల కేవల రసమయమైన దాస్యసంపత్తితోకూడిన స్థావర జంగమాత్మక వస్తువులన్నియు నమస్కరింపతగినవిగా అనుభవములో తెలుస్తూ ఉంటుంది.

అనగా, బృందావనములోని స్థావర జంగమములన్నియు మాయకు అతీతమని, గుణాతీతమని తాత్పర్యము!

**అఖండ విధు మండలం యది సువృత్త ముక్తాఫలైః**
**భవేత్ కిమపి చిత్రితం యదుపమీయతే తేన హి**
**శ్రమాంబుకణరాజిభిస్తదతిరాజ వృందాటవీ**
**విహార వశ రాధికా సువదనాంబుజం పాతు వః 23**

శ్రీబృందావనములో విహరిస్తూ, శ్రమచేత కలిగిన స్వేద బిందువులతో శ్రీరాధా ముఖకమలము అతిమనోహరముగ ఉన్నది. అట్టి ఆ ముఖబింబమును పోల్చవలెనన్న గుండ్రని ముత్యములతో చిత్రించిన పూర్ణచంద్రమండలమును పోల్చవచ్చునేమో! అట్టి ఆ తల్లి మమ్ము రక్షించునుగాక!

**అనంత పురుచంద్రమః ప్రచయ చంద్రికా కందలైః**
**కరంబితమిహాంబుజం వికసదస్తి జాంబునదమ్**
**మిథో మధుర చుంబిత యది నవైక కృష్ణాలినా**
**తదా తదివ రాధికా ముఖమవైమి వృందావనే 24**

ఒక వేళ అనంతానంత చంద్రుల చంద్రికలు స్వర్ణ వర్ణములో ఉన్న ఒక ప్రఫుల్లిత కమలములో కలసిపోయి, ఒక నవకృష్ణ భ్రమరముతో పరస్పరము

ముద్దుగొన్నచో; అప్పుడు శ్రీబృందావనములోని శ్రీరాధా ముఖశోభకు సమానమని అనుకుంటాను.

శ్రీరాధా ముఖశోభతో ఉపమింపదగిన వస్తువు ఎచటను లేదని భావము!

**స్వయం యదధి నూపురం మణిగణచ్ఛటా చిత్రితమ్**
**హరిర్వినిదధాత్యథాంగులిషు యావకం న్యస్యతి**
**హృదా వహతి భీతవన్మృదుపదేన తేనాపి యత్**
**రసాదటతి రాధికా భజ తదేవ వృందావనమ్ 25**

శ్రీకృష్ణుడు స్వయముగ శ్రీరాధాచరణములకు మణిజటితమైన నూపురములను అలంకరిస్తాడు, అంగుళులకు (వ్రేళ్లకు) లత్తుకను ధరింపజేస్తాడు. ఆ శ్రీచరణములను భయభక్తులతో హృదయములో ధరిస్తాడు. అట్టి మృదుల చరణములతో శ్రీరాధ రసార్ద్రమైన మృదుమధురభావముతో శ్రీబృందావనములో నడయాడుతుంది. అటువంటి బృందావనమును భజింపుము!

**అయే పరమమద్భుతం కిమపి భాతి వృందావనే**
**ద్వయం వికచమంబుజద్వయమథో విధోర్మండలమ్**
**మిథో నవసుధారస స్వదనలోలమేకం మహః**
**హిరణ్మయమిహోఽపరం వరహరిన్మణి వైభవమ్ 26**

ఓహో! శ్రీబృందావనములో ఒకానొక పరమాద్భుత రీతిలో వికసించిన రెండు కమలములు (రాధాకృష్ణులు) చంద్రమండలమునకు క్రింద ప్రకాశిస్తున్నాయి. అవి పరస్పరము నవసుధారసమును ఆస్వాదించుటలో లోలుపమై ఉన్నాయి. అందులో ఒకటి మహాస్వర్ణవర్ణ రంజితము కాగా, రెండవది మహామరకతమణి వర్ణ శోభను ప్రకటిస్తున్నది.

శ్రీరాధాకృష్ణుల దివ్యరస ప్రకాశమును ఎన్ని విధములుగా, ఎన్ని వస్తువులతో పోల్చి చెప్పినను శ్రీప్రబోధానందులకు తృప్తి అనునదియేలేదు. వారు భావవివశులై శ్రీయుగళమును వర్ణిస్తూనే ఉన్నారు, ఆనందమును పంచుచునే ఉన్నారు.

**అహో మధుప మౌలినా కనక పద్మినీయం ద్వయే**
**స్వపద్మముకులేక్షితా కథమివేక్ష్యామీత్యేకయా**
**సముక్త ఉరు సంభ్రమాత్ ప్రపిహితో రసం రాధికామ్**
**కథమ్వితి విహాసితాం స్మర తయైవ వృందావనే 27**

ఓహో! శ్రీబృందావనములో ఒకనాడు మధుకర శిరోమణియైన శ్రీకృష్ణుడు తన ప్రతిబింబమును, స్వర్ణకమలినియైన శ్రీరాధా ప్రతిబింబమును పద్మపు మొగ్గగా భావించి దానినే చూస్తూ, “చూడు, చూడు! ఎటువంటి కమలమో” అని పలికినాడు. అదివిని, కిశోరీజీ “అది ఏమియో తెలుసుకొమ్ము! నా లీలా కమలము జారిపడినది” అనుచు దానిని తీయుటకై అటు దూకినది. శ్రీకృష్ణుడు తన ఛాతీకి అంటుకొనునట్లు చేసి, పైకి తీసినాడు. శ్రీరాధ నవ్వసాగినది. ఈ విధముగ, నవ్వుచున్న శ్రీరాధను స్మరింపుము!

ఎంత అద్భుతమైన లీల! తమ యిద్దరి ప్రతిబింబములను శ్రీకృష్ణుడు రెండు కమలములుగాకాక, ఒకే కమలముగ దర్శించినాడు. అందుకు రాధాజీ కూడ అంగీకరించుటయేకాక, అది తన లీలా కమలమని ప్రకటించినది. ఆపై కిశోరీజీ దేనిని తీయుటకై వంగినదో, శ్యామసుందరుడు దేనిని పైకి తీసినాడో ఆ పరమాద్భుత రసరహస్యము వారికే ఎరుక! దర్శించిన రసిక మహాత్ములకే ఎరుక!

**లతాతరువిహంగమాదిషు కదాచిదాఖ్యాకృతే**
**మిథో వివదమానయోః కిమపి రాధికా కృష్ణయోః**
**ద్వయోర్విజయకాసినోః క్వ చ రుతేఽపి వృందావనే**
**ప్రియాలి వలయే హసత్యతిరసాత్మయుద్ధం స్మర 28**

ఒకానొక సమయంలో లతలు, వృక్షాలు, పక్షులు మున్నగు వాని నామములపై శ్రీరాధాకృష్ణులు ఇరువురి మధ్య వాదులాట జరుగుతున్నది. అప్పుడప్పుడు శ్రీబృందావనములోని పక్షులు చేసెడి శబ్దములను గూర్చి కూడ వారి మధ్య పందెము వేసుకొనుట జరుగుతూ ఉంటుంది. అట్టి స్థితిలో ఉన్న శ్రీయుగళమును చూచి సఖీజనులు నవ్వసాగినారు. ఇట్టి రసాత్మకమైన వారి యుద్ధమును స్మరింపుము!

**కనక కమలగర్భే దాడిమీ బీజ పంక్తిః**
**యది తదపి చ రాకాచంద్ర కోటిచ్ఛటౌఘమ్**
**సతత వికచమేక స్నిగ్ధ కృష్ణాలి భోగ్యమ్**
**స్మర తదుపమితం తచ్ఛ్రీముఖం రాధికాయాః 29**

ఒకవేళ స్వర్ణ కమలములో దానిమ్మగింజల వరుస ఉంటే, అవి పూర్ణిమనాటి చంద్రునివలె కోటికాంతులతో ప్రకాశిస్తూ ఉంటే, నిరంతరం వికసించి ఉంటే; ఒక స్నేహ పూర్వకమైన కృష్ణ భ్రమరము ఆ కమలముపై ఎగురుతూ ఉంటే అప్పుడు ఆ శోభను శ్రీరాధాముఖబింబముతో ఉపమింపవచ్చునేమో! అట్టి శ్రీవదనమును స్మరింపుము!

ఏలోకములో కూడ శ్రీరాధా ముఖబింబముతో పోల్చదగిన వస్తువు లేదు. ఆదేవి ముఖము స్వర్ణకమలము, పలువరుస దానిమ్మగింజల వరుస, ఆ కాంతి కోటి పూర్ణిమాచంద్రుల కాంతిని తిరస్కరిస్తుంది. ఆ ముఖ కమలము వాడిపోవుట అనునది లేదు, నిరంతరము వికసించియే ఉంటుంది. పైగా, కృష్ణుడు అను భ్రమరమునకు, రాధాముఖము అను కమలమునకు వియోగమన్నదే లేదు. ఇక ఆ శ్రీవదనమును దేనితోనైనను పోల్చుట ఎట్లు ?

**త్వం జానాసి సఖీ! ద్వయం సమదృశోః కః సృష్టవాన్ తపదమ్**
**హన్మి క్షౌణితలే విలిఖ్య యదహం నేత్రైరనంతైరపి**
**వృందారణ్యమథాన్యదేకమనఘం నో వీక్ష్య తృప్త్యామ్యహో**
**సత్యం శ్రీశ్వరి రాధికే వయమితోఽప్యన్యైక లుబ్ధేక్షణాః** **30**

హేసఖీ! నా కన్నులు ఏమి చూచాయో నీకు తెలుసా ? భూమిపై ఆ దృశ్యమును చిత్రించి, తిరిగి దాని చిహ్నములు కూడ లేకుండ చెరిపివేశాను. ఎందుకంటె, నా కన్నులు శ్రీబృందావనమును, మరొక పవిత్ర వస్తువును దర్శించుటలో తృప్తిని చెందలేదు. హే ఈశ్వరీ రాధా! ఇది సత్యము! కాని, నా చూపు బృందావనము నందే కాక ఒకానొక అన్య విషయము (శ్రీకృష్ణుని) నందు కూడ లుబ్ధత్వముతో ఉన్నది.

ఒకానొక ఏకాంత సఖి ఏదివ్యదృశ్యమును చూచిందో! దానిని చిత్రించుటలో తృప్తి కలుగలేదు. కనుకనే చెరిపివేసింది. రాధాజీతో కూడిన శ్రీకృష్ణుని బృందావనములో దర్శింపవలెనని ఆమె ఆకాంక్ష!

**లీలా ఖేలాద్రాధికా హేమ పద్మి**
**న్యాస్యోంభోజం సీధు గంధైరపారమ్**
**జ్యోత్స్నా మాధుర్యైక సింధౌ నిమగ్నమ్**
**వృందారణ్యే కృష్ణభృంగైక భోగ్యమ్** **31**

లీలా పరాయణయైన, స్వర్ణపద్మినియైన శ్రీరాధా ముఖకమల మకరంద గంధము సాటిలేనిది. అట్టి జ్యోత్స్నాపూర్ణసముద్రములో నిమగ్నుడైనవాడే శ్రీబృందావనములో శ్రీకృష్ణుడను భ్రమరమును పొందగలడు!

అనగా రసయుగళమైన శ్రీరాధాకృష్ణులలో ఒకరిని ఆరాధించువారు రెండవ వారిని కూడ పొందగలరని భావము! రాధాజీని ఆరాధింపక, శ్రీకృష్ణుని పొందలేరని కూడ అర్థము!

"నన్ను శరణు పొందినను నా ప్రేమమూర్తియగు శ్రీరాధను శరణు పొందనిచో నేను లభించను" అని పద్మపూరాణములో శ్రీకృష్ణుడు స్వయముగా ప్రకటించినాడు.

**వార్తాఽన్యోన్యం మధురమధురా శీతపీయూషధారా**
**శ్రీమద్రాధా మురలిధరయోర్వక్త్రచంద్రాత్ వహంతీ**
**చేతః కర్ణైర్మమ నిశి దివా మాదయత్వాలివృందైః**
**శ్రీమద్బృందావిపిన విషయైవాద్భుతా కాపి కాపి 32**

శ్రీరాధాకృష్ణుల ముఖచంద్ర వినిర్గతమైన కథ మధురమధుర శీతలము, ధారాపూర్ణమునైనది. ఆ కథ అనిర్వచనీయమైన శ్రీబృందావనముతోను, అద్భుత సఖీ బృందముతోను కూడి ఉంటుంది. అట్టి పరస్పర కథా వార్త నా చెవులలో ప్రవేశించి రేయింబవళ్ళు చిత్తమును ఉన్మత్తము చేస్తున్నది.

అనగా; ఏ లీలను శ్రీరాధాకృష్ణులు ప్రకటిస్తారో అది బృందావనముతోను, సఖీ బృందముతోను కూడి ఉంటుంది. శ్రీరాధ, శ్రీకృష్ణుడు, శ్రీసఖి, శ్రీబృందావనము – ఈ నలుగురితో నిండియున్న లీల రసపరిపుష్టమై ఉంటుంది.

**రాధాకృష్ణ ప్రణయమయ చిజ్జ్యోతిరానంద దేహమ్**
**కంచిత్ సంచింతయ హృది సదా తద్ద్వయీభావ విజ్ఞమ్**
**శ్రీమద్బృందావ నవలతా మందిరానీందిరాది**
**ప్రార్థ్యాన్యంతర్ననుపరిచర ప్రేయసోః ఖేలనాయ 33**

శ్రీరాధాకృష్ణుల ప్రేమమయ చిజ్జ్యోతి పూర్ణత్వమును; వారి భావములను ఎరిగిన ఒకానొక ఆనందమయుడైన రసికభక్తుడిని హృదయములో నిరంతరము భావించు! లక్ష్మీదేవిమున్నగువారిచే కూడ ప్రార్థింపతగిన శ్రీబృందావన నవలతా

మందిరములలో ప్రియతమ యుగళ కిశోరుల లీలకై అంతఃకరణములో సేవించు! (అనగా, ఆ లీలా దర్శనమునకై తపించుట.)

**అంతశ్చింతయ సంతతం స్మరకలారంగేన రాత్రిందివమ్**
**వృందాకానన కుంజవీథిషు మిథో మగ్నాంగదృగ్వాజ్ మనః**
**గౌరశ్యామ మహామనోహర మహోద్వంద్వం బహిః సుప్తవత్**
**భ్రాతర్హర్ష విషాద హృద్వ్యవహృతిం సర్వాంచ నిర్వాహయ 34**

శ్రీగౌర శ్యామ మనోహర యుగళము శ్రీబృందావన కుంజవీథులలో ఒకరికొకరు అంగ, నేత్ర, వాక్, మనస్సులను అర్పించుకొని; అహర్నిశలు స్మరకలా రంగస్థలిపై విరాజమానులై ఉంటారు. వారిని నిరంతరము మనసులో స్మరించు! కాని, సోదరా! సుఖదుఃఖములకు సంబంధించిన బాహ్యవ్యవహారములను చేష్టలు ఉడిగిన వాని వలె ఉండి, నిర్వహించు!

**రాధామాధవ కేలి కానన భువం రాకేందు కోటి ప్రభామ్**
**స్వచ్ఛాం ముక్త షడూర్మిభిరహో ప్రేమామృతాబ్ధేర్భృతామ్**
**నానాశ్చర్య సరః సరిత్ గిరిలతా గుల్మద్రుమాద్యైర్మహో**
**నందోచ్ఛృంఖలఖేలనం ఖగమృగైర్వీతాం సఖేఽను స్మర 35**

హే సఖా! శ్రీరాధామాధవుల కేళీ భూమియైన శ్రీబృందావనము కోటి పూర్ణచంద్రుల ప్రకాశము కలది, స్వచ్ఛమైనది. అది శోక, మోహ, జరా, మృత్యు, క్షుధ, పిపాస అను ఆరు అలలు లేనిది. ఓహో! అక్కడ తరంగమయమైన ప్రేమామృత సాగరము ప్రవహిస్తూ ఉంటుంది. అనేకములైన ఆశ్చర్యకర సరోవరములు, నదులు, గిరులు, లతాగుల్మ వృక్షాదులతోను; మహానందముతో క్రీడిస్తున్న పక్షి, మృగాదులతోను పరిశోభిస్తున్నది. అట్టి శ్రీబృందావనమును స్మరింపుము!

**హతేఽస్మిన్ హా వృందావన నవనికుంజేశ్వరి! కృపామ్**
**విధేహీత్యాక్రందన్ వ్యవహరణ మధ్యేఽపి చ ముహుః**
**త్రికాలం శ్రీవృందావిపిన దిశి వృందాని చ నమ**
**స్కృతీనాం సర్వాంగైః కురు చ పురుతత్ ప్రేమవలితః 36**

'హే బృందావన నవనికుంజేశ్వరీ! భాగ్యహీనుడైన ఈ దాసునిపై కృప చూపించు!' ఈ భావముతో లోక వ్యవహారములను నిర్వహించు సమయములో మాటిమాటికి ఉచ్చైస్వరముతో ఆక్రందించు! త్రికాలములలోను శ్రీబృందావనమునకు అభిముఖముగా నిలచి, ఆ రజమునకు ప్రేమ పూర్వకముగ మాటిమాటికి సాష్టాంగ నమస్కారము చేయుము!

**అహో క్రందన్నుచ్చైర్హృత సకల సర్వస్వ ఇవ సం**
**లుఠన్ భూమౌ నేత్రోద్గలిత జలధారః ప్రతిపదమ్**
**అజస్ర శ్రీవృందావన విరహదుఃఖ ప్రసరతో**
**భవేత్ యః కుత్రాపి ప్రథయతి స ఏకః క్షితియశః 37**

ఓహో! "సమస్తము దొంగిలింపబడింది" – అని ఈ ప్రకారముగ ఉచ్చస్వరముతో ఆక్రందించు! క్రిందపడి దొరలు! ప్రతిక్షణము అశ్రుధారలను ప్రవహింపజేయి, నిరంతరము శ్రీబృందావన విరహ దుఃఖముతో వ్యాకులత్వమును పొందు. ఎప్పటికి అన్యత్ర నివసింపకు. ఇట్లుండుటయే ఈ భూమిపై నీ యశస్సును వ్యాపింపచేస్తుంది.

శ్రీబృందావనముతోడి వియోగము వలన జీవునికి సమస్తమును పోగొట్టుకొనినంత దుఃఖము రావాలి! అట్టి స్థితి సహజముగా వచ్చిన వానిని శ్రీబృందావనము తన ఒడిలోనికి స్వీకరిస్తుంది.

**తచ్ఛ్రీగాత్ర ప్రసృమర మహాశ్చర్య సౌరభ్య లుభ్యత్**
**భూయిష్ఠాను వ్రజదలికులోత్సారణవ్యగ్రపానిః**
**వీథ్యాం వీథ్యాం పరకుతకతోత్ఫుల్ల నేత్రం చరంతీ**
**వృందారణ్యే విలసతి సహప్రేయసైకైవ రాధా** **38**

రాధా శ్రీమూర్తి నుండి మహాశ్చర్యమయమైన సుగంధము వ్యాపిస్తూ ఉంటుంది. ఆ సుగంధము పట్ల లోభముతో తన వెనుక ఎగురుచున్న అనేక భ్రమరములను ఆమె చేతులతో నెట్టివేస్తున్నది. శ్రీబృందావన వీథులలో పరమకుతూహలియై ప్రఫుల్లిత నేత్రములతో కటాక్షించుచున్న శ్రీరాధయే ప్రియతమునితో కలసి విలసిల్లుచున్నది.

**మానోఽతి ద్రఢిమానమాస్థితవతీ రాధా మమ స్వామినీ**
**శిక్షాభిః స్వసఖీగణస్య విదధే మౌనాది వృత్తిం యదా**
**క్షీణాశేష కృతిస్తు తర్హి స హరిః ప్రాసాదయత్తాం స్వతో**
**యస్యాః పుష్పఫలాద్యుపాయన భరైస్తాం నౌమి వృందాటవీమ్** **39**

నా స్వామినియైన శ్రీరాధ తన సఖీమణులకు శిక్షణ నిచ్చుటకై పట్టుదలతో కూడిన దృఢ మౌనమును వహించింది. అపుడు శ్రీహరి సమస్త కార్యములని మరచి, స్వయంగా పుష్పఫలాదికములతో రాధాజీని సంతుష్టను చేసినాడు. అట్టి బృందావనమునకు నమస్కారము చేయుము!

శ్రీకృష్ణుడు శ్రీబృందావనములోని పుష్పఫలాదికములను సమర్పించుట ద్వారా శ్రీరాధాజీని సంతుష్టను చేశాడట! రాధాజీకి బృందావనమనిన అంత ప్రీతి!

**భృంగీ సంగీతరంగ త్యజతి పికవధూః పంచమం నిర్ధునీతే**
**కీరః కాంచిన్నగాథాం పఠతి నటశిఖీ నైవ కేకాం కరోతి**
**వీణా హ్రీణా మనాఙ్ న ధ్వనిత మురలీ రౌతి రాధాయదాశ్రీ**
**వృందారణ్యస్య నిర్వనయతి గుణగణానుల్లసత్ రోమరాజిః** **40**

శ్రీరాధ పులకితయై శ్రీబృందావన గుణమణులను వర్ణింపసాగినది. అదే క్షణమున భ్రమరము సంగీతాత్మకమైన ఝుంకారమును ఆపివేసినది. కోకిల పంచమస్వరములో ఆలపించుటను నిలిపివేసినది. శుకము (చిలుక) ఏగాథను ఉచ్చరించుటలేదు. నాట్యశిఖామణియైన మయూరము కేకధ్వనిని చేయుటలేదు. వీణ లజ్జితయై మౌనము వహించినది. మురళి మూగబోయినది.

శ్రీరాధ తన మధురమైన కంఠముతో బృందావన రసగుణములను స్తుతించుట ఆరంభింపగనే ఆ మాధుర్యమునకు అచటి ప్రకృతి అంతయు ఆ మాధుర్యము నాస్వాదించుచు నిశ్చేష్టమైనది. భ్రమర, కోకిల, శుకపికాదులు; వీణ, వేణువు కూడ ఆ మాధుర్యరసములో తేలియాడసాగినవి. రాధాజీ మాటలకే స్థావర జంగమములన్నియు ఇట్లు నిశ్చేష్టితములైనవన్న; మరి ఆ మధురమూర్తి పాడినచో, నాట్యము చేసినచో ఏమగునో!

రసజగత్తునకు, శ్రీకృష్ణునకు స్వామినియైన రాధాజీ స్వయముగ బృందావనమును స్తుతించుచున్నది. అట్టి యెడ శ్రీబృందావన మహారసస్థితిని ఎవరు ఊహింపగలరు ? అది వేదములకే అతీతమైనది!

**శ్రీవృందావనదివ్యకీర్తి బిరుదం శ్రీరాధికా నిర్మితమ్**
**పాఠ్యంతే శుకశారికాః ప్రతిదినం తత్ కింకరీభిర్ముదా**
**కాంతం శ్రావయతేఽథ కౌతుక వశం ప్రేమ్ణా చ తం విహ్వలీ**
**కుర్వన్మే యదధీశ్వరీ మమ సరీసర్త్యత్ర నిత్యం మనః 41**

శ్రీరాధాజీ అనుగ్రహించిన దివ్య కీర్తితో కూడిన బృందావన బిరుదములను శ్రీరాధా దాసీమణి ప్రతినిత్యము శుకశారికలచే ఆనందముగా పఠింపజేస్తుంది. వానిని కుతూహలముతో నున్న కాంతునకు (కృష్ణునకు) కూడ వినిపిస్తూ, ఆయనను ప్రేమతో విహ్వలుడగునట్లు చేస్తుంది. అట్టి శ్రీబృందావనమునందే నా మనసు లగ్నమైనది.

బృందావనానికి రాధాజీ అనుగ్రహించిన బిరుదావళిని సఖి ద్వారా వింటూ శ్రీకృష్ణుడు ప్రేమవివశుడు ఔతాడట! శ్రీయుగళానికి బృందావనమనిన అంత ప్రీతి!

**పారం యేఽపి సమస్త శాస్త్ర జలధేర్యాతార్మమైతేఽప్యతీ**
**వాఽజ్ఞా శ్రోత్ పరమోత్తమోత్తమతయా ప్రజ్ఞా న వృందావనే**
**ఏతేత్వత్ర వర్ణ మాత్రక విదోఽప్యఽస్మద్విధానాం మతాః**
**సర్వజ్ఞైః సకలైః స్తుతాః పరతరం వృందావనం యే విదుః 42**

సమస్తశాస్త్రముల సముద్రము యొక్క పారమును తెలిసికొన్నను, ఒకవేళ శ్రీబృందావన ఉత్తమోత్తమ లక్షణమును గ్రహించలేకపోతే నా అభిప్రాయములో అతడు పరమ మూర్ఖుడు! మరి, ఎవరు శ్రీబృందావన పరతర తత్త్వమును గ్రహింతురో అట్టి వ్యక్తి ఈ జగత్తులో కేవలము వర్ణ పరిచయమును (ఫలాని వర్గమునకు చెందినవాడు) మాత్రమే కలిగియున్నను; అతడే సర్వజ్ఞులైన సమస్త పురుషుల ప్రశంసలను పొందుతాడు!

కనుక, జీవునకు కావలసినది శాస్త్ర పరిజ్ఞానము, మహాపాండిత్యము మున్నగునవి కావు. సాక్షాత్తు శ్రీరాధా స్వరూపమే అయిన శ్రీబృందావన పరతత్త్వమును ఆస్వాదించు ధన్యుడే ధన్యుడు!

**సాంత సాంతమవేహి దేహి వచనం దేహిష్వహో కామినీ**
**రూపాగ్నౌ న పతంగవన్నిపత రే చక్షు ప్రమాదాదపి**
**అద్య శ్వో న పతిష్యతోఽస్య వపుషః పోషాయ దోషాకరైః**
**కుర్యాః సంగమభంగ వాసనియమో వృందావనే గృహ్యతామ్ 43**

తమ అంత్యకాలము సమీపించుటను గమనించిన లోకులు అంతిమ వచనాలను ఈ విధముగ పలుకుతారు : 'అరే! స్త్రీరూపమను అగ్నిలో ప్రమాదవశాత్తు పడిపోయెడి మిడుతవలె పడిపోకు. నేడో, రేపో నశించిపోయెడి

ఈ శరీరమును పోషించుటకై దోషములను చేయకు. శ్రీబృందావనములో నిరంతరము నివసింపవలెనను నియమమును స్వీకరించు!'

ఇదంతయు మిథ్యావైరాగ్యము! అట్లుకాక మొదటి నుండియు దోషరహితముగ నుండి, బృందానివాసము చేయుటమంచిది.

**శ్రీవృందావన నామ వర్ణమను యః పూర్ణో రసైకార్ణవః**
**కర్ణః స్వాదయతే పరం చ రసనా తం రాధికా కృష్ణయోః**
**నిత్యాకర్ణన వర్ణనస్థ తదంగార్వాత్మనాం తత్పదాం**
**భోజ ప్రేమ భృతామజానత ఇహ ప్రేక్ష్యేఽపి నాంత్యోరసః 44**

శ్రీబృందావననామముతో పాటు ఒక పూర్ణరసమయ సాగరము విద్యమానమైనది. ఆ రస సాగరమును గూర్చి శ్రీరాధాకృష్ణులు నిత్యము వింటూ, వర్ణిస్తూ, ఆస్వాదిస్తూ ఉంటారు. కనుక; శ్రీబృందావనములో ఉన్న వ్యక్తులతోను, ఆ వ్యక్తుల చరణ సన్నిధిని ప్రేమించువారితోను పరిచయము లేనివారికి శ్రేష్ఠమైన రసము ప్రాప్తించదు. ఇది నేను చూస్తున్నాను.

శ్రీబృందావనము పట్ల, తద్రసభావ భావుకుల పట్ల ఆసక్తి లేనివారికి రసానుభూతి లభించదు అని చెప్తూ, శ్రీప్రబోధానందులు "ఇది నేను చూస్తున్నాను" అంటున్నారు. ఈ దివ్యగ్రంథములో ఆ మహనీయుడు వర్ణిస్తున్నవన్నీ వారి దర్శనానుభవములే!

**పుణ్యాత్ పుణ్యం మంగలం మంగలానాం**
**దివ్యాద్దివ్యం కామదం కామదానామ్**
**సారాత్సారం ప్రేమదం ప్రేమదానాం**
**అన్యత్ వృందారణ్యతో మన్యతాం కః ? 45**

శ్రీబృందావనము పవిత్రతను పవిత్రం చేస్తుంది. అది మంగళములకే మంగళదాయకము! దివ్యత్వమునకే దివ్యము. కామనలను తీర్చువానికే కామ

ప్రదాత! సారమునకు సారము, ప్రేమదానము నిచ్చువారికి ప్రేమదాత! అట్టి శ్రీబృందావనము కాక, అన్యము ఏమున్నది ? తెలిసికొనతగినది ఏమున్నది ?

సాక్షాత్తు శ్రీరాధా స్వరూపమైన శ్రీబృందావనమునకు మించిన శ్రేష్ఠ వస్తువు మరొకటిలేదని ఫలితార్థము!

**రే ధీమంతః! సంతతానర్థ దేహం గేహం స్త్రీ కుటుంబాద్యుపేక్ష్య**
**సౌఖ్యాత్ సౌఖ్యం మోక్షతో మోక్షమాశు శ్రీవృందారణ్యమేవాశ్రయంతు 46**

ఓ బుద్ధిమంతులారా! నిరంతరం అనర్థములను కలిగించు దేహ, గృహ, స్త్రీ, కుటుంబాదులను వదలిపెట్టు! అత్యంత సుఖదమైన వాని నుండి, మోక్షము నుండి కూడ విముక్తిని ప్రసాదించు శ్రీబృందావనమును ఆశ్రయించండి!

రసిక మహాత్ములు మోక్షమును కూడ తృణీకరించారు. మోక్షమునకు కూడ అందరాని రసస్థితిని పొందుట వారి లక్ష్యము! ఆ దివ్య రసానుభూతిని అనుగ్రహించుట బృందావనమునకే సాధ్యము! రాధాజీ స్వరూపమే అయిన బృందావనమును ఆశ్రయించియే రసికాచార్యులు రసానందమును పొందినారు.

**ఏతత్ కుత్సిత మస్థిమాంస రచితం విణ్మూత్ర పూయాదిభిః**
**పూర్ణ దృష్టవినష్టమింద్రియగుణా మర్దేన నిత్యార్థితమ్**
**ఆధివ్యాధిశతాభిభూత మనిశం కామాది దాహాకులమ్**
**దేహం తిష్ఠతు యాతు వా హరిరసైః త్వం నంద వృందావనే 47**

ఈ శరీరము కుత్సితమైన అస్థి, మాంసములతో ఏర్పడింది. మల మూత్రములతోను, నీటితోను నిండి ఉన్నది. ఒకనాటికి ఇది కూడ నశించిపోయేదే! ఈ ఇంద్రియములు నిరంతరము పీడిస్తూ ఉంటాయి. నిరంతరము వందల ఆధి వ్యాధులు పట్టిపీడిస్తాయి. కామాదుల దాహము చేత వ్యాకులత్వము తప్పదు.

అటువంటి శరీరము ఉంటే ఏమి ? లేకుంటే ఏమి ? ఈ బృందావనములో శ్రీహరి రసము నాస్వాదిస్తూ, ఆనందాన్ని పొందు!

మరణం ఎప్పుడు ఏ రూపంలో వస్తుందో తెలియదు! అన్నీ, అంతా, అశాశ్వతమే! కనుక శాశ్వతమైన బృందావనాన్ని ఆశ్రయించి, శ్రీయుగళ రసమును ఆస్వాదిస్తూ జీవించాలి!

**అదృశ్యః ప్రపతిష్యతోఽస్య భరణం విజ్ భాండకస్యాచరన్**
**హాహా మూఢ మహా వినష్టిమయసే స్త్రీ సంగినాం సంగతః**
**సోఢా నారక యాతనాః కతి న వా హంతాణు మాత్రాసహాః**
**కిం వృందావనవాస భాస న మహానందాయ మందాయసే ? 48**

హా మూఢుడా! నేడో, రేపో ఈ శరీరం పడిపోతుంది. మలమూత్రాదులతో నిండియున్న శరీరాన్ని భరిస్తూ, స్త్రీ సంగము కలిగిన వారి సాంగత్యాన్ని పొందుతూ, నీ మహా నాశనాన్ని నీవే తెచ్చుకుంటున్నావు. అహో! నరకయాతనలోని అణుమాత్రపు బాధ కూడ అత్యంత దుస్సహంగా ఉంటుంది. దానిని నీవు ఎన్ని మారులు సహించలేదు! ఇంత జరిగిన తరువాత కూడ; నీవు శ్రీబృందావన నివాసమునకు, బృందావనములో లభించే మహానందాన్ని పొందుటకు ఏల ఆలస్యం చేస్తున్నావు ?

**స్త్రీభిః కేన వశీకృతాస్త్రిజగతి ప్రాయో యశోఽప్లిప్సవో**
**దృశ్యంతే విషయా స్పృశోఽపి పతితాః సంగాన్మహాంతోఽపి హి**
**బుద్ధ్వైవం ప్రతిబోద్ధుమిచ్ఛసి న చేత్ స్వార్థం కరస్థం తతః**
**తత్రాహర్నిశమప్రమత్తహృదయో వృందాటవీమావస 49**

త్రిభువనాలలోను స్త్రీకి వశీభుతుడుకానివాడు ఎవరు ఉన్నారు ? చూస్తుంటే; యశస్సు పట్ల కాంక్ష లేకుండ, విషయాదుల స్పర్శలేకుండ ఉన్న మహాపురుషులు కూడ సాంగత్య దోషం చేత పతితులు ఔతున్నారు. ఇట్లున్న మహాత్ముల విషయము

గ్రహించికూడ అదే విధముగ నీవు ప్రవర్తించినచో నీ చేతిలోని స్వీయధనమును జారవిడచుకున్నట్లే! కనుక అప్రమత్త హృదయుడవై నిరంతరము బృందావనములో నివసించు!

**రే దుర్బోధ పరంరహో భగవతః శ్రీరాధికానాగరమ్**
**హిత్వాన్యం భజసే సురంతదుదయే స్థిత్వాఽపి వృందావనే**
**తన్మూనం సదనల్ప కల్పక తరోర్మూలే విధాయాలయమ్**
**కుగ్రామానుపగమ్యతత్ కుజనతో భిక్షాశయా భ్రామ్యతి 50**

ఓ మూఢుడా! భగవంతుడు ఆవిర్భవించిన శ్రీబృందావనములో ఉంటూ కూడ; నీవు భగవంతుని పరమరహస్యమూర్తియైన శ్రీరాధానాగరులను వదలి, ఇతరేతర దేవతలను భజిస్తున్నావే! ఇది ఎట్లున్నదంటే ఉత్తమోత్తమమైన కల్పవృక్షం క్రింద ఇంటిని నిర్మించుకొనికూడ, కుగ్రామములకు వెళ్లి సామాన్య గృహస్థుల యింట భిక్షకై ఆశతో తిరుగుచున్నట్లు ఉన్నది.

శ్రీబృందావనము అనేకానేక కల్పవృక్షములకు నిలయము! శ్రీధామము అనుగ్రహింపలేనిదంటూ ఏమీలేదు. కల్పవృక్షం క్రింద కూర్చుండి అడుక్కొని తిన్నట్లు, శ్రీరాధా కృష్ణులను వదలి ఇతర దేవతల నారాధించటం మూర్ఖత్వం ఔతుంది.

**శ్రీవృందారణ్యమగణ్య పుష్ప నివహైర్ధన్యాగ్రగణ్యైర్హృదా**
**ధ్యేయం ప్రాప్త వతాఽన్యతో హి కుధియో యద్ధ్యాయమాధావథ**
**తచ్చింతామణిమేవ పాదహతిభిర్దూరం నిరస్య స్వయమ్**
**హస్తాగ్రే పతతి శ్వపాకభవనే భక్ష్యాశయా భ్రామ్యథ 51**

అసంఖ్యాకమైన పుష్పములతో శోభిస్తున్న శ్రీబృందావనమును మహాభాగ్య శిరోమణులు కూడ హృదయములో ధ్యానిస్తున్నారు. హా! అట్టి బృందావనమును

పొంది కూడ నీవు కుబుద్ధివై అన్యత్ర పరుగిడుతున్నావు. తనంతటతాను నీ చేతులలోకి వచ్చిన చింతామణిని కాలితో దూరముగ తన్ని, చండాలుని ఇంట భిక్షకై తిరుగుతున్నావు!

ఎన్ని జన్మల పుణ్యఫలముగనో శ్రీబృందానిత్యనివాసము లభిస్తుంది. ఆ గొప్ప వరమును కాలదన్నుకొను మూర్ఖుడు వరించివచ్చిన చింతామణిని తానే దూరము చేసికొన్నట్లేకదా!

**ఆతన్వానౌ స్థిర చరమపి ప్రేమమాధ్వీ మదాంధ్యమ్**
**రాధాకృష్ణావపి చ లుఠతో భూతలే యద్రసేన**
**వృందారణ్యం తదిదమతుల ప్రోన్మదానంద సింధు**
**స్యందిద్రాక్ పదమివ మమాఽచూచురచ్చిత్త రత్నమ్ 52**

శ్రీబృందావన రసములో శ్రీరాధాకృష్ణులు, అచటి స్థావర జంగమములు కూడ ప్రేమసుధామత్తులై భూమిపై రసవివశత్వముతో పడిపోయి ఉన్నారు. అట్టి సాటిలేని ప్రోన్మద ఆనంద సాగరమును ప్రవహింపజేయు శ్రీబృందావనము నా చిత్తము అనెడు రత్నమును ఒక్కమారుగా దొంగిలించినది.

సాక్షాత్తు శ్రీరాధాకృష్ణులే తద్రసపానమత్తులై పడిపోవుదురన; ఇక ఆ బృందావన స్వరూప, స్వభావ, తత్వాదులను ఎవరు వర్ణింపగలరు ? అట్టి శ్రీబృందావనమునకు జయము! జయము!

**ముముక్షూణాం యాతా లయమలమహోభూర్యాపచితమ్**
**హరేరేకాంతీ త్వామహహ గృహయాతాం ధిగ కరోత్**
**నయాయా స్త్వం ముక్తే కుకృతిరూప వృందాటవి తదా**
**శ్రయైర్దుష్టాయాస్తే జగతి నాహి నామాపి భవితా 53**

ఓ మోక్షమా! నీవు మోక్షార్థులకు సాయుజ్య ముక్తి అనెడి మహా అనిష్టమును ప్రాప్తింపజేస్తావు. శ్రీహరి యొక్క ఏకాంత భక్తుల ఇంటికి నీకై నీవే వెళ్లినా, వారు నిన్ను తిరస్కరిస్తారు. కుకృతి రూపమైన నీవు శ్రీబృందావన సమీపమునకు కూడ వెళ్లవద్దు, ఎందుకంటే శ్రీధామ ఆశ్రయాన్ని పొందితే నీ పేరు ఈదుష్ట జగత్తులో మిగిలి ఉండదు.

అంటే, శ్రీబృందావన నిర్మల ఛాయలో రసికభక్తికి, రసానందమునకు తప్ప మోక్షమునకు స్థానము లేదని భావము!

**తాస్తాః సంపాదితాస్తే బహుజనిషు నిజా కిం ప్రతిష్ఠాః శ్రుణోషి**
**దివ్యస్రక్చందన స్త్రయాదిక విషయభుజః కాను తృప్తి స్తవాభూత్**
**తస్మాన్మిథ్యేంద్రియార్థే ప్రయతన విముఖస్త్వం సుఖస్యాతి సీమ్నః**
**సారం సారంగవత్ సుం చర మధురవనే రాధికా కేలిధామ్ని 54**

నీవు అనేక జన్మలుగా ఆయా విషయాలలో ప్రతిష్ఠను సంపాదించావు. మరి ఇప్పుడు కూడ వానిని గూర్చియే ఎందుకు వింటావు ? నీవు దివ్యమైన మాల, చందన, స్త్రీ సంబంధిత విషయాలను భోగించావు. వాని వలన నీకు తృప్తి కలిగిందా ? కనుక మిథ్యా ఇంద్రియముల వైపు వెళ్లుట ప్రయత్నపూర్వకముగా మానుము. శ్రీరాధికా కేళీధామమైన శ్రీబృందావనములో భ్రమరము వలె అమృతభాండార పరమ సారమును ఆస్వాదించుము!

**కాంత త్వక్ మాత్ర సంఛాదిత యువతి మయాఽమేధ్య బీభత్స పిండే**
**ద్రాగ దృష్టే పండితానామపి విలయమితా ధైర్యరక్షాతి శిక్షాః**
**కా భక్తిః కా విరక్తి స్తదపహృత ధియాం కైవ వృందావనాశా**
**తాసాం నామాఽప్య శ్రుణ్వంస్తదనుసర సఖే రాధికా కుంజవాటీమ్ 55**

కేవలము సుందరమైన చర్మమును కప్పుకున్న స్త్రీ యొక్క దేహ పిండమును చూచి పండితులు కూడ వారి ధైర్యమును పోగొట్టుకుంటున్నారు. వారి దీక్ష, శిక్షణలు కూడ నశిస్తున్నాయి. ఎవరి బుద్ధిని స్త్రీ హరిస్తుందో ఇక అతనికి భక్తి కలగటం ఎలాగు ? వైరాగ్యము ఎట్లు ? శ్రీబృందావనము పట్ల ఆసక్తి, ఆశ కలుగుతాయా ? కనుక ఓ సఖుడా! అట్టి వ్యక్తుల పేరును కూడ వినవద్దు. శ్రీరాధా కుంజమహల్ వైపుకు వెంటనే వెళ్లు!

**మహామోహనావున్మదానంద మూర్తీ**
**మహామోహితాంబున్మదా నందితౌ చ**
**అహోయేన తౌ రాధికా కృష్ణచంద్రౌ**
**తదానంద వృందాయ వృందావనం మే 56**

ఓహో! శ్రీరాధాకృష్ణులు శ్రీబృందావనములో మహామోహనులై, ఉన్మద ఆనంతమూర్తులై ప్రకాశిస్తూ ఉంటారు. బృందావన సాంగత్యములో ఇట్లు మహానందమూర్తులై ఉండియు, ఆధామము పట్ల మహామోహితులై, ఆనందముతో ఉన్మత్తులౌతారు. అట్టి శ్రీబృందావనము నా ఆనందమును వృద్ధి చేయునుగాక!

శ్రీరాధాకృష్ణుల వలన శ్రీబృందావనము శోభిస్తూ ఉంటుంది, బృందావనము వలన శ్రీరాధాకృష్ణులు శోభిస్తూ ఉంటారు. అన్యోన్యాశ్రయమైన ఈ దివ్యస్థితి పరమ నిగూఢము!

**యత్రాశ్రుణాం ప్రవాహశ్చలతి నయనతః సంతి సర్వాంగరోమో**
**ద్భేద స్వేదప్రకంప క్షితిలుంఠనముహుః శ్వాసమూర్ఛాది భావాః**
**తాదృక్ భక్తి ప్రవాహాదపిఖలు పరతోఽ త్యద్భుత స్వానుభావాత్**
**స్వానందం కాష్ఠ కుడ్యాదివదపి వసతాం రాతి వృందాటవీయమ్ 57**

శ్రీబృందావనములో కాష్ఠము (ఎండుకఱ్ర), గోడ మున్నగు వానివలెనై నివసించాలి. అట్టివారి కన్నుల నుండి అశ్రుధారలు ప్రవహిస్తూ ఉంటాయి. శరీరములో స్వేదము, గగుర్పాటు, కంపము, క్రింద పడిపోవుట, మాటిమాటికి దీర్ఘముగ శ్వాసించుట, మూర్ఛిల్లుట వంటి భావస్థితి కనిపిస్తుంది. ఈ విధముగా భక్తి ప్రవాహమును, స్వానుభవము నుండి కలుగు ఉత్తమ ఆనందమును బృందావనము వారికి అనుగ్రహిస్తుంది!

పైకి ఒక ఎండు కఱ్ర వలెను, గోడవలెను కనిపించుచు; లోలోన స్వామికై తపించుమహనీయులకు బృందావనము నిజరసానందానుభూతిని ప్రసాదిస్తుంది.

**మాంధాతృ ప్రముఖాగతా నృపతయో యోషాం యశోభిర్జగత్**
**వ్యాప్తం భూరపి ........................ మేరు మందరమ్**
**.........................................................**
**........... సర్వత ఉజ్జ్వలామృత పదం విందాశు వృందాటవీమ్ 58**

మాంధాత మొదలైన ప్రముఖరాజుల యశస్సు మేరు, మందర పర్వతముల మధ్యనున్న భూమి యందే కాదు, సమస్త జగత్తులోను వ్యాపించింది. అట్టి రాజులు కూడ ...............! సుఖమయమైన శ్రీబృందావన రజకణమును ఆశ్రయిస్తే ఏది లభిస్తుందో ఆ ఉజ్వల అమృతమయ స్థానమునకై బృందావనమును శీఘ్రముగా ఆశ్రయించు!

కాలగమనంలో చాలా శతకములు విలుప్తమైనాయి కదా! లభించినవానిలో కూడ కొన్ని శ్లోకములలోని కొన్ని వాక్యాలు నష్టమైనాయి. లభించినంత వరకు ప్రతి శ్లోకాన్ని అందించాలి అనే సదాశయంతో పరిష్కర్తలు అసంపూర్ణంగా ఉన్న ఇటువంటి శ్లోకాలను కూడ ప్రచురించారు.

**వృందాటవ్యాం నవ్యాంభోదః శ్యామో రాధా ప్రేమోద్దామః**
**తస్యా ఆస్యాంభోజ భ్రాజన్మాధ్వీ స్తృష్ణః కృష్ణోఽవ్యాత్ వః 59**

శ్రీబృందావనములో శ్రీరాధా ప్రేమ యందు ఉద్దామమైన నల్లని మేఘము ఉదయించింది. అది (శ్రీకృష్ణుడు) శ్రీరాధా ముఖ కమల మధువును పానం చేస్తూ కూడా, తీరని తృష్ణతో ఉంటుంది. అటువంటి శ్రీకృష్ణుడు నిన్ను రక్షించునుగాక!

**వృందారణ్యే ప్రేమ్ణః కందే నిత్యానందత్ గోపీవృందే**
**నిందయాఽహం వంద్యేయాఽథ ప్రీతివృందే చేత్ కిం దేవైః 60**

ప్రేమకు మూలమైన, నిత్యానందమయులైన గోపికలచే భూషితమౌ శ్రీబృందావనమునందు నాకు ప్రీతి కలిగితే నేను నిందనీయుడినైనా వందనీయుడను ఔతాను. ఇక నాకు దేవతలతో ఏమి ప్రయోజనం ?

అత్యంత మహిమాన్వితమైన శ్రీబృందావనము పట్ల విడువరాని అనుబంధం ఏర్పడితే, అది సమస్తదేవతానీకముకన్న అత్యున్నత స్థితి అని తాత్పర్యము!

**యేషాం కర్ణాభ్యర్ణా స్పర్శి ప్రేమర్ధీనాం ధారావర్షి**
**వృందారణ్యం పూర్ణ ప్రార్థ్యంతే కాకానాం యాయుస్తీర్థమ్ 61**

అందరికీ ప్రార్థనీయుమైన (కోరతగిన) ప్రేమసంపత్తిని గూర్చి ధారాపాతముగ వర్ణించు వ్యక్తి యొక్క చెవులలోకి శ్రీబృందావన దివ్యప్రేమ విషయము వెళ్లకపోతే అతడు కాకతీర్థమునకు వెళ్లుట మంచిది.

కాకతీర్థము - నరకము! ఎన్నెన్నో విషయముల మీద అనర్గళముగ ప్రసంగించు వ్యక్తికి బృందావన దివ్యప్రేమను గూర్చి తెలియకపోతే అంతకన్న నరకము మరిలేదు!

**గౌర శ్యామ జ్యోతిర్ద్వంద్వామంద ప్రేమానందాస్పందాః**
**కేచిత్ వృందారణ్యాఽనన్యాధన్యాః పుణ్యాదత్రావన్యాః 62**

శ్రీబృందావనములో ఏయే అనన్యభక్తులు గౌరశ్యామ యుగళ కిశోరుల యందు మిక్కిలి ప్రేమానందముతో స్తంభితులు (నిశ్చేష్టులు) ఔతారో వారు ధన్యులు! వారు పరమ పునీతులు, శోభాపూర్ణులు!

**క్వాఽ సౌ భక్తిః క్వాఽ నాసక్తిః క్వాత్మజ్ఞానం క్వానుష్ఠానమ్**
**కాలవ్యాలాగమ్యం రమ్యం వృందారణ్యం త్వేకధన్యమ్ 63**

ఆ భక్తి ఎక్కడ ? వైరాగ్యం ఎక్కడ ? ఆత్మజ్ఞానం, ధర్మానుష్ఠానం ఎక్కడ ? కాని, కాలరూప సర్పమునకు అందని శ్రీబృందావనము ధన్యము!

భక్తి వైరాగ్యాలతో, ఆత్మజ్ఞానులై ఉన్నవారు కూడ కాలసర్పమునకు చిక్కవలసినదే! కాని శ్రీరాధాకృష్ణుల నిత్యనివాసమైన బృందావనము కాలమునకు కూడ అతీతమని భావము!

**యామః కాపస్మయ పిశునతా క్రోధ లోభాదిహిస్రైః**
**సంసారాధ్వన్యహహ గహనేఽ త్యూఢ మోహాంధకారే**
**ద్రాఘీయస్యాం చలతి న పదం భీమమాయా రజన్యామ్**
**శ్రీమద్బృందాటవి! తవ కృపౌదార్యమేకం స్మరామః 64**

ఆహా! కామ, దంభ, దుష్టత్వ, క్రోధ, లోభాదులు అనెడు క్రూరజంతువులతో నిండి; అత్యంత మోహాంధకారము చేత నెట్టబడి సంసారము అనెడు అడవిలో తిరుగుతున్నాము. సుదీర్ఘమైన, భీషణమైన మాయామయ అంధకారములో కాళ్లు ఆడుటలేదు. హే బృందావనమా! కేవలము నీకృపను, ఔదార్యమునే స్మరిస్తున్నాను.

భీషణమైన సంసారం అనే మాయనుండి జీవుని ఉద్ధరింపగలిగినది శ్రీబృందావనము మాత్రమే!

**మౌఢ్యం మా కురు మా కురంగ నయనేక్షాదౌ కృథాః సాహసమ్**
**సామ్ముఖ్యేన సఖే న ఖేల నిఖిలగ్రాసేన కాలాహినా**
**సర్వానర్థ నిదానమర్థమపి నో దేహార్థమభ్యర్థనా**
**క్లేశైః సంచిను నిశ్చిను స్థితిమిహైవోల్లస్య వృందావనే 65**

ఓ మూర్ఖుడా! మూర్ఖత్వాన్ని మాను. మృగనయనయైన స్త్రీ వైపు చూడటం కాదు, ఆ సాహసమే చేయకు. అన్నిటినీ మింగివేసే కాలసర్పంతో ఆడకు. శరీరానికి సంబంధించిన అన్ని అనర్థాలకు మూలం ధనం! ఐనను, శరీరపోషణకై యాచించు క్లేశముతో ధనమును కూడబెట్టకు. శ్రీబృందావనములోనే స్థిరంగా ఉండాలని నిశ్చయం చేసుకో!

**కోనామ వృందావన కీర్తి వృందాదన్యత్ర కర్ణో సకృదర్పయేత్**
**యదేవ రాధా పదయోరగాధాం దధాత్యఽసారణ భావలక్ష్మీ 66**

శ్రీరాధా చరణ కమలములు అవధులు లేని అసాధారణ భావరూప సంపద! దానినే ఏకమాత్రముగ ఎరిగిన వ్యక్తి శ్రీబృందావనకీర్తిని వదలి, అన్య విషయాలను ఎందుకు చెవికెక్కించుకుంటాడు ?

అంటే; శ్రీరాధ, బృందావనము తప్ప అన్యము అతనికి రుచింపదని భావము!

**తేజోభావస్తమ ఇతి వదంత్యేక ఆచార్యదేశ్యా**
**మాయోల్లాసం నిగమ నిపుణా స్తన్నిమిత్తం వదంతి**
**వృందాటవ్యాం ప్రసరతి తడిత్ కోటికోటి ప్రకాశే**
**కోప్యాశ్చర్యో విలసతి మహాభాస్కరోధ్వాంతరాశిః 67**

కొందరు ఆచార్యులు “తేజస్సు లేక పోవటమే తమస్సు (చీకటి)” అని అంటారు. వేద పండితుల అభిప్రాయం ప్రకారం “మాయ యొక్క ఉల్లాసమే తమస్సు, తేజస్సు దానికి నిమిత్తం”! వారి ఉద్దేశం ప్రకారం తేజస్సు, తమస్సు ఒకే

చోట ఉండవు. కాని; శ్రీబృందావనంలో కోటికోటి విద్యుల్లతల వంటి కాంతితో ప్రకాశిస్తున్న రాధాజీ, సూర్యుని ఆశ్చర్యకరదీప్తితో కూడిన అంధకారరూపంతో ప్రకాశిస్తున్న శ్రీకృష్ణుడు ఒకే చోట విలసిల్లుతున్నారు.

కనుక వేదవిజ్ఞానమునకు, తార్కికబుద్ధికి అందరానిది రసతత్త్వమని ఫలితార్థము!

**రాసకేలి పండితాయ మండితాయ రాధికా**
**సంగినీభిరత్యనంగ రంగినీభిరున్మదాత్**
**అంగరేణు రమ్య వేణునాద ముగ్ధధేనుక**
**ధ్యాతరూప గోపభూపనందనాయ సన్నమః 68**

శ్రీశ్యామసుందరుడు రాసలీలా పండితుడు! అత్యంత ఉన్మత్తయై అనంగ రంగశాలినియైన రాధాజీతోను, రాధాసఖీమణులతోను శోభిస్తూ ఉంటాడు. శరీరమందంతట నిండిన గోధూళితో, రమణీయమైన వేణునాదముతో లోకాన్ని మోహింపజేస్తాడు. ధ్యానానికి యోగ్యమైన ఆ గోపేంద్రనందనుడికి సమ్యక్ ప్రకారంగా నమస్కరిస్తున్నాను.

**వేణురంధ్ర సప్తకేషులోల కోమలాంగులీ**
**పల్లవాయ వల్లవాధిరాజనందనాయ మే**
**దివ్యగీతగాయకాయ నాయకాయ రాధికా**
**కంఠతారహార దివ్యమధ్యగాయ సన్నమః 69**

గోపరాజపుత్రుడైన శ్రీకృష్ణుని పల్లవములవంటి కోమలఅంగుళులు (వేళ్లు) సప్తరంధ్రములతో శోభిస్తున్న వేణువుపై నర్తిస్తున్నాయి. అతడు దివ్య సంగీత గాయకులకు నాయకుడు! శ్రీరాధా కంఠహార మధ్యములో వెలుగుతున్న మణి! అతనికి మరిమరి నమస్కరిస్తున్నాను.

**మంజు కుంజవాటికాసు నాటికాసు మల్లికా**
**మాలభారినీషు వల్లవీషు చారు చిల్లిషు**
**దివ్యచిత్ర పట్టవాస ఆసనేऽతి సుందరై**
**రాధికా వ్రజేంద్ర నందనౌ స్మరామి సంగతౌ 70**

మనోహర కుంజవాటికలలో లీలాప్రకటన సమయంలో గోపీమణులు మల్లెమాలలను ధరించి ఒప్పుతున్నారు. అత్యంత సుందరమైన, దివ్యవిచిత్ర కాంతితో వెలుగుతున్న వస్త్రాసనముపై విరాజమానులైన శ్రీరాధామాధవులు సుందర హావ భావములను దర్శింపచేస్తున్నారు. వారిని స్మరిస్తున్నాను.

**మంద మంద చారుహాస దివ్యపీతపట్టవాస**
**నీలనీరదావభాస వల్లవీ విచిత్రరాస**
**ప్రేమసంపదేకవాస రాధికా నికుంజవాస**
**మాऽవ నిత్య తద్విలాస కోటిచంద్రవక్త్రభాస 71**

హే మృదుమధుర మందహాస ముఖా! దివ్యకాంతియుక్త పీత వస్త్రధారీ! నీలమేఘ శ్యామలాంగా! గోపికలతోడి విచిత్ర రాసవిలాసము కలవాడా! ప్రేమసంపత్తితో కూడిన రాసభవనమా! శ్రీరాధికా నికుంజవాసీ! శ్రీరాధా నికుంజ నిత్యవిలాసీ! కోటిచంద్రులను తిరస్కరించు ముఖ కాంతి కలవాడా! నన్ను రక్షించు!

**కుంద కుట్మలాగ్రదంత్యుదార మందహాసినీ**
**దివ్యచిత్ర బిందునీల సూక్ష్మపట్టవాసినీ**
**మంజుగుంజ భృంగపుంజ కుంజవీథి భాసినీ**
**మానసేऽస్తు మే సదైవ రాధికా విలాసినీ 72**

శ్రీరాధ కుంద మొగ్గల వంటి దంతపంక్తి కలది. మృదుమందహాసముతోను; దివ్యమైన, విచిత్రమైన దృష్టి చుక్కతోను శోభిస్తున్నది. మిక్కిలి కాంతిమంతమైన

వస్త్రమును ధరించింది. మనోహరంగా గుంజారవం చేస్తున్న భ్రమరాలతో వెలుగొందుతున్న కుంజ వీథిలో సంచరిస్తున్నది. అట్టి శ్రీరాధా విలాసిని నా మనసులో నిలచియుండునుగాక!

ఇప్పటివరకు శ్రీకృష్ణచంద్రుని వర్ణనాత్మకముగ స్తుతించిన శ్రీప్రబోధానందులు ఇక శ్రీరాధాజీని వర్ణిస్తున్నారు.

**కృష్ణకంఠనీత దివ్యకృష్ణగుంజ హారిణీ**
**నిత్యకేలి తృష్ణ కృష్ణ చిత్తవిత్తహారిణీ**
**ప్రేమపుంజమంజు కుంజవీథికా విహారిణీ**
**రాధికాஉస్తు మే స్వభక్త్యభావ తాపహారిణీ 73**

శ్రీరాధిక శ్రీకృష్ణుని మెడలో నుండి జారిన కృష్ణవర్ణములోనున్న దివ్యగుంజాహారమును ధరించింది. ఆమె నిత్యకేళీతృష్ణతో నుండు శ్రీకృష్ణుని చిత్తమును హరించింది. ఆ దేవి ప్రేమ పుంజములతో మనోహరముగ నుండు కుంజలలో విహరిస్తూ ఉంటుంది. రాధాభక్తి యొక్క అభావము (లేకపోవుట) చేత కలిగెడు తాపమును హరిస్తుంది. (అనగా జీవునిలో రాధాభక్తి అదృశ్యమైతే తీవ్రమైన తాపం కలుగుతుంది. ఆ తాపమును దయగల ఆ తల్లి తానే తీర్చి, భక్తి సంపదను ఇస్తుంది.) అట్టి రాధాదేవి నా హృదయములో ప్రకాశించునుగాక!

**కృష్ణ దృక్ చకోర పేయ వక్త్ర చంద్రికా**
**రాధికానురాగ మూర్తిరున్మద స్మరాధికా**
**దివ్యహేమ చంపకాలి కంపకాలి మండలీ**
**చిత్ర చిత్రకాంతి రత్నరాధ శాంతిరస్తుమే 74**

శ్రీకృష్ణచంద్రుని నయన చకోరము శ్రీరాధాముఖచంద్ర చంద్రికలను పానం చేస్తూ ఉంటుంది. అత్యంత ప్రేమతో ఉన్మత్తయైయుండు రాధిక మూర్తీభవించిన

అనురాగము! ఆమె సఖీమణులు కూడ హేమవర్ణములో నుండు దివ్యమైన సంపెంగ మొగ్గలకాంతి వంటి కాంతితో ప్రకాశిస్తూ ఉంటారు. భ్రమర సమూహాలు ఆ దేవికి వెనుక వెనుక ఎగురుతూ అనుసరిస్తాయి. ఈ విధంగా చిత్రవిచిత్ర కాంతిధారయైన శ్రీరాధాజీ శోభిస్తున్నది. అట్టి ఆతల్లి నా వేదనను శాంతింపజేయునుగాక!

**చారువక్త్రచంద్రమింద్రనీలవృంద సుందరమ్**
**దివ్యకేలి వృంద నందితాద్రిరాజ కందరమ్**
**ప్రేమబంధ వందమాన విశ్వవందితేందిరమ్**
**నౌమి కృష్ణమేవ రాధికా నికుంజ మందిరమ్ 75**

శ్రీకృష్ణుని ముఖచంద్రుడు అతిసుందరముగనున్నాడు. ఆయన ఇంద్రనీలమణి సమూహముల కాంతివంటి కాంతితో మనోహరంగా ఉన్నాడు. తన దివ్య క్రీడలతో ఆయన గోవర్ధన గిరిరాజుకు ఆనందాన్ని ప్రసాదిస్తాడు. ఆతని ప్రేమాలింగనాన్ని పొందగోరి విశ్వవందితయైన లక్ష్మీదేవి కూడ స్తుతిస్తూ ఉంటుంది. రాధా నికుంజ మందిరము ఆయనకు నిజవిలాసస్థలి! అట్టి శ్రీకృష్ణునకు నమస్కరిస్తున్నాను.

**ప్రాణేశౌ యది కౌతుకం కిల తదా వృందావనే కాచనా**
**పూర్వాలోకి కదంబవీథిరిహ వామస్తే కదానుగ్రహః**
**ఇత్యేకాలిగిరాఽ చిరాచ్చల చలేత్యుక్త్వాత్త పాణ్యోర్మిథః**
**స్మిత్వాఽ వ్యాత్తరితం న సంవృత పటం శ్రీరాధికాకృష్ణయోః 76**

“హే ప్రాణేశయుగళమా! మీరు ఒక కుతూహల దృశ్యాన్ని చూడాలనుకుంటే, శ్రీబృందావనంలో ఒక అపూర్వ, అలౌకిక కదంబశ్రేణి ఉన్నది. అక్కడికి ఒకమారు కృపతో రండి” అని ఒక సఖి అన్నది. అది వింటూనే “పద! పద” అనుకుంటూ; ఉత్కంఠతతో ఒకరి చేతులను మరొకరు పట్టుకొని, చిరునవ్వులతో, జారిపోతున్న

వస్త్రాలతో శ్రీరాధాకృష్ణులు త్వరత్వరగా వెళ్లసాగారు. అట్లు జారిపోతున్న వారి వస్త్రములు మమ్ము రక్షించునుగాక!

చిన్నపిల్లలు ఏదైన కొత్త విషయం, కొత్త వస్తువు ఒకటి ఉన్నదని తెలిస్తే పరుగుపరుగున వెళ్లినట్లు శ్రీరాధాకృష్ణులు సఖిమాటలననుసరించి చేయిచేయి కలిపి పట్టుకొని, వస్త్రాలు జారిపోతూ ఉండగా వేగంగా వెళ్లారట! శ్రీరాధాకృష్ణుల రసస్పర్శతోవారి వస్త్రములు కూడ రసమయమై రక్షింప సమర్థములై ఉన్నవి. అద్భుత భావన!

**యత్రోచ్ఛల మహా రసాబ్ధిలహరీ దోలాయితావున్మదమ్**
**శ్రీరాధా మురళీధరౌ సహ సదా ప్రోద్గాయతో నృత్యతః**
**సఖ్యస్తర్హి నటంతి దివ్యతనుభృత్ స్త్రీ పుంశ్చరాఽ న్యన్నట**
**త్యావేశాత్ బహుదివ్య దుందుభిరవే తాం నౌమి వృందాటవీమ్ 77**

శ్రీబృందావనములో ఎగసిపడుతున్న మహారససాగర తరంగాలలో తేలియాడుతున్న శ్రీరాధాకృష్ణులు ఉన్మత్తులై ఉచ్చైస్వరముతో పాడుతూ, నాట్యం చేస్తున్నారు. వారితో కలసి సఖీమణులు కూడ నాట్యం చేయసాగారు. ఇంకను, దివ్యదేహధారులైన స్త్రీలు, పురుషులవలె అభినయించు స్త్రీలు కూడ దివ్యదుందుభీ నాదముతో ఆవేశపూర్ణులై నృత్యం చేయసాగారు. అట్టి బృందావనమునకు నమస్కారం చేస్తున్నాను.

**పూర్ణ సంకీర్ణ నిత్యోన్మదవర మదనాత్మోదితో యత్రకృష్ణః**
**తాదృక్ రత్యైవ నానావిహారభిరనిశం రాధయా రంరమీతి**
**తాదృక్ భావోన్మదాంధీ భవదఖిల మహామాధురీణాంధురీణామ్**
**శ్రీమద్బృందాటవీమాశ్రయత హృది సదా తాదృశోద్దామ భావాః 78**

శ్రీబృందావనములో పరిపూర్ణమైన, అత్యంత శ్రేష్ఠ ఉన్మదమైన మదన స్వరూపుడు శ్రీకృష్ణుడు ప్రకటితమైనాడు. రతిస్వరూపిణియైన శ్రీరాధాజీతో కలసి

నిరంతరము అనేకములైన రసవిహారములతో క్రీడిస్తున్నాడు. దీనిని దర్శిస్తూ భావ వివశోన్మత్తయైన శ్రీబృందావనము మహామాధుర్యమయమై ప్రకాశిస్తున్నది. అట్టి శ్రీధామమును అట్టి ఉద్దామ భావావేశముతోనే హృదయములో నిరంతరము ఆశ్రయించు!

**న బహిర్భవ రే పునర్భవాంబుధిముత్తీర్య తథాఽ భవాంబుధిమ్**
**రససార నిధాన రాధికా రతి లీలా వనమేత్య భాగ్యతః 79**

ఓయీ! భవసాగరములోను, అభవసాగరములోను (ముక్తి) ఉత్తీర్ణుడవు కావాలనుకుంటున్నావా ? భాగ్యవశాత్తు రససార నిధానమైన శ్రీరాధారతి లీలావనమైన శ్రీబృందావనానికి రమ్ము! ఒకసారి వచ్చిన తరువాత ఇంక ఎక్కడికీ వెళ్లకు!

**అపి బంధసహస్రమస్తు మే బత వృందావన నిత్యసేవినః**
**న తరామతి భుక్తిముక్తయః పరతోనాపి పరేశభక్తయః 80**

శ్రీబృందావనమునకు నిత్యసేవకుడిగా ఉండాలనుకుంటున్న నాకు వేయి బంధనాలు ఉండనీ! భుక్తి, ముక్తి కావాలని కూడ కోరుకోను. ఇంకను చెప్పవలెనన్నచో, భగవంతుని పట్ల ఉండు భక్తి కూడ బృందావన దాసత్వమున కంటే శ్రేష్ఠముగా కనిపించుటలేదు!

శ్రీబృందావనమునకు సేవచేయుటయన, సాక్షాత్తు రాధాజీని సేవించుటయే కదా! కనుకనే ఆదాస్యము ముందు పరాభక్తికూడ శ్రీప్రబోధానందులకు తక్కువగా తోచినది.

**విషయాన్ విషవత్ పరిత్యజన్ పదాలంభ్య పునర్భవం భజన్**
**దృఢ సర్వపుమర్థ సారతామతిరస్మిన్ వస రాధికావనే 81**

విషయాదులను విషమువలె త్యజించు. ముక్తి తానే స్వయముగ నీ పాదముల చెంతకు వచ్చినను దానిని కూడ తిరస్కరించు. సమస్త పురుషార్థముల సారమైన ప్రేమధనమును పొందుటకు దృఢమతివై శ్రీరాధికావనము (బృందావనము)లో నివసించు!

**ముదితోఽఖిల సత్వసంపదారుదితో దైవకృతాత్మభూతితః**
**ఉదిత ప్రణయైకరాట్ పరా విదితస్త్వం భజ రాధికా వనమ్ 82**

సమస్త ప్రాణులు దైవవశమున లభించిన బల సంపదలను చూచి ఆనందాన్ని పొందుతాయి. ఈ విషయమై ఎరుకలో ఉండి, ప్రేమ స్వరూపమైన బృందావనమును సేవించు!

జీవులు తమ తమ కర్మానుసారంగా వచ్చిన సుఖదుఃఖాలను, కలిమిలేములను అనుభవిస్తూ; ఆంతర్యంలో మాత్రం ప్రేమస్వరూపులైన శ్రీరాధాగోవిందులను భావపూర్వకంగా భజించాలి అని శ్రీసరస్వతీపాదులు అంటున్నారు.

**రాధాకృష్ణౌ నిరవధి మిథో వర్ధమానానురాగౌ**
**యత్రోన్మత్తం స్థిర చరమహో తద్ద్వయ ప్రేమమాధ్వ్యా**
**ఆగంతూనప్యతి రస చిదాకారయేత్ యత్ స్వయంచ**
**నిత్యం తత్సంగతి రసభరం నౌమి వృందావనం తత్ 83**

శ్రీబృందావనములో శ్రీరాధాకృష్ణులకు ఒకరిపట్ల మరొకరికి కల అనురాగము నిత్యము పెరుగుతూ ఉంటుంది. ఓహో! అక్కడ యుగళకిశోరుల ప్రేమామృతములో స్థావరజంగమములన్ని ఉన్మత్తం ఔతూ ఉంటాయి. అక్కడ ఆగంతకులకు కూడ రసరూప చిద్ఘనరూపం వస్తుంది. శ్రీరాధాకృష్ణుల నిత్యసాంగత్యములో రసపూర్ణమైన అట్టి బృందావనమునకు నమస్కరిస్తున్నాను.

**వృందాటవ్యా అహహ సహజా కేయముద్దామ శక్తి**
**భక్తిర్విష్ణోర్బహు విథరసాం యా విముక్తించ దత్తే**
**యచ్చాన్యత్ దుర్లభమభిమతం ప్రాప్తమత్యశ్రమేణ**
**తచ్చాజస్రంకిరతి సకలాన్ ప్రత్యయోగ్యానపీహ** **84**

ఓహో! శ్రీబృందావనమునకు ఎటువంటి సహజ ఉద్దామ శక్తి ఉన్నదంటే శ్రీవిష్ణువునకు బహువిధ రసాత్మక భక్తిని, విముక్తిని ఇవ్వగలదు. అతిదుర్లభమైనట్టి, అందరును కోరుకొనునట్టి వస్తువును శ్రమలేకుండ వారికి ప్రాప్తింపజేయగలదు. అయోగ్యులైన వారికి కూడ శ్రీధామము కోరిన దానిని ప్రాప్తింపజేయగలదు!

దయా స్వరూపిణియైన శ్రీబృందావనమును ఆశ్రయించినచాలును, వ్యక్తుల యోగ్యతాయోగ్యతలను పట్టించుకొనక కోరినది ఈయగల మహాదాత ఆతల్లి!

**గతిః సఖి సుమంథరా కిమధునా విపినశ్రయమ్**
**కుతోఽ మధుమదాలసా లసతి హంత దృష్టిస్తవ**
**కథన్నుభయ కంపితాస్యుపహరీతి సఖ్యాగిరా**
**వినమ్రముఖ రాధికాం హృది భజామి వృందావనే** **85**

"హే సఖీ! నీవు చాలా మెల్లగా వెళ్తున్నావు. ఇప్పుడు ఆ నికుంజలకు ఎందుకు వెళ్తున్నావు ? ఏదో ఒకానొక మధుర వస్తువు లభించినట్లు నీకన్నులు మత్తిలి ఉన్నవి. భయంతో కంపిస్తున్నట్లు కనిపిస్తున్నావు ఎందుకు ?" అని ఈ ప్రకారంగా శ్రీకృష్ణుని సమీపంలో ఉన్న సఖి పలికింది. ఆ మాటలను విని వినమ్రముఖియైన రాధాజీని హృదయంలో స్మరిస్తున్నాను.

**అసుప్తిరిహ చేతనాహరణ హేతురేవ ధ్రువమ్**
**తథాఽ పటలమంథతాకారమనాసవో మాదకః**
**ధనం నిధనవజ్జహత్తదతి దూరతః పూరతః**
**పరేశ రసవారిధేర్ముదిత ఆస్వ వృందావనే** **86**

అక్కడ (బృందావనములో) జాగ్రదవస్థలో ఉన్నను చైతన్యము లేనిస్థితి, నేత్రరోగము లేకయే అంధత్వము, మద్యపానము చేయకనే మత్తిల్లుట, ధనము కూడ నిర్ధనముగ తోచుట – ఇట్లు ఉండును! కనుక సమస్తమును త్యజించి, భగవంతుని రససాగరములో ఆనందమును పొందుతూ, శ్రీబృందావనములో నివసించు!

భగవదనుభూతిని పొందుతున్న మహాత్ములు కన్నులు తెరచియే నిశ్చేష్ట స్థితిలో ఉంటారు. కన్నులు ఉండికూడ జగత్తులోనిది ఏదీ కనిపించదు, దృష్టి మరొకచోట లగ్నమై ఉంటుంది. వారు నిరంతరం దివ్యోన్మద స్థితిలో ఉంటారు. నిజమైన రససంపద నెరిగినవారు అగుటచే లౌకికధనముపట్ల ఆసక్తి ఉండదు!

**బద్ధుం బంధుజనః సదైవ యతతే దుస్స్నేహ పాశైర్మహా**
**మాయా కాఽపి విమోహినీ శిశుకలాలాపః స్త్రియా సౌరతమ్**
**ఘోరానర్థ నిదానమర్థమహహ త్వం విద్ధ్యపార్థం పర**
**స్వార్థ భ్రంశకరం తదన్య సకలం త్యక్త్వైవహి వృందావనమ్ 87**

బంధుజనులు దుస్స్నేహ పాశాలతో బంధించాలని నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటారు. పసిపిల్లల అవ్యక్తమైన ముద్దుమాటలు, స్త్రీ సాంగత్యము చెప్పనలవికాని మహామాయా స్వరూపము! అహో! ధనము కూడ ఘోరమైన అనర్థములకు ప్రధానమైనదిగ అనిపించి చివరకు నిష్ప్రయోజనమైపోతుంది. అంతేకాదు, అది పరమ స్వార్థమును (మంచిని కలిగించు అర్థమును) నాశనము చేస్తుందని గ్రహించు! కనుక సమస్తమును త్యజించి బృందావనమునకే రమ్ము!

**అద్యశ్వో వా త్వం మరిష్యస్యబుద్ధే**
**కిం తే కాంతా పుత్ర విత్తాది కుర్యాత్**
**యావద్దేహం సర్వతో మృత్యురస్తి**
**భ్రాతస్తదావద్ధావ వృందావనాయ 88**

ఓ మూర్ఖా! నేడో, రేపో నీవు మరణించవలసిందే! అప్పుడు నీ భార్యాబిడ్డలను, సంపదను ఏమి చేస్తావు ? ఎప్పటి వరకు ఈ శరీరం ఉంటుందో అప్పటి వరకు మృత్యుభయం నీతోనే ఉంటుంది. కనుక సోదరా! ఇప్పుడే నీవు బృందావనానికి పరుగున వెళ్లు!

అశాశ్వతమైన శరీరాన్ని, దానికి సంబంధించినవారిని వదలి; శాశ్వత సుఖదాయినియైన బృందావనమునకు రమ్మని శ్రీసరస్వతీపాదులు జీవులను దయతో పిలుస్తున్నారు.

**యోషిత పిండే కిం న పశ్యస్యనంధ!**
**ప్రత్యక్షం యత్ ప్రక్షరేచ్ఛిద్రకేభ్యః**
**భ్రాతః! కాంతత్వక్ చమత్కారమాత్రాత్**
**వృందారణ్యేఽ యత్యుపేక్షోఽ సి హా ధిక్ 89**

ఓయీ! నీవు అజ్ఞానివి కావు. స్త్రీ యొక్క కుత్సిత రంధ్రములబారి నుండి ఏల వెలుపలికి రావు ? ఆ ఛిద్రములను నీవు ప్రత్యక్షముగా చూచుట లేదా ? సోదరా! ఆడదాని అందమైన చర్మాన్ని చూచి నిన్ను నీవు మరచి, బృందావన నివాసం పట్ల ఇంత ఉపేక్ష వహించావు. హా! ఛీ! ఛీ! (నీవు తిరస్కరింప తగినవాడవు.)

**యత్నైర్మిథ్యా దుర్గ్రహ గ్రాహమేతం ద్రాక్ సంత్యజ్యాహం మమేతి గ్రసిష్ణుమ్**
**సంసారాంభోరాశిముత్తీర్యతీరం గత్వానంద విందవృందావనం తత్ 90**

'అహంకార, మమకారములు' అను రూపముతో పట్టిన ఈ దుష్టగ్రహమును ప్రయత్నపూర్వకముగ వదిలించుకొమ్ము! సంసారము అనెడు సముద్రమును దాటి, అవ్వలి తీరాన ఉన్న ఆనంద స్వరూపిణి శ్రీబృందావనమును పొందుము!

**కనక మరకతాభే దివ్యధామ్నః కిశోరే**
**మిథ ఉదిత ముఖేందు న్యస్త చక్షుశ్చకోరే**
**విహరత ఇహ వృందాకాననే చిత్తచోరే**
**మమ తదతి విచేష్యే యామి నాన్యత్ర ఘోరే** **91**

స్వర్ణ, నీల కాంతితో ప్రకాశిస్తున్న దివ్యయుగళ కిశోరులు ఉజ్వలమైన తమ ముఖచంద్రులపై నేత్రములు అనెడు చకోరములను లగ్నము చేసినారు. నా మనసును దొంగిలించి వారు బృందావనములో విహరిస్తున్నారు. నేను వారినే అన్వేషిస్తున్నాను. ఘోరమైన సంసార విషయాదులలోనికి వెళ్లను!

**అహహ! న మహతామప్యత్ర కిం హంత మోహ**
**క్షయమయతి హఠాత్‌యత్ బ్రహ్మతామీశతాంచ**
**న కలయతి స రాధా నూపుర ధ్వనిముగ్ధో**
**హరిరవిరహదార్ఢ్యయాః సంతి వృందావనే చేత్** **92**

అహహా! మహాపురుషులు కూడ ఈ మోహమును నశింపజేసుకొన లేకపోతున్నారు కదా! ఒక వేళ ఏదో ఒక విధముగా శ్రీబృందావనమును త్యజింపక (బృందావనములోనే) ఉంటే, అప్పుడు శ్రీరాధానూపురధ్వని శ్రీశ, బ్రహ్మత్వ, ఈశత్వములపట్ల నీదృష్టిని పోనివ్వకుండ చేస్తుంది. అనగా, మోహమూలకమైన బ్రహ్మత్వ ఈశత్వాదులను చూర్ణము చేస్తుంది.

శ్రీబృందావనములో శ్రీరాధాజీ నిరంతరం నడయాడుతున్నది. ఆ నూపుర ధ్వని సమస్త మోహములను నశింపజేస్తుంది. కనుక బృందానివాసము సర్వశ్రేష్ఠము!

**నిరవధి రససింధుః స్యందతే యత్ర వృందా**
**వనమిదమతి సాంద్రానంద సందోహకందమ్**
**కలయ కనకచంపకోత్ఫుల్లదిందీవరాభమ్**
**మధుర మధురధామద్వంద్వమున్మాద సత్వమ్** **93**

సాంద్రానంద సమూహములకు మూలబీజమైన శ్రీబృందావనము ఎల్లలు లేని రససింధు స్వరూపముగ ప్రవహిస్తున్నది. అచట స్వర్ణచంపక వర్ణరంజితగను, ఉత్ఫుల్ల నీలకమల వర్ణవిశిష్టునిగను ప్రకాశిస్తున్న ఉన్మత్త మధుర స్వరూపులను దర్శించుకొనుము!

**మహానిరయ నీరధిం హృది నిరూప్య నారీవపు**
**విలోక్య పరమాపదాం పదముపాగమం సంపదామ్**
**విభావ్య జనరంజనం హరిరసాత్మతా భంజనమ్**
**భజోపరతి భూషణః పరమధామ వృందావనమ్ 94**

స్త్రీ శరీరము మహానరకసాగరమని హృదయములో గుర్తించు! ప్రాప్తించిన అనేక విపత్తులను పరమసంపదగా భావించు. లోకులను రంజింపచేయదలచటం హరిరసాత్మకతకు హానికరమని గ్రహించు. వైరాగ్యమును భూషణముగా ధరించి, పరమధామమైన శ్రీబృందావనమునే భజించు!

**యదీయ సుఘన ద్రుమావలితలాధ్వని ద్యోమణి**
**ప్రభాప్రసర వంజితేఽంధతమ సౌరలక్ష్మీకృతా**
**సునీలపట గుంఠితాఖిల తనుః సుఖం రాధికా**
**దివాప్యభిసృతా ప్రియం స్మర తదేవ వృందావనమ్ 95**

శ్రీబృందావనములోని సఘన వృక్షముల నుండి సూర్యకిరణములు కూడ ప్రసరింపలేవు. (అంటే, వృక్షములు అంతదట్టముగా ఉంటాయి.) ఆ వృక్షముల క్రింద గాఢమైన చీకటిలో ఆమె అత్యంత నీల వస్త్రములతో తనను పూర్తిగా ఆచ్ఛాదించుకొనినది. ఇట్టి వేషధారణతో పగటి సమయంలో కూడ దాగి ఉండి, శ్రీరాధ ప్రియతమునికై అభిసారికవలె ఎదురు చూస్తున్నది. అట్టి బృందావనమును స్మరించు!

**శరద్విమల చంద్రికాతతి సుచందనైశ్చర్చితా**
**దధత్యమల మౌక్తికాభరణమత్యలక్ష్యం సుఖమ్**
**ప్రియాభిసరణోద్ధరాం ధవల ధౌత పట్టాంబరామ్**
**స్మరామి హృది రాధికాం స్వవనపుల్లమల్లీవనే 96**

శ్రీరాధిక శరత్కాలపు స్వచ్ఛ చంద్రికలలో, శరీరమునకు చందనమును అలదికొని నిలచినది. ఆమె నిర్మలమైన ముత్యాలహారమును ధరించినది. అతీతమైన భావస్థితిలో సుఖ పూర్వకముగ ప్రియతమునికై ఎదురు చూచుటలో ఆమె అగ్రగణ్య! శుభ్రమైన తెల్లని వస్త్రములను ధరించిన శ్రీరాధ తన వనమైన బృందావనములోని వికసిత మల్లికా వనములో విరాజమానయైనది. నేను ఆదేవిని హృదయములో స్మరిస్తున్నాను.

95వ శ్లోకములో గాఢాంధకారములో, నల్లని చెట్ల క్రింద నల్లని వస్త్రములను ధరించి శ్రీరాధ ప్రియతమునికై ఎదురు చూస్తున్నదని వర్ణితమైనది. (ఈ 96వ శ్లోకములో) వెంటనే శరత్కాలపు వెన్నెల కిరణములలో, తెల్లని వస్త్రములను ధరించి, తెల్లని మల్లె వనములో వేచి ఉన్నది అని శ్రీ ప్రబోధానందులు వర్ణించినారు. కాలము వారి ప్రీతిననుసరించి, భావమును బట్టి క్షణములలో మారిపోవుటను ఆయన దర్శించినారు.

**క్వచిన్నవ నికుంజకే మదనమోహనం దుర్ధర**
**స్మరన్ కేలికమున్మదాప్యభి సరత్యహో రాధికా**
**విచిత్రవనవీక్ష్యయా పథి విలంబినీ పాదయో**
**ర్ముహుః ప్రియసఖీధృతా హృది మమాస్తు వృందావనే 97**

ఒకనాడు శ్రీరాధ నవనికుంజలో మదనమోహనుని పట్ల భరింపరాని విరహముతో ఉన్మత్తయై అభిసారిక అయినది. విచిత్ర వనశోభను చూచు మిషతో మాటిమాటికి (కృష్ణునికై) వెనుకకు చూచుచు ఆమె విలంబగతితో నడుస్తున్నది.

ప్రియసఖి సహాయముతో ముందుకు నడుస్తున్న అట్టి రాధాజీ నా హృదయములో నిలచునుగాక!

**కాఽపేక్షా పితృమాతృబంధు సుహృదాం కా స్నిగ్ధతా ముగ్ధకాఽ**
**పత్యేష్వాత్మని జీవనేతి సుభగే కా వా కలత్రే రతిః**
**కా గేహ ద్రవిణాదికేషు మమతా దేహార్థ చింతాఽపి కా**
**ఛిత్వా గ్రంథిమిమాం హఠాత్వమఖిలాం వృందాటవీమాశ్రయ 98**

తల్లి, తండ్రి, బంధుజనుల పట్ల ఎందుకు అపేక్ష ? మనసును ఆకర్షించు సంతానము యొక్క సంతతిపై ఎందుకు ఈ వాత్సల్యము ? నీ జీవితములో భాగస్వామినియైన స్త్రీ పట్ల మాత్రము ఎందుకు ఆసక్తి ? ధన, గృహాదులపై మమత ఏల ? నీ శరీరమును గూర్చి చింత ఎందుకు ? బలవంతముగా ఈ సమస్త గ్రంథులను ఛేదించి, శ్రీబృందావనమును ఆశ్రయించు!

**దుఃఖాత్మ క్షణభంగుర సుఖలవాభాసేన సమ్మోహన**
**స్త్రీ పుత్ర ద్రవిణాలయాది సకలం త్యక్త్వా హఠాన్నిసృతః**
**క్రందం క్రందమమంద కందలిత సద్భావాంకురః సత్వరమ్**
**వృందారణ్యవిలాసినీ పదరజో విందన్ కృతీ నందతు 99**

దుఃఖమును కలిగించు స్వభావముతో, క్షణభంగురమై, లేశమాత్రపు సుఖముతోనే మోహింపజేయు స్త్రీ, పుత్ర, ధన, గృహాదుల నన్నిటిని త్యజించి; వాని నుండి విశ్రాంతిని పొందు! ఆర్తితో రోదిస్తూ రోదిస్తూ సాత్త్విక భావములను పొంది, శ్రీబృందావన విలాసినియైన శ్రీరాధా పదరజమును పొందు. ధన్యాతిధన్యుడవై ఆనందమును అనుభవించు!

అశాశ్వతమైన భవబంధాలను వదిలించుకొని, శాశ్వత ఆనందము ననుగ్రహించు శ్రీరాధాపదసన్నిధిని పొందుడని శ్రీప్రబోధానందులు జీవులకు హితమును బోధించినారు.

**ఉల్లసతి కాఽపి వృందావిపిన్యాఖ్యా సదనురాగరసఖానిః**

**యత్ర వసంతం సంతం విందతి రాధాపదారవిందాశా 100**

శ్రీబృందావనమను పేరుకల ఒకానొక అనిర్వచనీయమైన, ఉత్కృష్టమైన అనురాగరస'ఖని' విరాజమానమై ఉన్నది. ఎక్కడ నివసిస్తున్నా, శ్రీరాధాపదారవింద సన్నిధిని పొందవలెనను ఆశ ఉంటే ఆ తల్లి నిన్ను ఉద్ధరిస్తుంది.

మహామాయా పాశములచే బంధితులై, సంసార సాగరములో కొట్టుమిట్టాడుతున్న జీవులపై శ్రీప్రబోధానందులు ఎంతో దయను వర్షించారు. ఒకచో ప్రాకృతిక సుఖాల అశాశ్వతత్వమును బోధిస్తూ, మరొకచో లాలిస్తూ, ఇంకొకచో హెచ్చరిస్తూ ఆ మహాత్ముడు బృందావన దివ్యప్రేమను గూర్చి పదేపదే తెలియజేశారు. బృందావనములో నివసించాలి అనే ఆశ ఉన్నా చాలు, దయగల ఆ తల్లి ఉద్ధరిస్తుంది అని అభయం ఇస్తూ వారు ఈ శతకమును పూర్తి చేశారు.

# పదునాల్గవ శతకము

**దూరమవిద్యాసింధోర్విద్యా సింధోర్మహాద్భుతం సారమ్**
**చిరమారాధయ రాధాకృష్ణ విహారోజ్జ్వలం విపినమ్ 1**

అవిద్యాసాగరమునకు మిక్కిలి దూరములో నున్నదియు, విద్యాసాగరము యొక్క మహాద్భుత సారస్వరూపమైనదియు, శ్రీరాధాకృష్ణుల విహారముచే ఉజ్వలమైనదియునైన శ్రీబృందావనమును చిరకాలము ఆరాధింపుము!

**అలమిహ వితర్కజాలైః సహసైవాచ్ఛిద్యమోహజాలాని**
**ఉడ్డీయేవ విహంగవత్ పత వృందాకాననం రుచిరమ్ 2**

తర్క వితర్కములు ఇక చాలును! ఒక్కసారిగా మోహజాలమును త్రుంచివేసి, పక్షివలె ఎగిరిపోయి మనోహరమైన బృందావనములో వాలిపొమ్ము!

**జహి విషయదుర్విషవనం ఛింది దురాశా మహాపాశాన్**
**అయి మతి విహంగి! యాయా అమృతం వృందావనే సముడ్డీయ 3**

బుద్ధి రూప విహంగమా! విషయములు అనెడు విషవనమును త్యజించి, దురాశాపాశములను త్రెంచి, అమృత స్వరూపమైన శ్రీబృందావనములో వాలుము.

**కులధన విద్యాగర్వపర్వతమివ దుర్వహం సమాధిరూఢః**
**హాహా కదాను వింద్యాత్ వృందావన మాధురీం మూఢః 4**

హా!హా! మూర్ఖుడు తనను పర్వతముతో సమానమనుకొనుచు కుల, ధన, విద్యా, గర్వములతో ఎగిరిపడుతూ ఉంటాడు. అయ్యో! అతనికి శ్రీబృందావన మాధుర్యము ఏ విధంగా లభిస్తుంది ?

**ధిక్ ధిక్ మామతి కుమతిం వృందావన లబ్ధ చిద్ఘనాత్మపి**
**విడ్ భాండ దురభిమానాత్ ఫుల్లోఽసల్లోక మానాత్ యత్** **5**

బృందావనము నాశ్రయించి, చిద్ఘనస్వభావమును పొంది కూడ మలమూత్రాలతో నిండియున్న ఈ శరీరముపట్ల దురభిమానముతో ఉన్నాను. అసత్యమైన లోకమర్యాదకై ఉబ్బితబ్బిబ్బు ఔతున్నాను. నేను మిక్కిలి దుర్మతిని! ఛీ! ఛీ!

**కిం రే భ్రమసి దిగంతరమహహా నిరంతరవహత్ సుధాసింధుమ్**
**రాధాజీవిత బంధుం వృందారణ్యేందుమాశ్రయ శ్యామమ్** **6**

ఓయీ! దిగంతముల వరకు ఎందుకు వృథాగా సంచరిస్తావు ? నిరంతర సుధా సముద్రము, రాధాజీవిత బంధువు, శ్రీబృందావనచంద్రుడునైన శ్రీశ్యామసుందరుని ఆశ్రయించు!

**శ్రీరాధా నయనేందీవర బంధుం పూర్ణ రససింధుమ్**
**కమపి శ్యామలమిందుం వృందారణ్యేతిసత్కలం కలయ** **7**

శ్రీరాధా నేత్ర కమలములకు బంధువు, పూర్ణరససింధువునైన ఒకానొక అనిర్వచనీయ పూర్ణ కళాస్వరూపుడు శ్రీశ్యామచంద్రుడు! ఆతనికై శ్రీబృందావనములో నిరీక్షించు!

**రాధాధర దివ్య సుధారస సంస్వాదైక సంపదా మత్తః**
**కోఽపి ప్రేమాయత్తశ్చకాస్తి వృందావనే మహారసికః** **8**

అతడు శ్రీరాధా అధరముల దివ్యసుధారసమునాస్వాదించుట అను ఏకమాత్ర సంపత్తిచే మత్తిల్లినవాడు, ప్రేమాధీనుడైనవాడు! ఒకానొక మహారసికుడైన ఆ శ్రీశ్యామసుందరుడు బృందావనములో శోభిస్తున్నాడు.

**వృందారణ్య కదంబద్రుమ కాండ్రైర్వినిహిత త్రిభంగతనుః**

**స్మేరాధర మధువేణుః కృష్ణో మే హృది సహరాధయా స్ఫురతు 9**

శ్రీబృందావనములో కదంబవృక్షము క్రింద త్రిభంగియై, చిరునవ్వు చిందిస్తున్న పెదవులపై మధురవేణువును ధరించిన శ్రీకృష్ణుడు శ్రీరాధా సహితుడై నా హృదయములో స్ఫురించునుగాక!

**ప్రేమద్రవ లిప్తమిథో హృదయపటీ లిఖిత చిత్రవన్మూర్తీ**

**గౌరశ్యామ కిశోరౌ కావపి వృందావనే సదా భజత 10**

శ్రీశ్యామాశ్యాములు ప్రేమరసముతో ఒకరి హృదయములో మరొకరు తమ రూపములను చిత్రించుకున్నారు. శ్రీబృందావనములో అట్లు విరాజమానులైన ఒకానొక అనిర్వచనీయ గౌరశ్యామయుగళ కిశోరులను నిరంతరము భజించు!

**సంతాన కల్పద్రుమ పారిజాత మందారకానాం హరిచందనస్య**

**దివ్యై వనైశ్చింతయ చారు వృందావనం మహోచ్చిద్రస చంద్రికౌఘమ్ 11**

శ్రీబృందావనము సంతాన, కల్పవృక్ష, పారిజాత, మందార, హరిచందనాది దివ్యవనములతో భూషితమైనది. మహోచ్చిద్రస చంద్రికలతో మనోహరముగానున్న అట్టి బృందావనమును చింతింపుము!

**విచిత్ర సౌవర్ణ లసల్లతానాం విచిత్ర రత్న ప్రసవాద్భుతానామ్**

**సుదివ్య నానా ద్రుమసంగతానాం స్మరామి వృందావిపినే విలాసమ్12**

శ్రీబృందావనము విచిత్ర రత్నమయములైన పుష్పములు, చిగుళ్లు, ఫలములు మున్నగు వానిని సృష్టించు అద్భుత దివ్య వృక్షములతో కూడి ఉన్నది. విచిత్ర స్వర్ణమయ లతలతో శోభిస్తున్న అట్టి బృందావన విలాసమును స్మరిస్తున్నాను.

**వృందావనం శీతలమిందు వృందానందామృత స్యందన చంద్రికాతః**
**తత్ర్పాప్యమందా ఉరుతాపకందాద్భవాబ్ధి ముక్తాభజతాసు కృష్ణమ్ 13**

అనేక చంద్రుల యొక్క ఆనందసుధాచంద్రికలలో తేలియాడుతూ, నిత్యము తడుస్తున్న శ్రీబృందావనము మిక్కిలి శీతలముగ ఉంటుంది. ఓ మందబుద్ధులారా! అనేక తాపములకు బీజ స్వరూపమైన సంసారము నుండి విముక్తులై, బృందావనమునకు వచ్చి శ్రీకృష్ణుని భజింపుడు!

**వృందావనే నందిత కృష్ణచంద్ర నిస్తంద్ర కందర్పవిలాస వృందే**
**శ్రీరాధికాపాద సరోజ భృంగీ సంగీతమభ్యాసతు మే మనీషా 14**

ఆనందస్వరూపుడైన శ్రీకృష్ణచంద్రుని అద్భుత ప్రేమలీలలకు ప్రధాన కేంద్రమైన శ్రీబృందావనములో నా బుద్ధి శ్రీరాధా పదపద్మముల చెంత భ్రమరమై సంగీతమును అభ్యసించునుగాక!

**కిం నః సద్గురు గౌరవేన కురుతాం కిం లోకలజ్జాద్య నః**
**కిం వా నోపయశో భయం న విషయో ధర్మస్య కస్యాప్యహమ్**
**ఉన్మాదీవ శృణోమ్యహం న శతశః శాస్త్రస్య తద్విద్వచః**
**శ్రీవృందావన సద్రసేన యదభూదావిష్టముచ్చైర్మనః 15**

సద్గురువుల పట్ల గౌరవంతో మాకు ఏమి ప్రయోజనం ? లోకలజ్జతో ఇప్పుడు మాకు ఏమి వస్తుంది ? అపకీర్తి అనిన భయం లేదు. నేను ఏ ధర్మాచరణమును చేయటం లేదు. శతాధిక శాస్త్రవచనాలను, శాస్త్రవేత్తల వచనాలను కూడ ఉన్మత్తుని వలె వినటం లేదు. ఎందుకంటె, శ్రీబృందావన అత్యుత్తమ రసము నందు నా మనసు మిక్కిలిగా లగ్నమై ఉన్నది.

**ధర్మాతిక్రమ కోటిరస్తు సతతం కోటిర్భవత్వాపదా**
**మాస్తాం లోక వినింద కోటిగుణా ......................**
**..........................................................**
**శ్రీవృందావనమాత్మకోటి పరమప్రేష్ఠం కథం త్యజతామ్ 16**

కోటికోటి ధర్మములను అతిక్రమించినను, కోటికోటి విపత్తులు వచ్చిపడినను, లోకనింద ఎదురైనను ఆత్మకోటికి ప్రియమైన శ్రేష్ఠ బృందావనమును ఎందుకు త్యజిస్తాను ?

**నమస్కుర్వన్ వృందావనమహహ నమ్య స్త్రిజగతామ్**
**న సత్కుర్వన్ వృందావనమహహ దమ్య స్త్రిజగతామ్**
**గురుం కుర్వన్ వృందావనమఖిల దేవాదిక గురుః**
**లఘుం కుర్వన్ వృందావనమపి తృణం కోఽప్యతిలఘుః 17**

ఓహో! బృందావనమునకు నమస్కరించు వ్యక్తి మూడు లోకముల చేతను నమస్కరింపదగినవాడు! బృందావనమును గౌరవింపనివాడు మూడులోకముల చేత దండింపబడవలసినవాడు. బృందావనమును గురువుగా స్వీకరించిన వ్యక్తి సమస్త దేవతలకును గురువుగ ఉండతగినవాడు. బృందావనము నందు అల్పబుద్ధికలవాడు తృణముకన్న అల్పుడు!

**నమన్ మౌలి వృందావిపిన దిశి సర్వోన్నతతమో**
**మనాక్ ప్రీతో వృందావనభువి సమస్తః ప్రియతమః**
**దదత్ కించిత్ వృందావన తనుభృతే సర్వభగవత్**
**విభూతేర్భాగీశో భవతి జగతాం తద్భృతి పరః 18**

శ్రీబృందావన దిశగా శిరసువంచి నమస్కరించినవాడు లోకములో సర్వోన్నతుడు ఔతాడు. శ్రీబృందావన భూమి పట్ల కొద్దిపాటి ప్రీతిని చూపిస్తే

అందరికి ప్రియతముడు ఔతాడు. శ్రీబృందావనములోని జీవికి కించిన్మాత్రమును దానము చేసినా భగవంతుని సమస్త విభూతులను తృప్తిపరచినవానిగ ఔతాడు!

శ్రీబృందావనము పట్ల గౌరవమును, ప్రీతిని, అచటి జీవులపై జాలిని చూపినంతమాత్రమున భగవంతుని సమస్త కళలను ఆరాధించినట్లు అగునట! అట్టి బృందావన మహిమ ఇట్టిది అని వర్ణించుట సాధ్యమా!

**వృందాటవ్యామభవ్యా విదధతి న కథం వాసమాత్రంచ నిత్యమ్**
**జ్ఞాత్వా సర్వత్ర మోక్షావధి న ఖలు సుఖం క్వాపి నైవాస్తిరమ్యః**
**అత్రత్యానంద సింధోర్మధుతర మహాసార మూర్తి కిశౌరౌ**
**నిత్యాన్యోన్యామచోరౌ స్వనికట మిలితే వంటతః స్వం రసౌఘమ్ 19**

బృందావనములో జన్మింపకపోయినను కేవలము బృందావనములో నిత్యము నివసించుట అనునది కూడ ఏల చేయలేకున్నాడు ? మోక్షపర్యంతము ఎక్కడ కూడ సుఖము లేదని, ఎక్కడను ఏ రమణీయ వస్తువు కూడ లేదని ఆతనికి తెలుసును! ఆనందమహాసాగర స్వరూపులైన శ్రీయుగళకిశోరులు నిత్యము ఒకరి మనసును మరొకరు దొంగిలిస్తూ ఈ బృందావనములో విరాజమానులైనారు. వారు తమకు సమీపములో ఉన్నవారికి తమ రసధారను దానం చేస్తున్నారు!

'కేవలము బృందావనములో నివసించిన చాలునే, శ్రీయుగళము రసధారలతో తడిపివేస్తారు! ఈ సత్యము తెలిసి కూడ శ్రీధామములో నివసింపలేని వ్యక్తికన్న దురదృష్టవంతుడు ఇంక ఎవరు ఉంటారు' అని శ్రీప్రబోధానందులు జీవాళిపై కరగిపోయి పలుకుచున్నారు.

**శ్రీవృందారణ్యావాసే భవసి దృఢతరా చేత్వమాసే తదాసే**
**నిశ్చింతోఽహం శయానః కిమపి న గణయే దుఃఖమస్మిన్ సుఖం వా**
**సంతాపం నేతి చేతః కథమపి న కిమప్యస్తి సత్కర్మమాత్రమ్**
**నో వా పాపాన్నివృత్తిర్నచ హరిచరణాంభోజ భక్తిచ్ఛటేతి 20**

హే ఆశా! బృందావనములో నివసించాలి అని నీవు దృఢముగ అనుకుంటే నేను నిశ్చింతుడినై నిద్రిస్తాను. (బృందానివాసమునకు) ఎదురగు దుఃఖమునుకాని, సుఖమునుకాని లెక్కచేయను. మనసు ఏవిధమైన సంతాపమును పొందుట లేదు. లేశమాత్రపు సత్కర్మను కూడ నేను చేయలేదు. నా పాపములకు నివృత్తిలేదు. శ్రీహరి చరణకమలముల పట్ల భక్తి రేఖా మాత్రముగ కూడలేదు.

ఇన్ని అవలక్షణములున్నను బృందావనములో నివసింపవలెనను ఆశ మాత్రము దృఢముగ ఉన్నది. కనుక శ్రీబృందావన కృపను ఆతడు తప్పక పొందగలడు!

**శ్రీవృందారణ్యమన్యే తవ రజసి లుఠచ్ఛాది దేహం చ ధన్యమ్**
**నాన్యత్రాఢ్యం చతుర్భిః శృతి ముఖరమృఖైః శ్రీభుజైర్వాతృణాయ**
**ధన్యాసౌ యా వరాకీ త్వయి వసతి శునీ నాహమన్యత్ర మన్యే**
**లక్ష్మీ హస్తావలంబ ప్రణయ వరవధూప్యతధూతాత్మ తత్వామ్ 21**

హే బృందావనమా! దేహమును నీ రజమునందు దొరలించి, ఒడలంతయు ఆ రజముతో నిండిపోయినవాడు ధన్యుడు! కాని, ఇతరత్ర నాలుగు ముఖములను, అనేకబాహువులను కలిగి వేద పఠనము చేయువాడైనను ఆతనిని తృణముతో సమానముగ కూడ చూడను. నీ ధామములో నివసించు దయకు అర్హమైన శునకమైనను ధన్యగా భావిస్తాను. కాని, ఆత్మతత్వసంపదను అరచేతిలో పట్టుకున్న శ్రేష్ఠ స్త్రీ అయినను ఆమె అన్యత్ర నివసించినచో ధన్యాత్మగా భావించను.

బృందావనములో తప్ప, ఇతరత్ర నివసించువారు ఎంత గొప్పవారైనను తృణసమానులు కూడ కారట! బృందారజముతో నిండిపోయి, ఆ పవిత్రధామములో నివసించువారే మహాత్ముల దృష్టిలో ధన్యులు!

**యత్ర శ్రీకృష్ణచంద్రే స్మితరుచి రుచిరే చక్షురాధాయ రాధా**
**వక్త్రేందౌ మందమందం రణయతి మురలీముల్లసత్ రోమహర్షే**
**వైకుంఠే ధ్యానలీనాఽఖిల కరణగణ స్తత్ప్రభుః కామమూర్ఛా**
**సంప్రాప శ్రీర్విషాదీ స ముదమణుమపి ప్రాప తత్రత్యలోకః 22**

శ్రీబృందావనములో మృదుమధుర మందహాస కాంతితో, పులకితుడై, మనోహరముగ నున్న శ్రీకృష్ణచంద్రుడు శ్రీరాధాముఖచంద్రునిపై దృష్టిని నిలిపినాడు. ఆతడు భావవశుడై, మందమందముగ మురళిని మ్రోగించుచుండ, వైకుంఠములో ధ్యానమగ్నుడైయున్న శ్రీమన్నారాయణుని ధ్యానము చెదరినది. ఆయన ఆ మాధుర్యమునకు ప్రేమతో మూర్ఛితుడైనాడు. లక్ష్మీదేవి కూడ అస్థిరత్వమును పొందినది. అచటనున్న వారందరును వివశులైనారు.

**రాధా చేన్ముఖమున్నమత్య కురుతే మందస్మితం కిం తదా**
**పూర్ణేందోరుదయేన కైరవవనైః కిం వా ప్రఫుల్లైరిహ**
**సాచేదాత్తసఖీకరం ఘనతరం కుంజం దిదృక్షాచ్ఛలాత్**
**యాయాత్తర్హి హరేర మే రసమయీ వృందావనే శర్వరీ 23**

రాధాజీ సఖి కరమును ఆలంబనముగాగొని, ఘనమైన కుంజవనమును చూడగోరి చిరునవ్వుతో ముఖమును పైకెత్తినచో పూర్ణచంద్రుడు ఉదయించినను ప్రయోజనములేదు, వికసించిన కుముదవనముల ఆవశ్యకత కూడ లేదు. అపుడు రసమయమైన బృందావనములో పగటి సమయములోనే రాత్రి ఏర్పడినట్లు అగును!

శ్రీరాధాముఖచంద్రుడే పూర్ణచంద్రుడు, ఆ దేవి మధురమందహాసమే వికసిత కుముదవనము! బృందావనములో రాత్రింబవళ్లు శ్రీరాధా దివ్యకాంతితోనే వెలుగుతూ ఉంటాయి.

**కాలిందీయ ప్రచుర లహరీ దోలిత స్వర్ణపద్మి**
**న్యుత్ఫుల్లాబ్జే ధయతి విధుతేఽ ప్యేష భృంగోమధూని**
**కిం త్వం రాధే హససి మధుపః కిం ను వృందావనేఽ స్మిన్**
**మధ్వాదాతుం కిమపి రచయేన్నైవ ధార్ష్ట్యం పరోఽ పి 24**

యమునా నదీ తరంగాలలో ఊగుచున్న స్వర్ణకమలములపై వాలి భ్రమరము మధువును ఆస్వాదిస్తున్నది. హేరాధా! ఈ బృందావనములోని మధుపము (శ్రీకృష్ణుడు) మధువునుగ్రోలుచు, ఇతర స్త్రీల యందు ధార్ష్ట్యము (చిలిపితనము)ను చూపుటలేదా! నీవు నవ్వుచుంటివేల ? (అని సఖి రాధాజీని అడుగుచున్నది).

సఖి శ్రీకృష్ణుడు దక్షిణ నాయకుడని పలుకుచున్నది.

**శ్రీకాలింద్యా విపుల పులినే ఖంజరీటం నిరీక్ష్య**
**శ్రీరాధే త్వజ్జఘన పులినం వష్టి దృక్ ఖంజనో మే**
**శ్రీమత్కృష్ణ భ్రమర నికరే సీధుపే పద్మినీనామ్**
**వృందారణ్యే తవ సువదనాబ్జాసవే లాలసోఽ హమ్ 25**

హేరాధా! శ్రీయమునా నదీ తీరములలో ఖంజన పక్షులను చూచి, నీ జఘన తీరమును నా కన్నులు అనెడు ఖంజనములు చూడవలెనని కోరుకుంటున్నాయి. శ్రీబృందావనములో సుందరమైన కృష్ణవర్ణభ్రమరములు పద్మములలోని మధువును ఆస్వాదించుటను చూచి, నేను కూడ నీ సుందర ముఖ కమల సుధను ఆస్వాదింపవలెనను లాలసతో ఉన్నాను.

శ్రీకృష్ణుడు ఇట్లు శ్రీబృందావనములోని రసార్ద్ర సౌందర్యమును శ్రీరాధా రసమయ సౌందర్యముతో పోల్చుచు, తన అభిలాషను ప్రకటించినాడు.

**నవనవ వృందావన వరకుంజే మదకల గుంజన్మధుకర పుంజే**
**విహరతి రాధా కుసుమ విచిత్రా మధుపతి నాత్యున్మదన చరిత్రా 26**

శ్రీబృందావన నవీన శ్రేష్ఠ కుంజలలో భ్రమరములు మత్తిల్లి గుంజారవము చేస్తున్నాయి. అతిశయించిన ఉన్మత్తతతో రాధాజీ కూడ పుష్పముల విచిత్రమైన అలంకరణతో మధుపతియైన శ్రీకృష్ణునితో కలసి విహరిస్తున్నది.

**కథమిహ వృందావనభువి మందా న వసత వృందారక గణవంద్యాః**
**ఇహ హి పులిందా అపి మునివృందార్చిత మహివృందా హరిరసవృందాః27**

ఓ మందభాగ్యుడా! దేవతలచే స్తుతింపబడుచుండు శ్రీబృందావనములో నీవు ఏల నివసించుటలేదు ? ఇచట హరిరసపూర్ణమైన ఉత్సవములను చేయు సామాన్యజనులు కూడ మహర్షులచే పూజింపబడుతూ ఉంటారు.

**.............................................................**
**వృందావన భువమత్రా వతి రతి చిత్రా ...................... 28**

**యదధి హరే రతి మధుర చరిత్రం పరమ విచిత్రం పరమ పవిత్రమ్**
**తదపి న వృందావనమపి మాన్యాః ప్రకటమవన్యాం వివిదురధన్యాః 29**

శ్రీహరి యొక్క పరమ విచిత్ర, పరమ పవిత్ర, అతి మధుర చరిత్ర భూమిపై విరాజమానమై ఉన్నది. అట్టి బృందావనమును గూర్చి మహనీయులైనను ఎరుగకున్నచో అతనికన్నను అదృష్టహీనుడు ఉండడు!

**పరమ హరిరసేన సంప్రలోభ్య త్వమపజహార్థ మమేహ లోకధర్మమ్**
**అహహ రసలవం న దేహి వృందావన తనుషే కిమహో మృషైవ మోహమ్ 30**

హే బృందావనమా! నీవు పరమమైన హరిరసము నందు నాకు ప్రలోభాన్ని కలిగించి, ఈ లౌకిక ధర్మములను త్యజింపజేశావు. హా! ఇప్పుడు లేశ మాత్రము కూడ రసదానము చేయుట లేదు. ఓహో! మరి ఎందుకని నన్ను మిథ్యా మోహములో పడవేస్తున్నావు ?

హరిప్రేమరసమును ఎంత ఆస్వాదిస్తున్నా, ఇంకా ఇంకా లోభం కలుగుతూనే ఉంటుంది. అటువంటి అతృప్తి ఇక్కడ ప్రకటితం ఔతున్నది.

**ద్రుతనవ కనకేంద్రనీలరోచిర్ద్వయం వియక్ కథమప్యహో కిశోరమ్**
**మిథునమతి రసాంధమస్తి వృందావన భువి తత్ పదసేవనే స్పృహా మే 31**

ఓహో! కరగించిన బంగారము వంటి కాంతితోను, నీలమణి కాంతితోను కూడి; నిత్యసంయోగస్థితిలో కన్నులు మూతలుపడిన శ్రీయుగళము శ్రీబృందావన భూమిపై విరాజమానులైనారు. వారి శ్రీచరణ కమలములకు సేవ చేయుటయే నా లాలస!

**ప్రకృతిపర వికుంఠధామ దూరతరమిదమాద్యరసాద్భుతం రహస్యమ్**
**ఇహ నిజకృపయావిరస్తి వృందావనమిదమావసతః సతః ప్రపద్యే 32**

మాయా ప్రకృతికి ఆవల వైకుంఠధామము ఉన్నది. దానికి కూడ మిక్కిలి దూరములో శృంగార (ఆద్య) రసమునకు అద్భుత రహస్యస్వరూపమైన శ్రీబృందావనము ఉన్నది. ఆధామము కృపతో భూమిపై ఆవిర్భవించినది. అచట నివసిస్తున్న సత్పురుషులను శరణు వేడుతున్నాను!

**హతహృదయ! నిమజ్య హంత వృందా**
**వనభువి నిర్మల చిద్రసామృతాబ్ధౌ**
**విషయ విషదురాశయాఽనయా త్వమ్**
**కమితి మృషైవ తనోషి దుఃఖ సింధుమ్ 33**

ఓ అభాగ్యుడా! హా! బృందావన నిర్మల చిద్రసామృత సాగరములో ఓలలాడుతూ కూడ, విషయ విషముతో నిండినదురాశతో దుఃఖసముద్రములో అబద్ధపు తృప్తిని ఎందుకు పొందాలనుకుంటున్నావు ?

భాగ్యవశాత్తు బృందావనములో నివసిస్తూ కూడ; అసత్యమైన, అశాశ్వతమైన విషయాదులలో కూరుకొనిపోతున్న కొందరు జీవుల దుస్థితిని చూచి శ్రీప్రబోధానందులు వేదన చెందారు. కరుణతో అట్టివారికి వారు హితబోధ చేస్తున్నారు.

**శ్రీరాధా చరణారవింద మధురప్రేమాత్మక ప్రస్ఫుర**
**చ్చిజ్జ్యోతిర్ఘన గౌర దివ్య నవకైశోరాకృతిర్మోహినీ**
**తన్వంగీ సుకృశోదరీ రుచిర వక్షోజద్వయాల్యోద్గమా**
**నవ్యాముజ్జ్వల శాటికాం కటితటే నవ్యేపృథౌ విభ్రతీ** **34**

శ్రీరాధాజీ కమలముల వంటి చరణములతోను, మధుర ప్రేమాత్మక చిజ్జ్యోతి వంటి దివ్యనవకైశోరాకృతితోను వెలుగుచున్నది. ఆ దేవి మోహినీ స్వరూపిణి, కృశాంగి, కృశోదరి! మనోజ్ఞమైన వక్షస్థలము అనెడి సఖిచేత ఆలింగిత అయినది. విశాలమైన కటి స్థలిపై నవ్యమైన, ఉజ్వలమైన వస్త్రమును ధరించినది.

అత్యంత ఉజ్వలమైన శ్రీరాధా సాకార స్వరూపమును ఇట వర్ణించినారు. చిజ్జ్యోతి స్వరూపిణి అనుటచే నిరాకార కాంతి కూడ వర్ణితమైనది.

**శ్రీమన్నాభిగనీవిడోర కమణీమంగోల్లసత్కంచనా**
**హారాలీం పదకం చ నూతనకుచద్వంద్వే వలత్కంచుకే**
**విభ్రాణా మణినూపురౌ చరణయోః శ్రోణీతటే మేఖలామ్**
**నూత్నద్విస్తబకేవ హేమలతికా దిగ్వ్యాపి దివ్యచ్ఛవిః** **35**

ఆమె నాభిస్థానమును చుట్టియున్న నీవీ బంధనమునకు గల పట్టుతాడులో మణుల గుచ్ఛము వేలాడుచున్నది. కంచుకము చేత ఆచ్ఛాదితమైన నూతన వక్షస్థలముపై హారములు, పతకములు శోభిస్తున్నవి. ఆమె తన శ్రీచరణములకు మణినూపురములను, కటిస్థలిపై వడ్డాణమును ధరించినది. దిశల పర్యంతము వ్యాపించిన దివ్య నవీన దేహకాంతితో స్వర్ణలతవలె రాధాజీ వెలుగుతున్నది.

ఈ శ్లోకములో కూడ శ్రీసరస్వతీపాదులు శ్రీరాధా అద్భుత సాకార సౌందర్యముతోపాటు, అతీతమైన ఆ నిరాకార తేజో వైభవమును కూడ వర్ణించినారు.

**గ్రైవేయం గలశోభిరత్నఖచితం సౌవర్ణతాటంకమా**
**వీతం మౌక్తిక పంక్తిభిః శృతియుగే చిత్రాం మణీచిత్రకామ్**
**శ్రీనాసాపుట ఉజ్జ్వలం కనకమణ్యాబద్ధ ముక్తాఫలమ్**
**శోభాధామ దధాత్యథో కుసుమయుగ్వేణ్యగ్ర లంబాంబుజమ్ 36**

ఆమె (రాధాజీ) మెడలో రత్నజటితమైన కంఠాభరణము శోభిస్తున్నది. చెవులకు ముత్యాలతో కూర్చిన స్వర్ణతాటంకములును ధరించినది. అతివిచిత్రమైన మణిమయ భూషణములతో ఆదేవి అలంకృత అయినది. సుందరమైన నాసికపై ఉజ్వలమైన, కనకమణి జటితమైన ముత్యము లటకని (గుత్తి) వలె శోభిస్తున్నది. ఇట్లు ఆమె వర్ణనాతీతమైన శోభతో వెలుగుచున్నది.

**యస్త్వీదృక్ వృషభానుజాదయిత దాస్యాత్మ స్ఫురన్నంతరే**
**రాధాకృష్ణ మహానురాగ విభవానందేన మాద్యన్ముహుః**
**హాసం హాసమశేషతో వ్యవహృతీరుచ్చావచా వర్తయన్**
**నాశక్యాభిరతోఽఖిలాంగ పులకః శశ్వత్ స్వనాథ స్మితే 37**

ఈ విధముగ భానుజకు ప్రియతముడైన శ్యామసుందరుని పట్ల దాస్యభావ స్ఫూర్తిని అంతర్యములో పొందిన వ్యక్తి శ్రీరాధాకృష్ణుల మహానురాగ సంపద వలన మహానందముతో పొంగిపోతాడు. అతడు ప్రతిక్షణము ఉన్మత్తుడై ఉంటాడు. తనకు ఎదురగుచుండు చిన్నవి కాని, పెద్దవి కాని వ్యావహారిక విషయముల పట్ల నవ్వుతూ, నవ్వుతూ మృదువుగా ప్రవర్తిస్తాడు. శ్రీరాధాకృష్ణుల మృదు మందహాసము స్ఫురింపగనే ఆతని సర్వాంగములు పులకితములై అశక్తుడౌతాడు.

శ్రీసరస్వతీపాదులు శ్రీశ్యామసుందరుని స్మరణతో సఖీభావమును పొంది పులకితులైనారు.

**స్వే సాధౌ మిలితే శ్రుణోతి కథయత్యాత్మేశ యోర్మాధురీమ్**
**శ్రీవృందావనమావసేన్మమ సమారాధ్యః స సర్వాత్మనా**
**సద్బంధుః పరమః స మే పదగురుః సర్వస్వ భూతః స మే**
**తత్పాదే నిపతామి దండవదహం సర్వాభిమానోంగితః 38**

సజాతీయ సాధుజనులతో కలసి ప్రాణేశులైన శ్రీయుగళ మాధుర్యాన్ని గురించి వింటూ, వర్ణిస్తూ, ఆత్మార్పణము చేసికొని బృందావనములో నివసించు వ్యక్తియే నాకు ఆరాధింపతగినవాడు! అతడే పరమ సద్బంధువు, పరమగురువు, సర్వస్వమైనవాడు. నా స్వాభిమానమునంతటిని వదలివేసి, ఆతని చరణ కమలములకు సాష్టాంగ ప్రణామం చేస్తున్నాను.

**రాధాకృష్ణ పదాంబుజే దృఢరతిస్తత్కేలి కుంజోజ్జ్వలమ్**
**యోవృందావనమావసేచ్చ పరమాభేద్యః స్వసంకల్పతః**
**తస్యాహం యది యస్య కస్య చిదపిత్యక్త్వాభిమానావలిః**
**ధాస్యే పాదరజాంసి మూర్ధ్ని భవితాస్మ్యాత్మేష్ట యోగ్యస్తదా 39**

శ్రీరాధాకృష్ణుల చరణ కమలములపై దృఢ ప్రీతిని కలిగి ఉండాలి. తన సంకల్పము నుండి లేశమాత్రము కూడ చలింపక, శ్రీరాధాకృష్ణుల కేళీకుంజలతో ఉజ్వలముగ ప్రకాశిస్తున్న శ్రీబృందావనములో నివసించాలి! అట్టి వ్యక్తి ఎవ్వరైనను కాని, నా స్వాభిమానమును వదలి, ఆతని పదరజమును శిరసుపై ధరిస్తాను. అప్పుడే నేను నా ప్రియతమ యుగళ కిశోరుల సేవకు యోగ్యతను పొందుతాను.

**శ్రీమద్రాధాం సురతసమర శ్రాంతి భాజం ప్రియస్య**
**సుప్తాం వక్షస్థల స వపుషం సేవతే ప్రేమమగ్నా**
**యా కాచిత్తాం య ఇహ మనుతే స్వాత్మభావేన ధన్యః**
**పరోక్షేణాప్యయమతిహతోపీంద్రియైః స్యాత్ కృతార్థః 40**

శృంగారకేళిలో అలసిపోయిన శ్రీరాధ ప్రియతముని వక్షస్థలముపై పరుండి నిద్రించినది. ఒక సఖి ప్రేమమగ్నయై దేవికి సేవ చేయసాగినది. ఎవరైనను ఈ సఖిని పరోక్షభావముతో తన మనసులో భావింపగలిగినచో అతడు ఇంద్రియములచే పరాజితుడైనను కృతార్థుడే! ఇందులో సందేహము లేదు.

**త్వయి రచయతి రాధికాఽవనాశా**
**మతిభయ మేత్య పలాయి తవ మాయా**
**హత హృదయ! కుతోన్విదం తవాగాత్**
**వికృతిశతం గగన ప్రసూన కల్పమ్ 41**

"నిన్ను రక్షిస్తాను" అని రాధాజీ సాంత్వన కలిగించినంతనే మాయ భయభీతమై పారిపోయింది. ఓ హత హృదయమా! గగన కుసుమములవంటి (అసాధ్యములైన) నీ వందల వికారములన్ని ఏమైపోయినవి ?

రాధాజీ రక్షణ ఉన్నచోట మాయకు స్థానము లేదు.

**కాంతే మన్మతిహృత సుమంజుల కుచాద్యుచ్ఛ్రీరియం సేవ్యతామ్**
**సైవ త్వం యది సుప్రసీదసి మమప్రీతిః పరాగమ్యతామ్**
**తత్ కుంజం నిమిషం త్వయా తు న వినా జీవామ్యహో వ్యాహృతీ**
**వృందాటవ్యనుగా ఇతి స్మర కథాః శ్రీరాధికా కృష్ణయోః 42**

"హే ప్రియా! నా మనసును హరించిన నీ మనోహరవక్షస్థల ఔన్నత్యము సేవింపబడునుగాక! నీవు ప్రసన్నురాలివి అయితే నేను ఈ సేవను పొంది, పరమ ప్రీతిని పొందుతాను. ఓ ప్రియతమా! నీవు ఈ కుంజను వదలి వెళ్లిపోతే నేను ఒక్క నిమిషము కూడ జీవింపలేను."

శ్రీబృందావనములో శ్రీరాధాకృష్ణులకు సంబంధించిన ఇట్టి లీలా గాథలను స్మరింపుము!

శ్రీప్రబోధానందులు శ్రీబృందావనములో తాము దర్శించిన శ్రీయుగళ దివ్యరసలీలలను చింతించుచు; ఆ చింతనానందమును మనకు ప్రసాదిస్తున్నారు.

**అహో వృందారణ్యే మదనమద సింధుర్మమ సుదు**
**ర్ధరోద్వేలో హాసాదపి రతిషు వామ్యం న సహతే**
**గృహీత్వాతః పాదౌ మృగయతి హరిః సంతు పరతః**
**సుఖం సఖ్యస్త్వం మాం రహసి రమయాభంగ రతిభిః 43**

"అహో! శ్రీబృందావనములో నాయందు అతిశయించిన అనంగ సాగరము ఎగసిపడుతున్నది. ప్రేమ విషయములో పరిహాసమునకు కూడ నటన వద్దు, వామతాభావమును (ఇష్టము లేనట్లు ప్రకటించుభావము) సహింపలేను. సఖీ బృందము అన్యప్రదేశములో ఉన్నారు. అందువలన నీవు ఇప్పుడే ఈ నిర్జన ప్రదేశములో అభంగముగ ప్రేమదానమును అనుగ్రహింపుము" –

శ్రీకృష్ణుడు శ్రీరాధా చరణములను పట్టుకొని ఈ విధముగ ప్రేమ భిక్షను అర్థించినాడు.

**కదాచిచ్ఛ్రీ వృందావన ఉదిత తీవ్రోన్మదరసౌ**
**కృతౌ కామపూర్త్యావహలరతిఖేలాభిరపి తౌ**
**నిజేచ్ఛాతోఽనంతోదిత వరతనూ తన్నవలతా**
**గృహేఽనంతేఽనంత స్మరరసవిలాసౌ వ్యహరతామ్ 44**

శ్రీయుగళము ఒకనాడు ప్రేమక్రీడకు మిక్కిలివశులై శ్రీబృందావనములో తీవ్ర ఉన్మద రసాకృతిని దాల్చినారు. ఇంకను, నూతన లతాగృహములో అనంత భావములతో శోభిస్తూ, నిజేచ్ఛా స్వరూపులై అనంతప్రేమరసవిలాసముతో వారు అనంత విహారమును చేసినారు.

శ్రీయుగళ స్వరూపము అనంతము! వారు ప్రకటించు దివ్యరసలీల అనంతము! వారి నికుంజ విహారము అనంతము!

**యదా రాధాకృష్ణౌ ప్రబలరసతృష్ణౌ ద్వయతయా**
**న పూర్ణమవానంత్యం నిజమవృణుతా మన్యగమపి**
**తదైవ శ్రీవృందావన ఉరుమదోచ్ఛృంఖల మనో**
**భవాఖేలే ఖేలారసమతనుతాం రాసవలయే** **45**

ప్రబలమైన రసతృష్ణతో ఉన్న శ్రీరాధాకృష్ణులు తమ రెండురూపములతో క్రీడించినారు. అయినను తృష్ణ తీరక, అన్యములైన అనేక రూపములను ప్రకటించి, తమ పరికరములను కూడ అనేక మూర్తులుగా ప్రకటితము చేసినారు. అప్పుడు వారు శ్రీబృందావనములో తమ ఆశయమునకు వశులై, ఎల్లలు లేని ప్రేమరంగస్థలియైన రాసమండలములో క్రీడారసమును విస్తరింపజేసినారు.

కనుక; రాసలీలలో నాయిక, నాయకుడు, వేదిక, క్రీడ, పరికరములు అన్నియు రసమే అని ఫలితార్థము!

**అహో వృందారణ్యం మతిమతి జహారాఖిల మనో**
**హరస్యాప్యానందాంబుధిమపి రసోతృష్ణయతి తమ్**
**కిమిత్యేతద్వంశీ స్వపర సకలోన్మాదక రవా**
**వ్యభూన్ముగ్ధా తూష్ణీం యదధి పిక కీరాది విరుతైః** **46**

ఓహో! శ్రీబృందావనము సమస్త జనుల మనస్సులను హరించు వారి (శ్రీయుగళము యొక్క) మనసును కూడ పూర్తిగా హరిస్తుంది. ఆ ధామము ఆనంద సముద్రమునకు కూడ అత్యంత రసతృష్ణను కలిగిస్తుంది. అచటి కోయిలల, శుకపికాదుల కలకల ధ్వనులను విని; స్వపర భేదములేకుండ అందరినీ ఉన్మత్తులను చేయు మురళి కూడ విముగ్ధమై, మౌనము వహిస్తుంది!

**భజన్నుచ్చైరుచ్చైః ప్రతిముహురహో వృద్ధిమతులామ్**
**స్మరోన్మాదో రాధామురలిధరయోః కోऽపి సహజః**
**మహాసౌఖ్యాంభోధిః ప్రసరతి సఖీనాంచ పరమో**
**యదేష శ్రీవృందావన తవ మహానేష మహిమా 47**

ఓహో! శ్రీరాధామురళీధరుల అత్యున్నతమైన, సహజ ప్రేమోన్మాదము మాటిమాటికి వృద్ధి పొందుచున్నది. ఒకానొక అనిర్వచనీయ వస్తువు సఖియలను కూడ పరమమహాసుఖసాగరములో నిమగ్నమగునట్లు చేస్తున్నది. హే బృందావనమా! ఇది నీ మహిమయే!

అంటే నిరంతరము శ్రీరాధాకృష్ణుల అత్యున్నతరసస్థితిని ఆస్వాదిస్తూ సహజప్రేమోన్మత్తయై యుండు ఆ అనిర్వచనీయ వస్తువు బృందావనమే అని తాత్పర్యము!

**అయే రాధా పదాంబుజమహహ నారాధయతి చే**
**దతుష్టాయాం తస్యాం న ఖలు సులభస్తద్వశ హరిః**
**వినా వృందారణ్య శ్రయణమపి తస్యాః పదయుగమ్**
**సమారాద్ధుం శక్యం కథమపి చ నాన్యత్ర ప్రకటమ్ 48**

అహో! శ్రీరాధాపదకమలములను ఆరాధింపనివారిపట్ల శ్రీహరి అసంతుష్టుడు ఔతాడు. రాధావశవర్తియైన ఆయన అట్టివారికి లభింపడు. శ్రీబృందావనమును ఆశ్రయింపక శ్రీరాధా చరణ కమలములను చక్కగా ఆరాధించుట కూడ దుస్సాధ్యమే! ఏలనన ఆదేవి శ్రీచరణములు బృందావనములో తప్ప అన్యత్ర ప్రకటితం కావు!

కనుక; శ్రీరాధను, శ్రీకృష్ణుని, శ్రీబృందావనమును ఒకే రసతత్త్వ ప్రకాశముగ ఎరిగి ఆరాధింపవలెనని సారాంశము!

**అత్యానందాత్ వ్రజజన వధూబృంద ఆవిష్ట ఉచ్చైః**
**గీతం వాద్యం రచయతి చిరం లాస్యలీలాం విచిత్రామ్**
**వృందారణ్యే ధ్వనతి గగనే దుందుభౌ పుష్పవర్షే**
**రాధాకృష్ణావపి రసభరాన్నృత్యతో గాయతశ్చ 49**

అత్యంత ఆనంద, ఆవేశములతో వ్రజగోపికలు ఆడుచు, పాడుచు ఆనందించినారు. చాలసేపటివరకు విచిత్ర విధానరీతితో లాస్యలీలలను ప్రకటించినారు. శ్రీబృందావనములో ఆకాశమార్గములో దుందుభులు మ్రోగినవి. పూలవాన కురిసినది. శ్రీరాధాకృష్ణులు కూడ అచట రసభరితులై నృత్యగానములతో ఆనందించినారు.

**విపంచీ కించన్నధ్వనతి మురలీరౌతి న మనాక్**
**అగమ్యం చ ప్రోదంచయతి న పికః పంచమరవమ్**
**సఖీవృందం మౌన్యృజ్ఝతి ప్రణయగోష్ఠీమపి హరిః**
**యదా రాధా వృందావన గుణగణాన్ గాయతి ముదా 50**

శ్రీరాధ ఆనందముతో శ్రీబృందావనగుణగానమును చేయుట ఆరంభింపగనే రాధాజీ వీణయైన మధుమతి మౌనము వహించినది. మురళి కూడ ఒక్కసారిగ నిశ్శబ్దమైపోతుంది. కోకిల పంచమ స్వరములో ఆలపించుటను ఆపివేస్తుంది. సఖీబృందము మౌనము నాశ్రయిస్తారు. శ్రీహరి కూడ ప్రణయగోష్ఠిని ఆపివేస్తాడు.

శ్రీబృందావనము రాధాజీకి అత్యంత ప్రీతి పాత్రమైనది. అట్టి ధామమును ఆదేవి స్తుతిస్తూ గానం చేస్తుంటే సమస్త ప్రకృతి ఆ ప్రేమరసధారలో లీనమై నిశ్చేష్టితమగుటను శ్రీసరస్వతీపాదులు దర్శించారు. సాక్షాత్తు శ్రీకృష్ణచంద్రుడు కూడ విముగ్ధుడై చేష్టలుడిగి నిలచిపోతాడట! స్వయంగా రాధాజీయే స్తుతిస్తున్న బృందావన ప్రీతిరీతిని, మహిమను ఊహించటం, వర్ణించటం సాధ్యమా!

**వృందారణ్యే రాధికా మాధవశ్చ సంవర్ధేతే స్వైర్గుణైః స్పర్ధయేవ**
**ఆలీనాంచాపార సౌఖ్యోన్మదాబ్ధేరుచ్చైర్నిత్యవృద్ధిం స్మరామి 51**

బృందావనములో శ్రీరాధామాధవులు తమతమ గుణములతో పరస్పరము పోటీపడుచు, సమ్యక్ ప్రకారముగ వర్ధిల్లుచున్నారు. అట్లే సఖియల అపారసౌఖ్యరస ఉన్మాద సముద్రము కూడ క్షణక్షణమునకు పెరుగుతున్నది. అట్టి స్థితిని స్మరిస్తున్నాను.

**సర్వాశ్చర్యౌ రాధికాకృష్ణచంద్రౌ విశ్వస్యై వా జహ్రతుర్లీలా యాంఽతః**
**శ్రీమద్బృందాకాననే నైకయోరప్యాత్మా జహ్రే యేన కేనాపి చిత్రమ్ 52**

సర్వశ్రేష్ఠులైన శ్రీరాధాకృష్ణచంద్రులు తమ లీలతో సమస్తలోకముల అంతఃకరణమును అపహరిస్తున్నారు. కాని, శ్రీబృందావనము వారిరువురి ఆత్మను ఒకానొక సామాన్య వస్తువుతో హరిస్తున్నది. ఎంత చిత్రము!

రసస్వరూపులైన శ్రీయుగళము తమ లీలలతో అందరి మనస్సులను హరించుచుండ, శ్రీబృందావనము వారి ఏకాత్మను హరిస్తున్నదట! అట్టి బృందావనమును గూర్చి ఇంకేమి చెప్పగలము!

**కోటి ప్రాణైరేష నీరాజనీయః కాంతేత్యాకులాన్యోఽన్య వాగ్భిః**
**రాధాకృష్ణౌ మానయేతే యదీయం కంచిత్‌భావం నౌమి వృందాటవీమ్ తామ్53**

"హే ప్రియా! శ్రీబృందావనము యొక్క భావము (అందలి వస్తువులు, లీలలు, విభూతులు మొ॥ వానికి) కోటి ప్రాణములతో హారతి నిచ్చుటకు యోగ్యమైనది"! "ప్రియతమా! ఆ భావము కోటి ప్రాణములతో నీరాజన మీయతగినది" – ఈ ప్రకారముగా శ్రీరాధాకృష్ణులు ప్రేమపూర్ణమైన మాటలతో బృందావనమును గౌరవించుచుందురు. అట్టి శ్రీధామమునకు నమస్కరిస్తున్నాను.

**త్యక్త్వా ధర్మచార్థ కామౌ విముక్తిమైశీం భక్తిం వాఽథ తత్సాధనాని**
**రాధాకృష్ణౌ సేవితుం కేఽపి ధన్యా వృందారణ్యావాసమా మృత్యుకుర్యుః54**

ఎవరు ధర్మార్థకామ మోక్షములను, ఈశ్వర భక్తిని, అనేక సాధనలను త్యజించి; శ్రీరాధాకృష్ణులను సేవించుటకు మృత్యుపర్యంతము బృందావనములో నివసింతురో వారే ధన్యులు!

**రాధాకృష్ణావిహో భగవతో రూప సారైక తత్త్వే**
**తద్ధామ స్వద్భుత రహ ఇదం శ్రీలవృందావనాఖ్యమ్**
**ఆస్తాం వార్తాత్విహధృతవతీ తారతమ్యం మమాన్యా**
**స్వాద్య ప్రేమోత్సవ రస చమత్కారణీ స్యాత్ పరం ధీః 55**

శ్రీరాధాకృష్ణులు భగవత్స్వరూపసారమైన ముఖ్యతత్త్వము! శ్రీబృందావన నామకమైన వారి ధామము కూడ అత్యద్భుతమైన రహస్యవస్తువు! తారతమ్యము అనే ఈ మాట అటుండనీ! నా బుద్ధికి మాత్రము ఆస్వాదింపతగిన ప్రేమోత్సవ రసము వలననే చమత్కారము కలుగుతుంది.

శ్రీరాధాకృష్ణులు బృందావన ధామములో ప్రకటిస్తున్న ప్రేమోత్సవ లీలలే రసాస్వాదనమునకు ఆధారమని ఇట స్పష్టం చేస్తున్నారు. అనగా వస్తువివేచన చేయటం కోసం రాధాకృష్ణులు, ధామము, సఖియలు అంటున్నప్పటికీ ఉన్నది రసమే అనియు; ఆ రసానందానుభూతియే పరమావధి అనియు శ్రీప్రబోధానందులు తెలియజేస్తున్నారు.

**కామం వాసో భవతు నరకే చేన్మహానందకందైః**
**శ్రీమద్బృందావన గుణగణైః పూర్యతే కర్ణరంధ్రః**
**గీయంతే వా స్మృతిపథమథో యాంతి వా నాన్యథా మే**
**శ్రీవైకుంఠేఽప్యహహ రుచిదం శ్రీశితుః ప్రేథదాస్యమ్ 56**

మహానందమునకు మూలమైన శ్రీబృందావనగుణమణులతో నా చెవులు పూరింపబడినచో (వినగలిగితే) నరకములో ఉండుటకైన సిద్ధమే! సమస్తములైన శ్రీధామ గుణములను గానము చేయుదునుగాక! ఆ స్మృతి నిలచియుండును గాక! హా! ఇది తప్పు; శ్రీవైకుంఠము నందు శ్రీనారాయణుని ప్రియదాస్యము కూడ నాకు రుచింపదు.

**ప్రేమ్ణాయత్ర శనైః శనైః సుకుసుమాన్యాచిన్వతీ రాధికా**
**దాసీః శిక్షయతే జహాత్యలికులైరాక్రాంతశీధూన్యపి**
**నోపేక్షామతి రూపగంధ విభవాభావేఽ_ప్యహో తన్వతీ**
**తద్బృందావనమేకమాద్య ప్రణయానందాయ వందామహే 57**

భ్రమరములు మధువును స్వీకరించిన ఉత్తమమైన పూవులను మెలమెల్లగా సేకరించునట్లు శ్రీరాధాదాసీమణులకు శ్రీధామము శిక్షణనిస్తుంది. హా! అతిశయ రూపగంధాది సంపత్తి లేకపోయినను ఏ తరులతాదులను అది ఉపేక్షింపదు. అట్టి బృందావనమునకు కేవలము ఆద్య ప్రేమానందమును కోరుచు నమస్కరిస్తున్నాను.

శ్రీబృందావనము ఎంతటి మహనీయమైనది! అందు వికసించిన పూవులను సాక్షాత్తు రాధాజీ కోస్తుంది కదా! ఆ ధామము రాధాదాసీమణులకు శిక్షణ నిస్తుంది. అద్భుత రూప, గంధాదులను ఎంచక; అచట వృక్ష లతాదులనన్నిటినీ శ్రీధామము సమానముగా ఆదరిస్తుంది.

**శ్రీవృందావన పారిజాత విటపిచ్ఛాయా మణీమండపే**
**రత్నప్రోజ్జ్వల కుట్టిమే కుసుమ సద్గుచ్ఛైస్తదుల్లోచినీ**
**ఆసీనం సహ రాధయా సుమిలితం తత్తూల పట్టాసనే**
**పుష్పాఢ్యే మహితాః సఖీర్వన కథాః పృచ్ఛంతమీక్షే హరిమ్ 58**

శ్రీబృందావనములో, పారిజాత వృక్షఛాయలో మణిమండపమునందు రత్నజటితమైన ఒక ఉజ్వల ప్రదేశము ఉన్నది. అచట సుందర పుష్పములతో నిర్మితమై కాంతులీనుచున్న గద్దెపై శ్రీకృష్ణుడు రాధాసహితముగ ఆశీనుడైనాడు. అతడు సఖియలను మహితమైన వనకథలను గూర్చి అడుగసాగినాడు. అట్టి హరిని దర్శించు!

**స్వాద్య ప్రేమ మహారసాత్మక బహిర్నోవాంతరా భాతిచేత్**
**శ్రీవృందావిపినం తదా స్ఫురతి నో రాధాఽథ తన్నాగరః**
**అస్ఫూర్తౌ చ తయోర్విశుద్ధ రసచిన్మూర్త్యోః కథం కోటిభిః**
**యత్నైరప్యనురాగ సౌఖ్యజలధిః సారాతి కాష్ఠోదయః 59**

ఆస్వాద్య ప్రేమరసాత్మకమైన శ్రీబృందావనము బాహ్యాంతరాళాలలో స్ఫురింపకపోతే శ్రీరాధ, ఆమె నాగరుడైన శ్రీకృష్ణుడు కూడ స్ఫురించుట జరుగదు. విశుద్ధరస చిన్మూర్తులైన యుగళకిశోరులు లోలోన ప్రకాశింపకపోతే, కోటి అన్యప్రయత్నాలతోనైన అనురాగ సౌఖ్యసాగరమునకు సారాతి సారమైన ప్రేమ ఉదయిస్తుందా ? ఉదయింపదు!

ఆనందసాగరమునకు సారాతిసారమైన "ప్రేమ" రుచిని ఆస్వాదించవలెనన్న శ్రీబృందావనము, శ్రీరాధాకృష్ణుల అనుగ్రహము వలన మాత్రమే సాధ్యం ఔతుంది. ఎందుకంటె వారి స్వరూపమే కదా ఆ ప్రేమ!

**దివ్యస్రక్ గంధ భూషాదిభిరతి లసితౌ దివ్యతాంబూలవల్లీ**
**మాలీభిర్భోజ్యమానౌ కిమపి నవ వనం ప్రేక్షితుం గీతవాద్యైః**
**రాధాకృష్ణౌ యదాస్తః పరమకుతుకినో తర్హి తద్వక్త్రచంద్ర**
**సంక్రాంతే స్వచ్ఛదీప్తే స్థలజల సకలేఽద్యేమి వృందావన శ్రీః 60**

శ్రీరాధాకృష్ణులు దివ్యమాల, గంధ, భూషాదులతో సుసజ్జితులై; సఖియలు అందించిన తాంబూలమును చర్వణము చేస్తున్నారు. వారు ఆడుచు, పాడుచు

ఒకానొక నూతన వనమును చూచుటకు అత్యంత కుతూహలమును పొందినారు. అప్పుడు జలపూర్ణ స్థలముల స్వచ్ఛకాంతిలో వారి ముఖ చంద్రకాంతి ప్రతిబింబించినది. అట్టి బృందావనమును స్మరిస్తున్నాను.

**రే కామక్రోధలోభాదయ ఇహ సుహృదో మే భవంతో భవంతు**
**త్యజ్యానాదేహపాతం సతతమతి సమాలింగయమానందయంతు**
**చేష్టాభిస్స్వైన్నిజాభిః కథమపి పరమం బంధమాపాద్య వృందా**
**రణ్యే ధన్యేన కేనాప్యతివిరలతమేనాశ్రితే మామ వస్తు 61**

ఓ కామక్రోధలోభాది గుణములారా! బృందావనములో మీరందరు నా బంధువులుగ ఉండండి! నేను నా శరీరాన్ని త్యజించువరకు మిమ్ము వదలను. నిరంతరం దృఢముగ కౌగిలించుకొని నాకు ఆనందాన్ని ఇవ్వండి. మీ చేష్టలతో ఏదో ఒక విధముగ నన్ను బంధించినను ఒకానొక అరుదైన మహాత్ముని ఆశ్రయించి, ఈ బృందావనములోనే రక్షణను పొందుతాను.

కామక్రోధాది గుణములు ఎంత బాధిస్తున్నా, బృందావనములోని రసికమహాత్ముని ఆశ్రయిస్తే అతడు రక్షింపబడుతాడు అని భావము!

**నవైః కుసుమ పల్లవైర్నవ విచిత్రవేషం దధన్**
**నవం వసనభూషణం నవసమాగమ ప్రక్రియమ్**
**అహో నవ మహోద్వయం నవ హరిన్మణీ హేమరుక్**
**నవ స్మర రసాకులం స్మర సర్వర్తు వృందావనే 62**

శ్రీరాధాకృష్ణులు నవ కుసుమములతో, పల్లవములతో నూతన వేషమును వహించి; నవసమాగమమునకై నూతన వస్త్రములను, ఆభరణములను ధరించినారు. ఓహో! ఒక్కసారిగా సమస్త ఋతువులతోను శ్రీబృందావనము

శోభాపూర్ణమైనది. అట నవనీలమణి కాంతితోను, నవ స్వర్ణకాంతితోను, నవ స్మరరసముతోను కూడి వేగిరపాటుతో ఉన్న నవయుగళ కిశోరులను స్మరింపుము!

శ్రీబృందావనము, అందలి సమస్త వస్తువులు నిత్య నూతనమైనవి. శ్రీరాధాగోవిందులు, వారి వేషధారణ, ఆభరణములు, స్మరకళ అన్నియును 'నవనవ' నిత్యత్వస్థితిలో వెలుగుచుండును.

**విచిత్ర మృగ పక్షిసంకుల విచిత్రతామోహితమ్**
**విచిత్ర రసరంజితో భజ విచిత్రకామోత్సవమ్**
**విచిత్ర మతిరాధికా రతి విచిత్రతామోహితమ్**
**విచిత్ర రసరంజితో భజ విచిత్రవేషం హరిమ్ 63**

విచిత్రమైన మృగములతోను, పక్షులతోను నిండి ఉన్న ఆ విచిత్రవనిలో విచిత్రమైన కామోత్సవ పూర్ణుడైన శ్రీహరిని విచిత్ర రస రంజితుడివై భజించు! శ్రీరాధిక విచిత్రమతి, ఆ ప్రేమరీతి విచిత్రము! సమస్తమును మోహితము చేయు ఆ విచిత్ర వేష స్వరూపులైన రాధికా కృష్ణులను విచిత్ర రసానురాగముతో సేవింపుము!

శ్రీబృందావన ధామములో సమస్తము విచిత్ర రసరీతితో, ప్రేమగతితో ప్రకాశిస్తూ ఉంటుంది.

**విచిత్ర శ్రీవృందావనమిహ విచిత్రం వనలతా**
**నికుంజం తత్రాస్తే సుకుసుమ విచిత్రంచ శయనమ్**
**విచిత్రౌ శ్రీరాధామురలిధరణౌ తత్ర రసికౌ**
**విచిత్రాస్తత్క్రీడా స్తద్వధి విచిత్రో మధురిమా 64**

శ్రీబృందావనము విచిత్రమైనది. వనలతలతో నిర్మితమైన నికుంజ కూడ విచిత్రము! అచటి సుందర పుష్పశయ్య కూడ విచిత్రమైనది. దానిపై ఆశీనులైన

శ్రీరాధామురళీధరులు కూడ విచిత్రమే! వారి క్రీడకూడ విచిత్రమైనది. ఆ క్రీడా మాధుర్యము కూడ విచిత్రమైనది!

పూర్వ శ్లోకములో వలె ఇందు కూడ శ్రీప్రబోధానందులు ఎట్టి రసమయ విచిత్రదృశ్యములను దర్శించినారోకాని, వారికి శ్రీబృందావనములోని అణువణువు చిత్ర విచిత్రమైతోచినది.

**నవాంభోద శ్యామో నవ లలిత విద్యుద్విలసితా**
**నవానంగ క్రీడా నవరతి కలా కౌశల నిధిః**
**నవానందస్యందో నవరసభరేనాలసతనుః**
**స కృష్ణః సా రాధా నవతి నవ బృందావనరుచిః 65**

నవమేఘ శ్యామల వర్ణము కల శ్రీకృష్ణుడు, నవ లలిత విద్యుద్విలాసినియైన శ్రీరాధ, నవ అనంగక్రీడ, నవరతికళా కౌశలనిధి శ్రీబృందావనములో ప్రకాశమానమైనవి. నవానందరీతితో నవరసమునందు అలసత్వమును పొందక శ్రీయుగళము నవబృందావన కాంతియందు నవీన రూపముతో వెలుగుచున్నారు.

చిత్రవిచిత్ర రూపకాంతితో తేజరిల్లుచున్న శ్రీబృందావనములో సమస్తము నిత్యనూతనమే! ఆ నిత్యనూతన శ్రీకళలలో శ్రీరాధాకృష్ణులు నిత్యనవీన రూపములతో ఎచ్చటను కానరాని నవ అనంగ క్రీడలో కుశలురై విరాజిల్లుచున్నారు.

**వృందాటవ్యాం కలిందాచల దుహితృ తటే దివ్యపాటీర వాటీ**
**భ్రాజన్మల్లీ కుటీరే విరచిత రుచిరానంగ రంగ ప్రసంగమ్**
**మత్తల్పే పారిజాతాద్యురువిధ కుసుమైః కల్పితే పుష్పమాలా౽**
**లంకారోత్తంసకాదీ మనసి విహరతాం రాధికామాధవౌ నః 66**

శ్రీరాధా మాధవులు కాళిందీ నదీ తీరములో దివ్య చందన వాటికయందు ప్రకాశిస్తున్న మల్లీకుటీరములో విరాజమానులైనారు. పారిజాతాదిగాకల అనేక

పుష్పములతో రచితమైన ఉత్తమ పుష్పమాలలను, శిరోభూషణములను అలంకరించుకొని మనోజ్ఞమైన అనంగరస ప్రసంగములను విస్తరింపజేస్తున్న ఆ శ్రీయుగళము మామనసులో విహరింతురుగాక!

**స్థానే స్థానే నవీనత్యతుల హరిరసాదున్మదం కేకీవృందమ్**
**మల్లీవల్లీంచ ఫుల్లామనుమిలతి మదాంధాలి ఝుంకార ధారా**
**చూతే చూతే ప్రగాహయంతహహ మదకలం కోకిలా యత్ర తత్ర**
**శ్రీరాధామాధవావున్మద కలౌ కిశోరౌ శ్రీలవృందావనేస్మిన్ 67**

ఎక్కడ శ్రీబృందావనములోని ప్రతి ప్రదేశములోను నెమళ్లు ఎల్లలులేని హరిరసమునందు ఉన్మత్తమై మాటిమాటికి నృత్యం చేస్తున్నవో, మత్తిల్లిన భ్రమరములు ఝుంకారము చేస్తూ వికసించిన మల్లెలతలను కలుసుకుంటున్నవో, ఎక్కడ కోకిలలు మామిడి మొగ్గలపై వాలి కలధ్వనులతోడి సంగీతము నాలపిస్తున్నవో అక్కడ శ్రీరాధామాధవయుగళ కిశోరులు కూడ ఉన్మత్తులై బృందావనములో విరాజమానులైనారు.

**రాధామాధవయోర్వనే విజయినోః సుస్వచ్ఛదీప్త స్థలీ**
**......ష్వంగేషు ముకురోదార ద్రువల్లీషుచ .........**
**సర్వస్మిన్నపి సర్వతః ప్రతిఫల స్వాత్మాత్వగా న్యాన్యగే**
**శోభాకాఽప్యదితాతి విస్మయకరీ లోభాయ నో భాసతామ్ 68**

మణుల కాంతివంటి కాంతితో వెలుగుచున్న వన ప్రదేశములో విజయేచ్ఛతో ఉన్న శ్రీరాధామాధవులు విరాజిల్లుచున్నారు. వారి అంగకాంతి శుద్ధ స్ఫటిక మణివలె, దర్పణ (అద్దము) కాంతి వలె వెలుగుచున్నది. వారు పరస్పరము వృక్షలతలతో తమను ఆచ్ఛాదించుకొని, సర్వత్ర వ్యాపించిన ఆశ్చర్యమయ శోభను ప్రకటించుచున్నారు. అట్టి శ్రీయుగళము మాకు లోభము కలిగించుచున్నారు.

**ఇత ఇత ఇతి రాధామాధవౌ స్వ స్వ మాన**
**గ్రహిలరవ సఖీభిః ప్రేష్యమానౌ సమంతాత్**
**పథి పథి వన శోభా వీక్షణాయైవ యాంతౌ**
**జహసతు రతిలుబ్ధోల్లాసి చేతోఽ నవస్థామ్** **69**

సఖీమణులు వనశోభను దర్శిస్తూ, తమ ప్రేమానురాగములను మరింత వృద్ధి చేసుకుంటున్నారు. “ఇటువైపు”, “ఇటువైపు” అంటూ శ్రీరాధామాధవులకు అన్ని దిక్కులలోను వారు ప్రేరణ కలిగిస్తున్నారు. అత్యంత లోభముతోను, ఉల్లాసముతోను నిండిపోయి ఉన్న ఆ సఖులు ఎటువైపు వెళ్లినా అక్కడ స్థిరంగా ఉండలేకపోతున్నారు. ఇదిగని శ్రీయుగళము నవ్వసాగినారు.

అంటే శ్రీబృందావనములోని అణువణువు రసార్ద్రమై మరింత మరింత లోభమును, ఉల్లాసమును కలిగిస్తున్నదని భావము!

**ఇత ఉరుతరరమ్యం స్వామిన్యౌ పూర్వమేత**
**దనుదయితసఖ్యా ఖ్యాతదేశం భజేథాః**
**ఇతి ధృతపదదాసీ కాకుభిస్తత్రగత్వా**
**స్మర ప్రముదిత రాధామాధవౌ తత్ప్రశంసౌ** **70**

“హే ప్రాణాధిక శ్రీయుగళమా! ఇటు పక్క కూడ రమణీయమైన అనేక దృశ్యములు ఉన్నవి. ముందుగా వానిని చూచి, అటుపై ప్రియసఖి చెప్పుచున్న ప్రదేశమునకు వెళ్లవచ్చును” అని నర్మోక్తులతో ప్రార్థిస్తూ ఒక దాసి శ్రీయుగళ చరణ కమలములను పట్టుకున్నది. అందుకు ఆనందముగా అంగీకరించిన శ్రీరాధామాధవులు ఆ ప్రదేశమునకు వెళ్లి అత్యంత ప్రసన్నులై ఆ దాసీమణిని ప్రశంసించినారు. ఇట్టి దృశ్యమును స్మరింపుడు!

**విన్యాసైః పదపంకజస్య విపిన శ్రేణీరలం కుర్వతీ**
**సవ్రీడ స్మిత కందలేన విలసత్కుందం నభః కుర్వతీ**
**భ్రూవల్లీ నటనేన మన్మథధనుః ఖండం వృథా కుర్వతీ**
**రాధామాధవ సంగతాఽటతి సఖీవృందేన వృందాటవీమ్ 71**

శ్రీరాధామాధవులు తమ చరణ కమలముల విన్యాసముచే వన ప్రదేశములను అలంకృతము చేస్తున్నారు. లజ్జాయుక్తమైన వారి మృదు మధుర మందహాస కాంతులతో ఆకాశములోని కుందరాజు (చంద్రుని) యొక్క శోభను కూడ మరింత విస్తరింపజేస్తున్నారు. తమ భ్రూలతల (కనుబొమల) నృత్యముతో మన్మథుని ధనుస్సును వృథా అనిపింపజేస్తున్నారు. (వారి కనుబొమల కదలికయే నాట్యగతితో ఉన్నది.) ఈ విధముగా మాధవ సహితయైన రాధాజీ సఖీ బృందముతో కలసి బృందావనములో విహరిస్తున్నది.

**వ్యత్యస్తాభరణాంబరాన్నతిజవాత్ గండోచ్చలత్కుండలా**
**మాలోలాయతనేత్రముక్త కబరచ్యోతత్ ప్రసూనావలిమ్**
**కాంతాఽలీ తదశంకయాఽప్యతి నుతే వృందావనైక స్థలే**
**తద్వీక్షా రససంభ్రమాత్ ద్రుతగతిం రాధామహం రాధయే 72**

శ్రీరాధ తన వస్త్రములను, ఆభరణములను ఇటునటు వ్యత్యస్తము చేయుచున్నది. వేగవశముచే చెక్కిళ్లపై కుండలములు ఊగుచున్నవి. నేత్రములు చంచలిస్తున్నవి. కేశబంధము వదులుగనై పూవులు పడిపోవుచున్నవి. కాంతుని (కృష్ణుని)తోను, సఖీ బృందముతోను కలసి శంకారహితముగ శ్రీబృందావనమును ప్రశంసిస్తూ నడుస్తున్నది. ఒకానొక ప్రదేశమును దర్శించుటకై రససంభ్రమముతో వేగముగ వెళ్లుచున్న అట్టి శ్రీరాధను ఆరాధిస్తున్నాను.

శ్రీబృందావనము నందలి రసాధిక్యము చేత సాక్షాత్తు శ్రీరాధ ఎంతగా విముగ్ధ అయినదో ఇట వర్ణింపబడినది.

**కాప్యాగత్య యదైవ శంసతి వనం వృందావనే కించన**
**వ్యక్తం తర్హ్యతి కౌతుకేన వివశా రాధాగ్రతో ధావతి**
**కేశాన్ సంవృణతీ న నాఽపి వసనం నామంత్రితాలి ప్రియా**
**త్యక్తోత్సంగ విపంచికాఽథ సహసోల్లాసైః పరేఽప్యన్వయుః 73**

ఒక సఖి వచ్చి 'బృందావనములో ఒక తోట ప్రకటితమైనది' అని చెప్పినది. ఆ మాట వింటూనే శ్రీరాధ మిక్కిలి కుతూహలి అయినది. చెదరిన కేశములను సర్దుకొనక, వదులైన వడ్డాణమును బిగించుకొనక, సఖియలకు కూడ చెప్పక, తన ఒడిలోని వీణను త్యజించి ఉత్కంఠతతో ముందుకు పరుగిడినది. సఖీజనము ఉల్లాసముతో దేవిని అనుసరించినారు.

తనకు అత్యంత ప్రీతి పాత్రమైన బృందావనములో ఒక కొత్త తోట వ్యక్తమైనది అని తెలిసినంతనే రాధాజీపొందిన కుతూహలము, వేగిరపాటు పరస్పర రసానుబంధమును స్పష్టము చేస్తున్నది.

**ఇదం భగవదర్పణాచరిత సర్వసత్ కర్మణామ్**
**ఫలంచ భగవత్ పదాంబుజ సుభక్తిమత్ సంగతే**
**ఫలాత్మ భగవత్ కథామృత శ్రుతీనాం పరమ్**
**ఫలం మదనమోహనో యద్వయమైక్షి వృందావనే 74**

శ్రీబృందావనములో శ్రీమదనమోహనుని దర్శించుట సమస్త సత్కర్మలను భగవదర్పణము చేసిన ఫలమునిచ్చును. అంతేకాదు; భగవంతుని చరణ కమలములకు అంకితమైన ఉత్తమ సాధు భక్తుల సాంగత్య ఫలమునిచ్చును. ఇంకను సాధ్య స్వరూపమైన భగవత్కథామృతము పట్ల రుచిని కలిగించే వేదముల నభ్యసించుట వలన వచ్చెడి పరమ ఫలము కూడ ప్రాప్తిస్తుంది.

అనగా, శ్రీబృందావనములోని మదనమోహనుని దర్శనము లోకములోని ఉత్తమోత్తమ విషయములన్నిటికన్నను అధిక ఫలము నిచ్చునని భావము!

**విదగ్ధలలితాదికాలిభి రనూత్కంఠం శిక్షితమ్**
**విముగ్ధ మృగపక్షిభిః కలకలోంగితైర్వీక్షితమ్**
**సుహేమ హరినీలరుక్ ద్వయమహో మహాదీక్షితమ్**
**స్మర స్మరమహోత్సవే నిజవనే పరాలక్షితమ్ 75**

విదగ్ధతా పూర్ణులైన శ్రీలలితాది సఖీగణముల ద్వారా శ్రీయుగళకిశోరులకు పదే పదే ఒకరిపట్ల మరొకరికి ప్రేమోత్కంఠత పెరుగుచున్నది. సఖీమణులు శ్రీయుగళ కిశోరులకు అనేక విషయాలలో శిక్షణ ఇస్తున్నారు. (వారి ప్రేమోత్కంఠత పెరుగుటకు కావలసిన శిక్షణ ఇస్తున్నారేమో!) మౌనముగా కూర్చుండి, విముగ్ధమైయున్న పశుపక్ష్యాదులు వారినే చూస్తున్నాయి. ఇక ఎవరు కూడ వారిని చూడలేకున్నారు. (అనగా బృందావన పశుపక్ష్యాదులకు, సఖియలకు తప్ప వారు ఎవరికీ కనిపించుట లేదని భావము.) స్వర్ణ, ఇంద్ర నీలమణి వర్ణ రంజితులైన శ్రీరాధాకృష్ణులు తమ నిజవనమైన బృందావనములో స్మర మహోత్సవములో మహాదీక్షితులై ఉన్నారు. ఈ లీలను స్మరింపుడు!

**అనంగ రసమాదతః క్షుభితదృష్టి వాగంగయో**
**రభంగ రతిరంగయోః సురసపుంజ కుంజాలిషు**
**అలం గలితధైర్యయోః స్మరత రాధికా కృష్ణయోః**
**అసంగత గిరో మిథో విలసితాని వృందావనే 76**

అనంగ రసమునందు మత్తిల్లిన శ్రీరాధాకృష్ణుల చూపు, మాట, శరీరముల యందు చంచలత గోచరిస్తున్నది. శ్రీబృందావనములోని ఉత్కృష్ట, రసపూర్ణ కుంజలలో వారు నిత్యము ప్రేమక్రీడా పరాయణులైనారు. వారి ధైర్యము పూర్తిగా

వినష్టమై, పరస్పరము అసంగత వాక్యములను పలుకుచున్నారు. (అనగా ప్రేమక్రీడా విలోలురు అయిన శ్రీయుగళము నిలువలేకపోవుట, అప్రస్తుతమైన మాటలను మాటాడుట జరుగుచున్నది.) అట్టి శ్రీరాధాకృష్ణుల విలాసమును స్మరింపుము!

**అనంత సతృషోల్లసత్ శ్రుతి రనంత తృష్ణాదృక్**
**తవామృతకథారససదన ఇందు వక్త్రేక్షణే**
**న వేద మహదల్పతాం విధినిషేధ వార్తాలవమ్**
**సదా లసతి రాధయా తృటితసేతు వృందావనమ్ 77**

అనంతమైన తృష్ణతో ఉల్లసితమైన చెవి నీ (శ్రీరాధా) అమృతమయ కథారస సాగరము నందే నిలచియున్నది. అనంతమైన పిపాసతో వ్యాకులమైన నేత్రము నీ ముఖచంద్రునికై నిరీక్షిస్తున్నది. ఆ చెవులు, కన్నులు మహత్వ అల్పత్వములను, విధి నిషేధాదులను ఏమాత్రము ఎరుగకున్నవి. ఈ ప్రకారముగా అన్ని హద్దులను ఉల్లంఘించి శ్రీశ్యామసుందరుడు శ్రీరాధతో కలసి నిరంతరము బృందావనములో క్రీడిస్తున్నాడు.

శ్రీకృష్ణుని వినికిడి శక్తి, చూపు సమస్తము శ్రీరాధ యందే లగ్నమైనవి. ఆ కారణముచే ఆయన విధినిషేధాదుల నన్నిటినీ, వేద మర్యాదను ఉల్లంఘించినాడు. ఉన్నది కేవలము రాధ మాత్రమే!

**స్వహస్త రచితాం ప్రియ సుఖచమత్కృత ప్రీతయే**
**విచిత్ర పరిపాటికాం కుసుమవాటికామాస్థితామ్**
**విచిత్ర నవ కుంజకావలి పరిష్క్రియాదౌ రతామ్**
**భజామ్యనుగ కింకరీమభిసృతాం ముదా రాధికామ్ 78**

శ్రీరాధ ప్రియతమునికి సుఖ, చమత్కార, ప్రీతులను కలిగించుటకై స్వహస్తములతో విచిత్రరీతిలో పుష్పవాటికను రచించినది. అందు విచిత్ర

నవకుంజలను ప్రేమతో సరిదిద్దినది. ఆనందముగా తనను అనుసరిస్తున్న దాసీమణుల వెనుక నడచుచున్న ఆ శ్రీశ్రీరాధికను స్మరింపుము!

**సానందం నవకుంజవాసభవనం శిక్షా సుదక్షాలిభిః**
**నీతౌ నవ్య వధూవరౌ నవరతి క్రీడా ప్రసంగాకులౌ**
**ప్రోన్మీలన్నవరంగ చిత్రసుపటౌ నవ్యాంగరాగస్రగా**
**కల్పోజాలగతేక్షణాలి సుఖదౌ శ్రీగౌరనీలౌ నుమః 79**

శిక్షణనిచ్చుటలో నిపుణులైన సఖీమణులు శ్రీయుగళ సన్నిధికి వచ్చినారు. ఆనందమయస్థితిలో, నవనికుంజ రాజభవనములో, నవకేళీ ప్రసంగములతో చంచలించుచున్న ఆ నిత్యనూతన వధూవరులను సఖియలు తోడ్కొని తెచ్చినారు. అత్యంత సుందరమైన, నవనవ వర్ణములతో రంజితమైన విచిత్ర వస్త్రములను ధరించి; నవీన అంగరాగములతోను, శిరోభూషణములతోను వారు అలంకృతులైనారు. కుంజ రంధ్రముల నుండి సఖీమణులు వారిని దర్శిస్తున్నారు. ఈ విధముగా గౌరనీల వర్ణరంజితులైన యుగళ కిశోరులను నేను స్తుతిస్తున్నాను.

ఇట 'వధూవరులు' అను పదమును లౌకికార్థములో స్వీకరింపరాదు. యుగముల పర్యంతము నిత్యనూతన స్థితిలో ఉండు శ్రీయుగళజ్యోతి లోక కల్యాణమునకై 'రాధ–కృష్ణ' అను రెండు రూపములను ధరించినది. సహజముగా అది జ్యోతిస్స్వరూపము! అట్టి యెడ సామాన్యార్థమును భావింపను కూడ భావింపరాదు!

**వృందారణ్యగుణాన్ ప్రగాయదనిశం రాగైర్విచిత్రైర్మిథో**
**వృందారణ్య రసాంచితాః ప్రియసఖీః సన్నాదయన్నాటికామ్**
**ఉన్మాదోన్నతి వీక్ష్యవీక్ష్య మధురాం వృందావన శ్రీతతిమ్**
**శ్రీవృందా విపినేఽద్భుతం ద్వయమహస్తత్ గౌరనీలం నుమః 80**

శ్రీయుగళము పరస్పరము విచిత్ర రసరాగిణులతో శ్రీబృందావన గుణములను గానం చేస్తున్నారు. బృందావనరసముతో నిండిపోయిన సఖియలు నాటకమును దర్శిస్తూ నృత్యం చేస్తున్నారు. మధురమైన బృందావన శోభను చూచి, చూచి వారికి ఉన్మత్తత మరింతగా పెరుగుచునే ఉన్నది. ఈ విధముగా బృందావనములోని గౌరనీలవర్ణులైన అద్భుతయుగళ కిశోరులను నేను స్తుతిస్తున్నాను.

**ప్రత్యంగోచ్ఛలదంతపార రహిత శ్రీగౌరనీలచ్ఛటా**
**పీయూషాంబుధి కోటిమన్మథ దురున్నేయాతి లీలానిధిః**
**రాధాకృష్ణ సునామధామ యుగళం తద్దివ్యకైశోరకమ్**
**శ్రీవృందావన కుంజవీథిషు సదా ఖేలన్మనో గాహతామ్ 81**

వారి ప్రత్యంగము నుండి అనంతము, అపారము, సుందరము, గౌరనీలమునైన కాంతి సముద్రము ఎగసిపడుతున్నది. కోటికోటి మన్మథులు కూడ వారి నిజలీలాసాగరము యొక్క ఆవలి తీరమును పొందలేకున్నారు. అట్టి దివ్య కిశోరులు "శ్రీరాధాకృష్ణ" అను సుందర నామమును ధరించి, శ్రీబృందావన కుంజలలోని వీథులలో నిరంతరము క్రీడిస్తున్నారు. ఆ శ్రీయుగళము నామనసులో స్ఫురించునుగాక!

మన్మథుడు అంటేనే ఆకర్షణ అనికదా! అట్టి మన్మథులు కోటి మంది కూడ శ్రీయుగళ లీలావిలాసము యొక్క దివ్య ఆకర్షణను గూర్చి అణువైనను తెలుసుకొనలేకపోతున్నారు. ఇక ఆ మహాకాంతిని, ప్రేమతేజస్సును, రసధారను వర్ణించుట సాధ్యమా!

**జాగ్రత్ స్వప్నసుషుప్తి నిత్యమిలనో నిత్యానురాగోన్నతీ**
**నిత్యాశ్చర్యం నవీన దివ్యవయసౌ నిత్యస్మరోన్మాదినౌ**
**నిత్యాన్యోన్య విచిత్ర కేలికలనౌ నిత్యాలి వృందాన్వితౌ**
**శ్రీవృందావన నాగరౌ భజ మనస్తావేవ నిత్యోజ్జ్వలౌ 82**

ఓ మనసా! శ్రీరాధాకృష్ణులు జాగ్రత్, స్వప్న, సుషుప్తి స్థితులలో కూడ నిత్యసంయోగములోనే ఉంటారు. వారి అనురాగము నిత్యము వృద్ధి చెందుతూ ఉంటుంది. ఆశ్చర్యకరమైన వారి నూతన దివ్య వయస్సు నిత్యము! వారు నిత్యము ప్రేమోన్మాదముతో ఉంటారు. నిరంతరము పరస్పర విచిత్రకేళీ వినోదములో ఉంటారు. నిత్య సఖీమండలిచే భూషితులై వెలుగుతూ ఉంటారు. అట్టి నిత్యోజ్వల, రసాన్విత, బృందావన నాగర యుగళమును భజింపుము!

**అన్యోన్యాం సవలన్మిథోऽతి పులక శ్రీవృంద దోఃకందలౌ**
**హాసం హాసమనేక దివ్యగతిభిర్లీలా లసాభిర్ముదా**
**ప్రాణేశే ప్రియ పశ్య పశ్య శృణు శృన్విత్యాది వాక్ సంభ్రమౌ**
**రాధా తద్రమణౌ స్మరామ్యతి రసాత్ వృందాటవీ చారిణౌ 83**

శ్రీయుగళము ఒకరి భుజస్కంధములపై మరొకరు వాలుటచే మిక్కిలి పులకితులైనారు. సౌందర్య పూర్ణములైన వారి భుజములు శోభిస్తున్నాయి. వారు ఆనందపూర్వకముగ నవ్వుచు, నవ్వుచు లీలాలస చిత్తులైనారు. అనేక ప్రకారములైన దివ్యగతి భంగిమలతో "హే ప్రియతమా", "హే ప్రియా"; "చూడు, చూడు", "విను, విను" అను ఇట్టి మాటలనాడుచు శ్రీరాధాజీ, ఆమె ప్రియతముడైన శ్యామసుందరుడు మిక్కిలి రసపూర్ణులై శ్రీబృందావనములో విహరించుచున్నారు. వారిని నేను స్మరిస్తున్నాను.

**సముద్వేలితాశేష సత్ప్రేమ సింధౌ సదానంద వృందాటవీ శ్యామలేందౌ**
**న రాధా దృగిందీవరానన్య బంధౌ గతౌ దృక్ చకోరో తదాస్తాం మహాంధౌ 84**

అశేషమైన ఉత్కృష్ట ప్రేమ సాగరమును సంపూర్ణముగ వృద్ధి చెందించువాని యందు, నిత్యానందమయమైన బృందావన శ్యామచంద్రుని యందు, శ్రీరాధానేత్ర కమలములకు ఏకమాత్ర బంధువు అయిన ఆ శ్రీకృష్ణుని యందు దృష్టి మరలకపోతే గుడ్డివారై ఉందురుగాక!

**సదా రాధయాఽ గాధయా ప్రేమసారైః**
**సదారాధ్యయా సాధ్యయా తద్వనాన్యైః**
**అవిచ్ఛిన్న వృందాటవీకేలి వృందా**
**మమానందినీ శ్యామలా సైవ శోభా 85**

శ్రీరాధ అన్య అన్య వనములచే నిత్యము ఆరాధింపబడుచు, సాధ్య వస్తువు అగుచున్నది. ప్రేమసారము యొక్క అగాధమూర్తియైన ఆ రాధాజీచే అనుష్ఠింప బడుచున్నట్టి, బృందావన నిరవధిక కేళీ బృందములచే శోభిస్తున్నట్టి ఆ శ్యామల (కృష్ణుని) శోభ నాకు ఆనందము నిచ్చుచున్నది.

**మహానంద నిష్యందినీ విశ్వచేతో మృగా బంధినీం రంధినీం బంధసంధేః**
**రసోన్మత్త వృందాటవీ వల్గినీం తాం హరేర్దివ్య వంశీమహం శీలయామి 86**

వంశీ మహానందమును వర్షిస్తుంది, జీవుల చిత్తము అనెడు మృగమును బంధిస్తుంది. సమస్త బంధనములను నశింప జేస్తుంది. రసోన్మత్తయైన బృందావనమును అనేక విధములుగా ప్రశంసిస్తుంది. శ్రీకృష్ణుని యొక్క అట్టి దివ్యవేణువును నేను నిరంతరము ధ్యానిస్తున్నాను.

**కదా వా మదాఘూర్ణదాకర్ణనేత్రాకులీభూయ వృందావన శ్రీరసేన**
**నిజాంగం ముదాగుంఠయేత్తద్రజోభిః ప్రియాలీ సువిస్మాపినీ భాతి రాధా 87**

శ్రీరాధ బృందావన శ్రీరసము చేత వివశయై, మత్తిల్లిన ఆకర్ణాంత నేత్రములను అన్ని వైపులకు తిప్పి తిప్పి చూస్తూ, ఆ రజమును తన శరీరమునకు అలదుకొనుచు, తన ప్రియ సఖియలను కూడ విస్మితులను చేస్తూ ఎప్పుడు వెలుగుతూ ఉంటుందో కదా!

**సదా రాధికా కృష్ణ కేలీ స్థలీనాం విలీనాంతరో దివ్యశోభాం విభావ్య**
**ఇహానంద కందే మహాశ్చర్య వృందే నివత్స్యామి వృందావనే విశ్వవంద్యః 88**

శ్రీరాధాకృష్ణుల కేళీ ప్రదేశముల దివ్యశోభను చింతన చేస్తూ, దానియందు మగ్నుడినౌతాను. ఆనందపూర్ణము, మహాశ్చర్యపూర్ణమునైన ఈ బృందావనములో అందరిచే స్తుతింపబడుచు నిత్యనివాసము చేస్తాను.

బృందా నిత్యనివాసియైన భాగ్యశాలి అందరి మన్ననలను పొందుతాడని భావము!

**మహామోహినీ కోటిదుర్మోహ దృష్టిః**
**మహాసిద్ధికోటిషు దుర్గంధ బుద్ధిః**
**హృదివ్యక్త రాధాపదాంభోజ శోభః**
**కదా లోభయిష్యామి వృందావనేఽన్యాన్ 89**

కోటి కోటి మహామోహినీ స్వరూపులైన స్త్రీలను మోహదృష్టితో చూస్తూ, కోటి మహాసిద్ధుల యందు దుర్గంధబుద్ధిని కలిగి ఉన్నను; హృదయములో శ్రీరాధా చరణకమల శోభను స్మరిస్తున్నాను. (అనగా శ్రీచరణములు హృదయంలో నిలచిన క్షణముననే ఆ దుర్లక్షణములన్నియు నశించిపోతాయి అని భావము.) ఆ విధముగా శ్రీచరణ శోభను స్మరిస్తూ, ఇతరులను బృందావనము పట్ల లాలసతో ఉండునట్లు ఎప్పుడు చేస్తానో కదా!

ఎప్పుడైతే తాను శ్రీరాధా కృప వలన ఉద్ధరింపబడినాడో అప్పుడే మిగిలిన వారు కూడ ఉద్ధరింపబడవలెనని అతడు ఆకాంక్షించాడు.

**న రాధా న రాధా ప్రియో నాపివృందా**
**వనం నైవ వృందాని తత్ప్రేమభాజమ్**
**సదాయస్య హృద్గోచరే వాఽథ వాచాం**
**ప్రచారే కథం తస్య బృందే రసశ్రీః 90**

శ్రీరాధా, శ్రీశ్యామసుందరుడు, శ్రీబృందావనము, వారి ప్రేమభక్తులు ఎవరి హృదయములో నిత్యము గోచరింపరో; వారిని గూర్చిన కథనమును వినరో అట్టివారు శ్రీయుగళ, బృందావనముల రస సౌందర్యమును ఎట్లు ఆస్వాదింపగలరు ? (ఆస్వాదింపలేరని భావము.)

**యత్రానందచ్ఛవి తరులతా పక్షి సారంగ భృంగా**
**యత్ర స్థల్యో వివిధ మధుర జ్యోతిరుద్భూతి భాజః**
**యత్ర ప్రేమోన్మద రసమయ జ్యోతిరేకాబ్ధిమూర్తీ**
**రాధాకృష్ణావచల విహ్రతీ నౌమి వృందావనం తత్ 91**

శ్రీబృందావనములోని తరులతాదులు, పక్షులు, సారంగములు, భ్రమరాదులు అన్నియు ఆనంద స్వరూపములే! ఆ భూమి మధురమైన వివిధ జ్యోతులను ఉత్పన్నము చేస్తుంది. అచట ప్రేమోన్మద రసమయ జ్యోతి స్వరూపులైన శ్రీరాధాకృష్ణులు అవిచల భావముతో విహరిస్తూ ఉంటారు. అట్టి బృందావనమును నేను స్తుతిస్తున్నాను.

**అనంతానందేందుద్యుతి వితతయోఽనంత వైదూర్య వర్య**
**ప్రభాభాభిః పూర్ణాః శశిమణి హరిద్రత్న సత్‌హీరకాభాః**
**అనంతాతి స్వచ్ఛచ్ఛవి సుకనకాదర్శ దీప్యత్తలాభా**
**ద్రుమాస్తే శ్రీవృందావనభువి మహైశ్చర్యరూపాః స్ఫురంతు 92**

శ్రీబృందావన వృక్షములు అనంత ఆనందమయ చంద్రజ్యోత్స్నలతో పరిపూర్ణములై ఉన్నవి. అనంతములైన శ్రేష్ఠ వైదూర్యమణుల కాంతితో అవి ప్రకాశిస్తున్నవి. చంద్రకాంత శిలల, మరకతమణుల, వజ్రముల కాంతిని కలిగి ఉన్నవి. అతిస్వచ్ఛమైన, అనంతకాంతితో, సుందర సువర్ణదీప్తితో వెలుగుతున్న ఆ బృందావన మహైశ్చర్యకర వృక్షరాజములు నా హృదయములో స్ఫురించునుగాక!

**ఏకైకాంగీచ్ఛలిత మధుర శ్యామ గౌరచ్ఛటౌఘైః**
**వృందారణ్యం సుఖచితమథ ప్రేమమాధ్వీమదాంధమ్**
**కుర్వంతాద్భుత రతికలా వారిధీ కృష్ణరాధే**
**శుద్ధ ప్రేమోజ్జ్వల రసతనూ నిత్యంతశ్చకాస్తామ్ 93**

శ్రీరాధాకృష్ణులు తమ ప్రత్యంగము నుండి ఎగసిపడుతున్న మధుర శ్యామ గౌరకాంతితో బృందావనమును సుందరముగా అలంకరించినారు. వారు ప్రేమ మధువుచే మత్తిల్ల జేయు అద్భుత రతికళా స్వరూపులు! శుద్ధ ప్రేమోజ్వల రసమయ శరీరములను ధరించిన ఆ శ్రీయుగళము నిత్యము నా అంతఃకరణములో విరాజమానులై ఉందురుగాక!

**వృందారణ్య కదంబచ్ఛాయాయాం రాధికా కృష్ణౌ ...............**
**గాయంతావతి మధురం మమ సేవాం మనసి వాంఛితాం దిశతామ్ 94**

శ్రీబృందావనములో కదంబవృక్షఛాయలో అతి మధుర సంగీత స్వరూపులై శ్రీరాధాకృష్ణులు వెలుగొందుచున్నారు. అట్టి శ్రీయుగళము నామనోవాంఛితమైన సేవను అనుగ్రహింతురుగాక!

**శ్రీవృందావన కనకస్థలీషు శింజానం మంజు మంజీరమ్**
**సంచరదరుణ సరోజచ్ఛవి చరణం తత్ స్మరామి రాధాయాః 95**

అవి శ్రీబృందావన స్వర్ణమయ ప్రదేశములు! అట మనోజ్ఞమైన మంజీర ధ్వనులు రవళిస్తున్నాయి. అరుణకమల కాంతివంటి కాంతిగల శ్రీరాధా చరణములు అట నడయాడుచున్నవి. అట్టి శ్రీరాధా చరణములను నేను స్మరిస్తున్నాను.

**హృన్మమ రాధా నాగర చరణం మరణేఽపి నైవ విస్మరతు**
**తనురపి న విపత్ కోటిషు జీవన వృందావనం క్షణం త్యజతు 96**

శ్రీరాధా నాగరుల యుగళ చరణములను మరణ సమయములో కూడ నా హృదయము విస్మరింపకుండునుగాక! కోటి విపత్తులు వచ్చినను నా జీవన స్వరూపమైన బృందావనమును ఒక్క క్షణమైనను విడువకుందునుగాక!

**దృష్టాదృష్టాన్ విషయాన్ విస్మర హృన్నస్మర స్వభామపి బ్రహ్మ**
**న విముహ్యాపర విభూత్యా వృందారణ్యేఽద్భుత రసం మృగయ 97**

ఓ హృదయమా! కనపడునవి, కనపడనివి అయిన సమస్త విషయములను మరచిపొమ్ము. స్వప్రకాశ స్వరూపుడైన పరబ్రహ్మమును కూడ స్మరింపవద్దు. పరమ వైభవము లభించినను విముగ్ధుడవు కావద్దు. శ్రీబృందావనమునందలి అద్భుత రసముతో అనుసంధానమును పొందుము!

**వృందావనభువి దోషాః కథమపి దోషానవేహ సా విద్యా**
**దుఃఖక్షయాది దృష్టిః భ్రాంతిరపీయం మహాభ్రాంతిరన్యత్ర 98**

శ్రీబృందావనములో దోషములు ఉన్నవా, లేవా అను చర్చ చేయుటయే "అవిద్య"! దుఃఖ, క్షయాదుల పట్ల దృష్టి పోవుటయే "భ్రాంతి"! ఇక శ్రీబృందావనము నుండి అన్యత్ర వెళ్లుటయే "మహాభ్రాంతి"!

**నందయతి హృదయ కుముదం మందయతి మహా తమః స్తోమమ్**
**ఉచ్ఛలయతి రస సింధుం వృందావన కీర్తి చంద్రికా స్ఫురతి 99**

శ్రీబృందావన కీర్తిచంద్రిక హృదయమను పద్మమునకు ఆనందము ననుగ్రహిస్తుంది, మహాంధకారమును నశింపజేస్తుంది, రససముద్రమును ఉచ్ఛలితము (ఎగసిపడునట్లు) చేస్తుంది. అది నాలో స్ఫురించునుగాక!

**రాధానంతాపరాధాత్ పతతాం బాధాంబుధావనుద్ధారః**
**వృందావనమపి మందాయత ఇహ కరుణార్ద్రదృక్ ప్రసారే 100**

శ్రీరాధాజీ పట్ల అనంత అపరాధములను చేసి, బాధా సముద్రములో పడిపోయిన వ్యక్తికి ఉద్ధారణ లేదు. శ్రీబృందావనము కూడ అట్టి వ్యక్తి పట్ల కరుణ చూపజాలదు.

**అహో వ్యామోహోऽయం క ఇవ దురపోహోऽపి మహతామ్**
**యదేతత్ సర్వోచ్చైర్జ్వలదపి చ వృందావన వనే**
**పరం జ్యోతిః సాక్షాదపి మదనగోపాల వపుషా**
**రసానాం సారౌఘం కిరదపి నిరీక్ష్యాన్య రుచయః 101**

ఓహో! గొప్ప విద్వాంసులు కూడ ఎట్లు మోహవశులు ఔతున్నారు ? శ్రీబృందావనములో పరమజ్యోతిస్స్వరూపమైన మదనగోపాలుడు భావరస సారమును ప్రకాశింపజేస్తున్నాడు. ఆ సర్వశ్రేష్ఠ భావమును చూచి కూడ, అజ్ఞానముతో వారు అన్య విషయముల పట్ల రుచిని కలిగి ఉంటున్నారు!

అంటే ఎంత గొప్ప జ్ఞానులైనా బృందావనములోని మదనగోపాలుని రససారమును గ్రహించలేకపోతే వారు మోహాంధకారములో పడియున్న అజ్ఞానులే అని స్పష్టం చేస్తున్నారు.

**అహో వృందారణ్యోజ్జ్వల మదనగోపాల విలస**
**న్ముఖేందోః సౌందర్యం హరతి ప్రతిసారం ధృతిమతామ్**
**తదేతస్యైవైకాంతిక మధురదాస్యేన పదయోః**
**శరీరం న్యస్యేదం విరతకృతి నేష్యే జనురిదమ్ 102**

ఓహో! బృందావనములోని శ్రీమదనగోపాల ముఖచంద్రుని సౌందర్యము ధైర్యవంతుల సారవస్తువులనన్నిటిని హరిస్తున్నది. (అంటే వారు మదనగోపాలునికి వశమైపోతున్నారని భావము.) కనుక శ్రీయుగళపదముల చెంత ఏకాంత

దాస్యభావముతో శరీరమును ఉంచి, ఇతర కర్మలను త్యజించి జీవితమును గడుపుకొందును.

**సంవీత సత్కనక పీతపటం నివీత**
**మాలో లసత్కనక చంపకచారు దామ్నా**
**శ్రీరాధాయాః కనక చారురుచా ముకుందమ్**
**వృందావనే కనక భూషణ వేణుమీక్షే 103**

ముకుందుడు సుందరమైన పీతవస్త్రమును ధరించినాడు. స్వర్ణ చంపకముల తోడి సుందరమాలను, అందమైన శాలువను వహించినాడు. శ్రీరాధాజీ యొక్క స్వర్ణమయమైన సుందరకాంతితో ఆచ్ఛాదితుడై ఉన్నాడు. (అనగా శ్రీకృష్ణుడు రాధా భావములో ఉండి స్వర్ణకాంతితో వెలుగుచున్నాడని భావము.) స్వర్ణభూషణములతో సుసజ్జితుడై, మురళీధారియైన అట్టి శ్రీముకుందుని బృందావనములో దర్శింపవలెనని కోరుకుంటున్నాను.

**వృందావనే మదనమోహన వక్త్రచంద్ర**
**భామృతాయ మమ దృక్ బహుజాత లోభా**
**రాధా విలోచన విలోల చకోర చారు**
**చంచూత్పుటైశ్చులు కితాఽథ కుతోఽపి నైతి 104**

శ్రీబృందావనములో మదనమోహనుని ముఖచంద్ర శోభామృతమును పానము చేయవలెనని మా నయన చకోరము మిక్కిలి లోభముతో ఉన్నది. కాని, శ్రీరాధానేత్రము అనెడు చంచల చకోరము తన సుందర చంచుపుటముతో ఆ శోభామృతమును విశేషముగా పానము చేసినది. ఆ కారణము చేత ఇక ఎవరికిని లభించుట లేదు.

శ్రీప్రబోధానందులు మహాకవి, మహాపండితుడు, రసికమహాత్ముడు, గొప్ప భావుకుడు! ఆలంకారికశైలిలో విషయమునందించుటలో గొప్పనేర్పరి! ఈ లక్షణములన్నియు ఆ మహాత్ముని “శ్రీబృందావన మహిమామృతము” అను దివ్యగ్రంథములో దర్శనమిస్తున్నవి. ప్రస్తుత శ్లోకము అద్భుతమైన భావముతో నిండియున్నది. వారికి శ్రీమదనమోహనుని శోభామృతమును తమ నయన చకోరముతో ఆస్వాదింపవలెనని ఉన్నదట! కాని శ్రీరాధా నయన చకోరము ముందే ఆ అమృతమును పానము చేయుటచే వారికి ఆ అవకాశము లభింపలేదట!

ఇందులో శ్రీసరస్వతీ పాదుల కవితాచాతుర్యముతో పాటు, శ్రీరాధాకృష్ణుల నిరంతర సంయోగస్థితి కూడ ప్రకటితం ఔతున్నది. శ్రీయుగళము వియోగమన్నదే లేని నిత్యసంయోగ స్థితిలో ఉండు సత్య స్వరూపులు! లీలలలో వియోగము ఉన్నట్లు కన్పించినను అది ఆభాసమాత్రమే!

ఇట్టి అద్భుత చమత్కృతితో కూడిన శ్లోకము ద్వారా శ్రీరాధాగోవిందుల నిత్య సంయోగస్థితిని మరొకమారు స్పష్టం చేస్తూ శ్రీప్రబోధానందులు ఈ 14వ శతకమును పూర్తి చేసినారు.

# పదిహేనవ శతకము

**శ్రీవృందావనకుంజపుష్పశయనే వృందావనాధీశ్వరీ**
**సంగా భంగుర కామరంగ మధురో వృందావనైకోదయః**
**వృందారణ్య విచిత్ర పుష్పవిలసన్మాలాది వేషోజ్జ్వలః**
**శ్రీవృందావననాగరో దిశతు మే వృందావనే సద్రతిమ్ 1**

శ్రీబృందావన నాగరుడైన శ్రీకృష్ణుడు బృందావన కుంజలలో పుష్పశయ్యపై బృందావనేశ్వరియైన శ్రీరాధతో కలసి నిరంతరము మధుర ప్రేమ విలాసమును ప్రకటిస్తూ ఉంటాడు. అతడు బృందావనములో మాత్రమే ఏకమాత్రముగ ప్రకాశిస్తూ ఉంటాడు. బృందారణ్యములో వికసించిన పుష్పములతో అల్లినమాలలతో అలంకృతుడైన శ్రీకృష్ణుడు నాకు బృందావనము పట్ల విశుద్ధమైన ప్రీతిని ప్రసాదించునుగాక!

**వృందారణ్యే స్వకర రచితాశ్చర్య సత్పుష్పవాట్యామ్**
**నానా పుష్పాద్భుత రచిత సన్మండపే సత్పథేన**
**స్వాస్తీర్ణాంభోరుహ మృదుదలేనాభిసార్యాశు రాధామ్**
**క్రీడన్ కృష్ణోఽవతు స భవతో జుష్టవర్త్మోపహారమ్ 2**

అది శ్రీకృష్ణుడు స్వహస్తములతో రచించిన ఆశ్చర్యమయ సుందర పుష్పవాటిక! అందు అనేకములైన పుష్పములతో అద్భుత భావముతో ఏర్పరచిన సుందర మండపము! దానిలో కోమలమైన కమలదళములతో, అతిసుందరమైన భావములతో ఆచ్ఛాదితమైన సుందరమార్గమును ఆయన స్వయముగ ఏర్పరచినాడు. ఆ మార్గములో శ్రీరాధ అభిసారికగా వచ్చినది. అట్లు క్రీడా పరాయణుడైన శ్రీకృష్ణుడు మమ్ము రక్షించునుగాక!

**నిమర్యాదాః స్వదమభితః సేవమానా విభూతీః**
**పశ్యత్ బ్రహ్మాభిధమపి పదం నాపి నామ్నాయ వర్త్మ**
**వృందాటవ్యామతి రతి రసైకాబ్ధిమగ్నం శ్రితానామ్**
**గౌరశ్యామం తదుభయమహః కోఽపి పంథా దురూహః 3**

తమ చరణకమలములను విధిపూర్వకముగ (వైధీభక్తితో) సేవించి మహావైభవాన్ని పొందినప్పటికీ వారిని శ్రీయుగళము కన్నెత్తికూడచూడరు. బ్రహ్మపదమును, వైదిక మార్గమును కూడ చూడరు. శ్రీబృందావనములో అత్యంతముగా ప్రేమరసమగ్నులైయుండు శ్రీయుగళకిశోరులు తమను ఆశ్రయించిన నిజభక్తులకు వర్ణనాతీతమైన ఒకానొక అనిర్వచనీయ రసమార్గమును అనుగ్రహిస్తారు!

అనగా వైధీభక్తితో తమను సేవించిన వారిని, బ్రహ్మపదమును పొందిన వారిని, వేదోక్త మార్గములో ఉపాసించువారిని శ్రీయుగళము కన్నెత్తి చూడరు. కేవలము ప్రేమభక్తికే వశమౌతారని భావము!

**...... అత్యానందాద్వివశ వివసన స్రగ్ విభూషాది సేవామ్**
**నారీ వృందైరవసర కృతాం న స్మరంతౌ స్మరామి**
**..................................................**
**.................................................. 4**

**మానే గాఢతరేఽపి కర్కశ సఖీ శిక్షాశతైః ప్రేయసా**
**శశ్వత్ ప్రేషితమానదాస్పద జనాత్యంతార్థనేనాదృతే**
**భూయః ప్రేష్ఠ గిరా తదీయ వసతౌ శ్రీవృందాటవీ కుంజకే**
**సమ్యక్ శ్లాఘిత ఏకయా స్వయమహో రాధాం ద్రవంతీం భజ 5**

సఖియలు కఠిన శిక్షణతో కూడిన వందల కొలది మాటలు ఎన్నిచెప్పినను రాధాజీ మనసు మరింత గాఢముగా అగుచున్నది. ఈలోగా ప్రియతముడు ఒకానొక సఖిని మాటిమాటికీ దూతికగా పంపింపసాగినాడు. రాధాజీ ఆయన ప్రార్థనను మన్నించి, ఆదరము చూపించినది. ప్రియతముడు తిరిగి ఒక సఖి ద్వారా చేసిన బృందావన కుంజల ప్రశంసా వాక్యములను విని దేవి మనసు కరగి స్వయంగా ఆయన వైపుకు వెళ్లినది. అట్టి శ్రీరాధను సేవింపుము!

శ్యామసుందరుడు చేసిన ఏదో చిలిపి చేష్టను చూచి సఖియలు అమ్మను అటు వెళ్లవలదని అంటున్నకొలదీ రాధాజీ మనసు గాఢతరమైనది. ఇక ప్రియతముడు చేసిన బృందాస్తుతిని విని పూర్తిగా కరగిపోయినది. బృందావనమనిన అమ్మకు అంతప్రీతి కదా!

అద్భుతమైన ఈ ప్రేమలీలను దర్శించిన శ్రీప్రబోధానందులు వివశులై మిక్కిలి మార్మికముగా వర్ణించినారు.

**అస్త్రాణామధిదేవతా రతిపతేరీశార్దనేऽపీశితుః**
**స్వాద్యానామధిదేవతాऽతి పరమ ప్రోద్దామ భావశ్రియామ్**
**కేలీనామధిదేవతా రసభృతాం సా కాऽపి రాధాభిధా**
**ప్రాణానామధిదేవతా వ్రజపతేర్జాగర్తి వృందావనే 6**

శ్రీరాధ జగదీశ్వరుని కూడ మర్దించగల కామదేవుని అస్త్రములకు అధిదేవత! అత్యంత అధికముగా ఆస్వాదించుటకు యోగ్యమైన భావ సౌందర్యమునకు అధిదేవత! రసపూర్ణమైన విలాసములకును ఆమె అధిదేవత! వ్రజపతియైన శ్రీకృష్ణుని ప్రాణములకు అధిదేవత! అట్టి ఒకానొక అనిర్వచనీయ దేవి "రాధా" నామముతో ఈ బృందావనములో సంచరిస్తున్నది.

**భ్రూభంగయా కోటికోటిః సృజతి రతిపతేర్వాగ్విలాసైః సుధానామ్**
**కోటిరావిష్కరోతి స్మితవదనరుచా చంద్రకోటీర్వ్యణక్తి**
**పంక్తైకాంగచ్ఛటాభిః ప్రణయరసమహాంభోధి కోటీః ప్రసూతే**
**సా వృందారణ్య ఏవం ప్రియ సహ విహ్వతి స్వామినీ రాధికా మే 7**

నా స్వామినియైన రాధిక ప్రియతమునితో కలసి శ్రీబృందావనములో లీలా విలాసమును ప్రకటిస్తున్నది. ఆమె తన భ్రూభంగిమ నుండి కోటి కోటి కామదేవులను సృష్టిస్తున్నది. ఆ వాక్యవిన్యాస చాతుర్యము నుండి కోటికోటి అమృత ధారలు వర్షిస్తున్నాయి. మృదుమధుర మందహాసముతో కూడిన ఆమె వదనకాంతి నుండి కోటికోటి చంద్రులు ఉదయిస్తున్నారు. శ్రీరాధా ఏకమాత్ర లావణ్యఛట నుండి కోటికోటి ప్రేమరస మహాసింధువులు ప్రకటితమౌతున్నాయి.

**శ్యామానందరసైక సాగర! హరే! వృందాటవీ నాగర!**
**శ్రీరాధాముఖపద్మభృంగ! పరమాభంగేరనంగోత్సవ!**
**వంశీప్రాణసఖీ! సదా ముఖరిత శ్రీరాధికా సద్గుణ**
**ప్రేమోద్దామ విలాసమోహన! మనాక్ ప్రోన్మీల మన్మానసే 8**

హేశ్యామ్! ఆనంద రససాగరా! హరీ! బృందావన నాగరా! శ్రీరాధా ముఖకమల భ్రమరమా! పరమ అభంగ అనంగోత్సవకారీ! వంశీప్రాణమా! శ్రీరాధా సద్గుణనిత్యగాయకా! ప్రేమోద్దామా! విలాసమోహనా! క్షణకాలము నాహృదయములో ప్రకాశింపుము!

**చూడాం పుష్పైర్విచిత్రైర్మణి భువి విరచయ్యాత్ర నవ్యం శిఖండమ్**
**న్యస్యస్రగ్భిర్వత స్సాదిభిరపి చ లసన్ మేఘ ఆయాతి కృష్ణే**
**దూరాదేవాలి శిక్షాక్వచన విచలితా క్వాపి మౌనాది దీక్షా**
**ధావంత్యాశ్లిష్యరాధా హృది మమ రుదతీభాతి వృందావనేందుమ్ 9**

మేఘవర్ణ శ్యామలాంగుడైన శ్రీకృష్ణుడు ఈ మణిభూమిపై వికసించిన విచిత్ర పుష్పములతో చూడాభరణమును రచించి, వానిలో నూతన మయూర పింఛమును అమర్చి ధరించినాడు. మాలలతోను, శిరోభూషణములతోను అలంకృతుడై అతడు రాధాజీ ఉన్న ప్రదేశమునకు వచ్చుచున్నాడు. అతడు దూరమున ఉండగనే సఖియలు శిక్షణ ఇచ్చినారు. సఖియల శిక్షణను అనుసరించి రాధాజీ ఒకమారు విచలిత ఔతున్నది, మరొకమారు మౌనదీక్షను వహిస్తున్నది. ఇంకొకమారు ఆమె పరుగున వెళ్లి శ్రీబృందావనచంద్రుని కౌగిలించుకొని రోదిస్తున్నది. అట్టి శ్రీరాధ నా హృదయములో భాసించునుగాక!

(ఆ దేవి భోలాభాలీ కదా!)

**చంద్రవల్యాః కుంజవాటీ ప్రసూనైః**
**క్లప్తాకల్పేఽ ప్యాగతే ప్రాణనాథే**
**నాంగా మర్దైర్నాంగులీ నేత్రభంగై**
**శ్చాల్యాలీనాం పాతు రాధాఽ తిముగ్ధా** **10**

ప్రాణనాథుడైన శ్రీశ్యాముడు చంద్రావళి యొక్క కుంజవాటికలో పూచిన పూవులతో రచించిన భూషణములను ధరించి రాధాజీ చెంతకు వచ్చినాడు. అది చూచి సఖీమణులు తమ అంగ విన్యాసములతోను, వేళ్లతోను, కన్నులతోను రాధాజీకి సైగలు చేసినారు. అయినను ముగ్ధ అయిన రాధాజీ అవిచలముగ ఉన్నది. అట్టి ఆ దేవి మమ్ము పాలించునుగాక!

**వృందారణ్యం తవ తదఖిలం త్వత్పదస్యానుకమయమ్**
**చంద్రావల్యాః సకృదపి గృహం యామి చేత్ స్యాత్తవాజ్ఞా**
**ఇత్థం కృష్ణం వదతి రుదతీం సంపరిష్వజ్య గాఢమ్**
**రాధామత్యాకులగిరా నహి నహీత్యుక్తిధారాం స్మరామి** **11**

“ఈ బృందావనము నీది! ఇందలి వస్తువులన్నియు నీకు దయా పాత్రములు. నీ ఆజ్ఞ అయినచో చంద్రావళి ఇంటికి వెళ్లిరానా” అను శ్రీకృష్ణుని మాటలను విని, రాధాజీ మిక్కిలి రోదించినది. శ్రీకృష్ణుని గాఢముగా కౌగిలించుకొని, వ్యాకులయై ‘వద్దు, వద్దు’ అనసాగినది. అట్టి రాధాజీ పలుకులను స్మరింతును.

రాధాజీపలికిన ఆపలుకులలో శ్రీకృష్ణుడు తనను ప్రార్థించుటవలన కలిగిన భావావేశము ప్రకటితమగుచున్నది.

**ద్వారప్రాప్తౌ సకల సుసఖీవృంద ఆభాతి భానౌ**
**విష్వక కోలాహలిని పతతాం వృంద ఇందౌ సుమందే**
**వృందారణ్య వ్రతతి భవనే రాధికా సంచుకోచ**
**హ్రీణాం కించిన్న హరిరహహాశ్లేషణే స్పందితాఽపి 12**

సఖీబృందము ద్వారము చెంత కూర్చుండియున్నారు. సూర్యుడు ఉదయిస్తూ ఉన్నాడు. పక్షులు ఇటునటు కోలాహలముగ ఎగురుతున్నాయి. చంద్రుని కాంతి క్షీణించింది. అపుడు శ్రీబృందావన లతాగృహములో ప్రాణేశ్వరుని ఆలింగనములో స్పందిస్తూ కూడా రాధాజీ సిగ్గుతో సంకోచిస్తున్నది. ఆహా! హరి రాధాజీ ఆలింగనములో నిశ్చేష్టుడైనాడు.

**శ్రీవృందావన కుంజభూషణ సదా వృందావనావిష్టధీః**
**శ్రీవృందావన నాగరోన్మద మహాప్రేమాంధ రాధాంకగ**
**శ్రీవృందావన మోహన స్మరసదా వృందాటవీ జీవన**
**శ్రీవృందావన చంద్రఖేల మమ హృత్ వ్యంజన్నికుంజేఽనిశమ్ 13**

హే శ్రీబృందావన కుంజభూషణా! నిత్య బృందావనావిష్ట చిత్తా! వృందావన నాగరా! ఉన్మద ప్రేమాంధ! శ్రీరాధాంక స్థితా! శ్రీబృందావన మన్మథ మన్మథా!

నిత్యవృందావన జీవనా! బృందావనచంద్రా! నిగూఢమైన నా హృదయ కుంజలో నిరంతరము క్రీడింపుము!

**క్వణత్ కనక కింకిణీ గణ ఝణంఝణత్ కారిణీ**
**రణత్ వలయ నూపురా వివిధ హస్తకైః మోహినీ**
**విచిత్ర పట భూషణా కృత విచిత్ర లాస్యాద్భుతా**
**విచిత్రయతి రాధికా స హరి సాలి వృందావనమ్ 14**

శ్రీయుగళము యొక్క స్వర్ణ కింకిణులు ఝణఝణ ధ్వని చేస్తున్నాయి. దానితో పాటు వలయిత నూపుర ధ్వని కూడ వినిపిస్తున్నది. అనేకములైన హస్తభంగిమలతో వారు మనసును మోహింప జేస్తున్నారు. కాంతిమంతములైన వస్త్రములను ధరించినారు. విచిత్రమైన అద్భుత లాస్యము (నృత్యము)ను చేస్తున్న శ్రీరాధ, శ్రీహరి, సఖీమణులతో కలసి శ్రీబృందావనము విచిత్రమును దర్శింపజేస్తున్నది.

**విచిత్ర రత్న చిత్రకాం విచిత్ర హార ముద్రికామ్**
**విచిత్ర పుష్పగుంఫితోచ్చలాంబుజాగ్ర వేణికామ్**
**స్మరామి రాసమండలే విచిత్రవేష రాధికామ్**
**విచిత్ర పింఛమౌళినా విచిత్ర నృత్య మోహనీమ్ 15**

శ్రీరాధాకృష్ణులు విచిత్ర రత్నములచే సుసజ్జితులై, విచిత్ర హారముద్రికాదులచే భూషితులైనారు. విచిత్ర పుష్పములతో కూర్చబడిన రాధాజీ జడకు అగ్రభాగమున కమలము ఒప్పుచుండ జడ ఊగుచున్నది. విచిత్ర నృత్యమును చేస్తున్న మోహినీరూపిణి, విచిత్రవేషధారిణి అయిన శ్రీరాధిక విచిత్ర మయూర పింఛధారియైన శ్రీకృష్ణునితో కలసి రాసమండలములో వెలుగుచున్నది. అట్టి శ్రీరాధను స్మరిస్తున్నాను.

**కలిందశైల నందినీతటే నటేంద్ర మండలీ**
**దురూహ సద్రసోల్లసత్ సుతాండవైక పండితమ్**
**సరోమహర్ష మండితం స్వయం రసాంధరాధయా**
**సురూప ఖండిత స్మరం స్వయం స్మరామి మాధవమ్ 16**

యమునా నదీ తీరములో నటేంద్రబృందమునకు కూడ దురూహ్యమైన ఉత్తమ రసోల్లాసి ఆ మాధవుడు! అతడు ఉత్కృష్టమైన తాండవకళలో పండితుడు. పులకరింతలతో అలంకృతుడైన ఆతడు తన రూప మాధుర్యము చేత మన్మథుని గర్వమును కూడ నాశము చేసినవాడు. రసవివశత్వముతో కనులు మూతపడియున్న రాధాజీతో కలసి ప్రకాశిస్తున్న అట్టి శ్రీకృష్ణుని స్మరిస్తున్నాను.

**అనంత యోజనోచ్ఛ్రిత ప్రసారిశాఖ నీపద్రుమస్య స్మర**
**శీతలే తలే విచిత్ర రాధయా విచిత్ర వేషం మాధవమ్ 17**

అనంత యోజనముల పర్యంతము వ్యాపించి, ఎత్తైన విస్తృతమైన శాఖలతో కూడిన కదంబ వృక్షము! ఆ వృక్షము యొక్క శీతలఛాయలో విచిత్రమైన రాధా సహితముగా విచిత్రవేషధారియై నిలచిన శ్రీమాధవుని స్మరింపుము!

శ్రీయుగళమునకు సంబంధించిన ప్రతి విషయము, ప్రతి వస్తువు విచిత్రమై, విస్మయజనకమై శ్రీప్రబోధానందులకు దర్శనమిచ్చుచున్నది.

**స్వర్ణాబ్జోద్భాసి కృష్ణాతట లలిత నవ స్వర్ణవల్లీ గృహాగ్రే**
**సంతప్త స్వర్ణవర్ణాంబరమురుమణిసన్నద్ధ సుస్వర్ణభూషామ్**
**మాలాం సుస్వర్ణపుష్పం దధదతి రుచిరాం స్వర్ణసచ్చంపకాభామ్**
**శ్రీరాధాం వీక్ష్య వీక్ష్య క్వణయన్ ముదితో మాధవః స్వర్ణవంశీమ్ 18**

శ్రీమాధవుడు స్వర్ణకమలములతో ప్రకాశిస్తున్న యమునా నదీ తీరమున ఉన్న ఉత్కృష్ట నూతన స్వర్ణలతాగృహమునకు వచ్చినాడు. స్వర్ణవర్ణ వస్త్రములు జారుచున్నవి. అనేక మణులతో కూడిన ఉత్తమ స్వర్ణ భూషణములను, స్వర్ణ పుష్పములతో కూర్చిన మాలను ధరించినాడు. అట్టి మాధవుడు అతిమనోహరమైన స్వర్ణచంపక కాంతితో వెలుగుచున్న శ్రీరాధను చూస్తూ చూస్తూ ఆనందముతో స్వర్ణ వంశీని మ్రోగింపసాగినాడు.

సర్వత్ర స్వర్ణవర్ణదర్శనమే! అనగా అణువణువున నిండియున్న శ్రీరాధారసకాంతిని శ్రీప్రబోధానందులు అనుభూతి చెందినారు.

**రాకాహిమకర కోటిచ్ఛవి వృందారణ్య శాఖి వృందాయ**
**మమ మన ఆనందాంబుధి కందాయ ప్రీత కృష్ణచంద్రాయ 19**

శ్రీబృందావనమునందలి వృక్షములు కోటికోటి పూర్ణిమా చంద్రుల కాంతి వంటి కాంతిని కలిగి ఉన్నాయి. ఆనంద సాగరమునకు మూల స్వరూపమై, శ్రీకృష్ణచంద్రునికి కూడ ప్రీతిని కలిగిస్తున్నాయి. కనుక నా మనసు వాని యందు లగ్నమై ఉన్నది.

**గౌరశ్యామ కిశోరౌ కాంచన కుతుకాన్మిథో మనశ్చోరౌ**
**ప్రేమగుణైః పరిబద్ధౌః వృందారణ్యే స్మర స్మరక్షుబ్ధౌ 20**

గౌరశ్యామాత్మకమైన ఒకానొక జంట ఒకరిపట్ల మరొకరు కుతూహలవశులై పరస్పరము చిత్తచోరులైనారు (ఒకరి మనసును మరొకరు దొంగిలించినారు). వారు బృందావనములో ప్రేమరజ్జువుచే బంధితులై అనంగ క్షుభితులైనారు. అట్టి శ్రీయుగళమును స్మరింపుము!

**హా కామక్రోధలోభాద్యతిబల బహులవ్యాల సంకీర్ణమేతత్**
**సంసారారణ్యమేతద్దశ దిశి విసరద్దుఃఖ దావానలౌఘమ్**
**కిం కుర్మః కుత్రయామో హరిహరి శరణం స్వస్య పశ్యామి నాన్యత్**
**శ్రీవృందారణ్య ధన్య స్తుత నిజకృపయా రక్షమాం త్వాముపేతమ్ 21**

హా! ఈ సంసారము అనెడు అరణ్యము కామక్రోధలోభాది అనేక బలవంతులైన జంతువులతో నిండియున్నది. దీనిచే దశదిశలలోను మిక్కిలి దుఃఖమును కలిగించు దావానలము వ్యాపించుచున్నది. నేను ఏమి చేయగలను ? ఎక్కడికి వెళ్లను ? హరిహరీ! నాకు ఇంక శరణమునీయగలవారు ఎవరును కనిపించుట లేదు. హే బృందావనమా! నీవు ధన్యవు, ప్రశంసనీయవు! శరణాగతుడనైన నన్ను కృపతో రక్షింపుము!

**కర్ణాలంబి లసత్ కదంబముకులః కాదంబినీ శ్యామలో**
**దివ్యః కోఽపి కిశోర ఉజ్జ్వల తడిత్ కోటిచ్ఛటాం కామపి**
**దివ్యామేకకిశోరికాం రసమయీమంకే సుపంకేరుహో**
**న్మీలత్ పత్ర విలోచనాం దధదహో వృందావనే నందతి 22**

ఓహో! చెవులకు అత్యంత సుందరమైన కదంబమొగ్గలను ధరించి ఒకానొక మేఘశ్యామల కిశోరుడు ప్రకాశిస్తున్నాడు. అచట కోటి విద్యుదుజ్వల దీప్తితో పూర్తిగా విచ్చుకొనని పద్మదళ నేత్రములతోనున్న ఒకానొక రసమయ దివ్యకిశోరిని అతడు తన ఒడిలోనికి తీసుకొని బృందావనములో ఆనందిస్తున్నాడు.

**ఏకం యత్ర చకాస్తి ధామ విలసత్ కాదంబినే శ్యామలమ్**
**విద్యుత్కోటి విడంబకద్యుతి పరం నిత్యావియుక్తం ద్వయమ్**
**అత్యంతం రస దుర్దినం నిరవధి వ్యాలుపాదేవాధ్వనః**
**సర్వాన్ భక్తినదీ ప్లవేన పరితస్తాం నౌమి వృందాటవీమ్ 23**

అచట మేఘశ్యామలమైన ఒక విలాసమూర్తి, కోటి విద్యుల్లతలను తిరస్కరించు మరియొక సుందరమూర్తి విరాజమానులైనారు. నిత్యసంయోగ స్థితిలో నుండు ఆ యుగళము వైదిక మార్గములన్నిటికిని అతీతముగ నిరంతరము ప్రేమరస వర్షమును కురిపిస్తున్నారు. అచట భక్తి అను నది బృందావనమను నౌక ద్వారా నాలుగు వైపుల నుండి ప్రవేశింపగలదు. అట్టి బృందావనమునకు నమస్కరిస్తున్నాను.

**అపరతః పురుషార్థ చతుష్టయ భగవతో భజనంచ భవేద్బహు**
**ధ్రువమిదంతు వినా వృషభానుజా వనమహో న మహోజ్జ్వలం భక్తయః24**

ధర్మార్థ కామమోక్షములనెడు చతుర్విధ పురుషార్థములు ఇతరేతర విధానముల ద్వారా లభించవచ్చును. భగవంతునికి బహువిధముల సేవ కూడ జరుగవచ్చును. కాని, ఈ రాధావనమును విడచి, ఇతర ప్రదేశములో మహోజ్వలమైన ప్రేమరసభక్తి లభింపదు. ఇది నిశ్చయము!

**అహహ జన్మ సహస్ర సమేధితైర్బహు తపో జపయోగ సమాధిభిః**
**అసులభ లభతేఽ ప్యధి రాధికా వనమయే నమయేదపి యః శిరః 25**

ఓహో! వేల జన్మల పర్యంతము జప, తప, యోగ, సమాధి స్థితులలో చేయు సాధనల వలన పొందలేని ఆ ప్రేమపురుషార్థమును ఈ రాధాకాననము (బృందావనము)నకు కేవలము శిరసువంచి నమస్కరించుట వలన పొందవచ్చును.

**కనక నీలమనీయరుక్ నవకిశోర సునాగరయోర్ద్వయమ్**
**ఉపరిదీప్తవనే చిదచిద్వనాద్రసమయే సమయే భజ 26**

స్వర్ణనీలకాంతివర్ణ విశిష్టమైన నవకిశోరనాగరయుగళము యొక్క చిదచిదాత్మకమైన గోలోకమునకు పైన బృందావనము ప్రకాశిస్తున్నది. ఉజ్వల రసపూర్ణమైన ఆ బృందావనమునందు ఆయా సమయములలో సేవింపుము!

**అతిసుఖాకరమద్భుత మాధురీభర ధురీణమురీకురుతే యది**
**రస భరాధిక వృందాకాననం సురసమాఽపి సమాపి చ తత్ కృతిః 27**

అతిసుఖకరము, అద్భుతము, మాధుర్యపూర్ణము, రసమయమునైన శ్రీబృందావనము ఒకవేళ దేనినైన అంగీకరిస్తే, ఆ కార్యము ఎంత అసాధ్యమైనది అయినను పూర్తి ఔతుందని తెలుసుకొనుడు!

**రహస్యానామేతత్ పరమ సురహస్యం హరి రసో**
**త్సవానామాశ్చర్యోన్మద రస విలాసోత్సవ మిదమ్**
**స్వరోచి నిత్యానామతి పరమనిత్యోజ్జ్వలమిదమ్**
**యదేతచ్ఛ్రీ వృందావనమిహ దృశౌ నందయతి నః 28**

శ్రీధామము రహస్యములకు పరమరహస్యము, హరిరసోత్సవముల కన్నను ఆశ్చర్యకరమైన ఉన్మదరస విలాసోత్సవమును ప్రదానము చేయునట్టిది. స్వయం ప్రకాశకమైన నిత్య వస్తువులకన్నను అధికముగ నిత్య ఉజ్వలమైన ఈ బృందావనము మా నేత్రములకు ఆనందమునిచ్చుచున్నది.

**అయే దృష్టిం దూరాదతి విసృజ దుష్టాం గుణమయీ**
**తథా బ్రహ్మజ్యోతిర్మయ వరదృశ నాఽపి విమృశ**
**న దృష్టిర్నిష్ఠాంతే భజతు భగవజ్జ్యోతిరుదితామ్**
**పరం వృందారణ్యోజ్జ్వల రసదృగేవాస్తు భవతః 29**

ఓహో! దుష్ట గుణములతో కూడిన దృష్టిని దూరము నుండియే త్యజించు. బ్రహ్మజ్యోతి యొక్క పూర్ణదర్శనమును పొందవలెనను చింత కూడ వద్దు. భగవజ్జ్యోతి ఉదయింపవలెనను నిష్ఠతో కూడిన ఆలోచనయు వద్దు. కాని, నీ నేత్రములు ఈ బృందావన ఉజ్వల రస దర్శనము చేత సఫలమగునుగాక!

**శ్రీవృందారణ్య వీథ్యామపి సఖి! కలయాశ్చర్యం పున్నాగ శోభామ్**
**లోభాదత్రైవ నేత్రే మమ రసవివశే ఖేలతోఽన్యత్ర నైతః**
**ఏతన్నిత్యం మమ స్థాపయ కర నికటేఽనేక సమ్యక్ గుణం చ**
**ప్రేమ్ణా సంగ్రథ్య కంఠాదిషు నివిదధతీ స్వేన సమ్మోహినీ స్యామ్ 30**

ఓ సఖీ! బృందావన వీథిలో ఆశ్చర్యకరమైన పున్నాగ (పుష్పము – శ్రేష్ఠ పురుషుడు) యొక్క శోభకై నిరీక్షింపుము! లోభవశము చేత నా నేత్రములు రసవివశమై ఇక్కడే చరించుచున్నవి, అన్యత్ర వెళ్లుట లేదు. ఈ పురుష శ్రేష్ఠుడు నిరంతరము నాకు సమీపములోనే ఉన్నాడు, అనేకములైన ఉత్తమ గుణములు (త్రాళ్లు) కూడ ఉన్నాయి. వానితో ప్రేమ పూర్వకముగ మాలను అల్లి, స్వయముగా మెడలో వేసి ఆనందమును పొందుదునుగాక!

రాధాజీ సఖితో శ్రీకృష్ణుని గూర్చి ప్రత్యక్షముగా చెప్పక, పున్నాగ పుష్పమును నెపముగా చేసుకొని, ఆతని శోభను వర్ణించినది. శ్రీకృష్ణుని వశము చేసికొనగల రజ్జువు తన చేతిలోనే ఉన్నదని చెప్పుచు, ఆతనికై స్వయముగా పూమాలను అల్లినది.

**రాధే తారల్యమేవం న కురుహృది సమాధేహి గంభీరభావమ్**
**లజ్జాం కాంచిత్ సఖీభ్యః కురు పురుషవర స్త్వత్ పదాబ్జం దధాతు**
**క్రూరే పున్నాగ నామద్రుమ కుసుమమియం వక్తితత్రాన్యథా తే**
**శంకాస్తా నేతిరాధా గిరమనుతదిమాముక్తి మాల్యాం స్మరామి 31**

"హేరాధా! ఈ విథముగా సున్నితత్వమును చూపింపకు. హృదయములో గాంభీర్యమును వహించు. సఖియల వద్ద కొంత సిగ్గును చూపించు. ఆ పురుష శ్రేష్ఠుడు నీ పదపద్మమును (శిరసుపై) ధరిస్తాడు" అని ఒక సఖి పలికింది. వేరొక సఖి "అరే క్రూర హృదయా! 'పున్నాగ' నామక వృక్షము యొక్క కథను శ్రీరాధ

చెప్పింది. వేరు విధముగా జరిగినా జరుగవచ్చు. సందేహం అక్కరలేదు” అని సమాధానం ఇచ్చింది. ఈ ప్రకారమైన పరస్పర సంభాషణారూపమైన మాలను నేను స్మరిస్తున్నాను.

పూర్వ శ్లోకములో రాధాజీ పలికిన పలుకులను విన్న సఖి ఇప్పుడు ‘కృష్ణుని చెంత గాంభీర్యమును ప్రదర్శింపుమ’ని రాధాజీతో అన్నది. అందుకు రెండవ సఖి ‘ఆయనగారి కథలను విన్నాములే’ అంటూ పరిహాసం చేసింది. అద్భుతమైన ఈ లీలను దర్శిస్తూ శ్రీప్రబోధానందులు పొందిన ఆనందానుభూతి ఈ శ్లోకములలో స్పష్టమగుచున్నది.

తరువాతి రెండు శ్లోకములలోని వర్ణనను చూడగా ఒక మహా సుందర లీల జరుగుచున్నట్లును, ఆ లీలను శ్రీప్రబోధానందులు సఖియై దర్శించుచు దయతో మనకు అందించినట్లును తోస్తున్నది. అంతేకాదు, శ్రీకృష్ణునితో సహా సమస్త జగత్తులకును స్వామినియైన రాధాజీ సఖీమణులకు ఎంతటి చనవునిచ్చి ఆదరిస్తుందో కూడ తెలుస్తున్నది.

**శ్రీవృందావన వీథికాసు కుసుమేషూచ్చైర్గృహావేశతా**
**రాధే త్వం తరలాస్యతీవ యదహో శశ్వత్ సఖీనాం పురః**
**సంగృహ్య ప్రియకం మనోజ్ఞ తిలకం సద్బంధుజీవం రహ**
**స్యుత్సంగే స్వయమున్మదా చ పరతో భృంగాన్వితా భ్రామ్యసి 32**

“హే రాధే! శ్రీబృందావన వీథులలో సుందరపుష్పములతో శోభిస్తున్న మనోహర గృహములో కూర్చుండి నీవు మిక్కిలి చంచలవై ఉన్నావు. హా! కనుకనే నీవు సఖియల ముందు ప్రియక, తిలక పుష్పములను; బంధు జీవ (బంధులీ) అను పుష్పములను చేగొని బయలు దేరినావు.” (ప్రియక అనగా ప్రియతముడు, తిలక అనగా తిలకధారి, బంధుజీవ అనగా ప్రాణబంధువు అను కృష్ణపరమైన

అర్థమును సఖి ఉద్దేశించినది.) సఖి ఇంకను ఇట్లనుచున్నది : “వీనినన్నిటిని ఒడిలో పెట్టుకొని ఉన్మత్తవై ఒక భ్రమరము (నాయకుని)తో కూడినదానివై నీవు సంచరిస్తున్నావు.”

శ్రీకృష్ణునికై చంచలిస్తూ వేచియున్న రాధాజీని సఖి పరిహాసమాడుట ఈ లీలలో గోచరిస్తున్నది.

**మిథ్యావాదినీ! కిం ముధా ప్రలపసి ? ప్రత్యక్షమేతత్ కథమ్**
**సఖ్యః పశ్యతకిం తదాహ యదియం కింవాఽహ సా పృచ్ఛతామ్**
**ఏవం సత్యమిదం కథం ప్రకుపితాస్యేవం సఖీనాం గిరా**
**నాసాగ్రార్పిత తర్జనీకమహసద్రాధా శిరః కంపినీ 33**

“ఓ మిథ్యావాదినీ! ఎందుకు మిథ్యావచనములు పలుకుతున్నావు ? ఆ మాటలను ఎట్లు ఋజువు చేయగలవు ?” ఒక సఖి రాధాజీతో ఇట్లనుచు; “సఖులారా! మీరే చూడండి! ఆమె ఏది చెప్తున్నదో అది సత్యమా!” అని అడిగినది. “ఔను, అది సత్యము! నీవు ఎందుకు కోపగించుకుంటున్నావు ?” అని శ్రీరాధా పక్షమును వహించి మిగిలిన సఖులు సమాధానమిచ్చినారు. సఖియల ఈ మాటలను వింటున్న రాధాజీ తలనూపుచు, ముక్కుపై వేలునుంచి (ఇక చాలు అన్నట్లు) నవ్వసాగినది. (నేను ఈ లీలను స్మరిస్తున్నాను.)

ఎంత అద్భుత లీల! భువన భాండములన్నిటికిని స్వామినియైన రాధాజీ సఖీమణులకు అనుగ్రహించిన ఆ చనవు ఊహాతీతమై వెలుగుచున్నది.

**ఉపర్యుపరి సంభవన్నవ నవ విచిత్ర వల్లీ ద్రుమా**
**ముపర్యుపరి సంప్రఫుల్లిత విచిత్ర పుష్పోత్కరామ్**
**ఉపర్యుపరి రాధికా హరి విచిత్ర కామోత్సవా**
**ముపర్యోపరి సచ్చమత్కృతిముపాస్వ వృందాటవీమ్ 34**

శ్రీబృందావనము నిత్యనూతనమైన, విచిత్రమైన లతావృక్షాదులతో అత్యున్నతముగా ఉన్నది. ఒక రోజుకన్న మరొక రోజు మిక్కిలి శ్రేష్ఠమైన, వికసిత, విచిత్ర పుష్పములతో అలంకృతమై ఉన్నది. మహోన్నతమైన శ్రీశ్యామాశ్యాముల విచిత్రకామోత్సవముచే భూషితమైనది. అట్టి అత్యద్భుత సుందర చమత్కారియైన శ్రీబృందావనమును ఉపాసింపుము!

**రసాంధహరి రాధికాం రసప్రఫుల్ల వల్లీద్రుమమ్**
**రస ప్రసర ఖేలితోత్కల కలః ఖగైరాకులమ్**
**రసోల్లసిత వల్లవీగణ మహారసోద్యత్ స్మరమ్**
**స్మరామి రసవిహ్వలం సరలమేవ వృందావనమ్** **35**

శ్రీబృందావనములో శ్రీరాధాకృష్ణులు రసోన్మత్తతచే కనులుమూతపడి ఉన్నారు. వృక్షలతలు రసముచే బాగుగా వికసించినవి. అనేకములైన రసక్రీడలచే మత్తిల్లి సుందరమైన ధ్వనిని చేస్తున్న పక్షులు అట సంచరించుచున్నవి. రసోల్లసితులైన గోపికామణులు మహారాసయందలి ప్రేమ క్రీడను వ్యంజింపచేస్తున్నారు. రస విహ్వలమైన వస్తువులతో నిండియున్న అట్టి బృందావనమును స్మరిస్తున్నాను.

**నిరంతర దిగంతర ప్రసృమరైః పరాగోత్కరైః**
**నిరంకుశ విదూరగైరతి మహాద్భుతైః సౌరభైః**
**మహాతరువరోజ్జ్వలచ్ఛవి భరైర్విచిత్రైరపి**
**స్మరామ్యతిచమత్కృతాం చిత్ మృత్యోఘ వృందాటవీమ్** **36**

శ్రీబృందావనములో నిరంతరము పరాగము ఇటునటు వ్యాపిస్తూ ఉంటుంది. నిరంతరము మహాద్భుతమైన సౌరభము ఎంతయో దూరము వరకు ప్రసరిస్తూ ఉంటుంది. విచిత్రమైన మహాతరువుల ఉజ్వలకాంతి అతిచమత్కార పూర్ణచిదమృతమును ప్రవహింపజేస్తూ ఉంటుంది. అట్టి శ్రీబృందావనమును స్మరిస్తున్నాను.

**మహోన్మద రసావశే మహసి కృష్ణ రాధాభిధే**
**ద్వయే సహజ సంయుజి ప్రణయ పూరభాజి స్వతః**
**అసంవృత కచాంబరే గురుతర స్మరాడంబరే**
**స్వకృత్య పరిమోహితాం స్మర సఖీషు వృందావనే 37**

శ్రీరాధాకృష్ణ నామక యుగళము మహా ఉన్మదమైన రసముచే వివశులైనారు. ఇరువురు తమకు స్వాభావికమైన సహజసంయోగము యొక్క ప్రేమ ప్రవాహములో తేలియాడుచు, విడివడిన తమ కేశరాశిని, వస్త్రములను కూడ సరిచేసుకొన లేకున్నారు. ప్రేమగాఢత వలన ఇద్దరును వడలిపోయినారు. ఇది చూచి బృందావనములో, సఖియలలో ఒక సఖి తన కార్యము నుండి విమోహిత అయినది. (అనగా తాను చేయుచున్న పనిని కూడ మరిచిపోయినది.) ఇట్టి దృశ్యమును స్మరింపుము!

**గత్వాద్విత్రి పదాని తిష్ఠతి పదే దర్భాంకురేణ క్షతే**
**ఇత్యుక్త్వాథ భవేత్ వివృత్త వదనా చామోచయన్త్యంచలమ్**
**శాఖాయామవిషక్తమప్యభిముఖంచేక్షేత కించిన్ మృషా**
**సగ్‌దర్శేతి హరౌ సుభావౌత్యం ........................... 38**

పదయుగళికి దర్భాంకురము గుచ్చుకొనుట వలన రెండు, మూడు అడుగులకే ఆగిపోవుచు; వస్త్రములకు కొమ్మ తగుల్కొనకపోయినను మాటిమాటికి తిరుగుచు, వంగుచు, వెనుకకు చూచుచు – ఈ విధముగా మిథ్యా వచనములను చెప్పుచు, ఎవరినో చూచుటకై ఆగుచు; మాటిమాటికి శ్రీశ్యామసుందరుని చూడసాగినది. ఈ ప్రకారముగా ...............................!

రాధాజీ వనములలో విహరించుచు, వెనువెనుక శ్యామసుందరుడు వచ్చుచున్నాడో లేడో గమనించుచుండుటను శ్రీప్రబోధానందులు మనోహరముగ

వర్ణించినారు. శ్లోకములోని నాల్గవ పాదము సగమే లభించుటచే అంతవరకే అందించినను భావము పరిపుష్టముగనే ఉన్నది.

**........................................................**

**.............. వైదగ్ధీనాం రతిషు వితతీరద్భుతా భాయయంతౌ**

**ఆవిర్భానౌ ప్రతిపద చమత్కారిణీరూపశోభా**

**లోభాన్నో భావయతు హృదతి ప్రేమ వృందావనేశౌ 39**

...... శ్రీయుగళ కిశోరులు రతివిలాసాదుల యందు విదగ్ధతతో కూడిన అద్భుత చేష్టలతో పరస్పరము భావమును ఉద్దీప్తము చేయుచుందురు. ప్రతి పద చమత్కారిణియైన రూపశోభతో వెలుగొందుచుందురు. ప్రేమపూర్ణమైన శ్రీబృందావనమునకు ఈశ్వరులైన యుగళ కిశోరులు లోభముతో నున్న మా హృదయమునకు భావము నిత్తురుగాక!

ఈ శ్లోకములో కూడ మొదటి పాదము లభింపలేదు.

**ఏక ప్రాణం తదతి మధురం ద్వంద్వమేకాత్మభావ**

**మేకాక్రీడం నిరవధి సమున్మీలదేక స్మరార్తి**

**ఏకానంద ప్రణయ సుషమాధ్యేక సర్వేంద్రియేహమ్**

**వృందారణ్యేఽద్భుత రసమయం గౌరనీలం స్మరామి 40**

అత్యంత మధుర స్వరూపులైన శ్రీయుగళము ఏకప్రాణము, ఏకాత్మభావము, ఏకక్రీడాపరాయణ తత్త్వమునై ఉన్నారు. వారు నిరంతరము ఒకే ప్రేమార్తి యొక్క ప్రకాశమును ప్రకటిస్తూ ఉంటారు. వారు ఒకే ఆనందము యొక్క ప్రణయ శోభా స్వరూపులు! ఇరువురి సర్వేంద్రియముల చేష్టలు ఒకే ప్రకారముగ ఉంటాయి. శ్రీబృందావనములో ఈ ప్రకారముగా వెలుగుచున్న అద్భుత, రసమయ, గౌరనీలాత్మకమైన శ్రీయుగళమును స్మరిస్తున్నాను.

**...................................................**

**...................................................**

**....... శ్రీమద్బృందావన పరివృఢౌ ప్రేమమూర్త్యాంజలీభిః**
**వృందౌక్తయేవం స్మరసుహసితస్ఫారనేత్రౌ కిశోరౌ 41**

**తద్భావైర్విహిత పరమోపాసనాత్ ప్రేమ వృందా**
**రణ్యేఽ ద్యాతి క్షత తనుదృశౌ దివ్యతత్తత్ స్వరూపైః**
**ఆవిర్భూతౌ నిజరతివనే ద్రష్టుముత్కంఠమానౌ**
**వృందా విజ్ఞాపనమనుచలౌ నౌమి వృందావనేశౌ 42**

ఆయా సమయములకు అనుకూలమైన భావముతో ప్రేమమయమైన శ్రీబృందావనము విహితమైన పరమ ఉపాసనను చేస్తున్నది. ఆ రతివనములో ఆ దివ్య స్వరూపులు (యుగళము) తమ శరీరములపై కలిగిన నఖ క్షతములను, కరగిపోయిన కాటుక రేఖలను పరస్పరము చూచుకొనుచు ఉత్కంఠితులైనారు. బృందాదేవి చెప్పిన ప్రకారము సంచరించుచున్న శ్రీబృందావనేశ్వర యుగళమును స్తుతిస్తున్నాను. (41, 42)

**నవ్యోద్భూత ప్రతతి నిలయే నూతన వ్యక్త వల్లీ**
**వృక్షోదార ప్రసర నివహైః నవ్యదాస్యాలి క్లప్తామ్**
**భూషాం విభ్రత్తదుభయమహో దర్శయత్యుర్వ లీలామ్**
**వృందారణ్యే చలదనుసరేత్ గౌరనీలం మమాత్మా 43**

క్రొత్తగా ప్రకటితమైన లతాగృహమునందు నూతన లతా వృక్షాదులతో, ఉత్కృష్టమైన పల్లవ పుష్పాదికములతో, నూతన దాసీమణి చేసిన అలంకారముతో గౌరనీలవర్ణులైన యుగళ కిశోరులు వెలుగుచున్నారు. ఆ శ్రీయుగళము బృందావనములో విహరిస్తూ యథేష్టలీలలను ప్రకటిస్తున్నారు. నా ఆత్మ వారిని అనుసరించునుగాక!

**నవ ప్రకట వల్లవీః సముపశిక్ష్య ముఖ్యాలిభిః**
**నిజం నిజమనన్యగాద్భుతతమం కలా కౌశలమ్**
**విచిత్ర ధృత నామికం సముపహృత్య తత్సేవయా**
**స్మరామి ముదమాపితం ద్వివరధామ వృందావనే 44**

శ్రీయుగళ కిశోరులు ముఖ్య సఖీమణులకు, కొత్తగా ప్రకటితమైన (వచ్చిన) గోపికలకు తమ అనన్య అద్భుతతమ కళాకుశలత్వములో శిక్షణ నిస్తున్నారు. వారిని విచిత్రనామములతో చేరబిలచి, వారి సేవలను స్వీకరించి ఆనందమగ్నులను చేస్తున్నారు. బృందావనములోనున్న అట్టి శ్రీయుగళమును నేను స్మరిస్తున్నాను.

**అవ్యాద్దివ్య విచిత్ర రత్నఖచిత ప్రద్యోతి పీతాంబరః**
**కాంచీనూపురహార కుండల వరగ్రీవాంగులీయోజ్జ్వలః**
**దివ్యాన్యంగద కంకణాని తిలకం రత్నైర్విచిత్రం దధత్**
**పుష్ప స్రగ్ యుత బర్హచూడ ఉరుధా ప్రోత్సర్పదంగచ్ఛవిః 45**

శ్రీకృష్ణుడు దివ్యమైన, విచిత్రమైన, రత్నఖచితమైన ఉజ్వల పీతాంబరములను ధరించియున్నాడు. కాంచీ, నూపుర, హార, కుండల, కంఠహారాదులతో వెలుగుచున్నాడు. దివ్యమైన అంగద, కంకణములతోను; రత్నమయమైన విచిత్ర తిలకముతోను ఒప్పుచున్నాడు. పుష్పమాలికలతో అలంకృతుడై, మయూర పింఛమును ముకుటముగా ధరించిన శ్రీశ్యాముని ప్రత్యంగము నుండి కాంతి ప్రసరిస్తున్నది. అట్టి శ్యామసుందరుడు మమ్ము పాలించునుగాక!

**కాలిందీ పులినే సురద్రుమతలే శ్రీభాజి దివ్యోపరి**
**భ్రాజచ్చిత్ర వితానకే మణిమయ భ్రాజత్ప్రదీపే హరిః**
**గోపీభిః కృతగీతవాదన భరే ప్రోత్సారితాంతః పటః**
**పుష్పాంజల్యుపహార ఆత్త మురళీరంగప్రవిష్టో రసః 46**

శ్రీహరి కాళిందీనదీ తీరములో అత్యంత సుందరమైన కల్పవృక్షము క్రింద ఏర్పరచిన దివ్యవిచిత్ర చంద్రాతప వేదికపై విరాజితుడైనాడు. అంతయు మణిమయ కాంతులతో దీప్తిమంతమై ప్రకాశిస్తున్నది. గోపీమణులు సంగీత వాద్యాదులతో మిక్కిలి ఉత్సాహితులై అంతర్భాగములో పుష్పాంజలిని కానుకగా సమర్పించినారు. అపుడు రసరాజైన శ్రీకృష్ణుడు మురళిని చేతులలోనికి తీసుకొని 'రసరంగమంచె' పై ఉపస్థితుడై వారి కానుకలను స్వీకరించినాడు.

**వృందయాఽభి పాలితాఽతి దివ్యకేలికాననే**
**స్వర్ణ రత్న దివ్యగంధ మేదురావనీతలే**
**దివ్యసత్ప్రసూనరత్న శాఖిమండలావృతే**
**ఛాయయాఽతి శోభనే మునీంద్రవృందలోభనే 47**

శ్రీబృందాదేవిచే చక్కగా రక్షితమైన దివ్యకేళీవనములో స్వర్ణరత్నఖచితమైన, దివ్యగంధ పూర్ణమైన ఆ భూమి వెలుగుచున్నది. అచట దివ్యకుసుమములతో కూడి, మండలాకృతిలోనున్న వృక్షముల నీడలో అతిమనోహరము, మునీంద్రుల మనసులను లోభింపజేయునదియైన –

ఈ 47వ శ్లోకము నుండి 55వ శ్లోకము వరకు బృందా స్తుతి పరివ్యాప్తమై ఉన్నది.

**మందమంద సత్కళిందనందినీయ సుందరో**
**త్ఫుల్లితారవింద వృంద గంధబంధు వాయునా**
**వార్షభానవీ నవీన కేలిరంగ సంగత**
**స్వేదబిందు కందలేశ వంద్య పుణ్యరాశినా 48**

యమునా తటమున వికసించిన కమలముల సువాసనను వహించి మృదుమంద వాయువు వీస్తున్నది. శ్రీరాధా నూతన కేళీ విలాస సాంగత్యముచే ఉత్పన్నమైన స్వేదబిందు లేశమును పొందుగోరుచున్న పుణ్యరాశి –

**సర్వవేదమౌళి వర్గ దుర్గమాతి వైభవే**
**నామమాత్ర సత్పుమర్థరాశిరాశి వర్షణే**
**సర్వతీర్థ దుర్విభావ్య దివ్యపుష్ప పల్లవే**
**దివ్యజాలకేన దివ్యగుచ్ఛకైశ్చ భూషితే 49**

సమస్త వేద శిరోమణి బృందములును పొందలేని విభూతులను కలిగినది, నామోచ్చారణ మాత్రమున సమస్త పురుషార్థములను వర్షించునది, సమస్త తీర్థముల భావనకు అతీతమైన దివ్య పుష్ప పల్లవములతో, మొగ్గలతో, గుచ్ఛములతో భూషితమైనది –

**దివ్యవల్లి శాఖిభిః సమున్మదాలిఝంకృతైః**
**మత్త దివ్యకీర కోకిలాది దివ్యకూజితైః**
**దివ్య చిత్ర సంచరన్మృగీ ససంభ్రమేక్షితైః**
**స్ఫీత బహ్వనర్ఘ రత్న దివ్యభూమి మండలే 50**

దివ్యమైన లతా వృక్షాదికముల శోభతోను; ఉన్మదమైన భ్రమరముల ఝంకారముతోను; మత్తిల్లిన దివ్య శుక కోకిలాదుల దివ్యకూజితములతోను; దివ్యవిచిత్ర సంచరణ మృగముల సంభ్రమముతో కూడిన చూపులతోను; మనోహరమైన, అత్యంత అమూల్యమైన మణిరత్నములతో ఖచితమైన దివ్య ప్రదేశములతోను –

**సత్కవీంద్రకోటి కావ్య వర్ణనాతి దూరగైః**
**దివ్యహేమ నిర్మితాఽతి దివ్యవైభవైర్నగైః**
**దివ్యరత్నఖాని దివ్యగైరికాది ధాతుభిః**
**దివ్యకందరాతిసౌభగేచ విశ్వగార్చితైః 51**

ఉత్తమోత్తమ కవీంద్రుల కోటికోటి వర్ణనలకు అతీతమై; దివ్యస్వర్ణ నిర్మితమైన, అత్యంత సంపత్తిశాలియైన పర్వతములతో శోభిస్తూ; దివ్యరత్నఖనియై, దివ్యగైరికాది ధాతువులచే సర్వత్ర అత్యంత పూజనీయమైన గుహలతో భూషితమై –

**తైలవర్తిశూన్య దివ్యకేలి దీపకౌషధైః**
**దివ్య సత్సుధాతిమిష్ట వారిపూరి పూరితైః**
**దివ్య సత్సరోవరైః ప్రఫుల్లదివ్య పంకజైః**
**దివ్య కైరవాది పుష్పనిత్య ముగ్ధషట్పదైః 52**

దివ్యకేళిని ప్రదీప్తము చేయుటకు తైలము, వత్తి అవసరములేని ఓషధీ దీపములతో కూడినదియు; ఉత్కృష్టమైన దివ్య అమృతముకన్న తీయని జలములతో పూర్ణమైనదియు; దివ్యమైన అద్భుత సరోవరములతో శోభిస్తూ, వికసించిన దివ్యకమలములతో విరాజిల్లుచున్నదియు; దివ్యములైన కైరవాది పుష్పములపై వాలిన భ్రమరములను విముగ్ధము చేయు శోభా సమృద్ధికలదియునైన –

**దివ్యహంస సారసాది దివ్యనాద శోభితైః**
**నిత్యశోభితైరతీవ శోభితే సమంతతః**
**దివ్యహేమరత్న వల్లికుంజపుంజ మంజులే**
**దివ్య రత్న వేదికాభిరద్భుతాభిరుజ్జ్వలే 53**

దివ్యమైన హంస సారసాదుల దివ్యనాదముతో శోభించుచున్నదియు, నిత్యశోభామయ వస్తువులతో సర్వత్ర మిక్కిలి శోభించుచున్నదియు, దివ్య స్వర్ణ రత్నమయ లతాకుంజలతో మనోహరమైన అద్భుత దివ్య రత్నవేదికలతో సముజ్జ్వలమైనదియు –

**మంతు కోటిపాత్ర జంతుమాత్ర ముక్తిదాయకే**
**నాయకేన గోపసుభ్రువాం సదైవ సేవితే**
**దివ్యభాస దివ్యవాస కుట్టిమైః సుశోభితే**
**దివ్యనవ్య గోపసుందరీ విలాస మందిరే 54**

కోటి తీవ్ర అపరాధములు చేసిన జీవులకు కూడ ముక్తిదాయకమైనది, గోపీమణుల నాయకుని (కృష్ణుని)చే సదా సేవింపబడునది, దివ్యకాంతితో కూడిన దివ్యప్రదేశములతో సుశోభితమైనది, నవీన గోపసుందరుల విలాస మందిరములచే –

**దివ్యభావ భేదభాసి దివ్యసల్లతావృతే**
**దివ్యమాధురీధురీణ దివ్యకామ కౌతుకే**
**దివ్య సర్వచిద్విలాస వైభవాతి వైభవే**
**శ్రీవనే విహారిణం హరిం స్మరామి నిత్యశః 55**

దివ్య భావ భేదము నందు ప్రకాశించునట్టి, దివ్య సుందర లతలచే ఆవృతమైనట్టి, దివ్యమాధుర్యమయ ప్రేమ కుతూహలముతో కూడినట్టి, దివ్యచిన్మయ విలాసపూర్ణమైనట్టి, సమస్త విభూతులతో పూర్ణమైనట్టి శ్రీబృందావనములో విహరించు శ్రీహరిని నిత్యము స్మరింపుము!

శ్రీ ప్రబోధానందులు 47వ శ్లోకము నుండి 55వ శ్లోకము వరకు శ్రీబృందావన దివ్యశోభను అత్యంత దివ్యరీతిలో వర్ణించినారు. 'బృందావనము' అను పదమును ఉచ్చరింపకయే, ఆ లక్షణములను చెప్పుట ద్వారా స్ఫురింప జేసినారు. 55వ శ్లోకములో 'అట్టి బృందావనము' అనుచు, అట విహరించు శ్రీకృష్ణుని స్మరింపుడని హితవు చెప్పినారు.

**దివ్యలీలాయాతివేలముల్లసంత మద్భుతమ్**
**దివ్యవేష రాధయా రసాంధయాఽనిశం యుతమ్**
**దివ్యవేదికా చతుష్కమండలేఽను ఖేలినమ్**
**కందుకాది ఖేలయా తయైవసార్థముద్ధతమ్** **56**

దివ్యలీల యందు ఎల్లలులేని ఉల్లాసమునందు పరాయణుడైనట్టి; రసవివశయైన, అద్భుత దివ్య స్వరూపిణియైన రాధాజీతో నిరంతరము కూడియుండునట్టి; దివ్యవేదికపై క్రీడా పరాయణయైన శ్రీరాధతో కలసి కందుకాది (బంతి ఆట) ఆటలను ఆడుటలో ఉద్ధతమైనట్టి –

**తం కిశోర చంద్రమేక దివ్యరూప సౌభగమ్**
**దివ్యహాస్య దివ్యలాస్య దివ్యనర్మ కౌశలమ్**
**దివ్యలోచన త్రిభాగ దివ్యభంగి వీక్షకమ్**
**దివ్యమండనాది భూషితాంగ భంగిలోభనమ్** **57**

శ్రీకిశోర చంద్రుడు (శ్రీకృష్ణుడు) అత్యంత దివ్యమైన రూప సౌభాగ్యము కలవాడు. దివ్యహాసము, దివ్యలాస్యము, దివ్యనర్మ కుశలత్వము కలవాడు. దివ్యనేత్రము యొక్క క్రీగంటి చూపును కలిగి దివ్యభంగిమతో చూచువాడు. దివ్యాలంకారములచే భూషితమైన అంగభంగిమలతో అత్యంతలోభమును కలిగించు అట్టి కిశోరచంద్రుని స్మరిస్తున్నాను.

**భ్రూవిలాస ముగ్ధదివ్య కామరాజ కార్ముకమ్**
**దివ్యదృష్టి దిగ్ధమాత్ర విద్ధముగ్ధ యౌవనమ్**
**ఉల్లసత్ కురంగ భృంగ మీన హీనతాకరమ్**
**రాధికాముఖేందు దృష్టి వర్ధి లోభసాగరమ్** **58**

శ్రీరాధాముఖచంద్రుని భ్రూవిలాసము చేత దివ్యకామరాజ కార్ముకము తిరస్కృతం ఔతున్నది. ఆమె చూపు అనెడు బాణ ప్రయోగమాత్రము చేత సుందరీమణుల యౌవనము తిరస్కరింపబడుతుంది. (అంటే, ఆ ఒక్క చూపే సౌందర్యవతుల సౌందర్యము కన్న మించినది అని భావము.) రాధాజీ ఉల్లసిత హరిణమును (చకితదృష్టితో), భ్రమరమును (ముంగురులతో), మీనమును (అనిమిష దృష్టితో) పరాజితము చేస్తున్నది. అట్టి రాధాముఖచంద్రుని దర్శించి లోభము అనెడు సాగరము వృద్ధి చెందుతున్నది.

**రాధికా కటాక్షబాణ విద్ధమర్మ విహ్వలమ్**
**రాధికాధరామృతాశనైకతాన్ మానసమ్**
**ఖంజనాతి గర్వభంజనాతి చారులోచనమ్**
**విభ్రతం సుజాతపద్మ సద్మకాంతి మోచనమ్ 59**

శ్రీరాధా కటాక్షవీక్షణము ఆతనికి (కృష్ణునికి) మర్మభేదనము చేస్తుంది. అతడు విహ్వలుడు ఔతాడు. శ్రీరాధా అధరామృత పానమునకై ఆతని మనసు ఉద్విగ్నమౌతుంది. ఆమె అందమైన కన్నులు ఖంజనపక్షి గర్వమును నశింపజేస్తాయి. పద్మము నివాసముగా కల లక్ష్మీదేవి యొక్క కాంతిని కూడ శ్రీరాధాకాంతి తిరస్కరిస్తుంది.

లక్ష్మీకళకన్నను శ్రీరాధాకాంతి కళ అత్యంత అధికము అని భావము.

**పూర్ణచంద్రబింబకోటి చారువక్త్ర మండలమ్**
**మందమంద చారుహాస నింద్యకుంద కుట్మలమ్**
**దివ్యకుంకుమాగురు ప్రలేపలిప్త దోర్లతమ్**
**దివ్యరత్న కంకణాది భూషణౌఘ భూషితమ్ 60**

అందమైన ఆమె (శ్రీరాధ) ముఖమండలము కోటి పూర్ణచంద్రుల కన్న అధిక మనోహరముగా ఉన్నది. ఆ మధురమందహాస శోభ కుందమొగ్గలను పరాజితము చేస్తున్నది. దివ్యమైన కుంకుమ, అగరు మున్నగు లేపనములతో బాహులతలు శోభిస్తున్నాయి. దివ్యరత్నమయ కంకణములు మున్నగు వివిధ భూషణములతో (శ్రీరాధ) భూషితయై ఉన్నది.

**క్షిప్త దివ్య హార నిష్క కౌస్తుభాది చంద్రికమ్**
**గంధలిప్త వక్ష ఆత్త రాధికాంఘ్రి పల్లవమ్**
**రాధికా విచిత్ర వేషభూషణాది తత్పరమ్**
**రాధయాభిలింగనాత్ గతాంచి రోమ విగ్రహమ్ 61**

అతడు (శ్రీకృష్ణుడు) తాను ధరించిన దివ్యమైన హార, కనకకౌస్తుభాదిక ఆభరణముల కాంతితో ప్రకాశిస్తున్నాడు. గంధలేపనము చేసికొన్న తన వక్షస్థలముపై శ్రీరాధా పద పల్లవములను ధరించినాడు. శ్రీరాధను విచిత్రవేషభూషాదులతో అలంకరించుటలో తత్పరుడై ఉన్నాడు. శ్రీరాధా ఆలింగనముచే ఆతని సర్వాంగములు పులకరింతలతో శోభిస్తున్నవి.

**రాధయాఽతిరత్యగాధయా స్మరోన్మదాంధయా**
**నవ్యకామకేలికల్పయా కలా విదగ్ధయా**
**తం విదగ్ధ శేఖరం మహాస్మరోత్సవే రతమ్**
**ప్రేమ విహ్వాలాలి వృంద సంతతాశిషా భృతమ్ 62**

శ్రీరాధ అత్యంత ప్రణయమూర్తి! ఆమెకు ప్రేమోన్మత్తతచే కనులు మూతపడియున్నవి. ప్రేమ విలాసలీలా పరాయణయైనట్టి, కళావిదగ్ధయైనట్టి రాధాజీతో కలసి మహాప్రేమోత్సవము నందు ప్రీతిని చూపు ఆ విదగ్ధశేఖరుని (శ్రీకృష్ణుని) నేను స్మరిస్తున్నాను. ప్రేమవిహ్వలురైన సఖీమణుల నిరంతర ఆశీస్సులను శ్రీయుగళము స్వీకరిస్తున్నారు.

**స్వర్ణవర్ణకుంకుమాక్త చందనేన చర్చితమ్**
**స్వర్ణయూథికాది దివ్య పుష్పమాల్యమండితమ్**
**స్వర్ణహార నూపురాది దివ్యరత్న భూషణమ్**
**స్వర్ణదివ్య నవ్య సూక్ష్మ చిత్రరత్నవాససమ్ 63**

స్వర్ణవర్ణములోనున్న కుంకుమతో కూడిన చందనముచే శరీరము చర్చితమైనది. (మైపూతగా అలదుట). స్వర్ణ వర్ణములోనున్న అడవి సంపెంగలతోను, దివ్యపుష్పమాలికలతోను శోభితమై ఉన్నది. స్వర్ణహారములతోను, నూపురములతోను, దివ్యరత్నములతోను విభూషితమైనది. స్వర్ణవర్ణములోనున్న దివ్యమైన, నూతనమైన, సూక్ష్మమైన చిత్రిత వస్త్రములను ధరించినది –

**రత్నరాజి రాజితాద్భుతాంగులీయకం లసత్**
**స్వర్ణ సూత్రబద్ధ దివ్యనాది కింకణీసితమ్**
**స్వర్ణ వేణురంధ్రదత్తచారుపల్లవాధరమ్**
**స్వర్ణ పుష్ప మంజరీషు మంజు కర్ణపూరకమ్ 64**

ధరించిన అద్భుతమైన ఉంగరములు రత్నజటితమై శోభిస్తున్నాయి. స్వర్ణసూత్రముతో కూర్చిన కింకిణి (వడ్డాణము) దివ్యధ్వనిని చేస్తున్నది. స్వర్ణవేణు రంధ్రములపై మనోహరమైన పల్లవాధరములు శోభిస్తున్నాయి. స్వర్ణపుష్ప మంజరులతో నిర్మితమైన మనోహర కర్ణపూరకములు శోభిస్తున్నాయి.

**కోటి చంచలాభ దివ్యసుందరీభిరున్మదా**
**నంగకేలి సంగఖేలి రూపరాశి రాధికామ్**
**నాగరీగరిష్ఠ రత్యవాప్తి మందహాసినమ్**
**రాధికారసాల కుంజ పుంజ నిత్యవాసినమ్ 65**

అతడు కోటి కోటి విద్యుల్లతల వంటి సుందరీమణులతో పరివేష్టితుడై, ఉన్మద ప్రేమకేళీ పరాయణుడై విరాజిల్లుచున్నాడు. అతిరూపవతి, నాగరీ శిరోమణియైన ప్రియతమ యొక్క ప్రణయ ప్రాప్తిచే మధుర మందహాసము చేస్తూ; శ్రీరాధికా రసాల కుంజలలో నివసిస్తున్నట్టి –

**సాంబు నీల నీరదచ్ఛవిం తడిత్ ప్రియాతి రుచిమ్**
**క్షణాప్త రాధికా రతాంతరాభిలాషిణమ్**
**ప్రేమ మాదకతాతిమత్తమందవర్ణభాషిణమ్**
**వార్షభానవీ రతం సదా స్మరామ్యహర్నిశమ్ 66**

జలములతో నిండియున్న నీలమేఘము వంటి కాంతితో శ్రీశ్యామసుందరుడు విద్యుద్వర్ణ శోభితయైన ప్రియతమ యొక్క కాంతిని కూడి వెలుగుచున్నాడు. క్షణక్షణము రాధికా సహితుడై వివిధములైన సంయోగకళలతో, అభిలాషలతో నున్న అతడు ప్రేమోన్మత్తత వలన చంచలుడై మెలమెల్లగా మాటాడుచున్నాడు. శ్రీవృషభానునందిని యందు అనురక్తుడైయుండు ఆ శ్యామసుందరుని అహర్నిశలు స్మరిస్తున్నాను.

**ప్రేష్ఠ చిత్త నందనేన కల్పితం విచిత్రకమ్**
**హారిణా సుచారు ఫాలచంద్రసీమ్ని విభ్రతా**
**ప్రేయసీ ప్రసాదదత్త కుందదామ హారిణా**
**రాధికా చకాస్తి కుంజవీథికా విహారిణా 67**

శ్రీశ్యాముడు చిత్తహారిణియైన రాధచే సుందర ఫాలస్థలముపై దిద్దబడిన తిలకముతో ప్రకాశిస్తున్నాడు. ప్రియతమయైన రాధాజీ స్వయముగా ఇచ్చిన ప్రసాదరూప కుందమాలను మెడలో వహించి, కుంజవీథులలో విహరిస్తున్నాడు. మనోమోహనుడైన ప్రియతమునితో కలసి శ్రీరాధిక శోభిస్తున్నది.

**రచిత రుచిర వేషః కాంతయా స్నిగ్ధకేశః**
**స్వయమపి మణి పుష్పైః కల్పితస్తత్రవేషః**
**క్వచిదపి నవవృందా కాననే మంజువీథ్యామ్**
**సముదిత రస తంత్రః కృష్ణచంద్రోఽవతాద్వః** **68**

నల్లని కేశములు కల శ్రీకృష్ణచంద్రుడు ప్రియాజీ రచించిన వేషభూషాదులతో శోభిస్తున్నాడు. శ్రీబృందావనమునందలి ఒకానొక నూతన వనము యొక్క మనోహర మార్గమును మణిమయ పుష్పములతో స్వయముగా అలంకరించినాడు. సముజ్వల రసమునకు వశీభూతుడైన కృష్ణచంద్రుడు మిమ్ము రక్షించునుగాక!

**స్వయముపహృత పుష్పైః క్లప్తవేష విచిత్రైః**
**మిథ ఉదిత సుహాసం ప్రౌఢి గూఢ ప్రహర్షమ్**
**తదుమితముభయత్రానర్ఘ్య వైదగ్ధసారమ్**
**హి పరమహ ఉపాసేఽన్యోన్య చుంబ ప్రసాదమ్** **69**

శ్రీయుగళము స్వయముగా పుష్పములను తెచ్చి విచిత్ర భావముతో వేష రచన చేసికొని; అతి నిగూఢమైన, ఆనందపూర్ణమైన మందహాసము చేసినారు. మహా అనర్ఘ (అమూల్య)మైన విదగ్ధతా సారస్వరూపులైన శ్రీశ్యామాశ్యాములు పరస్పరము ముద్దుగొని ప్రసన్నముఖులైనారు. అట్టి యుగళమును ఉపాసింపుము.

**సంయోగావేశతోఽంతర్నిజ దయితతమాం సన్నివేశద్యతి హర్షో**
**త్కర్షోత్ఫుల్లాఖిలాంగో వివిధ వర శుభైర్గుంఫితా మందకేశః**
**కాశ్మీరాలేప పత్రావలి వరతిలకాదిన్యపూర్వాని కృత్వా**
**దేశే దేశే విమృగ్యన్ హరిరవతు వనస్థాలి పుంజే నికుంజే** **70**

శ్రీకృష్ణుడు సంయోగావేశముతో ప్రియతమయైన రాధాజీని కుంజలోనికి గొనిపోయి, అనేకములైన మంగళకర చిహ్నములతో ఆమెను పులకితను చేసినాడు.

సఖియలు శ్రీరాధా సుందర కేశపాశమును అందముగా ముడిచి; కుంకుమ లేపనము,పత్రావళి రచన, తిలకాదులను అపూర్వభావముతో చేసినారు. బృందావనములోని అన్ని ప్రదేశములలోను, సఖియలతో శోభిస్తున్న నికుంజలలోను శ్రీరాధకై అన్వేషిస్తున్న శ్రీహరి రక్షించునుగాక!

**ఆస్తే వృందావన వన ఇహైకత్ర గూఢం నికుంజే**
**కాచిద్దేవీ మధుర ప్రకృతిర్దుర్వితర్క్యానుభావా**
**కృత్వాంజల్యా నతి సువినయం దివ్యగంధ ప్రసూనైః**
**శ్యామామౌర్యై పరిచర పరిక్రమ్య భూయో నమత్వమ్ 71**

ఈ బృందావనములోని ఒకనికుంజలో నిగూఢమైన భావముతో, మధుర స్వభావము కల ఒకానొక తర్కాతీతయగు దేవి విరాజమానయై ఉన్నది. నీవు చేతులు జోడించి నమస్కారము చేయి! వినయముతో శ్యామవర్ణములో నున్న, దివ్యగంధపూర్ణమైన పుష్పములతో ఆమెను సేవించు! పరిక్రమ (ప్రదక్షిణ) చేసి, మరియొకమారు ఆదేవికి నమస్కరించు!

**లబ్ధాన్వహం భజన విభవంచైకచారో నిశీథే**
**నిత్యం చేదాచరసి పరమం తత్పదైకాంత భావః**
**తచ్ఛ్రీరాధా స్వమతి రసాత్ ప్రాప్త దోర్వల్లి బంధమ్**
**కంఠేకృత్వా నహి నహి జహీతీతి సత్యం బ్రవీమి 72**

ఒక వేళ నీవు ఆమె చరణములను ఏకాంత భావముతో ఆశ్రయించి, అర్థరాత్రి వరకు ఏకాంతముగా ఆనంద పూర్ణమైన భజనను నిత్యము అనుష్ఠిస్తే; నిజం చెప్తున్నాను రాధాజీ స్వయముగా తన బాహుబంధములో బద్ధునిగా చేస్తుంది. (అనగా అట్టి వ్యక్తిని వదలిపెట్టదు అని భావము). నిన్ను దగ్గరగా తీసుకుంటుంది. (ఎన్నటికి విడిచి పెట్టదు.)

**మంత్రంహ్యాస్యా అఖిల నిగమాగమ్యమేవ బ్రవీమి**
**యత్ ప్రాకట్యం క్వచిదపి కృతం నో రహస్యాగమేషు**
**పాదప్రాంతే విలుఠతి మహాసిద్ధి సంఘూర్ణజష్టుః**
**శ్రీమద్భావా అపి భగవతో యత్రప్రభావత్ కరస్థాః 73**

ఆదేవి యొక్క మంత్రము కూడ సమస్త వేదములకు అతీతమైనది. అయినను, దానిని గురించి చెప్తున్నాను. ఆ మంత్ర ప్రాకట్యమును గూర్చిన నిగూఢ విషయము కూడ ఆగమములలో చెప్పబడలేదు. ఈ మంత్రమననము చేయువారి చరణముల చెంత మహాసిద్ధులు పడి ఉంటాయి. ఇంకను, భగవంతుని సుందరభావ జాలము ఆ మంత్ర ప్రభావము చేత కరతలామలకము ఔతుంది.

**నిత్యం యజ్జాపిని నను జనే నో విధిర్నో నిషేధః**
**తత్పాదాంభోరుహ యుగరజో వేదతజ్ఞాన పునాతి**
**యత్ పీయూషాద్యతి సుమధురం మంగలం మంగలానామ్**
**సర్వాశ్చర్యామితమహిమ యత్ సాధకం సాధకానామ్ 74**

ఆ మంత్రమును నిరంతరము జపించువారికి ఎట్టి విధి నిషేధములు లేవు. ఎందుకంటే ఆ పాదపద్మ రజో కణము వేదములను, వేదజ్ఞులను కూడ పవిత్రము చేస్తుంది. ఆ మంత్రము అమృతము కన్న అతి మధురము, మంగళములకు మంగళకారి! అది సాధకులకు సర్వాశ్చర్యమయమైన, ఎల్లలులేని మహిమతో కూడిన సాధనము!

**సాధ్యానాం యత్పరమ పరమం సాధ్యమత్యున్మదానా**
**మానందానామపి చ పరమ ప్రోన్మదానందమాహుః**
**సర్వాసాం యత్ పరమసురహస్యావలీనాం రహస్యమ్**
**(ధారేత్యేవ) రాధేత్యేవం జప తదనిశం సార్థ సంస్మృత్యనన్య 75**

సాధ్య వస్తువులలో కూడ అది అత్యున్నతమైన పరమ సాధ్య వస్తువు! అత్యున్మద ఆనందరాశి కన్నను పరమ మత్తతను కలిగించు ఆనందమని చెప్పబడుచున్నది. పరమ రహస్యమున కన్నను అది అతిరహస్యము! ఆ మంత్రము ''రాధా'' నామము! అర్ధసహితముగ నిరంతరము ఈ మంత్రమును అనన్యభావముతో జపింపుము!

'రాధ' అనుదానికి 'ధార' అని పాఠాంతరము ఉన్నది. ఈ 'ధారా' శబ్దమునకు రాబోవు శ్లోకములో అర్థము వివరింపబడుచున్నది.

**యా పీయూషాదిక మథిత సన్మాధురీ సార ధారా**
**ప్రేమానందోన్మద రస చమత్కార సర్వస్వధారా**
**అస్మాకం వా సుభగతవ వా వేదకోఽన్యస్య వా స్యాత్**
**కస్యాప్యేషా పరమ హృదయోల్లాసి ధారేత్యదోఽర్థః 76**

ఇది (శ్రీరాధా మంత్రము) అమృతాదులను మథించుట వలన ఉత్పన్నమైన ఉత్కృష్ట మాధుర్యసారధార! ప్రేమానందోన్మద రస చమత్కారము యొక్క సర్వస్వధార! ఎవరికి తెలుసును ? ఇది మాకు చెందిన, లేదా సౌభాగ్యశాలియైన మీకు చెందిన, లేదా వేరెవ్వరికైనను చెందిన పరమోల్లాసమయ ధార! ఇదియే ఈ మంత్రమునకు అర్థము!

**శ్రీవృందావన కుంజ దేవ్యనునిశం గోపాధిరాజాత్మజే**
**నాభ్యర్చ్యా తదిమం రహస్యుపగతం ప్రేక్ష్యత్వమాత్మావృతేః**
**తిష్ఠేః స్థావరవన్నికుంజ నిలయస్యాభ్యంతరే ప్రేయసః**
**సఖ్యస్త్వత్సవిధే వయం స్మ ఉరుచేత్ కార్యం తదాఽయం విధిః 77**

హే బృందావన కుంజదేవీ (రాధా)! ఒకవేళ నీకు ప్రతిరాత్రి గోపకుమారుడైన శ్రీకృష్ణుని ఆదరమును పొందవలెనను ఇచ్ఛ ఉంటే, అతడు ఒంటరిగా వచ్చుటను చూచి, ఆతనికి కానరాకుండ నికుంజ నిలయములో స్థావరము వలె ఉండిపొమ్ము!

అత్యంతము ప్రేమ వివశత్వమును పొందినపుడు సఖియలమైన మేము కూడ అచటికి వత్తుము. ఇదియే చేయతగిన విధి!

శ్రీప్రబోధానందులు తాము దర్శించిన అద్భుతలీలను ఇట వర్ణించినారు. రాధాజీకై రానున్న శ్రీకృష్ణచంద్రునికి కానరాకుండ దాగి యుండుమని స్వామినికి చెప్పి, సఖియలు ప్రియతముని ఆటపట్టించుటకై వేచియున్న దివ్యదృశ్యమిది!

..............................................................

..............................................................

**తేనాఽఽసం తవ దేవతామతి రసౌ త్వత్ కామబాధాకులోఽ**
**ప్యేకాంతేఽపి కరిష్యతే న కిమపీత్యావేదితం తే ప్రియమ్ 78**

**ఇత్యన్యోన్య సుశిక్షణం సునిపుణం కృత్వా సఖీమండలే**
**తత్రైవోచ్చలతో నిలీయ హసతి ప్రేష్ఠే నిశీథే హరేః**
**ఆగత్యా చరతస్తథాతి మదన క్షుబ్ధస్య హాసోద్గమే**
**రాధాయాశ్చధృతి క్షయాద్రతికలా జీయాత్ సురత్యద్భుతా 79**

ఈ ప్రకారముగా ప్రియతమయైన రాధాజీ, సఖీమండలి పరస్పరము శిక్షణ నిచ్చుకొని నిపుణతతో ఆ రాత్రి నవ్వుకొనుచు దాగి ఉన్నారు. ఆపై శ్రీహరి కూడ అక్కడికి వచ్చి ఇటునటు తిరుగసాగినాడు. అతడు ప్రేమ విహ్వలుడై నవ్వుట మొదలిడినాడు. రాధాజీ కూడ అధీర అయినది. ఇక అచట ప్రేమోద్భూతమైన అద్భుత రతికళాదికము సంఘటించినది. ఆ కేళికి జయమగునుగాక!

**శ్రీవృందావన కుంజ మండలమిదం యావత్ సమానీయథా**
**స్తావద్దుర్గ్రహదేవతార్థిత తనోః సంధూక్షణం తే మనాక్**
**స్వప్నే నాగర శేఖరేణ రమితా కేనాపి సంలక్ష్యసేఽ**
**పశ్యంత్యాః పరపూరుషం స్థితిమతః పృచ్ఛే తవస్యాగ్రతః 80**

"ఈ విధముగ నీవు బృందావనములోని కుంజ మందిరమునకు వచ్చుచునే ఏదియో శక్తి నిన్ను ఆవహించుచున్నది. నీ భావములలో కూడ కొంత ఉద్దీపన గోచరిస్తున్నది. ఇంకను, స్వప్నములో నాగరశేఖరునితో కలసి క్రీడించిన లక్షణములు కూడ తెలుస్తున్నవి. కాని నీవు ఎన్నడు వేరు విధముగా చేయవుకదా! మరి ఈ నీ అవస్థకు (ప్రణయలీలా పరవశస్థితికి) కారణమేమి ? ఈ విషయమును గూర్చి నిన్ను అడుగుచున్నాను" అని సఖి రాధాజీని ప్రశ్నించినది.

పరమాద్భుతమైన ఈ లీలలో సఖి శ్రీరాధాగోవిందుల దివ్య శృంగారలీలను పరోక్షముగా ప్రస్తావించినది. "శ్రీయుగళ దివ్య అనంగకేళిని దర్శించిన కొందరు సఖులు ఆ తీవ్ర మాధుర్యరస ఆస్వాదనము చేత కల్పముల పర్యంతము విమూర్ఛితులై ఉంటారు" అని శ్రీరాధికాప్రసాదులు ఒక సందర్భములో పలికినారు. అట్టి యెడ వారి శృంగారకేళిలో ప్రవహిస్తున్న దివ్యమాధుర్య స్థితిని, గతిని భావములోనైనను ఎవరు అందుకొనగలరు ?

**ధృష్టాః సఖ్య ఇమాం నికుంజ నిలయ ఛిద్రాబ్ధి దత్తేక్షణాః**
**పశ్యంతి ప్రియ సర్వనాగర గురౌ నాతి త్వరామాచర**
**సర్వా ఆవృణురత్నదీప వితతీ స్తవన్మన్నిచోలై వృతిమ్**
**కుర్యశ్చేన్న ధృతిం హర శ్రుతితలే తాః పాతు రాధాగిరః 81**

"హే ప్రియా! సర్వనాగరగురూ! ఈ సఖీమణులు చాలా చతురులు! వారు నికుంజ మందిర రంధ్రముల నుండి దృష్టిని సారించి, అంతయు చూచుచున్నారు. త్వరపడవద్దు! సమస్తమైన రత్నదీపములను మన వస్త్రములతో కప్పివేయుము (అనగా వెలుతురు లేకుండునట్లు చేయుట). ఒక వేళ అట్లు చేయకపోయినచో, వారి ధైర్యమును హరింపుము!" రాధాజీ పలికిన ఈ మాటలు చెవులలో ప్రవేశించి, అందరిని పాలించునుగాక!

శ్రీరాధాగోవిందుల దివ్య శృంగార లీలను దర్శించియే కదా సఖిరూప రసిక మహాత్ములు వర్ణిస్తున్నారు. అయినను, సఖులు కుంజరంధ్రముల నుండి చూస్తున్నారని రాధాజీ హెచ్చరిస్తున్నది. ఆ చిన్నారి 'భోలా భాలీ' కదా!

**అయిమయి రతిదానం వర్ష రాధేఽత్యుదారే**
**వయం గమ నికుంజే యామ సఖ్యత్ర సంతు**
**ఇతి నిరవధి వృందారణ్య కుంజేషు రాధామ్**
**ప్రతి మురభిదురస్మాభ్యర్థనాని స్మరామి 82**

"ఓ అత్యుదార చరితా! రాధా! నాపై ప్రేమదానరూప వర్షమును వర్షింపుము! పద, మనము సఖియలకు అగమ్యమైన నికుంజకు చేరుకుందాము. సఖులు ఇక్కడే ఉందురుగాక! ఏమో, సఖియలు అక్కడికి కూడ రావచ్చును" – ఈ ప్రకారముగా నిరంతరము బృందావన నికుంజలలో శ్రీరాధాజీని ప్రార్థిస్తున్న శ్రీకృష్ణుని అభ్యర్థనను స్మరిస్తున్నాను.

'సఖియలకు అగమ్యమైన కుంజ' అంటూనే శ్రీకృష్ణుడు 'ఏమో, వారు అక్కడికి కూడ రావచ్చు' అనుట వలన సఖీమణులకు శ్రీయుగళమును గూర్చి తెలియని రసరహస్యము లేదని స్పష్టం ఔతున్నది.

**మదన కదన నిత్యక్లాంతపారే సకాంతో**
**విదధతి లలితాద్యాః శిక్షణం చాన్యనార్యః**
**అనుచరి శుభశీలే బ్రూహి మే కిం ను కృత్యమ్**
**తదిహ జయతి రాధా మంత్రితం కుంజ వీథ్యామ్ 83**

"నా ప్రియతముడు ప్రణయ కలహములో నిరంతర నిపుణుడు! లలితాది సఖీమణులు కూడ శిక్షణనిస్తున్నారు. ఓ శుభశీల అనుచరీ! నా కర్తవ్యము ఏమియో తెలుపుము" – ఈ ప్రకారముగ కుంజమార్గములో రాధాజీ చేయుచున్న పరామర్శకు జయమగునుగాక!

**కథిత విథతమానా ప్రేష్ఠమాశ్వాస్య వల్లీ**
**గృహమిద ఉపనీయ స్థాపయిష్యామ్యలక్ష్యమ్**
**త్వమపశరితుమత్రైవాతి రోషాదవేయా**
**ఇతి సమశుచాస్యాయాశ్లేషిణీం పశ్య రాధామ్ 84**

"నీ మిథ్యా అలుకను గూర్చి చెప్పి, ప్రియతముడు పలుకు ప్రియవచనములను విని, ఇతరులకు కానరాని లతాగృహమునకు నిన్ను తీసుకొని వెళ్లి కూర్చుండ పెట్టెదను. ఇక నీవు మిక్కిలి కుపితవై (కోపగించి) అచటి నుండి మరియొక ప్రదేశమునకు వెళ్లుచున్నట్లు ప్రవర్తింపుము!" ఈ ప్రకారముగ సమాన వ్యథననుభవిస్తున్న ప్రియసఖి ముఖమున ముఖము చేర్చి తన అవస్థను ప్రకటిస్తున్న రాధాజీని దర్శింపుము.

**వనమిదమతి కామోద్వర్థకైక స్వభావమ్**
**వపురపి చ వయః శ్రీరూపలావణ్య సీమా**
**స ఇహ మదన కోటిమోహనో నిత్యఖేలో**
**భవతు ఘనవనే మే సంస్థితే యాంతు సఖ్యః 85**

ఈ బృందావనము అతిశయ కామవర్ధక స్వభావముచే విశిష్టమైనది. శరీరము వయో, సౌందర్య, రూప, లావణ్యాదులకు అవధి! ఘనవనములో నేనుండగా కోటిమదనుల వంటి ఆ మోహనుడు ఇచట నిత్యక్రీడాపరాయణుడై ఉండుగాక! సఖులారా! మీరు వెళ్లుడు!

**ఇహ కుసుమిత వృందాకాననే కోకిలానామ్**
**కలరవ ఇహ మందవాత్యసౌ గంధవాహః**
**ప్రియమపి పరమర్మా విజ్ఞ సఖ్యాః కుశిక్షా**
**కృదహమహహ ఛిన్నా కేన తార్యాఽద్య దుఃఖమ్ 86**

ఈ కుసుమిత బృందావనములో కోకిలలు కలరవము చేస్తున్నాయి. మృదు మంద సుగంధపూర్ణమైన వాయువు వీస్తున్నది. హా! ఇట్లు అన్నియు మంగళకరముగనే ఉండియు ఇతరుల మర్మము నెరుగగల సఖి ఇచ్చిన శిక్షణ ననుసరించి నడుచుకొని విరహిణినైనాను. హా! ఇప్పుడు ఈ దుఃఖము నుండి నన్ను ఎవరు రక్షింపగలరు ?

శ్రీప్రబోధానందులు ఇట విరహస్థితిలో ఉన్న రాధాజీని దర్శించి వర్ణించినారు.

**అయి మధుకర యూథాః సంతి వృందావనేఽస్మిన్**
**బహవ ఇహ న సంఖ్యావంతి పుష్పాని సంతి**
**ధనురిషు గుణకోటీ నిర్మిమానోఽత్ర భీమః**
**ప్రభవతి నను కామస్తత్ర కా మాన వార్తా ? 87**

ఓ మధుకరా! ఈ బృందావనములో అనేక యూథికా వృక్షములు (నాయికా దళములు) ఉన్నవి. వానిపై అసంఖ్యాకమైన పుష్పములు కూడ ఉన్నవి. ఇచట ధనుర్బాణములతో కోటి రజ్జువులను నిర్మించటములో దక్షుడైన ప్రచండ కామదేవుడు కూడ ఆవిర్భవించినాడు. ఇక, అలుకకు ఇక్కడ తావు ఉంటుందా ?

బృందావనములో వికాసమానమై ఉన్న దివ్యశృంగార వాతావరణము ఇట వర్ణితమైనది. విరహిణిగా పై శ్లోకములో దర్శనమిచ్చిన రాధాజీని బృందావనము ఇట్లు సాంత్వన పరచినది.

**న పునరితి కుశిక్షాస్తాదృశీ శ్రుణోమి**
**ప్రణయిని గుణధామ్న్యూహ్యాహ మానాపరాధమ్**
**మమ పరుష గిరాగత్యాత్ర వృందావనోద్యత్**
**పికకలవికలీభూతోఽగమజ్జీవయన్మామ్ 88**

(నేను ప్రతిజ్ఞ చేస్తున్నాను.) ఈ ప్రకారముగా ప్రియజనుల విషయములో ఇచ్చిన శిక్షణను నేను వినను. (అనగా శ్రీకృష్ణునకు వ్యతిరేకమైన మాటలను

పట్టించుకొనను అని భావము.) ఎందుకంటే ప్రియతముడు నిఖిల గుణములకును నిధియైనను ఆతని పట్ల అపరాధభావము కలిగినది. నిష్ఠురమైన నా మాటలను విని కూడ ఇక్కడికి వచ్చి నా ప్రాణములను నిల్పినాడు. బృందావనములో ప్రతిధ్వనిస్తున్న కోకిలల కలరవములతో వికలుడై అతడు వెళ్లిపోయినాడు. (అని రాధాజీ పలికినది).

**అయి జగతి సుధన్యాసైవయా మానినీ స్యాత్**
**ప్రణయిని సఖి తాదృశ్యోమదాద్యా స్త్వధన్యాః**
**అపి దయిత సఖీభ్యో మానవర్ణేఽపి కర్ణే**
**విశతి హృది విహంత్యో వేపథుం ప్రోద్దహంతి 89**

"హే సఖీ! రాధా! ప్రియతముని పట్ల మానినిగా (అలుకతో) ఉండెడు స్త్రీయే లోకములో ధన్యురాలు! కాని, ఈ ప్రకారముగా అగర్వితగా ఉండు స్త్రీ భాగ్యహీనురాలు!" అట్లు సఖియల ద్వారా రాధాజీ చెవులలో 'అలుక' అను అక్షరములు ప్రవేశిస్తే ఆమె హృదయము వికలమై వణికిపోతుంది. శరీరము దహించుకుపోతుంది.

తాను అలుక వహిస్తే కృష్ణునకు కలుగుబాధను తలచి, రాధాజీ తనుమనః ప్రాణములు తల్లడిల్లినవి.

**సఖ్యోమానం రసాలం నియతమహం వైమ్యత్ర వృందావనే తు**
**ప్రోదేత్యత్యద్భుతో యేన కృతనిజపతి స్త్రీ కృతాంతో వసంతః**
**భృంగీ సంగీత కార్యన్నవ మదనధనుః శింజనీనామివోచ్చైః**
**టంకారా వజ్రశంకామిహ చ విదధతే కోకిలా కూజితాని 90**

హే సఖియలారా! ఈ బృందావనములో నాకు నియతపూర్వకముగ మధురమైన అలుక ప్రాప్తిస్తుంది. ఇచట ప్రేయసీ ప్రియుల పాలిట యమ స్వరూపమైన వసంతము విరాజితమైనది. భ్రమరముల ఝుమ్మనునాదము మన్మథుని

చాపమును ఉచ్చైస్వరముతో టంకారము చేసినట్లు ఉన్నది. కోకిలల కూజితములు వజ్రాయుధఘోషయా అనుశంకను కలిగిస్తున్నాయి.

పై శ్లోకములో సఖియల ద్వారా 'అలుక' అనుమాటను వినుటకు కూడ ఇష్టపడని రాధాజీ ఈ శ్లోకములో తానే అలుకను ప్రస్తావించినది. ఐనను శ్రీకృష్ణునికై ఆమె హృదయము ఎదురుచూచుచుండుట కూడ ఇట స్పష్టమగుచున్నది.

**స్త్రీ రూపామేధ్యపిండే ముహరమృతధియా నిత్యలోలుభ్యమానమ్**
**చక్షుర్న క్షుద్రజీవైరపి విహిత మృషా మాననాఽత్యంత మగ్నః**
**జిహ్వామిష్టాన్న నిష్ఠా విరమతి న మనాక్ విత్తసంగృధ్ను చిత్తమ్**
**హా వృందారణ్య కాన్యాభవతి మమ గతిశ్చేదహంత్వత్ స్థితోఽపి 91**

స్త్రీరూపమైన అపవిత్రదేహమును అమృతముగా భావించి నా చూపు మాటిమాటికి విలోలమౌతున్నది. క్షుద్రజీవుల ద్వారా లభించిన మిథ్యాగౌరవము పట్ల మనసు అతిగా నిమగ్నమౌతున్నది. జిహ్వా మిఠాయిపట్ల ఆసక్తిని చూపిస్తున్నది. చిత్తము సంపదలవైపు ఆకర్షింపబడుతున్నది. ఏ ఇంద్రియమునకును వైరాగ్యమన్నదే లేదు. కనుక హేబృందావనమా! నేను నీ భూమిపై నివసిస్తూ కూడ దుర్గతిని పొందితే, నేను ఏమి చేయగలను ?

ఇంతకుముందు శ్లోకములలో అపూర్వమైన, రసమయమైన శ్రీరాధాకృష్ణుల ప్రణయలీలలను దర్శిస్తూ వివశులై వర్ణించిన శ్రీప్రబోధానందులు ఒక్కసారిగా ఈ ప్రాకృతిక జగత్తులో ఏ దృశ్యాన్ని చూచారో! లేదా ఏ విషయ విషము చెవిని పడిందో! అధోగతిలో కొట్టుమిట్టాడుతున్న జీవుల గురించి ప్రస్తావించారు.

**శ్రీరాధా పరదేవతా నవలతాగేహేషు నిత్యస్థితా**
**శ్యామాంకైకవిభూషణా లలితయా స్వీయైః సదా సేవితా**
**వృందాటవ్యతి దుర్గమోహన పురః తస్యాఖిలం సైనికమ్**
**యస్యాసౌ వరదః శ్రియాప్యకలితః శ్రీభావరాజోఽస్తు నః 92**

పరదేవతయైన శ్రీరాధ నవలతాగృహములో నిత్యము ఉపస్థితయై ఉంటుంది. శ్రీశ్యామసుందరుని అంకస్థలియే ఆమెకు విశేష భూషణము! శ్రీలలితాది సఖీమణులచే నిత్యము సేవింపబడుతూ ఉంటుంది. శ్రీబృందావనమే రాధాజీ యొక్క దుర్గము, అతి సురక్షితమైన మోహనపురము! అచటి సమస్త వస్తువులు ఆ దేవికి సైనికులు! శ్రీలక్ష్మీదేవికిని అగోచరమైన శ్రీభావరాజము (మహాభావము) మాకు వరదానముననుగ్రహించు దైవము!

**గుంజామంజుల హారిణం మురలికానాదైర్మనోహారిణమ్**
**గోపీహ్రీధనహారిణం వ్రజ విషాగ్న్యాది వ్యతీహారిణమ్**
**నిత్యంచానురతం స్వయా దయితయా శోభా సమాహారిణమ్**
**వృందారణ్య విసారిణం భజ సఖే భక్తాఘ సంహారిణమ్ 93**

శ్రీహరి గుంజామంజుల హారమును ధరించి ఉన్నాడు. మురళీ నాదముతో మనసులను హరిస్తూ ఉన్నాడు.గోపికల లజ్జ అనెడు ధనమును హరించినవాడు. వ్రజములో విషాగ్నిమున్నగు వానిని శమింపజేసినవాడు. తన ప్రియతమపట్ల నిరంతర అనురక్తికలవాడు. సాటిలేని కాంతి కలవాడు. భక్తుల పాపములను పోగొట్టువాడు. ఓసఖా! బృందావన విహారియైన అట్టి శ్రీకృష్ణుని భజింపుము!

**వృందాని ద్యుతిమల్లతా విటపినాం వృందారకే విందయన్**
**వృందారణ్యలతాగృహే వ్రజవధూ వృందారికాఽఽనందయన్**
**కందర్పోత్సవకం వేణువివరాత్ సాంద్రామృతం స్యందయన్**
**ఆనందం హరిరద్యకందలయాన్ముక్తిం చ నో నందయత్ 94**

అతడు జ్యోతిర్మయమైన వృక్షలతాదులకు మనోజ్ఞత్వమును ప్రాప్తింపజేసి, బృందావన లతాగృహములో వ్రజవధువులకు ఆనందమును అనుగ్రహించినాడు.

వేణురంధ్రముల నుండి సాంద్రామృత అనంగోత్సవమును ప్రవహింపజేసినాడు. నేడు ఆ శ్రీహరి ముక్తి యొక్క ఆనందమును కూడ త్యజించి, ఆనంద ధ్వని చేస్తున్నాడు.

**శ్రీవృందావన ఫుల్లమల్లి విలసత్ వల్లీకుటీరే రవత్**
**కీరే ధీరసమీర సూరతయా తీరే తమాలచ్ఛవిః**
**కోఽపి క్రీడతి మంజుగుంజ దలినీ పుంజ స్వయం గుంజయా**
**నిర్మాయోజ్జ్వల హారమాదధదతి ప్రేమ్ణా చ రాధోరసి 95**

ఆ ప్రదేశము శబ్దిస్తున్న శుకపికాది పక్షులతో శోభిస్తున్నది. మెల్లగా వీస్తున్న వాయువుతో కూడి, యమునా తీరమున మనోమోహకముగ గుంజారవము చేస్తున్న భ్రమరములతో శ్రీబృందావనము భూషితమైనది. చక్కగా వికసించిన మల్లెల సుగంధముతోనున్నలతా కుటీరములో తమాల వర్ణములో నున్న ఒకానొకరు (శ్రీహరి) గుంజా బీజములతో స్వయముగా ఉజ్వల హారమును తయారు చేసి ధరించినాడు. అతడు ప్రేమపూర్వకముగా శ్రీరాధా వక్ష స్థలముపై క్రీడించినాడు.

**శ్రీవృందావన నవకుంజ మందిరేషు**
**స్వానందామృత రససింధు బంధురేషు**
**శ్రీరాధామురలిధరౌ మిథో హసంతౌ**
**గాయంతౌ స్మర సతతం స్మరోన్మదాంధౌ 96**

అది స్వానందామృత రససాగరము వంటి మనోహర బృందావన నవకుంజ మందిరము! అందు శ్రీరాధా మురళీధరులు పరస్పరము అనంగమాదకతచే మత్తిల్లి చిరునవ్వు చిందిస్తున్నారు, గానం చేస్తున్నారు. వారిని నిత్యము స్మరింపుము!

**శ్రీవృందావిపిన విచిత్ర పుష్పవాట్యామ్**
**శ్రీకృష్ణోరసి నిహితాఢ్య నూపురాదిః**
**శ్రీరాధాద్భుత రతికేలి నాట్యలీలా**
**దృష్ట్యో మే కిరతు మహారసాబ్ధి వర్షమ్** **97**

శ్రీబృందావనము నందలి విచిత్ర పుష్పవాటికలో శ్రీకృష్ణుని వక్షస్థలిపై అమూల్యనూపురాదులతో భూషితమైన రాధాశ్రీచరణము వెలుగుచున్నది. అట రాధాజీ ప్రకటిస్తున్న అద్భుత ప్రేమక్రీడతో కూడిన నాట్యలీలను దర్శించిన నా నేత్రములలో మహారస సముద్రము వర్షించునుగాక!

**కాలిందీ పులిన ఉరు ప్రసూన వృందా**
**రణ్యోచ్చైః ప్రవర కదంబ శాఖిమూలే**
**గాయంతౌ మదకల మత్యుదార గౌర**
**శ్యామం తన్మధుర మహోద్వయం స్మరామి** **98**

కాళిందీ నదీ తీరములో అనేక పుష్పములతో అలంకృతమైన శ్రీబృందావనము; అట మిక్కిలి ఎత్తైన మహా కదంబ వృక్షము క్రింద వెలుగుచు సంగీత పరాయణులైన, మత్తిల్లిన, ఉదారులైన శ్రీగౌర శ్యామ మధుర యుగళమును స్మరిస్తున్నాను.

**వృందాటవ్యభినవయ కుంజ ఖేలనోత్కా**
**వాలాభిః కృతనవపుష్ప చిత్రవేశౌ**
**శ్రీరాధా మురలిధరౌ ముదా చరంతౌ**
**సద్వీథ్యాం భజత కయాఽపి నీయమాణౌ** **99**

శ్రీరాధా మురళీధరులు శ్రీబృందావనములోని అభినవ కుంజలలో క్రీడాసక్తులైనారు. సఖియలు పుష్పములను తెచ్చి చేసిన విచిత్ర వేష భూషాదులతో

వారు సుసజ్జితులైనారు. ఒకానొక సఖి చూపిన కుంజవీథులలో ఆనందముగా ఇటునటు సంచరిస్తున్న ఆ శ్రీయుగళమును సేవింపుము!

**కిమిందునాం కోట్యా యది వదనమానంద మదనమ్**
**సుధాసారైః కింవా యది సుముఖిబింబాధరమిదమ్**
**కటాక్షాజీయాసు స్తవ కిమిహ కందర్పవిశిఖైః**
**ప్రసన్నా త్వం రాధే యది క ఇహ ధన్యో మదఽపరః 100**

హేరాధా! ఆనందకందమైన నీ వదన చంద్రుడు ఉదయిస్తే కోటి చంద్రుల ఉదయము వలన ఏమి ప్రయోజనము ? నీ బింబాధరముల రసము ప్రాప్తిస్తే అమృతసారము వలన ఏమి ప్రయోజనము ? నీ కటాక్షవీక్షణము ప్రసరిస్తే ఇక మన్మథుని బాణములతో ఏమి పని ? నీవు నా పట్ల ప్రసన్నురాలివైతే జగత్తులో నాకన్న ధన్యులెవరు ఉంటారు ?

శ్రీరాధా ప్రసన్నత్వమును పొందిన ధన్యునకు జగత్తులో ఇక దేనితోను ప్రయోజనము లేదని భావము!

**అలిందే కాలిందీ పులిన నవ మందార లతికా**
**నికుంజస్యానందామృత మధుర మందానిలయుతే**
**మిథోఽతి ప్రేమోచ్ఛృంఖల మదన ఖేలౌ సుమధురమ్**
**హసంతౌ గాయంతౌ భజత హృది రాధా మధుపతీ 101**

యమునా తీరమున, నవమందారలతా నికుంజలో ఆనందామృతముతో కూడిన మంద మధుర వాయువుచే వారు సేవింపబడుతున్నారు. అత్యంత ప్రేమ పూర్ణమైన అనంత ప్రేమక్రీడాపరాయణులై శ్రీరాధామాధవులు మధుర మందహాసము చేస్తూ, గానం చేస్తున్నారు. వారిని హృదయములో భజింపుము!

**అకస్మాత్ సిందూరం తవ సుముఖి కిం దూరమగమత్**
**విశేషః కిం వాన్యాదృశ ఇవ దృశోస్తేఽంజనరుచః**
**అహో సంవృత్యంగం ముఖమపి సమాయాతి వనతో**
**నతగ్రీవం యైవ ధ్రువమిహ తదుక్తార్థయసి 102**

హే సుముఖీ! అకస్మాత్తుగా నీ సిందూరము జారిపోయినదేమి ? (నీతిలకము ఎందుకు కరగిపోయినది ?) నీ కన్నులకు దిద్దిన కాటుక యొక్క శోభ కూడ వేరుగా ఉన్నది. ఓహో! నీ ముఖమును దాచి, మెడను వంచి (తలవంచి) వస్తున్నావు! ఇప్పటి ఈ నీరూప శోభయే మన మాటలలోని అర్థమును స్పష్టం చేస్తున్నది. (సఖి రాధాజీలో వెలుగుతున్న శృంగార కళను వర్ణించింది.)

**కాళిందీ ఫుల్లాదిందీవర వన పవనేనాంచితే మందమందమ్**
**శ్రీవృందారణ్య వృందారక విటపిలతా మందిరాలింద ఇందుః**
**జీయాత్ కోఽపీంద్రనీలద్యుతిమతిమధురైః కందలైరంగ భాషా**
**విందన్ వందారు వృందారకగణ కుసుమాసారవర్షైః ప్రమోదమ్ 103**

యమునా నదీ తీరములో వికసించిన కమల వనము మీదుగా మెల్లగా వీస్తున్న వాయువుచేత బృందావనము సేవింపబడుచున్నది. ఆ బృందావన మనోహర వృక్షలతా మందిరములో ఒకానొక ఇంద్రనీలమణికాంతివిశిష్టుడైన చంద్రుడు (కృష్ణుడు) జయశీలుడై ఉన్నాడు. అతి మధురముగా ప్రకటితమగుచున్న శరీర కాంతి చేత నమస్కరింపదగి ఉన్నాడు. దేవతలు కురిపించిన పూలవానతో ఆతడు ముదితుడై విరాజిల్లుచున్నాడు.

**శ్రీమద్బృందావనేందుః స పరమ మధురః ప్రేమపీయూష సార**
**స్యందీ సందీప్త కామానల వికలహృదా గాఢరాధాసుధాబ్ధిః 104**

శ్రీబృందావన చంద్రుడు (శ్రీకృష్ణుడు) అత్యంత మధురమైన ప్రేమామృత సారమును వర్షిస్తూ ఉంటాడు. కాని, అత్యంత ఉద్దీప్తమైన కామాగ్నిచేత వికల హృదయుడైనపుడు రాధాజీ తన అగాధమైన రసామృత సింధువు చేత శాంతిని ప్రదానం చేస్తుంది.

అంటే అన్ని లోకములకు శ్రీకృష్ణుడు ఆనందమును అనుగ్రహిస్తుంటే, రాధాజీ ఆయనకే ఆనందాన్ని ఇస్తుందని భావము!

**సిందూరేణ ప్రణయ తిలకం విందుభిశ్చందనానామ్**
**వీతం ఫాలే రచయ కుచయోః పత్రకం కుంకుమేన**
**రమ్యం సమ్యక్ విదధ్యామధరమధురే తచ్చ సర్వం పురావత్**
**తీవ్రాలిభ్యః సదా మే చ భయమథ హ్రియం భింధి వృందావనేందో 105**

"హే బృందావన చంద్రా! జలబిందువులచే జారిన తిలకమును గంధపు చుక్కతోను, కపోలములపై సిందూరముతోను దిద్దుము! పూవులతో వక్షస్థలముపై పత్రరచన చేయుము. మధురమైన నా అధరములపై పూర్వమువలె సుందర భావముతో చిత్రకాదులనుంచుము. నాకు సఖియలనిన భయమగుచున్నది. (తన ఇప్పటి స్థితిని చూచి పరిహసింతురని రాధాజీ భావము.) కనుక, కృష్ణా! నా సిగ్గును దూరము చేయుము" అని శ్రీరాధ శ్రీశ్యామునితో పలికినది.

**సంచార్యేత ఇతస్తతః ప్రియసఖైః శ్రీదామముఖ్యైః సమమ్**
**శ్రీవృందావన వీథికాసు సతతం రాధైక వార్తాపరః**
**ధైర్యే ధావతి మంత్రయంతమనఘోపాయంచ తత్ సంగతౌ**
**కంచిత్ కామరసైక సార సుభగం శ్యామం కిశోరమ్ 106**

శ్రీదామాది ప్రముఖ సఖాగణముతో కలసి ఏకమాత్ర శ్రీరాధా కథా పరాయణుడై శ్రీకృష్ణుడు అక్కడక్కడే సంచరిస్తున్నాడు. బృందావన వీథులలో

ఉపస్థితుడు ఔతున్నాడు. తిరిగి అధీరుడై, రాధాజీని కలసికొనగల ఉత్తమ ఉపాయమును వారితో కలసి ఆలోచిస్తున్నాడు. ప్రేమరసమునకు ఏకమాత్ర సారస్వరూపుడైన సుందరశ్యామకిశోరుడు ఆవిధముగ (రాధాజీకి వశవర్తియై) ఉన్నాడు. అట్టి శ్రీకృష్ణుని భజిస్తున్నాను!

శ్రీప్రబోధానందులు ఈ శతకములో సమస్తజగత్తులకు నాయికయైన రాధిక సఖీమణులకు ఎంతటి చనవునిస్తుందో దర్శన ప్రమాణముతో వర్ణించినారు. ఆ ప్రేమ, ఆ కాతరత్వము ఊహాతీతమై వెలుగుతున్నది. శ్రీరాధాకృష్ణుల ఏకాంత శృంగార కేళికి సంబంధించి సఖి సలహా ఇస్తున్నది. ఆ సలహాలను స్వామిని చిరునవ్వుతో అంగీకరిస్తున్నది. ఇట్టి రాధాజీ గుణమణులను సంపూర్ణముగా ఎవరును వర్ణింపజాలరు!

శ్రీప్రబోధానందులు శ్రీకృష్ణుని సఖాగణమును స్మరిస్తూ ఈ 15వ శతకమును పూర్తి చేసినారు.

# పదహారవ శతకము

**రాధా వక్త్ర సరోజ దివ్యమధురం రాధా దృశోరంజనమ్**
**రాధా వక్షసి దివ్యనీల వసనం రాధా మనః శృంఖలమ్**
**రాధా నాభి సుధాసరః కువలయం రాధాపద శ్రీనఖేం**
**దునా లాంఛనమేవ వాంఛత వనేరాధక ఖేలామృగమ్** 1

శ్రీకృష్ణుడు శ్రీరాధాముఖ కమలమునకు దివ్యభ్రమరము, రాధానేత్రములకు కాటుక, శ్రీరాధా వక్షస్థలమునకు దివ్య నీల వస్త్రము! అతడు శ్రీరాధా మానసమునకు శృంఖల (సంకెల), శ్రీరాధా నాభి అనెడు అమృతసరోవరమునందలి నీల కమలము! శ్రీరాధా సుందర చరణ నఖచంద్రునకు ఆ శ్యామవర్ణుడు లాంఛనము (చంద్రునిలోని నల్లని మచ్చ). ఇంకను, రాధాజీకి ఏకమాత్ర క్రీడా మృగము! అట్టి శ్యామసుందరుని పొందవలెనని కోరుకొనుడు!

15వ శతకములోని చివరి శ్లోకములో రాధాజీకి వశవర్తియై యుండు శ్రీకృష్ణుని స్మరించిన శ్రీప్రబోధానందులు ఈ శతకములోని మొదటి శ్లోకమును ఆ స్మరణతోనే ఆరంభించినారు.

**ఏకాంత కుంజ భవనేఽను నయేన రాధామ్**
**అంకే నిధాయ కరజైరలకాన్ వివిచ్య**
**చుంబున్ముహుః కనక పంకజ కాంతి వక్త్రమ్**
**సోఽయం హరి పులక పూర్ణవపుః ప్రియో మే** 2

ఏకాంత కుంజ గృహములో శ్రీహరి రాధాజీని అనునయ పూర్వకముగా తన ఒడియందు కూర్చుండబెట్టుకొనినాడు. తన వేళ్లతో ఆమె ముంగురులను సరిచేయుచు, స్వర్ణకమలము వలె శోభిస్తున్న ముఖమును మాటిమాటికి ముద్దుగొనుచు పులకరించుచున్నాడు. అట్టి శ్రీకృష్ణుడే నాకు ప్రియతమమైనవాడు!

**కస్యాపి గోపరమణీయ రమణీయ మూర్తేః**
**కాదంబినీ రుచి కదంబ కరంబితస్య**
**విద్యుత్ పిశంగ వసనస్య నిశమ్యరాధా**
**నామాదిమక్షరమపి క్షరదాస్యమీక్షే 3**

అతడు గోపరమణులకు రమణీయమూర్తి! మేఘమాల వంటి కాంతి కలవాడు. మెరుపువలెనున్న పీతాంబరమును ధరించినవాడు. "రాధ"లోని మొదటి అక్షరమును విన్నంత మాత్రముననే కరగిపోతున్న శ్రీకృష్ణుని శ్రీముఖచంద్రుని దర్శింపవలెనని కోరుకుంటున్నాను.

**పరస్పర సుసమ్ముఖం ముఖముదార నర్మస్మితమ్**
**పరస్పర వపుష్ప శత్పురు మిషేణ పాణిద్వయమ్**
**పరస్పర రసోల్లసత్ పులక గౌరనీలాకృతీ**
**దధత్ వయమహః పరస్పర ధృతాత్మ భావం భజే 4**

వారు ఒకరికి ఎదురుగా మరొకరు విరాజమానులై, ఉదారమైన నర్మోక్తులతో సంభాషించుకుంటున్నారు. ఏదో ఒక వంకతో ఒకరినొకరు స్పృశించుకుంటున్నారు. పరస్పరము రసోల్లసితులై పులకరించిన గౌరనీల ఆకృతితో ఉన్నారు. ఒకరి స్వభావమును మరొకరు గుర్తించి ఆనందిస్తున్నారు. ఈ విధముగా శ్రీయుగళమును భజింపుము!

**కదాపి చిదచిన్మయాదుపరి చేత్ స్పృహారోహణే**
**రతం మదనమోహనే విదధతాం తదేకాంతికీమ్**
**న సంతుజనతాపనే ప్రతివసంతు వృందావనే**
**నమంతు నను జంతుకానిహ న మంతురస్తు క్వచిత్ 5**

ఒకవేళ నీకు చిదచిదాత్మకమైన జగత్తును దాటి ఊర్ధ్వముఖముగా వెళ్లవలెనను ఇచ్ఛ ఉంటే శ్రీమదనమోహనుడిని ఏకాంతరీతితో సేవించు! జనులతో నిండి ఉన్న చోట ఉండకు. శ్రీబృందావనములో నివసించు. అక్కడ ఉన్న సమస్త ప్రాణులకు నమస్కరించు! ఎవ్వరికి ఎట్టి అపరాధము జరుగకుండునుగాక!

**మహాద్భుత చమత్కృతి ప్రకట సర్వ సద్వైభవమ్**
**భవన్నవ నవం సదామధుర పూర్ణ శోభార్ణవమ్**
**అతీవ సుచమత్కృతీ జన కృపా క్షమాద్యైర్గుణైః**
**మహో మదనమోహనాకృతి భజంతు వృందావనే 6**

శ్రీమదనమోహనుడు మహాద్భుత చమత్కారి! ఆయననుండియే సమస్తములైన ఉత్తమవైభవములు ప్రకటితమైనవి. అతడు నిరంతర, నూతన, మాధుర్య పూర్ణ సౌందర్యమునకు సాగరము వంటివాడు! జీవుల పట్ల అత్యంత కృప, క్షమ మున్నగు గుణములతో మహాద్భుతమైనవాడు. జ్యోతిర్మయ స్వరూపుడైన ఆ మదనమోహనుని బృందావనములో భజింపుము!

**అనన్యరస భావతో మధుర భావ సారోత్కరే**
**కరే నిపతితం స్వతోఽఖిల పుమర్థమాతన్వతి**
**విరజ్య భగవత్ పదాదపి ముదాత్ర వృందావనే**
**మహోజ్జ్వల మహామహో మదనగోపరసం భజ 7**

శ్రీమదనగోపాలుడు తన అనన్యరస స్వభావముతో మధురభావసార పూర్ణుడై వెలుగొందుచున్నాడు. తన కరతలమునందున్న సమస్త పురుషార్థములను అనుగ్రహించు దాత! ఈ బృందావనములో సారూప్యాదిగాకల ముక్తిని త్యజించి, ఆనందముగా మహాజ్యోతిర్మయ స్వరూపుడైన మహోజ్వల మదనగోపాలుని భజింపుము!

**ఆనంద రస కందలీ పరమకంద వృందాటవీమ్**
**కరుద్ర కృత వర్ణనాతిగ విచిత్ర శోభానిధిమ్**
**నవీన తడిదంబుద ద్యుతి మహోదయైక స్థితిమ్**
**ప్రవీణమతయో హరే భజనవర్త్మసు ధ్యాయత 8**

ఓ బుద్ధిమంతులారా! హరిభజనమార్గములో అత్యున్నత రససముద్రము యొక్క పరమమూల స్వరూపమైన ఈ బృందావనమును ధ్యానింపుడు! ఇది బ్రహ్మ, మహేశ్వరాదులకు కూడ అనిర్వచనీయమైన విచిత్ర శోభానిధి! నవీనాంబుదములోని తటిల్లతద్యుతి వలెనున్న రెండు స్వరూపములందును (శ్రీశ్యామాశ్యాముల యందు) ఇది స్థితమై ఉన్నది.

అంటే; శ్రీబృందావనమునకు, శ్రీశ్యామా శ్యాములకు కల అభిన్నత్వమును శ్రీసరస్వతీపాదులు స్పష్టం చేస్తున్నారు.

**కర్ణాభ్యర్ణాఽస్పర్శినః స్త్రీతి వర్ణాదప్యుత్రస్తాః సంగమాత్రాద్విహస్తాః**
**న్యస్తాత్మానః శ్రీలవృందావనే యే క స్తాన రాధా పాదగాన్న స్తువీత 9**

'స్త్రీ' అను అక్షరము చెవిని పడని వ్యక్తి, ఆ అక్షరమును విన్నంత మాత్రముననే భయభీతుడగువాడు, ఆ సాంగత్యమాత్రము చేతనే అత్యంత వ్యాకులుడగువాడు శ్రీబృందావనమునకు ఆత్మ సమర్పణము చేసికొని, శ్రీరాధా చరణములకు శరణాగతి చెందితే అట్టి భాగ్యశాలిని ఎవరు ప్రశంసింపకుండ ఉంటారు ? అంటే అందరూ ప్రశంసిస్తారని భావము!

**అత్యామృష్ట ప్రేమమాధ్వీక మాద్య**
**ద్రాధాకృష్ణోచ్ఛృంఖలానంగ ఖేలా**
**అత్యాశ్చర్యానంద సందోహ సాంద్రా**
**వృందాటవ్యాం సేవ్యతాం రే సుభవ్యాః 10**

ఓహో మహోదయులారా! ఈ బృందావనములో అతి విశుద్ధమైన ప్రేమమాధుర్యమత్తతలో ఎల్లలులేని శ్రీరాధాకృష్ణుల ప్రేమక్రీడ జరుగుతూ ఉంటుంది. వారు అత్యాశ్చర్య ఆనందరస ఘన స్వరూపులు! వారిని సేవింపుడు!

**కాలిందీపులినం విచిత్ర షడ్ఋతు శ్రీసేవ్య వృందావనమ్**
**నిత్యాశ్చర్యగుణో మరుత్పురుకలశ్చంద్రో నిశా శారదీ**
**ఇత్యద్భుత దీపనోగుణనిధి శ్రీరాధికా మాధవా**
**లంబీకోఽ పి మహాద్భుతో హృది రసశ్చిత్తానుభావోఽ స్తు నః 11**

యమునా తీరము, విచిత్రమైన షడృతువుల శోభతో సేవింపబడుతున్న బృందావనము, నిత్యాశ్చర్యమయ గుణములతో కూడిన వాయువు, పూర్ణ కళా విశిష్ట చంద్రుడు, శరద్రాత్రి ఇత్యాదిగాకల అత్యద్భుత వస్తువులతో ఉద్దీపనమును పొందు ఒకానొక మహాద్భుత రసము, చిత్తానుభావము గుణనిధులైన శ్రీరాధామాధవుల ఆశ్రయముతో నా హృదయములో ఉదయించునుగాక!

**కాళిందీపులినే రవచ్ఛుక పికే మత్తాలి ఝంకారిణీ**
**నృత్యత్ కేకిని పుష్పిత ద్రుమలతా వృందౌఘ వృందావనే**
**గౌరశ్యామ కిశోరయోః అతి రతిపత్యోర్నిజైకాంతయోః**
**కంచిత్ దివ్యమహారసం రసయితం మచ్చిత్తముత్కంఠతే 12**

శ్రీబృందావనము కాళిందీ తీరముతో శోభిస్తున్నది, శుక కోకిలాదులచే ప్రతిధ్వనిస్తున్నది. మత్తమధుకరముల నినాదముతోను, మయూరముల తాండవ నృత్యముతోను, పుష్పిత వృక్షలతాదులతోను శ్రీధామము భూషితమై ఉన్నది. అట్టి బృందావనములో రతికామ స్వరూపులైన ప్రియతమ శ్రీగౌరశ్యామయుగళ కిశోరుల ఒకానొక దివ్యమహారసమును ఆస్వాదించుటకు నా చిత్తము ఉత్కంఠతతో ఉన్నది.

**కళిందతనయా తటే మధుర మాధవీ మండపే**
**మిలన్మలయ మారుతే మధుప ఝంకృతాలంకృతే**
**పికాలికుల కూజితే వ్రజకళావతీ పూజితే**
**కిశోర సహసీ సదా స్మర గౌర నీలాకృతీ 13**

కాళిందీ నదీ తీరములో, మలయమారుతవీచికలతో, భ్రమరముల ఝంకృతితో, కోకిలల కూజితములతో కూడిన మధురమాధవీ మండపములో వ్రజగోపికలచే పూజింపబడుచున్న గౌరనీల యుగళ కిశోరులను నిరంతరము స్మరింపుము!

**అతిస్వచ్ఛైరంగచ్ఛవి నవసుధాంభోధి లహరీ**
**పరీవాహైః వృందావన వలయమాప్లావయదిదమ్**
**అహో గౌరశ్యామం మధురమధురం ధామయుగళమ్**
**సదా కైశోరం మే హృది మదనముగ్ధం విహరతు 14**

అతిస్వచ్ఛమైన అంగకాంతి యొక్క నూతన సుధా తరంగముల ప్రవాహములో బృందావనమంతటిని తేలియాడించు నిత్యకిశోర గౌరశ్యామ మధురమోహనులైన శ్యామాశ్యాములు నా హృదయములో విహరింతురుగాక!

**మిథః సాన్ముఖ్యేన వ్రతతి భవన ద్వారి రుచిరా ఽ ఽ**
**స్తరాసీనా వక్షైరతి సరసఖేలావిదధతౌ**
**సఖీభిస్తౌ బాలవ్యజన కృతసేవారతిముదా**
**భజే రాధాకృష్ణౌ రతికలహకుంఠత్వ హృదయౌ 15**

లతాగృహ ద్వారము చెంత ఒకరినొకరు చూచుకొనుచు శ్రీరాధాకృష్ణులు మనోహర శయ్యపై కూర్చుండినారు. వారు మిక్కిలి రసవంతమైన పాచికల ఆట ఆడుచున్నారు. సఖీమణులు చామరములతో వీచుచు వారిని సేవిస్తున్నారు.

ఈ విధముగా రతికలహముచే కుంఠిత హృదయులైన శ్రీయుగళమును ఆనంద పూర్వకముగా భజిస్తున్నాను.

**నవహేమ హరిన్మణి ప్రభం మధురాణాం మధురం మహోద్వయమ్**
**తదహం రససార విగ్రహం నవ వృందా విపినే భజేఽన్వహమ్ 16**

నవహేమ, ఇంద్రకాంతమణులతో సమానమైన కాంతిని కలిగి, మధురాతి మధురమైన రససార యుగళమును నవ బృందావనములో నేను నిత్యము భజిస్తున్నాను.

**విలసన్నవ హేమ చంపకద్యుతి కైశోర మనోహరం మహః**
**తదహం మృగయే ముహుః శ్రితం హృది వృందావన పుష్పకేతునా 17**

నవస్వర్ణ చంపక కాంతి విశిష్టయైన ఒక కైశోరమనోహర స్వరూపిణి (శ్రీరాధ) బృందావన కామదేవుని (కృష్ణుని) యొక్క ఆశ్రయమును పొందినది. నేను అట్టి దేవిని మాటిమాటికి అనుసంధానము చేసుకుంటున్నాను.

**హరిణాయత లోచనేన హి క్షణమాత్రం న విధాతుమిష్యతే**
**అపి తల్పవరాఽపి యాఽనిశం హృది రాధా మమా స్త్వధీశ్వరీ 18**

శయ్యపైనున్న విశాలలోచనయైన శ్రీరాధను శ్రీహరి ఒక్క క్షణమైనను విడిచిపెట్టుటకు ఇష్టపడడు. అట్టి అధీశ్వరి రాధాజీ రాత్రింబవళ్లు నా హృదయములో విరాజిత అగునుగాక!

శ్రీరాధ తననుండి దూరమగుటను శ్రీకృష్ణుడుభావములో సైతము సహింపలేడని భావము!

**అతిదోలితమూర్తిమాలయా సతతోద్వేల మహారసాంబుధేః**
**తదహ నవ గౌరనీలరుక్ మిథునం కుంజకుటీషు లాలయే 19**

నిరంతరము ఎగసిపడుచుండు మహారససముద్ర తరంగములలో ఊగుచుండు ఆ గౌరనీల కాంతిమయమైన జంటను కుంజకుటీరములో నేను లాలిస్తున్నాను.

**స్పృహయే రసపుంజ రాధికా రతికుంజే లతికౌఘవీబద్ధధీః**
**భవితుం కవితుండమండలీ కుముదానందక కీర్తి చంద్రికా 20**

మహారసవతియైన శ్రీరాధ యొక్క రతికుంజలో లతలచే బద్ధమతినై (బంధింపబడి) కవిగజమండలి అనెడు కలువలకు ఆనందము నిచ్చు చంద్రుని యొక్క కీర్తి చంద్రికను కావలెనని కోరుకుంటున్నాను.

కలువలకు ఆనందమునిచ్చువాడు చంద్రుడు! కవులకు ఆనందము నిచ్చునది కీర్తి! శ్రీరాధా రససాగరములో ప్రేమరసలతలచే బంధింపబడి రసచంద్ర చంద్రికలను పొందగోరుచున్నారు.

**మదకేకి శిఖండ మండలం నవగుంజాఫల మంజు హారిణమ్**
**మురలిధ్వని మోహితాఖిలం భజ వృందావన నాగరీవిటమ్ 21**

మత్తమయూర పింఛమును శిరసుపై ధరించినవాడు, నవగుంజా బీజములతో చేసిన మనోహరమాలను ధరించినవాడు, మురళీనాదముచే జగత్తును మోహింపజేయువాడు, బృందావననాగరీ (రాధా) లంపటుడైన శ్రీకృష్ణుని భజింపుము!

**మధురం మధురం బనే బనే కల కూజన్నవ కోకిలా కులమ్**
**అఖిలర్తూల్లసల్లతాద్రుమం శ్రయ వృందావన నామ తద్వనమ్ 22**

ప్రతి వనమునందు మధురాతి మధురమై, అవ్యక్తమధుర ధ్వనులను చేయుచున్న కోకిలలతో ముఖరితమగుచున్న, అన్ని ఋతువులలోను అందగిస్తున్న లతా వృక్షములతోను ఉన్న శ్రీబృందావన నామకమైన ఈ వనమును ఆశ్రయింపుము!

**మదనోన్మాద ఘూర్ణితారుణ క్షణముద్యత్పులకం క్షణే క్షణే**
**పరిచుంబిత రాధికా ముఖం భజ వృందావన కుంజనాగరమ్ 23**

శ్రీకృష్ణుడు క్షణక్షణము ప్రేమోన్మాదవశుడైన కారణమున కన్నులు ఎఱ్ఱవారినవి. సర్వాంగములు పులకితమైనవి. శ్రీరాధాముఖబింబమును ముద్దుగొనుచున్న ఆ బృందావన కుంజ నాగరునే భజింపుము!

**మురలి కలగీత తోషిత ప్రియరాధార్పిత కంఠమాల్య భృత**
**పులకోజ్జ్వల ఫుల్ల విగ్రహో హసితాస్యః స హరిర్నమస్యతామ్ 24**

శ్రీహరి మురళి నాదముచే సంతోషించిన రాధాజీ పుష్పమాలను ఆతని మెడలోవేసినది. పులకరించిన ఆతని దేహకాంతి ఉజ్వల ప్రఫుల్లితమైనది. ముఖబింబమున చిరునవ్వుతో శోభిస్తున్న అట్టి శ్రీకృష్ణుడే నమస్కరింప తగినవాడు!

**రతి మన్మథ కోటిమోహనం విహరత్ పూర్ణ రసైక సాగరమ్**
**నవ కాంచన నీలరత్నరుక్ యుగళాన్ భజ కుంజవీథిషు 25**

కోటి రతీ మన్మథులను మోహింపజేయునట్టి, నిరంతర విహరణశీలురైనట్టి, పూర్ణ రససాగర స్వరూపమైనట్టి, నవ హేమ నీలమణి కాంతితో కూడినట్టి శ్రీయుగళమును కుంజ మార్గములో భజింపుము!

**హసత్ పరిహసన్ముహుర్బహు మిషాన్మిథోఽంగ స్పృశత్**
**ప్రగాయదథ వాదయత్ కిమపి నృత్యదత్యద్భుతమ్**
**సుహేమ హరినీలరుక్ తదుభయం కిశోరం మహః**
**స్మరామ్యతి విచిత్ర సద్రసకథాలి వృందావనే 26**

శ్రీయుగళ కిశోరులు పదేపదే హాస పరిహాస పరాయణులగుచున్నారు. ఏదో ఒక నెపముతో ఒకరినొకరు తాకుచున్నారు. గాన, వాద్యములతో అనిర్వచనీయమైన మధుర నృత్యమును చేయుచున్నారు. ఈ విధముగా స్వర్ణ,

ఇంద్రనీలమణికాంతితో వెలుగుచున్న శ్రీయుగళము అతి విచిత్ర రసాత్మికలైన సఖియలచే పరివేష్టితులై బృందావనములో విరాజిల్లుచున్నారు. నేను వారిని స్మరిస్తున్నాను.

**అనంగరస వారిధౌ మహతి కుల శూన్యే మహా**
**మదాంధ నవ నాగరౌ ప్రణయకేళి కల్లోలినీ**
**స్మరానవధి ఖేలినౌ లలిత గౌర నీలద్యుతి**
**న భంగుర సుసంగతీ మధురధామ్ని వృందావనే 27**

పారావారమే (హద్దులు)లేని మహా అనంగరససాగరములో మహాప్రేమ వివశులైన నాగర యుగళము ప్రణయకేళీ మహా తరంగములలో నిమగ్నులై నిరంతరము క్రీడిస్తున్నారు. వారు సుందరమైన గౌరనీలకాంతితో వెలుగుచున్నారు. మధురధామమైన బృందావనములో భంగము లేని వారి సంగము నిత్య ఘనిష్టమై ఒప్పుచున్నది. అట్టి వారిని స్మరింపుడు!

**క్వచిన్నవ నికుంజకే కపటసుప్త కృష్ణోరసి**
**స్ఫురన్మురలికాహృతిం నిజసఖీ గిరా కుర్వతీ**
**విధృత్యరమితా రుదత్యధివలాత్ కలాశాలినా**
**సమేత్యహసదాలి నిర్ధూత శుగస్తు రాధాహృది 28**

ఒకానొక నవనికుంజలో శ్రీకృష్ణుడు నిద్రను నటిస్తూ పడుకొని ఉన్నాడు. తన సఖి చెప్పిన మాట ప్రకారము ఆతని వక్షస్థలముపై నున్న మురళిని అపహరింపదలచిన రాధాజీ సమీపమునకు వచ్చినది. కళా నిపుణుడైన శ్రీహరి ఆమెను దగ్గరకు లాగికొనినాడు. (పట్టుబడినందుకు) ఆక్రందిస్తున్న కిశోరిని చూచి సఖి నవ్వుచు వచ్చి, ఆమె శోకమును దూరము చేసినది. ఈ విధముగా శ్రీరాధ నా హృదయములో ఉదయించునుగాక!

**ఉరః పురట సంపుట ద్వితయయుక్స్ఫుట లక్ష్యతే**
**వ్యనక్తిముఖ మధ్యతః శిఖర పంక్తిమీషత్ స్మితమ్**
**స్ఫురత్యధర విద్రుమః కర పదోర్మణి శ్రేణయోః**
**వపుః సకలమేవ తే కనక సారసారైః కృతమ్ 29**

(శ్రీరాధా) నీ వక్షస్థలము రెండు బంగారు పేటికలతోనున్నట్లు స్పష్టముగా తెలుస్తున్నది. మృదుమధుర మందహాసముతో నున్న నీ ముఖములో పండిన దానిమ్మ గింజల వంటి కాంతితో మణిమయ (దంత) పంక్తి ప్రకాశిస్తున్నది. అధరములు పగడములను స్ఫురింపజేస్తున్నవి. కర, చరణముల నఖమణి కాంతులు విస్తరిస్తున్నవి. నీ దేహమంతయు స్వర్ణాదిగాకల మహాసారవస్తువుల సారముతో నిర్మితమైనట్లు ఉన్నది!

**సహోద్వర్త్యస్నాతౌ సహరచిత భూషౌ సహభుజౌ**
**సహాచామ్యాసీనౌ సహ విరచితాఽఽరాత్రిక విధీ**
**సహైవ శ్రీరాధామురలిధరనౌ కుంజశయనే**
**సుఖం సుప్తౌ విశ్రామయ మృదు మృదున్మర్దిత పదేః 30**

ఇరువురికి (యుగళమునకు) నలుగుపెట్టుట, స్నానము చేయించుట ఒకేమారు జరుగుతుంది. ఒకేమారు ఆభరణములతో అలంకరించుట ఔతుంది. ఒకేమారు ఆహారము, ఆచమనము, ఆశీనులను చేయుట జరుగుతుంది. రాత్రివేళ చేయు సేవ (ఆరాత్రిక విధి) కూడ ఒకేమారు పూర్తి ఔతుంది. ఇంకను, శ్రీరాధా మురళీధరులు ఒకేసారి కుంజశయ్యపై సుఖనిద్రలో ఉండగా వారి మృదు పాదములకు సంవాహనము (ఒత్తుట) చేసి, వారిని విశ్రమింపజేయుడు!

**కదాచిత్ కాళిందీతట భువి కదాచిత్తరుతలే**
**కదాచిత్ కుంజాత్ గహన విపినే కర్హిచిదహో**
**అభంగైః సంగీతోత్తర మధుర కందర్ప లలితైః**
**సదా వృందారణ్యే మమ హృదయ బంధూ విహరతః 31**

నా ప్రాణ బంధువు అయిన శ్రీయుగళకిశోరులు ఒకసారి కాళిందీ నదీ తీరములో, ఇంకొకమారు వృక్షఛాయలో, మరొకమారు కుంజలలో, మరొకమారు గహన వనములో విహరిస్తున్నారు. ఒకొక్కమారు అంతకంతకు పెరుగుతున్న సంగీతాదులతో మధురమైన ప్రేమవిలాస పరాయణులై వారు నిరంతరము బృందావనములో విహరిస్తున్నారు.

**అహో మాయా విద్యామయమఖిల భేదం న హి మనాక్**
**విదంతౌ కందర్పోత్సవ సహజ వృతీ కథమపి**
**మహావిద్యానందాత్మక విమలమూర్తి విహరతో**
**మమప్రాణౌ వృందావన భువి సుగౌరాసితరుచి 32**

ఓహో! శ్రీయుగళము మాయామయము, విద్యామయమునైన సమస్త వస్తువుల భేదస్థితికి అతీతులు! ఏదో ఒక విధముగ ప్రేమోత్సవమునందు తమ స్వాభావిక ప్రవృత్తిని నిర్ధారించు మహా విద్యాత్మకులు! ఆనంద స్వభావులు, విమల మూర్తులు, సుందర గౌరశ్యామ కాంతి స్వరూపులునైన శ్రీశ్యామాశ్యాములు నా ప్రాణధనమైన బృందావనములో నిత్యవిహారము చేస్తున్నారు.

**అయే గౌరశ్యామ ద్వయ మధురధామ శృతి శిరో**
**రహస్యానాం సారం సముదయతి వృందావన వనే**
**సదా భంగోత్తుంగ స్మర సమరరంగం నవనవో**
**ల్లసత్ కైశోరం తత్కిమితి న రసేనానుసరతి 33**

ఓహో! గౌరశ్యామ యుగళము వేదవేదాంగముల రహస్యసారస్వరూపులై యుండియు శ్రీబృందావనములో ప్రకటితులైనారు. వారు నిత్యవర్ధన శీలమైన ఉన్నత అనంగ సమర రంగములో నవనవాయమాన కైశోర స్వరూపులై వెలుగుచున్నారు. కనుక నీవు రసపూర్వకముగా వారిని ఎందుకు అనుసరింపవు ? అంటే శ్రీయుగళమునకు రసాత్మక పరిచర్య చేయుట మన విధి అని భావము!

**శ్రుణు భ్రాతస్త్వం మే నను శపథపూర్వం వచ ఇదమ్**
**హరేః పాదౌ జానన్నహి నహి కిమప్యతి మధురమ్**
**చమత్కార స్తవాప్యతి మధురతా యః పరతరః**
**పరాగే శ్రీవృందావిపిన వర కందర్ప పదయోః 34**

ఓ సోదరా! నేను శపథ పూర్వకముగా చెప్తున్నాను, వినుము! శ్రీమన్నారాయణుని పాదపద్మములను గూర్చిన జ్ఞానమును ఎరిగినను విశేష మాధుర్యము లభించదు. ఎందుకంటే బృందావన మన్మథుడైన శ్రీకృష్ణుని చరణకమల రేణువు కూడ అంతకన్న అధికతర మాధుర్యమును కలిగి ఉంటుంది.

**అద్యత్వద్బహు శిక్షయా సఖి! మయా మానః సమాలంబితః**
**తత్రాభూత్ యదసహ్యా దుఃఖమపి తత్కథ్యేత కస్యాగ్రతః**
**శ్రీవృందావన పుష్పమండిత వపుర్వంశీధరః సేంద్రియమ్**
**దేహం కర్షతి ఏకతస్తవ గిరాయద గౌరవాచ్చైకతః 35**

"ఓ సఖీ! నేడు నీవు ఇచ్చిన శిక్షణ వలన నేను అలుక వహించాను. కాని, దాని వలన దుస్సహమైన దుఃఖముగా ఉన్నది. అది ఎవరి ఎదుట చెప్పగలను! ఒకవైపు బృందావన పుష్పములతో శోభితుడైన వంశీధరుడు ఇంద్రియములతో సహా నన్ను ఆకర్షిస్తున్నాడు, రెండవ వైపు నీవు విధించిన బంధనము పట్ల గౌరవమూ నన్ను ఆకర్షిస్తున్నది" (అని రాధాజీ పలికినది).

జగదేక స్వామినియైన శ్రీరాధ సఖీవచనములకు ఎంతటి గౌరవము, మన్నన ఇస్తున్నది! సహజముగా ఆమెకు కృష్ణుని పట్ల అలుక లేదట, కాని సఖిని మన్నించి అలుక వహించినదట!

రాధాసఖి ఎంతటి పుణ్యరాశియో! ఇంకెంతటి రసార్ద్రచిత్తయో!

**వృందారణ్యం మనసిజమయం తత్ర నిత్యం వసంత**
**స్తత్రోత్ఫుల్లా నవ తరు తలాస్తత్ర గుంజతి భృంగాః**
**మత్తాశ్చూతాంకురకవలనైః కోకిలాః సంరువంతి**
**శ్యామః సాక్షాత్ వరమనసిజస్తత్ర కా మానవార్తా ? 36**

"శ్రీబృందావనము ప్రేమమయమై ఉన్నది. ఆపై ఇచట నిత్య వసంతము! ఇంకను తరులతాదులన్నియు ప్రఫుల్లితములై ఉన్నవి. భ్రమరములు గుంజారవము చేస్తున్నవి. మామిడి మొగ్గల నాస్వాదించి మత్తిల్లిన కోకిలలు కూస్తున్నవి. అన్నిటినీ మించి శ్యామసుందరుడు సాక్షాత్తు శ్రేష్ఠ మన్మథ రూపముతో వెలుగొందుచున్నాడు. ఇంక అలుకకు స్థానమెక్కడ ?" అని రాధాజీ అంటున్నది.

ఈ వాక్యములన్నియు శృంగార సంబంధిగా తోచుచున్నను, రససార స్వరూపులైన శ్రీరాధాకృష్ణుల యందు వీనిని ఆరోపింపరాదు. జీవులపై దయతో శ్రీరాధాకృష్ణులు ప్రకటించుచున్న లీల అని మరువరాదు. ఆ లోతైన భావమును వర్ణించు శక్తి భాషకు లేదు.

**సఖ్యాద్య ప్రతిబోధితాఽస్మి న భవాన్ భూయోఽభిభాష్యః శఠో**
**నేక్ష్యశ్చత్వమతో న సంశయమతో మా కించ నో వాచయా**
**కించాలోక కృతానురాగక ముధా స్పర్శ్రవత తత్వద్ధృతా**
**మత్కంఠే స్వమర్పితా పరమియం గుంజావలీ నీయతామ్ 37**

“ఓ శఠుడా! నీ మాటలు, నీ దర్శనము అన్నిటిని గురించి సఖియలు నాకు తెలియజేశారు. ఇప్పుడు నాకు ఏదో ఒకటి చెప్పి సంశయములో పడేయవద్దు. ఇంకను, అబద్ధపు అనురాగము అను వంకతో నన్ను స్పృశించుట నీ వ్రతము, స్వభావము! కనుక నీవు నాకు ఇచ్చిన శ్రేష్ఠమైన గుంజామాలను తిరిగి నీవే తీసుకొమ్ము” అని రాధాజీ శ్రీకృష్ణునితో పలికినది.

పై శ్లోకములో ప్రేమమయమైన బృందావనమును వర్ణించి, ‘ఇంకెక్కడి అలుక’ అని పలికిన రాధాజీ ప్రస్తుత ఘట్టములో శ్రీకృష్ణుని పట్ల అలుకను చూపిస్తున్నది.

**రాధాయా ఇతి భాషితేన పరమానందప్రవాహోనహమ్**
**యానద్య ప్రతిలబ్ధవాన్నఖలుతే వాక్ చేతసోర్గోచరాః**
**సఖ్యః ప్రేక్ష్యమిథః స్మితంకురుత కిం యుష్మత్ కుచేష్టాసు మే**
**జీవాతుర్వనరాజ వైభవమథో దాక్షిణ్య మేనీదృశః** **38**

“రాధాజీ పలికిన ఈ పలుకులతో నేను పరమానందమును పొందాను. ఇది నిశ్చయము; మాటకు, మనసుకు అగోచరము! ఓ సఖీ! ఇది చూచుచు ఎందుకు నవ్వుతున్నావు ? మీ ప్రతికూలమైన చేష్టల మధ్యకూడ శ్రీబృందావన వైభవము, హరిణనయనయైన శ్రీరాధ అనుకూలముగ ఉండుట నాకు జీవన ఔషధముగ నున్నవి” అని శ్రీకృష్ణుడు పలికినాడు.

రాధాజీపైకి అలుకను అభినయించుచున్నను, ఆమెలో తనపట్ల వెలుగుచున్న ప్రేమను చూచి శ్రీకృష్ణుడు అదియే తన జీవన ఔషధము అనుచున్నాడు.

.................................................................

.................................................................

**చూడాం దివ్య విచిత్ర పుష్పరచితాం విధాయ స్వయమ్**
**ఖేలతి కోఽపి గోప కుసుమేష్వాషోఽత్ర వృందావనే** **39**

.................................... స్వయముగా విచిత్ర పుష్పములతో శిరోభూషణమును తయారుచేసి ఒకానొక గోపకుల మన్మథుడు ఈ బృందావనములో లీలను ప్రకటిస్తున్నాడు.

**శ్రీవృందావన భూరియం మధుపతిః సర్వత్ర ధత్తే రసాన్**
**సర్వస్థావర జంగమస్య హృదయం చాక్రమ్య సోఽత్ర స్థితిః**
**అన్యత్ కిం సఖీ! సోఽంగమంగమపి మేఽవష్టభ్య కామోన్మదమ్**
**చేష్టావానల మక్షరోధమపి తన్మానన్య కః సంభవః ? 40**

“ఇటు ఈ బృందావన భూమి, దానిపై మధుపతియైన కృష్ణుడు సర్వత్ర రసవర్షమును కురిపిస్తున్నాడు. ఇచటి స్థావర, జంగమముల హృదయములో శ్రీశ్యామసుందరుడు స్థితుడై ఉన్నాడు. ఇంకను, సఖీ! నా ప్రత్యంగములోను ప్రేమోన్మదము ప్రవహిస్తున్నది. ఇంద్రియములను నిగ్రహించుట అసంభవముగ ఉన్నది. చెప్పుము, నేనెట్లు అలుక వహించగలను ?”

బృందావనమందంతట రసవర్షము కురియుచున్నది. రసమే వివిధ రూపములను ధరించి, లీలా నాటకమును రక్తి కట్టించుచున్నదని మరువరాదు.

**సంస్యూతాత్మ మిథో నవైరతి దృఢైః సత్ప్రేమ సూత్రైః సదా**
**హృద్వాగింద్రియ దేహ తుల్య విషయాశేషేణ సత్సుందరమ్**
**శ్రీవృందావన నిత్యకేలి విలసత్ కైశోర నిత్యోదయమ్**
**గౌరశ్యామ మహోద్వయం మదకలం తత్ స్వాత్మ భావేఽస్తు నః 41**

శ్రీశ్యామా శ్యాములు నూతనమైన, అతి దృఢమైన, సుందరమైన ప్రేమ సూత్రముతో బంధితులై ఉంటారు. నిరంతరము ఒకరికొకరు హృదయ, వాక్య, ఇంద్రియ, దేహాది సమస్త విషయములలోను ఏకాత్మ స్వరూపులు! వారు సుందరమైన బృందావనములో నిత్యము కేళీ విహారము చేస్తూ ఉండెడి నిత్యకైశోర స్వరూపులు!

గౌరశ్యామాత్మకమైన ఆ 'మదకల' యుగళము మా హృదయములో స్వస్వరూపముతో ప్రకాశింతురుగాక!

**విందానః సతతం కిమేతదఖిలం కోఽహం క ఈశోన్వితి**
**ఛిందానః సదుపాసనచ్ఛురికయాదుస్నేహ పాశం దృఢమ్**
**రుంధానః సతతం కదింద్రియగణం విందానవాప్యం పరమ్**
**వృందారణ్య నిషేవయైవ సుసఖే! కిం దాన యజ్ఞాదికైః ? 42**

ఓ ప్రియసఖా! ఈ సమస్త దృశ్యమాన వస్తువులు ఏమిటి ? నేను ఎవరు ? ఈశ్వరుడు ఎవరు ? ఇత్యాదిగా తత్త్వవిచారమును చేస్తూ చేస్తూ; సదుపాసన అనెడు కత్తితో దృఢమైన స్నేహపాశములను త్రెంచివేసి; నిరంతరము దుష్ట ఇంద్రియములను నిరోధిస్తూ ప్రవర్తింపుము. శ్రీబృందావనమునకు సేవ చేస్తూ చేస్తూ అప్రాప్య వస్తువైన ప్రేమలాభమును పొందుము. ఇక దాన యజ్ఞాదులతో ఏమి పని ? (ప్రయోజనము లేదు.)

**అన్యోన్యాం సార్పితోద్యత్ పులక మృదుభుజం సర్వతశ్చారు హాసో**
**దారాలోకం సుమంజు క్వణిత నవతులా కోటి కాంచీ కలాపమ్**
**ఆలిభ్యాంః స్వోత్తరీయైః కృతశిర ఉపరిచ్ఛాయమాభోజ్యమానాన్**
**తాంబూలధ్యాయ వృందావనమతదుభయం ధామతత్ గౌరనీలమ్ 43**

'శ్రీయుగళము ఒకరి భుజముపై మరొకరు మృదు బాహువులను వేసి పులకితులగుచున్నారు. మనోహరముగా నవ్వుచు, అన్ని వైపులకు ఉదారమైన చూపును ప్రసరింపజేస్తున్నారు. మధురముగా ధ్వనించుచున్న నూతన నూపుర, కాంచీ ఆది ఆభరణములను ధరించినారు. సఖియలు తమ తమ మేలి ముసుగులతో వారి శిరస్సులపై నీడను కల్పించి; భోజన, తాంబూలాదులను సమర్పించినారు.' ఈ విధముగా బృందావన విహారులైన గౌరనీల యుగళమును ధ్యానింపుడు!

**కృష్ణప్రేమ మయంక నిర్మల చిదానందాత్మ వృందావనే**
**తద్రూపాద్భుత వైభవై సు మధురే తద్వర్ధితౌర్యత్రికే**
**శ్రీకృష్ణైకరసాభిమగ్న పురురుగ్ దేహేంద్రియైః సుందరే**
**.................................................... 44**

**....................................................**
**....................................................**
**గోపీమండల ఉన్మద స్మరకలా రంగేన నృత్యన్ముదా**
**నిస్సీమ స్మరబాధయా విహరతి శ్రీరాధయా మాధవః 45**

శ్రీబృందావనము ఏకమాత్ర శ్రీకృష్ణ రసము నందు మగ్నమై ఉంటుంది. నిర్మలమైన, చిదానందాత్మకమైన శ్రీధామము అత్యంత కాంతిమయమైన శ్రీకృష్ణుని రూపము యొక్క ఆశ్చర్యకర వైభవ మధుర భావమును వృద్ధి చేస్తుంది .......... ............ గోపీమండల ఉన్మద స్మర కళారంగము నందు నృత్యపరాయణుడైన మాధవుడు ఎల్లలులేని స్మర వ్యాకులత్వముతోనున్న శ్రీరాధతో కలసి విహరిస్తున్నాడు. (44, 45)

**శ్రీవృందావన మంజుకుంజ భవన్వేష్వద్రీంద్ర సత్కందరే**
**కాలిందీ పులినే కదంబ విటపిచ్ఛాయాస్వతి స్నేహతః**
**నిత్యం శ్రీవృషభానుజా చరణయోర్దాస్యైక లాస్యోద్వహే**
**స్వాంత స్యాంతరుదేతు మే మధుపతావాద్యారతిః పావనీ 46**

శ్రీకృష్ణుడు శ్రీబృందావన మనోహర కుంజలలో, గిరిరాజు యొక్క సుందరమైన గుహలలో, యమునా తీరములో, కదంబ వృక్ష ఛాయలో నిత్యము అతిస్నేహ పూర్వకముగా భానుజా చరణ కమలములకు దాస్యపూర్వక లాస్య పరాయణుడై ఉంటాడు. అట్టి మధుపతియందు వెలుగుచుండు అతి పవిత్రమైన

ఆద్యరతి (శృంగార భావము) నా అంతఃకరణములో ఉదయించును గాక! ఇదియే నా ప్రార్థన!

బృందావనము నందలి అణువణువునను శ్రీకృష్ణుడు రాధాజీని సేవించు చుండుట ఇట వర్ణితమైనది.

**యా గోవర్ధన ఘటదాన విషయా యా శ్రీకలిందాత్మజా**
**మధ్యస్నానకలా వికల్పితదురు తారాతరచ్ఛద్మతః**
**యా వృందావన వాటికాసు కుసుమస్తేయస్య లీలా పరా**
**రాధామాధవయోర్వినోదలహరీ సా మే హృది స్ఫూర్జతు 47**

గోవర్ధనగిరి సమీపములో జరిగిన ఘటదాన లీల, యమునా నదిలో స్నానకేళీ విలాసలీల, యమునాతీరము యొక్క పారమును తెలిసికొనుట అను మిషతో చేసిన నటన, బృందావన వృక్షవాటికలలో పూవులను దొంగిలించిన లీల – శ్రీరాధా మాధవుల ఈ సమస్త లీలా వినోద లహరి నా హృదయములో స్ఫురించునుగాక!

**మా యాహి వృందావిపినం విహాయ మా యాహి వృందాధి భయ సమంతాత్**
**సా రాధికా తాం నవ కుంజవాటీం సారాధికాం పూర్ణరసోత్సవేన 48**

శ్రీబృందావనమును విడచి వెళ్లవద్దు. జనసాంగత్యములోనికి కూడ వెళ్లవద్దు, ఎందుకంటె సర్వత్ర భయము ఉన్నది. ఆ రాధిక, ఆ పూర్ణతమసార వస్తువైన రాధిక నవ వాటికలో పూర్ణరసోత్సవముతో శోభిస్తున్నది.

కనుక శ్రీధామము తప్ప మరొక ప్రదేశము వద్దు అని భావము!

**నిత్యం మందసుగంధశీతల మరుత్సంసేవితే సర్వతో**
**దివ్యామోద మిలజ్జల స్థల భవానేక ప్రసూనోద్గమే**
**కాలిందీతట నీపరాజి సుతలే ఖేలత్ కిశోరద్వయమ్**
**నానా కామకలా రసేన సతతం తత్ గౌరనీలం భజే 49**

శ్రీయుగళకిశోరులు నిత్యము నాలుగు దిక్కులలోను స్థల, జల ప్రభవములైన దివ్యసుగంధ పూర్ణమైన పుష్పముల వాసనలతో కూడిన పిల్లవాయువులచే సేవింపబడుతూ ఉంటారు. కాళిందీ తీరములోని నీపవృక్షముల సుందర ఛాయలో అనేక విధములుగా ప్రేమకళారసవిధితో నిరంతరము క్రీడిస్తూ ఉంటారు. అట్టి గౌరనీలాత్మక యుగళ కిశోరులను సేవిస్తాను!

**కాళిందీ పులినే కదంబ విటపిచ్ఛాయాసు రత్నోల్లసత్**
**వల్లీమండప ఉజ్జ్వలే మరకతోన్మీలత్ ప్రదీపాలిని**
**ముక్తాకుట్మల గుచ్ఛహీర కుసుమే వైదూర్య సత్పల్లవే**
**ధ్యాయామి స్మరకేలినర్మనిరత శ్రీరాధికామాధవమ్ 50**

రత్నోజ్వలమైన లతామండపము మరకతమణిమయ దీపములతో శోభిస్తున్నది. ముత్యములు, మొగ్గలు, గుత్తులు మున్నగువానితో అది రచితమైనది. వజ్రములు, కుసుమములతో భూషితమైనది. వైడూర్యములు, మణిమయములైన సుందర పల్లవములతో కూడిన వృక్షములతో భూషితమైనది. కాళిందీ నదీ తీరములో, కదంబ వృక్షఛాయలో నున్న అట్టి రత్నోజ్వల లతామండపము నందు నిగూఢమైన ప్రేమకేళిలో నిరతులైయున్న శ్రీరాధామాధవులను ధ్యానిస్తున్నాను.

**కదాచిత్ చిరప్రభా ఘన ఇవ క్షణోద్ఘాటితా**
**ఖిలస్మర వశాకృతిః ప్రియతమోరసాఖేలతి**
**కదా చ నవ కాంచన వ్రతతి సత్ మాలాయితమ్**
**హరిరం వలయతే స్వ వపుషా సుగౌర త్విషా 51**

ఒక మారు మేఘము యొక్క ఒడిలో మెరుపుతీగవలె క్షణకాలము ప్రేమ వశీకృతమైన స్వభావమును చూపుచు ప్రియతముని వక్షస్థలముపై క్రీడించినది; మరొకమారు స్వర్ణలత శ్యామతమాలమును వలె శ్రీరాధ తన సుందర గౌరవర్ణ దేహముతో శ్యామసుందరుని కౌగిలించుకొనినది.

**కదాపి మదనోన్మదా పులక పూర్ణదోః కందలీ**
**ద్వయేన దయితోల్లసత్ పులక కంఠమాశ్లిష్యతి**
**కదాప్యగురు సౌరభ ప్రియభుజేన కంఠం నిజమ్**
**ప్రవేష్టయతి తత్ కరాంబుజ తల నిధత్తే హృది 52**

శ్రీరాధ ఒకమారు మదనోన్మత్తయై పులకించిన బాహులతలతో ఉల్లాసముతో పులకితుడైన ప్రియతముని కంఠమును కౌగిలించుకుంటుంది. మరొకమారు అగరు సౌరభయుక్తమైన ప్రియతముని బాహువులను తన కంఠము చుట్టును వేయునట్లు చేస్తుంది. ఆతని కరకమలమును తన హృదయముపై ఉంచుకుంటుంది.

**కదాపి కలితాంచలా రతికలోర్మిభిశ్చంచలా**
**వికర్షతి నిజ ప్రియం నవనికుంజ వీక్షాచ్ఛలాత్**
**కదాప్యతి తృషా మృషా వదనపద్మ జిఘ్రాంసయా**
**ముహుర్ముర్మరలి మోహన స్మిత ముఖాంబుజ చుంబతి 53**

శ్రీరాధ ఒకమారు (శ్రీకృష్ణుని) ఉత్తరీయమును పట్టుకొని, ప్రేమ విలాస తరంగములలో చంచలిస్తూ నవనికుంజను దర్శించుట అను మిషతో ప్రియతముని ఆకర్షిస్తుంది. మరొకమారు అత్యంత తృష్ణాతురయై ముఖకమలమును ఆఘ్రాణింప వలెనను లాలసను ప్రకటిస్తూ, మాటిమాటికీ మృదుమధుర మందహాసముతో శోభిస్తున్న మురళీమోహనుని ముఖ కమలమును ముద్దుగొనుచున్నది.

**అదక్షిణ కరాంబుజాన్నమిత బర్హచూడం హరేః**
**ప్రగృహ్య చిబుకం మనోహరమవామహస్తేన తు**
**కదాపి పులకావలిం వలిత చారుగండస్థలమ్**
**మహారభస చుంబనైరధరశీధు నిష్కర్షతి 54**

రాధాజీ తనవామ (ఎడమ) కరకమలముతో మయూర పింఛముతో నిర్మితమైన శ్రీకృష్ణుని చూడాభరణమును వంచి, దక్షిణ (కుడి) హస్తముతో మనోహరమైన అతని చిబుకము (గడ్డము)ను పట్టుకొనినది. ఆ స్పర్శతో పులకరించిన శ్యాముని గండస్థలిని ముద్దుగొని శ్రీరాధ తన అధరసుధను అనుగ్రహించినది.

**కదాపి నిజభూషణైర్మదన మోహనం భూషయేత్**
**స్వమేవ పరిమండయేత్ క్వచ ముదాపి తన్మండనైః**
**కదాపి కురుతే నిజ ప్రియతమాంగ రాగాంచితమ్**
**స్వకం స్వకుచ కుంకుమాదిభిరథ ప్రియం లింపతి** **55**

(శ్రీరాధ) ఒకమారు తన అలంకారములతో మదనమోహనుని అలంకరించినది, ఆతని ఆభరణములతో తనను అలంకరించుకున్నది. మరొకమారు ప్రియతముని అంగరాగములను తీసుకొని, తన దేహమునకు మార్జనము చేసుకున్నది. ఇంకను, శ్రీరాధ తన వక్షస్థలముపైనున్న కుంకుమాది లేపనములను ప్రియతముని శరీరమునకు అలదినది!

**కదాపి హరి కంఠగ స్రజమసౌ స్వకంఠేఽర్పయ**
**త్యముష్య చ సు కంఠగాం రచయతి స్వకంఠస్రజమ్**
**కదాపి బహు నిందయతి ప్రణయాత్ కదాచిత్ స్తుతిమ్**
**కదాపి రుషితా కదాప్యతి గభీర ధీ స్తుష్యతి** **56**

రాధాజీ ఒకమారు శ్రీకృష్ణుని కంఠమాలను తనమెడలో వేసుకుంటుంది, తనమెడలోని సుందర హారమును ఆతనికి ధరింపజేస్తుంది. ఒకొక్కమారు బహువిధములుగా నిందిస్తుంది, మరికొన్నిమారులు అనేక విధములుగా స్తుతిస్తుంది. ఒకమారు క్రోధిత ఔతుంది, మరొకమారు అతిగంభీరమైన ఆలోచనలో నుండి సంతుష్ట ఔతుంది.

**కదాచిదతి దూరతః స్మరభరార్ధితా రోదితి**
**క్షిపంత్యపి సఖీజనం చలతి కుంజమేకాసితమ్**
**అలక్ష్యనయనేంగితైః వపుషిచాంగులీ ఘట్టనైః**
**లతాగృహమనుప్రియం దిశతి పక్షకేనాగమమ్ 57**

(శ్రీరాధిక) ఒకమారు బహుదూరము నుండియే ప్రేమాతురయై కలవరపడుతుంది. సఖియలను కూడ వర్జించి, ఒంటరిగా శ్రీశ్యామసుందరునికై కుంజలోనికి వెళ్తుంది. ఇతరుల నుండి దాగికొని; కళ్లతోను, శిరసుతోను, వేళ్లతోను సైగ చేస్తూ ప్రియతముని లతాగృహ గవాక్షము ద్వారా లోనికి రమ్మని పిలుస్తుంది.

**రమాది వరవర్ణినీ నికరరూప విప్రణ్ మహా**
**సురూప సుషమార్ణవే నవకిశోర గోపీగణే**
**విచిత్రతర తారకాస్వివ సుచంద్రలేఖామహమ్**
**స్మరామి వృషభానుజాం మధురభానుజా కాననే 58**

రాధాజీ లక్ష్మీదేవి ఆదిగా కల రూపవతులకు మించిన మహాసుందర లావణ్య సాగరము, నవకిశోర వయస్కులైన గోపీమణులు అనెడు విచిత్ర తారకలయందు సుందరమైన చంద్రలేఖ! అట్టి వృషభాను నందినియైన శ్రీరాధయొక్క వనము బృందావనము! ఆ బృందావనములో శ్రీభానుజను స్మరిస్తున్నాను.

**అనంగరస మాధురీభర ధురీణ లీలానిధిః**
**స్ఫురత్కనక చంపక ప్రకరగౌర గాత్రచ్ఛటా**
**అహో మదనమోహన స్ఫురదురః స్థలాలంకృతిః**
**నవాంకురిత యౌవనా జయతి మే నిజస్వామినీ 59**

శ్రీరాధ అనంగరస మాధుర్యముతో కూడిన శ్రేష్ఠమైన లీలానిధి! స్వర్ణ చంపకము వలె గౌరవర్ణకాంతులతో ప్రదీప్తమై ఉన్నది. ఆదేవి మదనమోహనుని

మనోహర వక్షస్థలమునకు అలంకారము! నూతన యౌవనశ్రీతో వెలుగుచున్న అట్టి నా స్వామినికి జయమగునుగాక!

**కమప్యఖిల సుందరం దరదలన్నవేందీవర**
**స్ఫురన్మదిర మేదుర ద్యుతిముదారలీలానిధిమ్**
**కిశోరమతి మోహనం స్మర రసైకమూర్తిం వశమ్**
**విధాయ పదయోర్వనక్షితిషు రాధికా ఖేలతి 60**

అతడు ఒకానొక అనిర్వచనీయ నిఖిల సుందర స్వరూపుడు! కొద్దిగా వికసించిన నవనీల పద్మము వంటి మేఘ ఘన కాంతి కలవాడు! ఉదార లీలా సాగరుడు, అత్యంత మోహనాకారుడు! అనంగరసైకమూర్తి, కిశోరవయస్కుడు! అట్టి శ్రీకృష్ణుని వశీకృతునిగ చేసుకొనిన శ్రీరాధిక బృందావన భూమిపై ఆడుచున్నది.

**ప్రతిక్షణ మహాద్భుత స్మరకలామయం బిభ్రతీ**
**వపుః ప్రతిపదాద్భుత ప్రకటకాంతి వన్యాప్లుతమ్**
**నిరంతర నిరంకుశోచ్ఛలిత కృష్ణ భావాంబుధిః**
**గుణైరసదృశాధికా విజయతే మమ స్వామినీ 61**

ప్రతిక్షణము మహాద్భుత ప్రేమ కళా విలాసముతోకూడిన శరీరసౌందర్యము కలదియు, అడుగడుగునను అద్భుతభావములతో ప్రకాశించుచున్నదియు, కాంతిమయమైన రూపమును ధరించినదియు, నిరంతరము ఆటంకమేలేని గతితో ఎగసిపడుతున్న కృష్ణభావ సాగర స్వరూపిణియు, సాటిలేని గుణములకు నిధియునైన నా స్వామినికి జయమగునుగాక!

**రసోజ్జ్వల నిజేశ్వరీంగిత తరంగరంగ రింగద్ధియః**
**పరిస్ఫురదుపర్యుపర్యధిక సత్కలా కౌశలాః**
**మహాప్రణయ దోలితోత్పులక చారుగాత్ర శ్రియో**
**నవ వ్రజ కిశోరికాః స్మరత రాధికా కింకరీః 62**

శ్రీరాధా దాసీమణులు రసోజ్వలయైన తమ ప్రాణేశ్వరి యొక్క ఇంగితము ననుసరించి నడుచుకుంటారు. వారు అత్యధికమైన సుందర కళా కౌశలములో విశిష్టులు! మహాప్రణయ రసమునందు తేలియాడుచు పులకరించుచుండు సౌందర్య స్వరూపిణులు! నవ వ్రజ కిశోరీమణులైన అట్టి శ్రీరాధాదాసీమణులను స్మరింపుడు!

**నిరంతర రసామిత ప్రణయ వీచి హిందోలనై**
**శ్చలన్మనసిజాంబుధౌ వివిధ కార్య పర్యాకులమ్**
**ప్రధాన లలితాదికం ప్రియసఖీ నిదేశోత్సవమ్**
**స్మరామి వృషభానుజా చరణ కింకరీ మండలమ్ 63**

శ్రీలలితాది ప్రియ సఖియలు నిరంతరము ఎల్లలులేని ప్రణయ రసతరంగములలో తేలియాడుచు, చంచలిస్తున్న ప్రేమసముద్రములో వివిధ కార్యక్రమముల నిర్వహణలో వ్యాకులురై ఉంటారు. భానుజ వారి నిర్దేశానుసారము ఉత్సవములను జరుపుతుంది. అట్టి ఆదేవి యొక్క దాసీమణులను స్మరిస్తున్నాను.

**అమంద రసతుందిలే మధురగుంజదిందీవరే**
**విరజ్య నిజమందిరే లసతి సానురాగేందిరే**
**సదా మదనమోహన ప్రణయ సంపదా సుందరే**
**రతి వితను రాధికా మధుర మాధవీ మందిరే 64**

మధుర మాధవీ మందిరము అతిశయించిన రసముచే విశాలమైనదిగా ఉన్నది. మధుర గుంజారములతో పూరితమైన కమలములచే శోభిస్తున్నది. లక్ష్మీదేవి తన మందిరమును విడచి అనురాగముతో అట విహరిస్తున్నది. మదనమోహనుని ప్రణయసంపద అయిన శ్రీరాధాజీ యొక్క ఆ మాధవీ మందిరము అనురాగముతో వర్ధిల్లుచున్నది.

**అసంఖ్యవర కింకరీ కలిత మంజు కుంచావలీ**
**నిషేవన రసోత్సవే శుకపికాలి కోలాహలే**
**సుపుష్పిత లతాద్రుమే సురభిశీత మందానిలే**
**మమ ద్వితయజీవనం విహరతీహ వృందావనే 65**

శ్రీబృందావనములో అసంఖ్యాకమైన శ్రేష్ఠదాసీమణులు మనోహర కుంజలలో చేయు సేవారసోత్సవములో మగ్నులై ఉన్నారు. శుక, పిక, భ్రమరాదులు కోలాహలధ్వనులు చేస్తున్నాయి. లత, వృక్షాదులు సుందరమైన పుష్పములతో శోభిస్తున్నాయి. సుగంధ పూర్ణమైన, శీతలమైన పిల్లవాయువు అంతట వీస్తున్నది. అట్టి ఈ బృందావనములో నా జీవనమైన యుగళ కిశోరులు విహరిస్తున్నారు.

**అహో మదనమోహనోరసి రసేన దోలాయితమ్**
**మహః కనక చంపక ప్రకర గౌరదివ్యాకృతిః**
**విచిత్రరుచివీచిభిః ఖచిత చారు వృందాటవీ**
**నికుంజవరమందిరే కిమపి సుందరం ఖేలతి 66**

అహో! మదనమోహనుని వక్షస్థలముపై రసవివశయైన, స్వర్ణ చంపకము వలె గౌరవర్ణముతోనున్న, దివ్యాకృతిని కలిగియున్న ఒకానొక అనిర్వచనీయ జ్యోతి వెలుగుచున్నది. ఆ జ్యోతి (శ్రీరాధ) విచిత్రకాంతి తరంగములతో బృందావనమును ప్రకాశింపజేయుచు, సుందర నికుంజ మందిరములో క్రీడిస్తున్నది.

**మహాప్రీతి జ్యోతిః రస జలనిధౌ పూర్ణ విమలే**
**స్ఫురత్ వృందాటవ్యాం నవతరులతా మందిరవరే**
**కిశోర ద్వంద్వం తత్సహజనవ కందర్ప లలితమ్**
**మమాంతః సద్భావే కనకహరినీలార్చిరుదియాత్ 67**

పూర్ణ విమలరససాగరము నందు మహాప్రీతి స్వరూపులైన జ్యోతిర్యుగళము బృందావనములోని నవతరులతలతో నిర్మితమైన మందిరమునందు ప్రకటితులైనారు. సహజమైన, నవ మన్మథ లలిత స్వరూపులైన, స్వర్ణఇంద్రనీల మణికాంతితో ప్రకాశిస్తున్న యుగళకిశోరులు నా అంతఃకరణములో సద్భావముతో ఉదయింతురుగాక!

**విశుద్ధాద్యప్రేమాత్మకం పరమచిజ్జ్యోతిరమృతాం**
**బుధి ద్వీపస్యాంతః స్ఫురతు హృది వృందావనమ్**
**కదంబచ్ఛాయా సామథ మధుర రాధా మధుపతీ**
**రహో దృష్ట్యావేశే స్ఫురతు మమ సాక్షాదివ తతః 68**

విశుద్ధ, శృంగార రస, ప్రేమాత్మక, పరమ చిత్‌జ్యోతి యొక్క అమృతసాగర ద్వీపమునందు స్థితమై ఉన్న బృందావన నామక వనము నా హృదయములో స్ఫురించునుగాక! ఇంకను, కదంబ వృక్ష ఛాయలో, నిభృత ప్రదేశములో పరస్పర దర్శనావేశముతో నున్న శ్రీరాధా మాధవులను సాక్షాత్తుగా చూచుచున్నట్లు వారు నా హృదయములో స్ఫురింతురుగాక!

**మహాస్థేయః ప్రేమా భరతు మమ హేమాంబుజవరో**
**దరోద్భాసే జ్యోతిష్యురసి కిల తే శ్యామవిధో**
**మహానందే వృందావన నవనికుంజ స్మర పురే**
**స్ఫురత్యున్మర్యాదాం వహతి రససామ్రాజ్య లహరీమ్ 69**

హే శ్యామచంద్రా! మా స్వర్ణకమలిని (శ్రీరాధ) నీ హృదయములో జ్యోతి రూపముగా ఉదయించి, నీ హృదయమును నిశ్చలమైన మహాప్రేమతో నింపును గాక! మహానందమయమైన శ్రీబృందావన నవనికుంజము అనెడు మదన మందిరములో అవధిలేని రససామ్రాజ్య తరంగ విస్తారమును స్ఫురింపజేయును గాక! (అని ఒక సఖి శ్యామునితో అంటున్నది).

**అనంత శ్రీరాకావర కనక చంద్రచ్ఛవి రసౌ**
**తరంగ ప్రత్యంగ ప్రసరదతి సౌందర్య జలధిః**
**అహో భ్రుకుట్యైరున్మద మదనకోటిః ప్రకటయం**
**త్యజస్రం శ్యామాంకే మమ విహరతే జీవన కలా 70**

ఓహో! అనంత సౌందర్యపూర్ణమైన పూర్ణిమాచంద్రకాంతి యొక్క రసమునందు ఎగసిపడుతున్న రాధాజీ ప్రత్యంగము నుండి సౌందర్యసాగరము ప్రకటితమగుచున్నది. ఆమె యొక్క కనుబొమల కదలిక నుండి నిరంతరము కోటి ఉన్మత్తమదనులను ప్రకాశితము చేస్తున్నది. నా జీవన కళయైన అట్టి రాధాజీ శ్యామసుందరుని ఒడిలో విహరిస్తున్నది.

**అహో వృందారణ్యే ప్రతినవ నికుంజం ప్రతినవ**
**ద్రుమోద్యానం ప్రత్యుజ్జ్వల నవ విలాస స్థల వరమ్**
**మమ ప్రాణ ద్వంద్వ సహజ నవ కందర్ప లలితమ్**
**సదా ఖేలావృందైర్మధుర మధురాం విందతి రతిమ్ 71**

ఓహో! శ్రీబృందావనములోని ప్రతినికుంజలోను, ప్రతి నవ వృక్ష ఉద్యానవనములోను, ప్రతి ఉజ్వల నవవిలాస స్థలి యందును నా ప్రాణ స్వరూపులైన శ్రీయుగళము సహజమైన నవ ప్రేమ క్రీడా పరాయణులై వెలుగొందు చున్నారు. వారు నిత్యము అనేక విధములైన క్రీడల ద్వారా మధురాతి మధురమైన ప్రేమ సుఖమును పొందుచున్నారు.

**కదాచిత్ కాలిందీ కనకనలినీ భృంగ రచనౌ**
**కదాచిత్ కాలిందీ కమలవనహంస ద్వయ గతీ**
**కదాచిత్ కాలిందీ తట కనకవల్లీ వలిత సత్**
**తమాల ప్రోన్మీలన్నవ మిలన లీలౌ విలసతః 72**

వారు (శ్రీయుగళము) ఒకమారు యమునా నదిలోని స్వర్ణకమలము, భృంగముల దృశ్యమును రచిస్తారు. మరొకమారు కాళిందీ తీరాన ఉన్న కమల వనములోని హంసయుగళగతిని అనుకరిస్తారు. వేరొక సమయములో యమునా తీరములోనున్న స్వర్ణలత, తమాల వృక్షముల వలె నూతన సంయోగమును ప్రకాశింపజేస్తూ విలసిల్లుతూ ఉంటారు.

**కదాచిత్ గాయంతౌ మధుర మధుర శారిశుకవత్**
**కదాచిత్ కూజంతౌ మదకల కుహూకంఠ యుగవత్**
**కదాచిత్ నృత్యంతౌ సపది శిఖినీ మత్త శిఖివత్**
**కదాచిత్ పశ్యంతౌ సచకిత కురంగీ హరిణవత్ 73**

(వారు) ఒకపరి శుక శారికాదుల వలె మధుర మధురముగా గానం చేస్తారు. మరొకమారు మత్తిల్లిన జంట కోకిలల వలె 'కుహూ కుహూ' ధ్వని చేస్తారు. వేరొకమారు ఆడు నెమలి, మత్తిల్లిన మగ నెమలి వలె అతివేగముగా నృత్యం చేస్తారు. ఇంకొకమారు చకితమైన హరిణీ హరిణముల వలె చూస్తారు.

**సదా రాధాకృష్ణప్రణయ పులకాశ్రుద్గమ భృతః**
**కిశోరీః కందర్పాకుల కనక గౌరాంగ లతికాః**
**ప్రసాదస్రగ్ వస్త్రాభరణకృత భూషాః ప్రణయినోః**
**ప్రపద్యే శ్రీవృందావనభువి విచిత్రాఖిల కలాః 74**

శ్రీరాధా సఖీమణులు శ్రీరాధాకృష్ణుల ప్రణయమునందు మునిగి, నిత్యము పులకితాశ్రువులతో శోభిస్తూ ఉంటారు. అనంగ రసముచే చంచలిస్తు, స్వర్ణగౌర లతల వంటి శరీరములతోవారు వెలుగొందుతూ ఉంటారు. ప్రియతమ యుగళము ప్రసాదించిన మాల, వస్త్రము మున్నగు వానితో వారు తమను తాము అలంకరించు కుంటారు. విచిత్రమైన సమస్త కళలను ఎరిగిన ఆ కిశోరీమణులను ఈ బృందావనములో ఆశ్రయిస్తున్నాను.

**మహా ప్రేమానందాత్మక పరమ విస్తీర్ణ జలధౌ**
**మహాజ్యోతిర్ద్వీపే మధురతర వృందావన వనమ్**
**విచిత్రాం తత్రాపి స్మర కుసుమవాటీం నవ నవైః**
**నికుంజే శ్రీరాధా సుఘనరస పుంజైరివ వృతామ్ 75**

మహా ప్రేమానందాత్మకమైన, పరమ విస్తృతమైన సాగరము యొక్క మహా జ్యోతిర్మయ ద్వీపము నందు మధురతరమైన 'బృందావన' నామక వనము విరాజితమై ఉన్నది. దాని యందు నవనవ నికుంజలచే శోభితమై, శ్రీరాధాఘనరస పుంజములచే ఆవృతమై ప్రకాశిస్తున్న విచిత్ర కుసుమవాటిక ఉన్నది. దానిని స్మరించుము!

**మహానిస్సంగానాం సహజమధురాత్మ ప్రియ కథా**
**ప్రసంగానాం ప్రేమోత్పులక గలదశ్రాకుల గిరామ్**
**అపారే శ్రీవృందావన రసమహాబ్ధౌ విహరతామ్**
**శిరో మే సోల్లాసం వహతు మహతాం శ్రీపదరజః 76**

మహానిస్సంగులై, సహజమధుర స్వభావముతో ప్రియతముని కథా ప్రసంగము నందు నిమగ్నులై; మాటాడునపుడు ప్రేమతో, పులకలతో, అశ్రువులు జాలువారుచుండ గద్గద స్వరముకలవారై అపారమైన బృందావన రస మహా సముద్రములో విహరించు మహాపురుషుల శ్రీపదరజమును శిరసుపై ఆనందముగా ధరిస్తున్నాను.

**సుధా సధ్రచీనైః శిశిర మృదుహాసతి మధురైః**
**వచోభిః శ్రీవృందావన రస సువాసై స్తను భృతామ్**
**తదేవాంతర్యేషాం చకితాంగీ ప్రతి ముహుః**
**దృశోర్భంగీ నంగీకృత రసతరంగా విదధతీ**

**ప్రణయ రస పూరోత్తరలితా కిశోరీ**
**కాశ్మీర ద్రవ కనక గౌరీ మమ గతిః 77, 78**

అమృతము కన్నను సుశీతలమై, మృదుమందహాసముతో, అతిమధురమైన బృందావన రసముచే సువాసితమైన మాటలను మాటలాడువారు మహనీయులు! అట్టివారి హృదయములో చకిత చకితాంగియైన రాధాజీ మాటిమాటికీ రసతరంగ మయమైన నయనభంగిమలను విస్తరింపజేస్తుంది. ఈ ప్రకారముగా ప్రణయ రస ప్రవాహమునందు చంచలించు కాశ్మీర ద్రవము వంటి హేమగౌరీ కిశోరియే నాకు ఏకమాత్రగతి! (77, 78)

**అనంతాభిర్హేమామృత సురుచి వీచిర్భిరఖిలమ్**
**నయంతీ శ్రీవృందావనమఖిల వృందారక నుతమ్**
**సదా నిర్మర్యాదోచ్ఛలదతుల మాధుర్య జలధిః**
**పరో మే సా కాఽపి స్ఫురతి వృషభానోః కులమణి 79**

రాధాజీ బృందావనములో తన అనంతహేమామృత సుందర కాంతి తరంగములతో సమస్త దేవతలను కూడ వందనీయులుగా చేస్తున్నది. ఆ దేవి నిరంతరము ఎగసిపడుతున్న, ఎల్లలులేని, సాటిలేని మాధుర్యసాగరము! ఆమె వృషభాను మహారాజ కులమణి! అట్టి ఒకానొక అనిర్వచనీయ మూర్తి నా హృదయములో స్ఫురిస్తున్నది.

**విదూరే త్రైగుణ్యాదథ విమల విద్యామయ పరే**
**మహానందే వృందావన భువి సుకందే రసతరో**
**అమర్యాదా రాధా చరణ పరిచర్యా రసమహో**
**మహోదిద్వందవా హృది పరమధన్యా స్ఫురతు వః 80**

శ్రీబృందావనము త్రిగుణాలకు అతీతమైన, విమలమైన, విద్యామయ జగత్తుకు కూడ అందరానిదైన పరమానంద రసవృక్షమునకు మూల స్వరూపము!

అట్టి బృందావనము పరమధన్యము! ఎల్లలులేని శ్రీరాధా చరణ సేవా రసమహా సాగరమైన ఆ వనము నీ హృదయములో స్ఫురించునుగాక!

**పుమర్థాశ్చత్వారో దిశి దిశి విధాయాంజలి పుటమ్**
**స్థితాః సేవోత్సుక్యాత్ భజతి చ విభూతిర్భగవతః**
**అమందానందాబ్ధి ప్లుత మధుర వృందావన వనే**
**సదా రాధాకృష్ణౌ స్మరతి రతి సారేన సుకృతీ 81**

నిరతిశయ ఆనంద సముద్రము నందు నిమగ్నమైయుండు మధుర బృందావనములో ప్రేమపూర్వకముగా శ్రీరాధాకృష్ణులను స్మరించువాడు పుణ్యాత్ముడు! అట్టి వ్యక్తికి సేవ చేయుటకై చతుర్విధ పురుషార్థములైన ధర్మార్థ కామ మోక్షములు అన్ని దిక్కుల నుండి చేతులు జోడించి ఉత్సుకతతో నిలచి ఉంటాయి. భగవంతుని విభూతులు కూడ అతనిని సేవిస్తాయి!

బృందావనములో శ్రీరాధాకృష్ణులను నిరంతరము స్మరించు ధన్యుడు పొందలేనిది లేదు అని భావము!

..............................................................

..............................................................

**స్మరన్ కాంచిత్ సేవామఖిల జనసంగం పరిహరన్**
**సదా రాధారాధేత్యమల సుకృతీ కోఽపి జయతి 82**

............ ఒకానొక సేవా విశేషమును స్మరిస్తున్న, జనసాంగత్యమును త్యజించి నిరంతరము "రాధే రాధే" అని జపిస్తున్న ఒకానొక విశుద్ధ పుణ్యాత్ముడు ఇచట సర్వోత్కృష్ట భావముతో విరాజమానుడైనాడు.

ఈ శ్లోకములో మొదటి రెండు పాదములు లుప్తమైనవి. తరువాతి రెండు పాదములలోను నిరంతరము రాధే రాధే అని స్మరిస్తున్న ఒకానొక భాగ్యశాలి దర్శనమిస్తున్నాడు. అదిగని శ్రీప్రబోధానందులు ఆనందించి, అందించినారు.

**మహోశ్చర్య జ్యోతిర్వపుషి నవకైశోర లలితే**
**మహోవృందం నిందద్రుచిర కనకేందో రుదయతః**
**స్మరామి శ్రీరాధే కిమపి మురళీమోహన మనో**
**హర వృందారణ్యే తవ సురస సింధూచ్ఛలనకృత్ 83**

శ్రీరాధే! నీవు శ్రీబృందావనములో రసమహా సాగరమును ఎగసిపడునట్లు చేయుదానవు! మురళీమోహనుని మనసుకు మోహనమూర్తివి. నీ సుందర స్వర్ణముఖ చంద్రుడు ఉదయిస్తూనే కాంతిని ప్రసరించు సూర్యచంద్రాదులు తిరస్కృతులు ఔతారు. (అంటే రాధాముఖకాంతి ముందు అవన్నియు వెలవెలబోవుననుట.) నీ నవకిశోర లలిత సుకుమార శరీరములో అనిర్వచనీయమైన మహోశ్చర్యజ్యోతి వెలుగుతున్నది. ఆ జ్యోతిని నేను స్మరిస్తున్నాను.

**మహోవేశాద్రాధా మురళిధరయోః పుష్పనికరమ్**
**ప్రదత్తం భూవల్లీవర విటపినోఽధో రభసకృత్**
**నిదేశాత్ సంప్రాప్తం వరయువతియుగ్మం ప్రియవహు**
**ప్రసూనాన్యారోప్య ప్రణతమనుహోసైః కురు మతిమ్ 84**

శ్రీబృందావన భూమి యందలి శ్రేష్ఠవృక్షలతల క్రింద శ్రీరాధామురళీధరులు ఉపస్థితులైనారు. వారిపై మహా ఆవేశముతో కుతూహలవశులై వృక్షలతలు పుష్పవృష్టిని కురిపించినవి. బృందాదేవి చేసిన సైగల ననుసరించి శ్రేష్ఠులైన ఇద్దరు సఖియలు నవ్వుచు ప్రియాతి ప్రియమైన అనేక పుష్పములను శ్రీయుగళమునకు సమర్పించి నమస్కరించినారు. ఈ లీల యందు మనసును లగ్నము చేయుము!

**సముత్ఫుల్లత్ వల్లీ తరుషు ఉపగాయచ్ఛుక పికమ్**
**సముద్యోతత్ భూమి ప్రమద సునటద్బర్హి నటనమ్**
**సరిచ్చైలా ద్యోత్యుల్లసిత మణిఝుంకార లలితమ్**
**ధ్రువం వృందారణ్యం హరిరస మహోవిహ్వాలమిదమ్ 85**

చక్కగా ప్రస్ఫుటితమగుచున్న తరు, లతలపై శుక, కోకిలాదులు గానము చేస్తున్నాయి. ఆ సముజ్వల భూమిపై ఆనంద పరాయణమై చక్కగా నాట్యము చేయగల నెమలి నృత్యము చేస్తున్నది. నదీ, పర్వతములపై మిక్కిలి శోభాపూర్ణమైన మణులు లలితముగా మెరుస్తూ జ్యోతిర్మయముగానున్నవి. ఈ స్థితికి శ్రీబృందావనము నిశ్చయముగా హరిరసమునందు విహ్వల అగుటయే కారణము!

**త్వదంగచ్ఛాయాయాః ప్రసరమపి వీక్ష్యోదిత మహా**
**స్మరావేశాత్ భ్రామ్యన్మురలిధర మౌలౌ విహరతః**
**పరాగాన్ శ్రీరాధే తవ నిభృత దాసీ చరణయో**
**శ్చిరం వందే శ్రీవృందావన నవనికుంజేశ్వరి ముదా 86**

హేరాధే! శ్రీబృందావన నికుంజేశ్వరీ! నీ శ్రీ అంగముల కాంతిని చూచి ప్రేమావేశము చేత మురళీధరుడు వివశుడు ఔతూ ఉంటాడు. ఆ కాంతి అతనిని నీ ఏకాంత దాసీమణుల చరణకమల పరాగము నందు విహరింపజేస్తుంది. నేను చిరకాలము ఆనందపూర్వకముగా నీ దివ్యకాంతికి నమస్కరిస్తున్నాను.

శ్రీరాధా శ్రీఅంగ దివ్యకాంతి చేత వివశుడై ఉండు శ్రీకృష్ణుడు పునః పునః ఆ కాంతి దర్శనమును పొందుటకై శ్రీరాధా దాసీమణుల పదముల చెంత ఉండుటకు కూడ వెనుకాడడు. వారిని 'కాకువాణి'తో ప్రార్థిస్తూ ఉంటాడని, తనను రాధాజీ సన్నిధికి చేర్చుమని సఖియలకు విన్నవించుకుంటాడని 'శ్రీరాధాసుధానిధి' కూడ స్పష్టం చేసింది.

**ప్రియే త్వం మామంగీకురు చ పురు చంద్రాభ వదనే**
**దృఢీయో నిర్మాణా భవతు రసనాద్యా తవ గుణై**
**సదాస్థాతుం కాంక్ష్యే విపిన వర కుంజేచ నవయోః**
**సుఖం పశ్యే క్రీడాం ప్రణయ రస యుక్తాం హి యువయోః 87**

హే ప్రియే! బహు చంద్రకాంతివదనే! నీవునన్ను అంగీకరింపుము తల్లీ! నీ గుణగానమును చేయుటలో నా జిహ్వా అతిదృఢ భావములో లగ్నమై ఉన్నది. వనశ్రేష్ఠమైన బృందావనములో సర్వదా నివసింపవలెనని కాంక్షిస్తున్నాను. అట్లు నివసింపగలిగితే మీ యుగళకిశోరుల ప్రణయరసలీలను దర్శింపగలుగుతాను!

**అహో గౌరశ్యామం కిమపి నవ వృందావనలతా**
**నికుంజే క్రీడంతం మధుర మధుభారేణ సుభగే**
**భజ శ్రీకాలిందీ స్ఫుటిత తరుతీరే నవవయోః**
**నవానంగాసక్తం పరమరసభావైక నిరతమ్ 88**

ఓహో! శ్రీయమునానది చెంత, పుష్పించిన వృక్షములతో భూషితమైన తీరముపై, మధుభారముతో సౌభాగ్యయుక్తమైన నవబృందావన లతా నికుంజములు ఒప్పుచున్నవి. అట నవ వయస్కులు, నవ అనంగ ఆసక్తులు, పరమరసభావము నందే ఏక మాత్రముగ నిరతులు అయిన గౌరశ్యాములు మధురముగా క్రీడిస్తున్నారు. ఆశ్చర్యము కదా! అట్టి శ్రీయుగళమును భజింపుము!

**ప్రవీణా సంగీతే కర కలిత వీణా స పులకమ్**
**ప్రగాయంతీ శ్యామం పరమ సుకవీనాం వరరతిః**
**నవీనా సర్వాంగే ద్రుతకనకవత్ స్నిగ్ధసురుచి**
**చ్ఛవీనాం స్వచ్ఛందప్రభవఖనిరాస్తాం మమ హృది 89**

శ్రీరాధ సంగీతమునందు నిపుణురాలు! చేతిలో వీణను ధరించి, పులకితయై శ్యాముని సన్నిధిలో గానం చేస్తుంది. ఆమె పరమ సుకవుల శ్రేష్ఠమైన ప్రీతికి ఆస్పద! నవవయో విలాసిని, కరగిన బంగారము వంటి స్నిగ్ధమైన కాంతి కలది. సమస్తమైన కాంతివిశేషమునకు ఏకమాత్ర ప్రభవ స్థానము! అట్టి శ్రీరాధ నాహృదయములో విరాజమానమగును గాక!

**నమో వృందారణ్యే రసికవరరంగీ భగవతే**
**నమో వృందారణ్యేశ్వరి! తవ పదాంభోజ రజసే**
**నమస్తే తత్ ద్వంద్వ ప్రణయ లలితే శ్రీలలితే**
**నమః శ్రీమద్బృందాటవి! సుబహుకృత్వస్త్వయి మమ 90**

శ్రీబృందారణ్య రసికవర భగవంతునికి నమస్కారము! హే బృందావనేశ్వరీ! నీ చరణకమల రజమునకు నమస్కారము. యుగళ కిశోరుల ప్రణయ స్వరూపిణీ! అతిసుందరీ! శ్రీ లలితాదేవీ! నీకు నమస్కారము. హే బృందాటవీ! నీకు నా అనేకానేక నమస్కారములు!

**అనంత బ్రహ్మాండావలి వలిత మూల ప్రకృతితః**
**పరే బ్రహ్మజ్యోతిష్యతి రుచిర వైకుంఠ భవనమ్**
**తదంతః విభ్రాజన్మధుర మథురామండలమహో**
**రహస్యం తత్రాపి స్ఫురతి మమ బృందావన వనమ్ 91**

అనంత బ్రహ్మాండములను చుట్టివేసిన మూల ప్రకృతి! దానికన్నను అతీతమైన బ్రహ్మజ్యోతి చేత అతి మనోహరమైన వైకుంఠధామము! ఓహో! దానికన్నను ఆవల మధురమైన మథురా మండలము విరాజితమై ఉన్నది. దానికన్నను కూడ అతిగుప్తమై వెలుగుచున్న బృందావనము నా హృదయములో స్ఫురించుచున్నది.

**న వైకుంఠఽప్యుత్కంఠిత మతిరహం ముక్తిపరమామ్**
**హరేః సర్వైర్దేవాదిభిరసులభాం ప్రత్యపి సదా**
**పరం శ్రీగాంధర్వా మురలిధరయోశ్చారు చరణా**
**ర్పణ స్థల్యాం వృందావన భువి భరేయం తృణ తనుః 92**

వైకుంఠమును పొందవలెనను ఉత్కంఠ నాకు లేదు. సమస్త దేవతలకు దుర్లభమైన శ్రీహరి ప్రసాదించు ముక్తిని కూడ నేను కోరుకొనుటలేదు. కాని,

శ్రీరాధాజీ మురళీధరులు పాదము మోపిన ఈ బృందావన భూమి యందు తృణముగానైన ఉండు భాగ్యము లభించిన చాలును! ఇదియే నా ప్రార్థన!

**దదానా తాంబూలం ప్రియతమ ముఖేందౌ స పులకమ్**
**ముదా ప్రేయోదత్తం మధురమదతీ చర్వితమపి**
**తతః కించిత్ దావాప్యతి దయిత దాసీన్ వివశయం**
**త్యసౌ వృందారణ్యే లసతి మమ జీవస్య వసతిః 93**

శ్రీరాధ పులకితయై ప్రియతముని నోటిలో తాంబూలము నుంచినది. ఇంకను, ప్రియతముడు ఇచ్చిన మధుర చర్విత తాంబూలమును ఆనంద పూర్వకముగా ఆస్వాదించినది. తిరిగి అందులోని కొద్ది భాగమును తనకు అత్యంత ప్రియమైన దాసీమణులకు ఇచ్చి వారిని వివశులను చేసినది. ఈ విధముగా నా జీవితమునకు శ్రీరాధ  బృందావనములో ఆధారమై ప్రకాశించుచున్నది.

**అనన్య శ్రీరాధా పదకమల దాస్యైక రసధీః**
**హరే సంగేరంగ స్నపన సమయేనాఽపి దధతీ**
**బలాత్ కృష్ణే కూర్పాసకభిది కిమప్యాచరతి కా**
**వృదశ్రుర్మేవేతి ప్రలపతి మమాత్మా చ హసతి 94**

సఖి శ్రీరాధా చరణ కమలముల పట్ల ఏకమాత్ర దాస్య నిష్ఠతో, అనన్య చింతనతో ఉంటుంది. అట్టి సఖి శ్రీకృష్ణునకు స్నానము చేయించునపుడు అతడు బలపూర్వకముగా ఆమె కంచుకమును లాగుట వంటి చిలిపి చేష్టలను చేయగా ఆమె రోదించుచు, ప్రలాపింపనారంభించినది. అది చూచి నా ఆత్మస్వరూపిణియైన రాధాజీ నవ్వసాగినది.

**అజస్రం స్రగ్ గంధైర్వ్యజన వర తాంబూల మృదుపత్**
**సుసంవాహైర్దివ్యాభరణ వసనాద్యైః ప్రణయినోః**
**మహాప్రేమావేశాత్ పులక రస ఘూర్ణాయిత తనుః**
**సదా రాధా దాసీః స్మర హృదయ సేవాం విదధతీః 95**

ఓ మనసా! ప్రేమమూర్తులైన శ్రీయుగళ కిశోరులకు నిత్యము మాల్య, గంధ, చామర వ్యజన (వింజామరతో వీచుట), తాంబూల సమర్పణ, మృదు పద సంవాహన, దివ్యవస్త్ర భూషణాదులను ధరింపజేయుట మున్నగు సేవలను దాసీమణులు చేస్తూ ఉంటారు. మహా ప్రేమవశులైన కారణమున పులకించుటచే వారి దేహములు చంచలిస్తూ ఉంటాయి. సేవా పరాయణలైన ఆ రాధా దాసీమణులను స్మరింపుము!

**స్మర శ్రీమద్బృందావనమతి మహానందరసదమ్**
**సదాతిప్రేమార్ద్రే హృది నవ కిశోరౌ పరిచర**
**కృపా దృష్టిర్దాసే హరి హరి కదా స్యాన్మయి తయో**
**రిహ ప్రాప్యైకాంతం ప్రతిదినముదశ్రుర్విలప భోః 96**

అహో! అత్యంత మహానందము ననుగ్రహించు శ్రీబృందావనమును నిత్యము స్మరింపుము! అతిప్రేమార్ద్ర హృదయముతో శ్రీనవయుగళ కిశోరులకు పరిచర్య చేయుము. ఓహో! 'ఎప్పుడు ఈ దాసునిపై యుగళ కృపాదృష్టి పడుతుంది ?' ఇట్లనుచు బృందావనములోని నిర్జన ప్రదేశములో ప్రతి దినము అశ్రువులు కార్చుచు విలపింపుము!

**కదా యామో దామోదర పరమ కామోత్సవ వనమ్**
**భవామో వామోరు ప్రముఖ విషయాऽమోహ మనసః**
**నయామోऽసచ్ఛాయాః పథమపి న యామో వనఫలా**
**దిభిః కాలం నామోజ్జ్వల హృది భజామౌ రసనిధీ 97**

శ్రీదామోదరుని పరమ ప్రేమోత్సవవనమైన బృందావనమునకు నేను ఎప్పుడు వెళ్తాను ? స్త్రీల పట్ల ఎప్పుడు నిర్మోహిత చిత్తముతో ఉంటాను ? ఎప్పుడు నేను అసత్కల్పిత మార్గములో వెళ్లకుండ, వన్యఫలాదికములతో కాలము గడుపుతాను ? శ్రీనామమును గ్రహించి, ఎప్పుడు ఉజ్వల హృదయముతో రససాగర స్వరూపులైన యుగళకిశోరులను సేవిస్తాను ?

శ్రీప్రబోధానందులు గొప్పసన్యాసి, అఖండబ్రహ్మచారి! బృందావనమే ఆ మహాత్ముని నిత్యనివాసము, నిరంతర నామచింతనమే జీవనము! అట్టి మహనీయుడు జీవులపై దయతో పైన చెప్పిన విషయములను తనయందు ఆరోపించుకొని, మనము ఎట్లు జీవింపవలెనో తెలియపరచినారు.

**కా తవ కాంతా కస్తవ తనయః స్థిరమతిరేతన్మృతి మను గణయః**
**అహహ కిమద్య న పశ్యసి మరణం తవ పర వృందావనమిహ శరణమ్ 98**

నీకు భార్య ఎవరు ? పుత్రుడు ఎవరు ? బుద్ధిని స్థిరము చేసికొని నీ మృత్యువునకు మిగిలిన రోజులను లెక్కింపుము. ఓహో! నీ మృత్యువు సమీపిస్తూ ఉండటాన్ని ఎందుకు నీవు నేటికీ చూడటం లేదు ? చూస్తే, నీకు ఏకమాత్ర శరణము, పరమ ఆశ్రయ ప్రదేశము బృందావనమే (అని తెలుస్తుంది)!

శ్రీరాధా మదనమోహనుల దివ్యలీలా విలాసమును, శ్రీరాధా సఖీమణుల అనన్యనిష్ఠ, సేవాపరాయణత్వములను శతకమందంతట వర్ణించిన శ్రీప్రబోధానందులు చివరిగా వైరాగ్యపూర్ణమైన పలుకులతో జీవుని పరమధర్మమును బోధిస్తూ ఈ 16వ శతకమును ముగించినారు.

# పదిహేడవ శతకము

**నమస్తస్మై కస్మై చిదపి పురుషాయాద్భుత మహో**
**మహిమ్నే విభ్రాజత్ కనకరుచిధామ్నే స్వకృపయా**
**అసంకోచేనైవాశ్వపచమఖిలేభ్యః స్వయమహో**
**దదౌయః సద్భక్తిం విమల తరనానా రసమయీమ్** 1

ఓహో! శ్రీచైతన్యప్రభువు తన కృపా విశేషము చేత చండాలుని పర్యంతము సంకోచింపక విమలతరమైన విశుద్ధ రసమయ భక్తిని అందరికిని అనుగ్రహించినారు. అత్యుజ్వలమైన స్వర్ణకాంతిని, అద్భుత మహిమను కలిగిన ఆ అనిర్వచనీయ పురుష వరేణ్యునకు ప్రణామము చేస్తున్నాను.

శ్రీప్రబోధానందులు ఈ శతకమును తమ గురు స్మరణతో ఆరంభించినారు.

**యస్మిన్న ప్రవిషేన్మనోఽపి మహతాం కా తత్ర వార్తా పునః**
**శాస్త్రాణాం జ్ఞపితం చ యద్భగవతాభంగ్యైవ భక్తోద్ధవే**
**తత్ వృందావన మున్నదేన రసిక ద్వంద్వేన కేనాప్యహో**
**నిత్యక్రీడతయా గృహీతమిహ కే విద్యుర్న గౌరాశ్రయః** 2

(జ్ఞాన యోగాది సాధనల ద్వారా లభించిన సూక్ష్మబుద్ధికల) మహాపురుషుల మనసు కూడ శ్రీబృందావన మహామహిమా సాగరము యొక్క లోతును ఎరుగలేదు. అట్టి యెడ శాస్త్రములు ఈ విషయముపై ఏమి తెలిసికొనగలవు ? భగవంతుడైన శ్రీకృష్ణుడు భక్త ఉద్ధవునకు ఈ బృందావనమును గూర్చి నొక్కి వక్కాణించి చెప్పినాడు. రసోన్మదులైన శ్రీయుగళ కిశోరులు ఈ బృందావనమును తమ నిత్య క్రీడా స్థలిగా స్వీకరించినారు. శ్రీధామపు నిగూఢతత్వమును శ్రీగౌరాంగ ప్రభువును ఆశ్రయింపక తెలిసికొనుట సాధ్యము కాదు.

**గుణైః సర్వైఃహీనోఽ ప్యహమఖిల జీవాధమ తమోఽ**
**ప్యశేషైర్దోషః స్వైరపి చ వలితోదుర్మతిరపి**
**ప్రసాదాత్ యస్యైవావి దమహహా రాధాం వ్రజపతేః**
**కుమారం వృందావనమపి స గౌరో మమ గతిః 3**

ఓహో! సర్వగుణహీనుడినైనను, సమస్త జీవులకన్నను అధముడినైనను, సమస్త దోషములకును నిధినైనను, మహాదుర్బుద్ధినైనను నాగురుదేవులైన శ్రీగౌరాంగ మహాప్రభువు యొక్క కృప లభించినది. ఆకృపా విశేషము చేత శ్రీరాధ, శ్రీకృష్ణుడు, శ్రీబృందావనము నాకు ప్రాప్తించినవి. అట్టి శ్రీచైతన్యులే నాకు ఏకమాత్రగతి!

శ్రీసరస్వతీపాదులు "గురుకృప"కు అసాధ్యమన్నది లేనేలేదని చాటి చెప్పుచున్నారు. సుకుమార హృదయులైన ఆ మహాత్ముడు అధమజీవుల దుర్లక్షణములను తమయందు ఆరోపించుకొని, గురుకృపా విశేషశక్తిని ప్రకటించినారు.

**శ్రీవృందావన కేలి రంగ సహజం సౌందర్య శోభా వయో**
**వైదగ్ధ్యాది చమత్కృతేః పరతరం విశ్రాంతి ధామాద్భుతమ్**
**తన్మే మోహన దివ్య నాగరవర ద్వంద్వం మిథో జీవనమ్**
**గౌర శ్యామలముజ్జ్వలోన్మద రసావిష్టం హృది స్ఫూర్జతు 4**

శ్రీబృందావనములో శ్రీయుగళ కిశోరులు సహజకేళిరంగ పరాయణులు; సౌందర్య శోభా వయో వైదగ్ధ్యాది చమత్కారములకు సర్వోత్కృష్టమైన విశ్రామ స్థల స్వరూపులు! వారు పరస్పర జీవనమూల స్వరూపులు. ఉజ్జ్వలమైన ఉన్మద రసమునందు లగ్నమైన మనసు కలవారు. అట్టి గౌర శ్యామ, అద్భుత మోహన దివ్యనాగర శ్రేష్ఠులైన శ్రీయుగళకిశోరులు నా హృదయములో స్ఫురింతురుగాక!

**ఇహ భ్రామం భ్రామం జగతి నహి గంధోఽపి కలితో**
**యదీయస్త్రత్రైవాఖిల నిగమ దుర్లక్ష్య సరణౌ**
**అపారే శ్రీవృందావన మహిమ పీయూష జలధౌ**
**మహాశ్చర్యోన్మీలి న్మధురిమణి చిత్తం లగతు మే 5**

సమస్త జగత్తులలోను పరిభ్రమించినను శ్రీబృందావనమును గూర్చి గంధమాత్రము కూడ తెలిసికొనలేరు. అది సమస్త వైదిక మార్గములకు అతీతమైనది. అట్టి మహాశ్చర్య మాధుర్య ప్రకాశము కల శ్రీబృందావన మహిమామృత సాగరము నందు నా చిత్తము లగ్నమగునుగాక!

**జయతి జయతి వృందారణ్యమానంద సింధోః**
**అనుపమమివ సారం శారదా కోట్య కథ్యైః**
**ఖగ మృగ తరువల్లీకుంజ వాపీ తటాక**
**స్థల గిరి హ్రదినీనామద్భుతైః సౌభగాద్యైః 6**

శ్రీధామము ఖగ, మృగ,తరు, లతా కుంజ, వాపీ, తటాకములతోను; స్థల, పర్వత, హ్రదముల (సరస్సుల)తోను సౌభాగ్య సమృద్ధిని కలిగి ఉన్నది. కోటి కోటి సరస్వతులకు కూడ వర్ణనాతీతమైన, అద్భుత ఆనంద సాగరము యొక్క అనుపమ సార స్వరూపమైన శ్రీబృందావనమునకు జయహో! జయహో!

**వృందారణ్యే చర అచర దృక్! పశ్య వృందావన శ్రీ**
**జిహ్వే! వృందావన గుణగణాన్ కీర్తయ శ్రోత్ర! గృహ్యాన్**
**వృందాటవ్యాం భజ పరిమళ ఘ్రాణ గాత్ర! త్వమస్మిన్**
**వృందారణ్యే లుఠ పులకితం కృష్ణకేలిస్థలీషు 7**

ఓ పాదమా! నీవు బృందావన భూమి యందు సంచరించు. నేత్రమా! బృందావన సౌభాగ్యమును దర్శించు. ఓ జిహ్వా! శ్రీబృందావనగుణగానమును

చేయి. కర్ణమా! బృందావన గుణములను విను. ఓ నాసికా! బృందావన పరిమళమును ఆస్వాదించు. శరీరమా! బృందావనములోని శ్రీకృష్ణుని కేళీస్థలములలో పులకితవై దొరలుము!

ఇందు భగవంతుడు అనుగ్రహించిన సమస్త ఇంద్రియములకు సార్థకత నిచ్చునది ఏదియో ఆ బృందావన మహిమ వర్ణితమైనది.

**మహోజ్జ్వల రసోన్మద ప్రణయ సింధు నిష్యందినీ**
**మహామధుర రాధికారమణ ఖేలనా నందినీ**
**రసేన సమధిష్ఠితా భువన వంద్య వృందయా**
**చకాస్తు హృది మే హరే పరమధామ వృందాటవీ** **8**

హే కృష్ణా! బృందావనము ఉన్మదమైన శృంగార రస మహాసాగరములో తేలియాడిస్తుంది. శ్రీరాధా సహితుడైన శ్రీరాధారమణుని మహామధుర క్రీడలలోని ఆనందాన్ని అనుగ్రహిస్తుంది. త్రిభువనవంద్య అయిన బృందాదేవి ద్వారా పరమానందము నందు స్థితయైయుండు పరమధామ స్వరూపము శ్రీధామము! అట్టి బృందావనము నా హృదయములో ప్రకాశించునుగాక!

**జన్మని జన్మని వృందావన భువి వృందారకేంద్ర వంద్యాయామ్**
**అపి తృణ గుల్మక భావే భవతు మమాశా సముల్లసతు** **9**

దేవేంద్రుడు కూడ ఎవరికి నమస్కరిస్తాడో ఆ బృందావన భూమియందు జన్మజన్మలకు తృణగుల్మాది (గడ్డిపరక, పొద) రూపముతోనైనను జన్మింపవలెనని భావిస్తున్నాను (కోరుకుంటున్నాను).

**హరి పద పంకజ సంవాహన రసమనుభూయ పూర్ణోఽపి**
**యత్రోద్ధవః ఆశాస్తే తృణతాం తన్నౌమి రాధికా విపినమ్** **10**

శ్రీహరి చరణకమల సంవాహన రసానుభవమును పొంది పూర్ణ మనోరథుడైన శ్రీ ఉద్ధవుడు బృందావనములో తృణముగనైనను పుట్టవలెనని ప్రార్థించినాడు. అట్టి శ్రీరాధా వనమునకు నమస్కరిస్తున్నాను.

**రాధావల్లభ పాదపల్లవజుషాం సద్ధర్మనీతాయుషామ్**
**నిత్యంసేవిత వైష్ణవాంఘ్రిరజసాం వైరాగ్య సీమా స్పృశామ్**
**హంతైకాంత రస ప్రవిష్ట మనసామప్యస్తి యద్దూరతః**
**తద్రాధాకరుణావలోకమచిరాత్ విందతు వృందావనే 11**

(బృందావనములో కాక ఇతరత్ర) శ్రీరాధావల్లభ చరణ కమల సేవతోను, సద్ధర్మములతోను ఆయుష్కాలము నంతయు గడపిన సేవకులకైనను; సదా వైష్ణవుల పదరజసేవలో గడపి వైరాగ్యపరాకాష్ఠ స్థితిలో నున్న త్యాగజీవనులకైనను, పెక్కుమాటలేల ?, ఏకాంతరసము నందు మనసును నిల్పుకున్న మహామనీషులకైనను శ్రీరాధాకృపాదృష్టి అత్యంత దూరముగ (అతీతముగ) ఉండును. కాని ఆకృపాదృష్టి బృందావనములో స్వల్ప సమయములోనే ప్రాప్తింపగలదు.

**రాధానంద కిశోరౌ నిరవధి రససాగర నిమగ్నౌ**
**నిజకేలిధామ వృందా విపినముద్దీక్షైవ సాంఖ్యమాప్నుతః 12**

అవధులు లేని రససాగరములో నిమగ్నులైయుండు శ్రీరాధ, నందకిశోరుల నిజకేళిధామము శ్రీబృందావనము! ఆధామమును దూరము నుండి దర్శించినను సాటిలేని సుఖము ప్రాప్తిస్తుంది.

**ఉద్దామ ప్రమోదోజ్జ్వలైక రసయా భక్త్యా విధూతావృతే**
**వ్యక్తం కస్యచిదేవ చిత్తముకురే తత్తద్దిగా భోగవత్**
**స్వమస్మిన్ దివ్యవిచిత్ర కేలి మిథునం తత్ శ్యామగౌరంవిధు**
**జ్జ్యోత్స్నావత్ పరిచారయేత్త దిహ కిం విందేఽథ వృందావనమ్ 13**

అత్యధిక పరమానంద ప్రదమైన, అద్వితీయమైన, ఉజ్వల రసపూర్ణమైన భక్తివలన మహాభాగ్యశీలుర మాలిన్య ఆవరణము తొలగిపోయినది. వారి చిత్తము అనెడు దర్పణములో దిగ్వలయపు హద్దు వలె ప్రకాశిస్తున్న శ్రీగౌరశ్యాముల దివ్యవిచిత్రకేళిని శ్రీబృందావనము తనయందు నిలుపుకొని, చంద్రజ్యోత్స్నవలె సేవారూపమున ప్రకాశితము చేస్తున్నది. అట్టి బృందావనమును నేను పొందగలనా!

దిగ్వలయసీమను దాటి ప్రకాశిస్తున్న శ్రీశ్యామాశ్యాముల దివ్యతేజస్సు మాయా ఆవరణమును దాటిన మహాత్ముల హృదయములో ప్రకాశిస్తూ ఉంటుంది. అట్టి రసిక మహాత్ములు బృందావనములో నివసిస్తూ ఉండటం వలన ఆ తేజస్సు బృందావనములో చంద్రకిరణములవలె శీతలత్వమును అనుగ్రహిస్తూ సేవా రూపముగా ప్రకాశిస్తుంది. శ్రీహితాచార్యులు, హరిదాస్‌జీ, ధ్రువదాస్‌జీ, హరిరామ వ్యాసజీ, రాధికాప్రసాద్ మహరాజ్ వంటి రసికాచార్యుల రసికవాణి ద్వారా శ్రీయుగళతేజస్సు సర్వత్ర ప్రకాశిస్తున్నది.

**విశుద్ధాద్వైతైక ప్రణయ రస పీయూష జలధౌ**
**ఘనీభూతద్వీపే సముదయతి వృందావనమహో**
**మిథః ప్రేమోత్ఘూర్ణాద్రసిక మిథునాక్రీడమనిశమ్**
**తదేవాధ్యాసీనః ప్రవిశతి పదేక్వాఽపి మధురే** **14**

అహో! విశుద్ధ, అద్వితీయ, సర్వోత్తమ ప్రణయ రససముద్రము యొక్క ఘనీభూత ద్వీపమైన బృందావనము అట ఉదయించినది. అచట ఒకరికై మరొకరు ప్రేమచేత వ్యాకులత్వమును పొందు రసికయుగళకిశోరుల నిత్యకేళీ విలాసము చక్కగా ప్రకటితం ఔతున్నది. కనుక, శ్రీబృందావనమును ఆశ్రయించినవారి మనసు అనుపమానమైన శ్రీరాధామధుర దాస్యమునందు ప్రవేశిస్తుంది.

**నాహం వేద్మి కథం ను మాధవ పదాంభోజ ద్వయాం ధ్యాయతి**
**కా వా శ్రీశుక నారదాది కలితే మార్గేస్తి మే యోగ్యతా**
**తస్మాత్ భద్రమభద్రమేవ యదినామాస్తాం మమైకం పరమ్**
**రాధాకేలి నికుంజ మంజులతర వృందావనం జీవనమ్ 15**

అహో! లక్ష్మీపతి యొక్క చరణకమల ధ్యానపద్ధతిని ఎరుగను. శుక, నారదాదుల ఐశ్వర్యజ్ఞాన మిశ్రితమైన ధర్మమార్గము నందు కూడ నాకు యోగ్యత ఏమున్నది ? కనుక; చక్కగనో, కాకుండగనో కేవలము శ్రేష్ఠమైన శ్రీరాధా కేళి నికుంజ పుంజములతో శోభిస్తున్న శ్రీబృందావనమే నాకు జీవనము!

శ్రీబృందావనము నాశ్రయించుట కన్నను ఉత్తమోత్తమ మార్గము ఇంకేమున్నది ? సాక్షాత్తు ఐశ్వర్య కళాస్వరూపుడైన శ్రీమన్నారాయణుడు బృందావనము పట్ల లాలసతో ఉంటాడట!

**యత్సీమానమపి స్పృశేన్న నిగమో దూరాత్ పరం లక్ష్యతే**
**కించిత్ గూఢతయా యదేవ పరమానందోత్సవైకావధి**
**యన్మాధుర్య కణోప్యవేది న శివస్వాయంభువాద్యైరహమ్**
**తత్ వృందావన నామధామ రసదం వందామి రాధాపతేః 16**

వేదము కూడ బృందావనమును దూరము నుండియే లక్షించినది. (అనగా ఆ లోతును తెలసికొనలేకపోయినది.) ఆధామము కేవలము అతిరహస్యమయ, పరమానందోత్సవాదులకు చరమసీమ! ఆ మాధుర్యకణము యొక్క లేశమును గూర్చి శివ, స్వాయంభువాదులకు కూడ తెలియదు. శ్రీరాధారసపతియైన శ్రీకృష్ణునకు కూడ రసదానము చేయు బృందావన నామక ధామమును నేను ఆరాధిస్తున్నాను.

**కదాను వృందావన కుంజమండలే భ్రమన్**
**భ్రమన్ హేమహరిన్మణి ప్రభమ్**
**సంస్మృత్య సంస్మృత్య తదద్భుత ప్రియద్వయం**
**ద్వయం విస్మృతిమేతు మేఽఖిలమ్ 17**

శ్రీబృందావన కుంజలలో పునః పునః సంచరిస్తూ; ఆ స్వర్ణమణికాంతి కల శ్రీరాధను, ఇంద్రనీలమణికాంతి కల శ్రీగోవిందుని నిరంతరము స్మరిస్తూ; సమస్తమును మరచిపోవు భాగ్యము నాకు ఎప్పుడు కలుగుతుంది ?

**ఛిద్యేత ఖండశ ఇదం యది మే శరీరమ్**
**ఘోరా విపద్వితతయో యది వా పతంతి**
**హా హంత! హంత! న తథాపి న భూయాదిదమ్**
**వృందావనాదితర తుచ్ఛపదే పిపాసా 18**

నాయీ శరీరము ఖండఖండములుగనైనను, ఛిన్నభిన్నమైనను, ఘోరవిపత్తులు నాపై వచ్చిపడినను; హా! హా! అట్లు అయినను ఎప్పటికిని బృందావనమును విడచి ఇతర తుచ్ఛ ప్రదేశములకు వెళ్లవలెనను ఇచ్ఛ నాకు లేదు.

**స్వయం పతిత పత్రకాణ్యమృతవత్ క్షుధా భక్షయన్**
**తృషా మిహిర నందినీ శుచి పయోఽంజలీభిః పిబన్**
**కదా మధురరాధికారమణ రాసకేలిస్థలీ**
**విలోక్య రసమగ్న ధీరధివసామి వృందావనే 19**

ఆకలిగా ఉన్నప్పుడు రాలిపడిన ఎండుటాకులను అమృతమువలె భుజిస్తూ, దాహము వేసినపుడు యమునా పవిత్ర జలములను దోసిలితో త్రాగుచు – ఈ విధముగా శ్రీరాధికారమణుని మధుర రాసకేళీ స్థలిని దర్శించుకొనుచు రసమగ్నుడనై శ్రీబృందావనములో (మరణపర్యంతము) ఎప్పుడు నివసిస్తాను ?

బృందావనములో నిత్యనివాసిగనున్న భాగ్యశాలికి భోజనమునకు కొదవలేదు. ఆ చల్లని తల్లి ఒడిలో అన్నీ సమకూరుట ప్రత్యక్ష ప్రమాణముగ గమనింపవచ్చును.

**భూమిర్యత్రసుకోమలా బహువిధ ప్రద్యోతిరత్నచ్ఛటా**
**నానాచిత్రమనోహరా ఖగమృగాద్యాశ్చర్యరావాది మత్**
**వల్లీభూరుహజాతయోఽద్భుతతమా యత్ర ప్రసూనాదిభిః**
**తన్మే మంద కిశోరకేలి భవనం వృందావనం జీవనమ్ 20**

శ్రీబృందావన భూమి అతికోమలము! నానావిధములైన మణుల కాంతులతో పరమోజ్వలమై, విచిత్రభావములతో మనోహారియై ఉంటుంది. ఈ ధామములోని పశు, పక్షి గణములు కూడ ఆశ్చర్యకరమైన కలకల ధ్వనులు చేస్తూ ఉంటాయి. ధామము లతా వృక్షాదులతోను, ఫల పుష్పాదులతోను అద్భుత తమమై ఉంటుంది. శ్రీరాధాముర‌ళీధరుల కేళీభవనమైన అట్టి బృందావనమే నా జీవనము!

**సాక్షాత్ పురో శ్రీపురుషోత్తమాంఘ్రి సేవారసాదప్యధికో రసౌఘః**
**స్యందేత వృందా విపినేఽప్యదృష్టే రాధా ప్రియేఽత్రోద్ధవ ఏవ సాక్షీ 21**

మధురాది నగరములలో శ్రీపురుషోత్తముడైన వాసుదేవునికి చేయు సాక్షాత్తు చరణకమల సేవారసము కన్నను అధిక ప్రేమానందరసప్రవాహము బృందావనములో ప్రవహిస్తున్నది. శ్రీరాధా ప్రియతముడైన శ్రీకృష్ణుని సాక్షాద్దర్శనము లభింపకపోయినను ఈ బృందావనములో అట్టి ప్రేమానందరసము ప్రవహిస్తున్నదనుటకు శ్రీఉద్ధవులే సాక్షి!

శ్రీఉద్ధవుడు శ్రీకృష్ణుని పంపున గోపికలకు జ్ఞానోపదేశము చేయుటకై బృందావనమునకు వచ్చినపుడు, ఆ'నందవ్రజ స్త్రీలలో' ప్రవహిస్తున్న ప్రేమరస

మహాప్రవాహమునకు ముగ్ధుడైనాడు. బృందావనములో తృణగుల్మములుగ పుట్టినను చాలునని భావించినాడు. వేదవేదాంగములకు, జ్ఞాన వైరాగ్యాదులకు అతీతమైన, పంచమ పురుషార్థమైన "ప్రేమ" బృందావనములో వెలుగుచున్నది.

**జాగర్తి దుందుభిరవః పరమోஉత్ర "రాధా**
**వృందావనే వస" ఇతి ప్రకటః పురాణే**
**తస్యా విధేయమసమోర్ధ్వ మహానురాగ**
**మూర్తే స్తదంగనమపోహ్య హరిం క్వ పశ్యేః 22**

"శ్రీరాధ శ్రీబృందావనములో రవము" అను పరమ వాక్య రూప దుందుభి పురాణములలో ప్రతిధ్వనిస్తున్నది. సాటిలేని అనురాగమూర్తియైన శ్రీరాధ యొక్క ప్రసిద్ధమైన అంగనను (బృందావనమును) విడచి, శ్రీరాధా వశవర్తియైన శ్రీకృష్ణుని ఇక ఎక్కడ దర్శింపగలము ?

శ్రీరాధ నిలచియుండు బృందావనములోనే శ్రీకృష్ణుడును ఉండునని తాత్పర్యము!

**మిలంతి చింతామణి కోటి కోటయః**
**స్వయం బహిర్దృష్టిముపైతి వా హరిః**
**తథాపి వృందావన ధూలి ధూసరమ్**
**న దేహమన్యత్ర కదాపి యాతు మే 23**

కోటి కోటి చింతామణులు స్వయముగా లభించినను, శ్రీకృష్ణుడే స్వయముగా కన్నుల ముందు ప్రత్యక్షమైనను; అట్లు జరిగినను శ్రీబృందావన ధూళిధూసరితమైన నా శరీరము (శ్రీబృందావనమును విడచి) అన్యత్ర వెళ్లకుండుగాక!

అంటే బృందావన నిత్యనివాసమున కన్నను ఏదియును అధికము కాదని భావము!

**కృపయతు మయి వృందారణ్య రాజ్ఞీ మనాగ**
**ప్యతి బహుల కృపోరు స్నేహ భారాదుదశ్రుః**
**ఫలతు తదనుకంపా కల్పవల్లీ ఫలం త్వ**
**ద్భుతమధి వసతిర్మే తత్ప్రియారామ సీమ్ని 24**

మిక్కిలి కృపతోను, మహా స్నేహాతిశయముతోను శ్రీబృందావనేశ్వరి ఒక్కమారు నాపై కృపాదృష్టిని ప్రసరింపజేస్తే – ఆదేవికి ప్రియమైన బృందావన సీమలో నిరంతర నివాసము అనెడు 'కరుణా కల్పలత' యొక్క అద్భుత ఫలము ఫలించినట్లే!

అంటే శ్రీరాధా కృపాదృష్టి ప్రసరిస్తే బృందావన నిత్యనివాసము లభిస్తుందని తాత్పర్యము!

**తేనాఽకారి సమస్త ఏవ భగవద్ధర్మోఽపి తేనాద్భుతః**
**సర్వస్మాత్ పురుషార్థతోఽపి పరమః కశ్చిత్ కరస్థీకృతః**
**తేనాధాయి సమస్తమూర్ధనిపదం బ్రహ్మాదయస్తం నమ**
**న్త్యాదేహాంతమధారి యేన వసతౌ శ్రీవృందావనే నిశ్చయమ్ 25**

మరణపర్యంతము బృందావనములో నివసింపవలెనని నిశ్చయించుకొనిన వారు సమస్త భగవత్ ధర్మములను ఆచరించినట్లే! సమస్త పురుషార్థములే కాక, అద్భుతమైన ఒక పరమ పురుషార్థము – పంచమ పురుషార్థమైన ప్రేమ వారికి కరతలామలకమై ఉంటుంది. సమస్త సుఖములు వారి నుదుటిపై (తలరాతలో) నెలకొని ఉంటాయి. అట్టి మహనీయులకు బ్రహ్మాది దేవతలు కూడ నమస్కరిస్తారు.

**పులినే పులినే కలిందజాయా విచరంశ్చాపి తలేతలే తరుణమ్**
**ప్రణయాద్భుత సౌఖ్య కంద వృందావిపినే హంత కదా దినాని నేష్యే ? 26**

ఓహో! యమునా నదీ తీరతీరములలో, వృక్షముల క్రింద తిరుగుతూ తిరుగుతూ; అద్భుతమైన, ప్రణయ సుఖ మూలమైన శ్రీబృందావనములో ఎప్పుడు నేను రోజులను గడుపుతాను ?

**గౌరశ్యామల మిథునం ఖేలతి కందర్ప లీలా యత్ర**
**రాధామాధవనామ్నా ప్రథిత తన్నౌమి కాననం కిమపి 27**

శ్రీధామములో గౌరశ్యాములు అనంగ లీలా ప్రకటనము చేస్తున్నారు. అనిర్వచనీయమై, రాధామాధవ నామముతో ప్రసిద్ధమైన బృందావనమునకు నమస్కరిస్తున్నాను.

**ఖగబృందం పశుబృందం ద్రుమవల్లీ బృందమున్మద ప్రేమ్నా**
**ప్రీణయదమృత రసేన శాంత వృందావనం నమత 28**

ఉన్మదమైన, ప్రేమపూర్వకమైన అమృత రసదానము చేయునట్టి; ఖగ మృగ వృక్షలతాదులకు కూడ ప్రీతి ప్రదానము చేయునట్టి ఆ శాంత బృందావనమునకు నమస్కరించు!

**ఊషరమపి హరిభక్తేర్నానా దుర్మార్గ నిష్ఠమప్యధమమ్**
**వృందా విపినమచింత్య ప్రభావమున్మాదయేత్ ప్రేమ్నా 29**

హరిభక్తి ఉదయించుటలో చౌడు భూమి వంటి అయోగ్య హృదయులను, అనేకములైన దుష్టమార్గములలో చరించు వ్యక్తులను, అత్యంత అధములను కూడ అచింత్యమైన తన ప్రభావము చేత బృందావనము ప్రేమతో మార్చి, వారిని ఉన్మాదులను చేస్తుంది.

**భక్త్యైకయాఽన్యత్ర కృతార్థ మానినో ధీరస్తదేతన్న వయం విదామః**
**శ్రీరాధికా మాధవ వల్లభం నః పరంతు వృందావనమేవ సంశ్రయః 30**

శ్రీబృందావనము కాక అన్యత్ర ఏకాంతభక్తియోగముతో కృతార్థులు కావలెనని భావించువారిని 'ధీరులు' అని మాత్రము అంటాను. ఇక ఎట్టి వివేచనను చేయను. కాని శ్రీరాధామాధవులకు ప్రియమైన శ్రీబృందావనమే నాకు ఏకమాత్రగతి!

**దోషాకరోఽహం గుణలేశహీనః సర్వాధమో దుర్లభవస్తు కాంక్షీ**
**వృందాటవీముజ్జ్వల భక్తిసారబీజ కదా ప్రాప్య భవామి పూర్ణః 31**

నేను సమస్త దోషములకు గనిని, గుణహీనుడను, అన్నివిధములుగా అధముడను! అయినప్పటికీ దుర్లభ వస్తువును కోరుకుంటున్నాను. ఉజ్వల భక్తికి సారబీజరూపమైన బృందావనమును ఆశ్రయించి ఎప్పుడు పూర్ణమనోరథుడను ఔతాను ?

**శుద్ధోజ్జ్వల ప్రేమరసామృతాబ్ధేరనంత పారస్య కిమప్యుదారమ్**
**రాధాభిధం యత్ర చకాస్తి సారం తదేవ వృందావిపినం గతిర్మే 32**

అనంత, అపార, శుద్ధ, ఉజ్వల, ప్రేమరససారరూపము; అనిర్వచనీయ పరమదాన శీలమునైన శ్రీరాధా నామము ఎక్కడ ప్రకాశిస్తున్నదో ఆ శ్రీబృందావనమే నాకు గతి!

**సర్వసాధన హీనోపి వృందారణ్యైక సంశ్రయః**
**యః కోఽపి ప్రాప్నుయాదేవ రాధాప్రియ రసోత్సవమ్ 33**

ఏసాధనలు చేయకపోయినను ఏకాంత భావముతో శ్రీబృందావనమునే సమ్యక్ ప్రకారముగా ఆశ్రయిస్తే, ఎవరైనను శ్రీరాధాప్రియ రసోత్సవము (రాసకేళీ ఆనందము)ను పొందగలరు!

**త్యజంతు స్వజనాః కామం దేహ వృత్తిశ్చమాఽస్తువా**
**న వృందావన సీమాతః పదం మే చలతు క్వచిత్ 34**

స్వజనులు నన్ను త్యజించినా, జీవించుటకు ఏ ఉపాయమూ లేకపోయినా శ్రీబృందావన సీమను దాటి ఒక్క అడుగు కూడ అన్యత్ర వెళ్లను.

బృందావనము పట్ల ఇట్టి నిష్ఠను చూపిన ధన్యాత్మునికి అన్నియు తానై శ్రీధామము స్వీకరిస్తుంది.

**సా మే న మాతా సచ మే పితా న సమే న బంధుః సచమే సఖా న**
**సమే న మిత్రం సచ మే గురుర్న యో మే న వృందావన వాస మాదిశేత్ 35**

నాకు బృందావన నివాసమునకు అనుజ్ఞ ఇవ్వకపోతే తల్లి, తండ్రి, బంధువు, సఖుడు, మిత్రుడు, చివరికి గురువు కూడ లేనట్లే! ఉన్నట్లు వారిని నేను గుర్తించను.

"మాతా నాస్తి పితా నాస్తి నాస్తి బంధు సహోదరః" అని శ్రీశంకర భగవత్పాదులు అన్నట్లు బృందావన మహాత్ములు కూడ అదే భావమును ప్రకటించినారు.

**తచ్ఛాస్త్రం మమ కర్ణమూలమపి న స్వప్నేఽపి యాయాదహో**
**శ్రీవృందా విపినస్య యత్ర మహిమా నాత్యద్భుతః శ్రూయతే**
**తే మే దృష్టి పథం న యాంతు నితరాం సంభాష్యతామాప్నుయుః**
**యే వృందావన వైభవే శ్రుతిగతే నోల్లాసినస్తే ఖలాః 36**

అహో! ఏ శాస్త్రము బృందావనము యొక్క అత్యద్భుత మహిమను గానం చేయదో ఆ శాస్త్రము స్వప్నములో కూడ నా చెవులలో పడకుండునుగాక! శ్రీబృందావన వైభవమును విని ప్రేమపూర్వకముగా ఉల్లసితులు కాని దుష్టజనులను చూడటానికి ఇష్టపడను. వారిని గురించి మాటాడుటకు కూడ ఇష్టపడను!

**అలమలమిహ యోషిద గర్దభీ సంగరంగైః**
**అలమలమిహ విత్తాపత్య విద్యాయశోభిః**
**అలమలమిహ నానా సాధనా యాస దుఃఖైః**
**భవత భవత వృందారణ్యమాశ్రిత ధన్యాః 37**

ఈ సంసారములో స్త్రీ రూపమైన గార్దభముతోడి సాంగత్య ఆనందము వలన ఏమీ ప్రయోజనము లేదు. ధన, పుత్ర, కీర్తి, విద్యాదుల ఆవశ్యకత కూడా లేదు. అనేకములైన సాధనలతో దుఃఖపడితే మాత్రం ఏమి ఔతుంది ? ఓహో! నీవు బృందావనమును ఆశ్రయించి ధన్యుడవుకమ్ము!

**వైకుంఠం కోటికోటి ప్రగుణితమపి నోయద్రజోలేశమాత్రమ్**
**ప్రోన్మీలత్ సౌభగర్ధేర్లవమపి లభతే శుద్ధ భావోజ్జ్వలాయాః**
**కుర్వీరన్ భక్తి కోటి భగవతి న తథాప్యద్భుత ప్రేమమూర్తేః**
**శ్రీరాధాయాఽభక్తైః కిమపి న కలితాం నౌమి వృందాటవీమ్ 38**

కోటికోటి గొప్ప గుణములు కలిగినా వైకుంఠము ఈ శ్రీబృందావన రజ కణ లవలేశమునకు కూడ సమానము కాదు. ఆ వైకుంఠమునందు శుద్ధ భావ పూర్ణ ఉజ్వల వృందావనము యొక్క నిరంతర వర్ధనశీలమైన శోభాసంపత్తి కూడ లేదు. అద్భుత ప్రేమమూర్తియైన శ్రీరాధికయందు భక్తిలేనిచో ఆ వైకుంఠనాథుని యందు కోటిరెట్లుగా భక్తిని ఆచరించినా అతనికి బృందావనము లభించదు. అట్టి శ్రీబృందావనమునకు నేను నమస్కరిస్తున్నాను.

**ఇదమపి భవితా కిం ? యత్ర కుత్రాపి వృందా**
**పదమపి మమ యాతం శ్రోత్రవీథీమకస్మాత్**
**మధుర మధుర రాధా మాధవానంగ ఖేలా**
**వనముపనయదంతర్ధాస్యతి ప్రేమమూర్ఛామ్ 39**

శ్రీబృందావనములో ఉండి, "బృంద" అను శబ్దము నా చెవులలో అకస్మాత్తుగా పడినంత మాత్రముననే శ్రీరాధామాధవుల ప్రేమక్రీడావనమైన బృందావన భావముతో నామనసు ప్రేమతో మూర్ఛిల్లగలదా! ఇట్టి భాగ్యము నాకు ఎప్పుడు కలుగుతుంది ?

**కదాను వృందావన వీథికా స్వహం పరిభ్రమన్ శ్యామలగౌరమద్భుతమ్**
**కిశోరమూర్తిద్వయమేక జీవనం పురః స్ఫురత్‌వీక్ష్యపతాని మూర్ఛితః 40**

హా! శ్రీబృందావన వీథులలో అన్ని చోటులలో సంచరిస్తూ; అద్భుత, గౌరశ్యామ, అభిన్న స్వరూపులైన శ్రీయుగళమును ఎదుట చూచి ఎప్పుడు మూర్ఛితుడినై పడిపోతానో కదా!

**కిమేతా తాదృక్ భాగ్యం మమ కలుష మూర్తేరపి భవే**
**న్నివాసో దేహాంతావధి యదిహ శ్రీవృందావన భువి**
**తయోః శ్రీదంపత్యోర్నవ నవ విలాసైర్విహరతోః**
**పదజ్జ్యోతిః పూరేరపితు మమ సంగోఽనుభవితా 41**

ఈ బృందావన భూమిపై మరణ పర్యంతము నివసించు భాగ్యము నా వంటి కలుషాత్మునికి లభిస్తుందా ? నిత్య నవనవాయమాన కేళితో విహార పరాయణులైన శ్రీరాధా శ్యామ యుగళ కిశోరుల చరణకాంతిపుంజ సన్నిధి లభించు భాగ్యము నాకు ఉన్నదా!

**భూతం స్థావర జంగమాత్మకమహో యత్ర ప్రవిష్ఠం కిమ**
**ప్యానందైక ఘనాకృతి స్వమహ సా నిత్యోత్సవం భాసతే**
**మాయాంధీకృత దృష్టిభిస్తు కలితం నానా వికల్పాత్మనా**
**తత్ వృందా విపినం కదాఽధి వసతః స్యాన్మేతనుశ్చిన్మయీ 42**

శ్రీధామములో స్థావర జంగమాత్మకమైన ప్రాణులు అన్నియు ఒకానొక అనిర్వచనీయ ఆనందఘన నిజతేజస్సులో నిత్యానందముతో విరాజితమై ఉన్నవి. కాని మాయావశులై గ్రుడ్డివారైన వారికి అవి అన్నియు వివిధములైన వికృతి రూపములతో కనిపిస్తున్నాయి. ఈ శ్రీబృందావనములో నివసిస్తూ నా శరీరము ఎప్పుడు చిన్మయత్వమును పొందుతుంది ?

**యత్ర ప్రవిష్టః సకలోఽపి జంతుః సర్వ పదార్థోఽప్యబుధైరదృశ్య**
**స్వానంద సచ్చిద్ఘనతాముపైతి తదేవ వృందావనమాశ్రయంతు 43**

ఈ శ్రీధామములో ప్రవిష్టమై ఉన్న సమస్త జీవ, వస్తువులును అజ్ఞానులకు అదృశ్యమై; స్వానంద సచ్చిదానంద స్వరూపమును పొంది ఉంటాయి. అట్టి బృందావనమును నీవు ఆశ్రయింపుము!

**వృందావనస్థేష్వపియేఽత్ర దోషానారోపయంతి స్థిర జంగమేషు**
**ఆనందమూర్తిష్వపరాధినస్తే శ్రీరాధికా మాధవయోః కథం స్యుః 44**

ఈ బృందావనములోని సమస్త స్థావర, జంగమాత్మక ప్రాణుల పట్ల మిథ్యాదోషారోపణ చేయు వ్యక్తి సమస్త ఆనందఘన స్వరూపులైన శ్రీబృందావన వాసుల పట్ల అపరాధము చేసినట్లే ఔతుంది! అట్టివారు శ్రీరాధామాధవులకు భక్తులు ఏవిధముగా ఔతారు ?

అంటే బృందావనములో ప్రతి అణువు శ్రీరాధాకృష్ణుల దివ్యప్రేమతో నిండి ఉంటుంది. కనుక ఎవరిపైన ఏపాటి అపరాధ భావమును కలిగి ఉన్నను ఆ వ్యక్తి శ్రీరాధామాధవుల ప్రేమదృష్టికి నోచుకొనజాలడు అని భావము!

**యే వృందావనవాసీ నిందనరతా యే వా న వృందావనమ్**
**శ్లాఘంతే తులయంతి యేచ కుధియో కేనాపి వృందావనమ్**
**యే వృందావనమత్ర నిత్య సుఖచిద్రూపం సహంతే నవా**
**తైః పాపిష్ఠ నరాధమైర్న భవతు స్వప్నేఽపి మే సంగతిః 45**

శ్రీబృందావనవాసులను నిందిస్తూ, బృందావనమును ప్రశంసింపకుండ ఉంటూ, అన్యప్రాంతములతో బృందావనమును కూడ సమానమని పోల్చుచు, ఈ భౌమ బృందావనము యొక్క నిత్య సచ్చిదానందమయ స్థితిని స్వీకరింపక (గుర్తింపక) జీవించువారు మందబుద్ధులు! అటువంటి పాపిష్ఠి నీచ పురుషులను నేను కలలో కూడ కలువకుందునుగాక!

**అసహ్యా బహు దుర్వచో యది వదంతి సాక్షాత్ స్త్రియమ్**
**బలాదపహరంతి చేత్ ప్రియసుతాదికం ఘ్నంతి వా**
**ధనాద్యపి చ జీవనం యది హరంతి వృందావన**
**స్థితాస్తదపి తే ప్రియా మమ భవంతి వంద్యాః సదా 46**

బృందావనవాసులు నన్ను అసహ్యాకరముగా దుర్భాషలు ఆడినను, నా ముందే నా భార్యను బలవంతముగా అపహరించినను, నా ప్రియ పుత్రాదికమును చంపుటకు ప్రయత్నించినను, ధనాదికమును అపహరించి నా జీవితమును నాశనము చేసినను; అట్లయ్యు వారు నాకు ప్రియమైనవారే, పూజింపతగినవారే!

బృందానిత్యనివాసము అత్యంత దుర్లభవరము! అట్టి వరమును పొందిన అదృష్టవంతులు దోషపూరితమైన పనులు చేయరు. కాని ఒకవేళ అంతటిఘాతుక కార్యములు చేసిననువారు పూజ్యులే అనుట ద్వారా బృందానివాసము లభించుట ఎంత దుష్కరమో చెప్పుటయే ఉద్దేశ్యము తప్ప బృందానివాసులైయుండి అటువంటి పనులు చేసెడు అవకాశము ఉన్నదని చెప్పుట కాదు!

**పరస్వస్త్రైయైక వ్యసనమపి నిత్యం పరవధూ**
**ప్రసక్తం విశ్వేషామహహ బహుధా హింసకమపి**
**దురాచారం లోభాద్యాన్ పహతమపి భ్రాత తరుణమ్**
**దివాంధస్తం వృందావనగతజనం నావగణయేః 47**

సోదరా! బృందావనవాసి ఇతరుల సంపదను హరించినా, నిత్యము పరస్త్రీయందు ఆసక్తితో ఉన్నా, సమస్త జగత్తును అనేక విధములుగా హింసించినా, లోభాది గుణములతో అంధునివలె ప్రవర్తించినా నీవు మాత్రము దురాచార బుద్ధితో ఆతనిని నిరాదరించకు! శ్రీబృందావనవాసి బాలసూర్యుని వంటివాడు! దివాంధమైన గుడ్లగూబ సూర్యుని చూడజాలనట్లు బృందావాసి యొక్క గుణసమూహమును గణించుటకు నీవు అసమర్థుడివి!

**పరధన పరదార ద్వేష మాత్సర్యలోభాఽ**
**నృత పరుషపరాభిద్రోహమిథ్యాభిలాపాన్**
**త్యజతి య ఇహ భక్తో రాధికా ప్రాణనాథే**
**న ఖలు భవతి వంధ్యా తస్య వృందావన 48**

ఏ భక్తుడు బృందా నివాసము పట్ల నిష్ఠను కలిగి ఉంటాడో; ఎవరు శ్రీరాధా ప్రాణనాథుని భక్తుడై పరస్త్రీ వ్యామోహాదులను వదలివేస్తాడో; ఎవరు ద్వేష, మాత్సర్య, లోభ, అసత్య, నిష్ఠురత, పరద్రోహాచరణాదులను వదలివేస్తాడో అట్టివానికి బృందావనము పట్ల ఆశ ఎన్నటికిని నిష్ఫలము కాదు! (అంటే బృందా నివాసము లభిస్తుందని అర్థం.)

**కురు సకలధర్మ ముంచ సర్వ స్వధర్మ**
**త్యజ గురుమపి వృందారణ్యవాసానురోధాత్**
**స తవ పరమ ధర్మః సా చ భక్తిర్గురూణామ్**
**స కిల కలుషరాశిర్యద్ధి వాసాంతరాయః 49**

శ్రీబృందావన వాసమునకై విన్నవించుకొనునపుడు (అవసరమైనచో) సమస్త అధర్మములను ఆచరించు, వర్ణాశ్రమ ధర్మములను కూడ త్యజించు. పెక్కుమాట లేల ? తలిదండ్రులను కూడ వదలిపెట్టు. నీ పరమధర్మము పరమ గురుభక్తియే! బృందా నివాసమునకు విఘ్నములను కలిగించు ఏ ధర్మాచరణమైనను అది అంతయు పాపరాశియే!

**నిర్మర్యాదాశ్చర్య కారుణ్య పూర్ణో**
**రాధాకృష్ణౌ పశ్యతశ్చేత్ కదాచిత్**
**యః కోఽప్యస్మిన్ యాదృశాస్తాదృశోవా**
**దేహస్యాంతే ప్రాప్నుయాదేవ సిద్ధిమ్ 50**

అవధులు లేని ఆశ్చర్యమయ, కారుణ్యపూర్ణ స్వరూపులైన శ్రీరాధాకృష్ణులు ఏదో ఒకనాడు ఇక్కడున్న ఎవరో ఒక వ్యక్తి వైపు తమ దృష్టిని ప్రసరింపజేస్తే ఆ వ్యక్తి శ్రీబృందావనములో దేహత్యాగము చేసి సిద్ధిని పొందగలడు.

**రాధా మధుపతి పాదాంబుజ భక్తిరస పూర దూరముక్తస్య**
**అజితేంద్రియస్య కృపయా మమ వృందారణ్యమాశ్రయో భవతు 51**

శ్రీరాధామాధవుల పదపద్మ ప్రేమికులైన భక్తులచే దూరమునుండియే నేను త్యజింపబడినను, ఇంద్రియవశుడినైన నాకు బృందావనము కృపతో ఆశ్రయమిచ్చును గాక!

**రాధామాధవపాదపంకజరజః ప్రేమోన్మదే తత్ప్రియ**
**క్రీడాకాననవాసిషు స్థిర చర ప్రాణిష్వపి ద్రోహిషు**
**ప్రద్వేషం పరమాపరాధమహహో త్యక్త్వేతరైరప్యఘై**
**ర్యుక్తోప్యా మరణాంతలబ్ధవసతి ర్వృందావనే స్యాత్కృతీ 52**

అహహ! శ్రీరాధా మాధవ చరణ కమల పరాగము నందు ప్రేమోన్మత్తమై యుండు ప్రియ క్రీడావనమైన బృందావనములో నివసించు స్థావర జంగమాత్మక ప్రాణులలో ఎవరైనను నీకు ద్రోహము చేసినను వానిపట్ల ద్వేషబుద్ధితో కూడిన మహాపరాధ భావమును వదలిపెట్టు! అన్యత్ర ఏదైన పాపమును చేసినను, మరణ పర్యంతము బృందావనములో నివసిస్తే అతడు పుణ్యాత్ముడు.

**న లోక వేదోద్ధృతమార్గభేదైరావిశ్య సంక్లిష్యత రే విమూఢాః**
**హఠేన సర్వం పరిహృత్య వృందావనాంతరే పర్ణకుటీం కురుధ్వమ్ 53**

ఓ మూఢుడా! లోక, వేద మార్గములలో ఆవిష్టుడవై (ఉండి) దుఃఖమును పొందవద్దు. అన్నింటినీ హఠపూర్వకముగా వదలి, బృందావనములో పర్ణ కుటీరమును నిర్మించుకొనుడు!

అంటే; లోకమర్యాదలను, వైదిక మార్గములను పాటించుటకన్నను బృందావనములో నివసించుట శ్రేష్ఠతరమని భావము!

**యత్తత్ వల్గంతు శాస్త్రాణ్యహహ జనతయాగృహ్యతాం యత్తదేవ**
**స్వం స్వం యత్తన్మతం స్థాపయతు లఘుమతిస్తర్కమాత్ర ప్రవీణః**
**అస్మాకంతూజ్జ్వలైకోన్మద విమల రసప్రేమ పీయూషమూర్తేః**
**శ్రీరాధాయాః విహారాటవిమిహన వినాఽన్యత్ర నిర్యాతి చేతః 54**

శాస్త్రములు ఏ వ్యవస్థను ఏర్పరచినను,లోకులు తమ ఇచ్ఛననుసరించి వానిని స్వీకరించినను, అల్పబుద్ధికలవారు తర్కించుటలో ప్రవీణులైనను, వారు కూడ తమ మత సిద్ధాంతమును స్థాపించినను; నా మనసు మాత్రము ఉన్మద విమల రసమయ ప్రేమామృతమూర్తియైన శ్రీరాధా విహార వనమును (బృందను) విడచి ఎటువైపుకి పోదు.

**స్నిగ్ధ శ్యామాభిరామచ్ఛవి మృదుమసృణోత్తప్త హేమావదాతమ్**
**జ్యోతిర్ద్వంద్వం కిశోరాకృతి మధురమహోత్ ఘూర్ణమానం రసేన**
**నిత్యం యత్రైవ ఖేలయతి మదనకలా కౌతుకేనాత్యుదారమ్**
**సారం సారాదశేషాదపి తదిహ ధనం శ్రీల వృందావనం నః 55**

ఓహో! ఒకరు స్నిగ్ధ శ్యామల మనోహర కాంతిధారి, రెండవవారు కోమల సుకుమారతప్త స్వర్ణకాంతి వంటి గౌరవర్ణ విశిష్టమైన కిశోరాకృతి (శ్రీరాధాకృష్ణులు)! వారు మధురమైన రసమునకు వశులై ఎగసిపడుతున్న జ్యోతిర్యుగళ స్వరూపులు! మదన కళాకౌతుకముతో వారు బృందావనములో మనోహర భావముతో నిత్యక్రీడ సలుపుతూ ఉంటారు. సమస్త భగవద్ధామములకును సారాతి సారమైన అట్టి ఈ బృందావనమే నా సర్వస్వము!

**అపార కరుణాకరం వ్రజవిలాసినీ నాగరమ్**
**ముహుః సుబహు కాకుభిర్నతిభిరేతదభ్యర్థయే**
**అనర్గల వహన్ మహాప్రణయ సీధు సింధౌ మమ**
**క్వచిజ్జనుషి జాయతాం రతిరిహైవ వృందావనే 56**

అపార కరుణాకరుడు, వ్రజవిలాసిని శ్రీరాధానాగరుడు అయిన శ్రీకృష్ణునికి పదేపదే అత్యంత వినయముతో నమస్కరించి ప్రార్థిస్తున్నాను. నిరంతర మహా ప్రణయామృత సాగర స్వరూపమైన ఈ భౌమబృందావనము నందు ఏ జన్మలోనైనను నాకు ప్రేమరతి ప్రాప్తించునుగాక! ఇదియే నా ప్రార్థన!

**నానామార్గరతోఽపి దుర్మతిరపి త్యక్త స్వధర్మోఽపి హి**
**స్వచ్ఛందాచరితోఽపి దూరభగవత్సంబంధ గంధోఽపి చ**
**కుర్వన్ యత్ర చ కామలోభవశతో వాసం సమస్తోత్తమమ్**
**యాయాదేవ రసాత్మకం పదమహం తన్నౌమి వృందావనమ్ 57**

అనేక మార్గముల యందు ఆసక్తితో ఉన్నను, దుర్మతియైనను, స్వధర్మమును పరిత్యజించినను, స్వేచ్ఛాచారియైనను, భగవత్సంబంధము లవలేశమైనను లేకపోయినను; కామ, లోభములకు వశీభూతమైనను బృందావనములో నివసిస్తూ ఉండుట వలన సర్వోత్తమ పదమైన శ్రీరాధాదాస్యము లభిస్తుంది. అట్టి రసాత్మక ధామమైన శ్రీబృందావనమునకు నమస్కరిస్తున్నాను.

శ్రీబృందావన నిత్యనివాసముతో సాటియైనది, మహత్తరమైనది మరొకటి లేనేలేదని ఫలితార్థము!

**ఇహ సకల సుఖేభ్యః సూత్తమం భక్తిసౌఖ్యమ్**
**తదపి పరమకాష్ఠాం సమ్యగాప్నోతియత్ర**
**తదిహ పరమ పుంసో ధామ వృందావనాఖ్యమ్**
**నిఖిల నిగమ గూఢం మూఢబుద్ధిర్న వేద 58**

ఈ లోకములో భక్తి సుఖమే సమస్తసుఖములలోను మిక్కిలి ఉత్కృష్టమైనది. శ్రీధామములో అట్టి భక్తి పరాకాష్ఠ స్థితిలో లభిస్తుంది. ఆ బృందావన నామక ధామము సమస్త వేదములకును నిగూఢమైనది! పురుషోత్తముని ధామమైన శ్రీబృందావనము మూఢబుద్ధులకు తెలియదు.

**భజంతమపి దేవతాంతరం యథాక్షరే బ్రహ్మణి**
**స్థితం పశువదేవ వా విషయ భోగ మాత్రే రతమ్**
**అచింత్యనిజ శక్తితః స్వగత రాధికామాధవ**
**ప్రగాఢరస దుర్గమం కురుత ఏవ వృందావనమ్ 59**

అనేకానేక దేవుళ్లను, దేవతలను ఉపాసించి నిర్విశేష బ్రహ్మమునందు నిష్ఠతో ఉండువారికిని, ఇంద్రియ వశులై భోగములయందే నిమగ్నులై ఉండు బుద్ధిహీనులకును కూడ శ్రీబృందావనము అచింత్యమైన, బలశక్తులతో కూడి తనయందు క్రీడిస్తున్న శ్రీరాధామాధవుల పట్ల ప్రగాఢ రసమును ప్రదానం చేస్తుంది. ఇతరలోకములతో పోల్చి చూస్తే బోధించుటకు అతీతమైన (రస) వ్యవస్థను బృందావనము ఏర్పరచినది.

**యత్కోట్యంశమపి స్పృశేన్ననిగమో యన్నో విదుర్యోగినః**
**శ్రీశబ్రహ్మ శుకార్జునోద్ధవముఖాః పశ్యంతి యన్నక్వచిత్**
**అన్యత్ కిం వ్రజవాసినామపి న యద్దృశ్యం కదాలోకయే**
**శ్రీవృందావనరూపమద్భుతమహం రాధా పదైకాశ్రయః 60**

శ్రీబృందావన రూపములోని కోట్యంశమును కూడ వేదము స్పృశింప లేకపోయింది. (వర్ణించలేకపోయింది.) యోగులు శ్రీధామ విలాసమును తెలుసుకొనలేకపోయారు. లక్ష్మీదేవి, మహాదేవుడు, బ్రహ్మ, శుక, అర్జున, ఉద్ధవాదులు కూడ బృందావనమును ఎన్నడు చూడలేదు. (బృందావన స్వస్వరూపమును

చూడలేదు.) ఇన్ని మాటలు ఎందుకు, కొందరు వ్రజవాసులు కూడ చూడలేక పోయారు. అట్టి అద్భుతమైన శ్రీబృందావనమును శ్రీరాధా చరణములనాశ్రయించి ఎప్పుడు చూడగలను ?

బృందావనము వేదములకు అతీతము, దేవతలకు అతీతము, తుదకు కొందరు వ్రజవాసులకు కూడ దుర్లభము! అట్టి బృందావన మహిమను తెలుసుకొనుటకై గురుకృపతో ప్రయత్నిస్తున్నాము.

**విస్మృత్యద్వైత మాత్రం ప్రణయమయ మహాజ్యోతిరేకార్ణవాంతః**
**శ్రీవృందారణ్యమత్యుజ్జ్వలదతుల రసాంబోధి తస్మిన్ సఖేత్వమ్**
**వేశోకించిత్ గృహీత్వోజ్జ్వలమఖిలకలా కోమలాభీరబాలా**
**ప్రాణశ్రీరాధికాయాః కిమపి రసనిధేశ్చాటుకారం భజేథాః 61**

ఓ సఖా! ద్వంద్వ వస్తువులను, ద్వంద్వ సంశయాదులను అన్నిటిని త్యజించు. ప్రణయపూర్ణ, మహాజ్యోతి స్వరూప, అత్యుజ్వల, నిరుపమాన రససాగరమైన శ్రీబృందావనములో ఎవరో ఒక భావయుక్త ఉజ్వల దాసీ వేషమును ధరించు. సమస్త కళానిధులైన గోపబాలికలతో కలసి వారి ప్రాణ స్వరూపమైన రాధాజీకి ఆనందమును కలిగించు శ్రీకృష్ణుని సేవింపుము!

**దుర్వాసనా సుదృఢ రజ్జుశతైర్నిబద్ధ**
**మాకృష్య సర్వత ఇదం స్వబలేన కృష్ణ**
**వృందావనే విహరతః సహ రాధయా తే**
**పాదారవింద సవిధం నయ మానసం మే 62**

హే కృష్ణా! దుర్వాసనారూపమైన, దృఢమైన శత శత రజ్జువులతో (త్రాళ్లతో) బంధింపబడిన నా మనసును నీ కృపాబలముతో విషయాదులన్నిటినుండి వెలుపలికి లాగుము! శ్రీరాధా సహితముగా విహరిస్తూ ఉండు నీ చరణ కమల సన్నిధిని ప్రసాదింపుము!

**వశీకర్తుం శక్యో నహి నహి మనాగింద్రియ గణో**
**గుణోఽ భూన్నై కోఽ పి ప్రవిశతి సదా దోషనిచయః**
**క్వ యామః కిం కుర్మో హరి హరి మయీౝ శోప్యకరుణః**
**స్వవాసం శ్రీవృందావన వితర మానన్య గతికమ్ 63**

ఇంద్రియములను ఏవిధముగ కూడ వశము చేసుకొనలేకపోతున్నాను. నాయందు ఒక్క మంచి గుణము కూడ లేదు. అనేక దోషములు నాలో నిత్యము ప్రవేశిస్తున్నాయి. హరి హరీ! నేను ఎక్కడికి వెళ్లగలను ? ఏమి చేయను ? విధాత కూడ నాపట్ల దయమాలినాడు. కనుక, హే బృందావనమా! అనన్యగతివైన నీవు నీయందు (శ్రీధామములో) నివసించు యోగ్యతను అనుగ్రహింపుము!

**జాతి ప్రాణ ధనాని యాంత సుయశోరాశిః పరిక్షీయతామ్**
**సద్ధర్మా విలయం ప్రయాంతు సతతం సర్వైశ్చ నిర్భర్త్స్యతామ్**
**ఆధివ్యాధిశతేన జీర్యతు వపుర్లుప్త ప్రతీకారతః**
**శ్రీవృందావిపినం తథాపి న మనాక్ త్యక్తుం మమాస్తాం మతిః 64**

జాతి, ప్రాణ, ధనాదులు వినష్టమైతే కానిమ్ము; కీర్తి అంతా పోయిన పోనిమ్ము, సద్ధర్మము కూడ నష్టమైన కానిమ్ము, లోకులు అందరూ నన్ను నిరంతరము తిరస్కరించిన తిరస్కరించనిమ్ము, ప్రారబ్ధము వలన నా శరీరము వందల కొలది వ్యాధులతో జీర్ణించి పోనిమ్ము – కాని నా బుద్ధికి మాత్రము బృందావనమును త్యజింపవలెనను లేశమాత్రపు ఆలోచన కూడ రాకుండునుగాక!

**రక్షతి సంసార భయాత్సదోషమప్యశేష దేహభృత్ బృందమ్**
**వృందావనమితి తేన ప్రథితం తన్నౌమి కాననం కిమపి 65**

అనేక దోషములతో కూడియున్నప్పటికీ సర్వప్రాణులను సంసార భయము నుండి రక్షించునది బృందావనము! అట్టి అనిర్వచనీయమైన కాననమునకు నమస్కరిస్తున్నాను.

**వృందారణ్యాదన్యత్ ప్రకృతేరంతర్బహిర్వాపి**
**నైవాస్తిమధుర వస్త్విత్యవకలితం యైర్నమస్తేభ్యః 66**

'ప్రాకృత, అప్రాకృత జగత్తులో బృందావనము తప్ప మరొక మధుర వస్తువు లేదు' అని ఏ వ్యక్తి గ్రహిస్తాడో అతనికి నేను నమస్కరిస్తున్నాను.

**విభ్రాజత్తిలకా కలింద తనయా నీరౌఘనీలాంబరో**
**దంచత్ కాంచనచంపకచ్ఛవిరహో నానా రసోల్లాసినీ**
**కృష్ణప్రేమపయోధరేణ రసదేనాత్యంత సమ్మోహినీ**
**గోపేంద్రాత్మజవల్లభా విజయతే రాధేవ వృందాటవీ 67**

శ్రీరాధకు ఏవిధంగా నుదుటిపై తిలకం శోభిస్తున్నదో శ్రీబృందావనం కూడ అదే విధంగా తిలకము (వృక్షము)తో భూషితయై ఉన్నది. శ్రీరాధ యమునా నదీ జలాల వంటి నీలాంబరము ధరించినట్లు బృందావనం కూడ యమునా జలరూప నీలివస్త్రాలను ధరించింది. శ్రీరాధ స్వర్ణచంపక కాంతివంటి దేహ కాంతితో ఉన్నట్లు బృందావనం కూడ స్వర్ణచంపకముల కాంతితో ఉన్నది. రాధాజీ ఎట్లు వివిధ వికాసరస ఉల్లాసినియో బృందావనం కూడ అట్లే ఫల, పుష్ప, ముకుళాది రసములతో విరాజిల్లుతున్నది. శ్రీరాధ శ్రీకృష్ణునికి ప్రేమ రసదాయకమైన మనోహర వక్షస్థలమును కలిగి ఉన్నట్లే బృందావనము కూడ కృష్ణునికి ప్రేమ వర్ధకమైన శ్రీరాధాకుండాది సరస్సులతో ఆనందాన్ని విస్తరింపజేస్తున్నది. ఈ విధంగా శ్రీరాధాజీ వలె బృందావనము కూడ శ్రీశ్యామసుందరునికి ప్రీతిని కలిగిస్తూ ఉంటుంది.

శ్రీప్రబోధానందులు ఈ శ్లోకములో శ్రీరాధకు, శ్రీబృందావనమునకు అద్భుతముగా అభేదమును ప్రతిపాదించినారు. శ్రీబృందావనము ఈ విధముగా రాధాజీకి రెండవరూపమై గోపేంద్రాత్మజునకు ఆనందమును కలిగిస్తున్నది.

**యస్మిన్ కోటి సురద్రువైభవయుతా భూసీరుహాః పోషకాః**
**భక్తిః సద్వనితా మహారసమయీ యత్ర స్వయం శ్లిష్యతి**
**యత్ర శ్రీహరిదాసవర్యగణితాః ఖట్వాయమానాః శిలా**
**స్తత్ వృందావనమద్భుతం సుఖమయం కోనామ నాలంబతే 68**

శ్రీబృందావనములో కోటి కల్పవృక్షముల కన్న వైభవముతో కూడిన వృక్షము అందరినీ పోషిస్తున్నది. మహారసమయసాధ్వి అనెడు భక్తి స్వయముగా ఆలింగనం చేసుకుంటున్నది. ఆధామం హరిదాసశ్రేష్ఠులతో (గిరిరాజు వంటి శ్రేష్ఠులతో) విరాజిల్లుతున్నది. అచటి శిలకూడ శయ్యవలె పని చేస్తుంది. అద్భుతమైన, సుఖమయమైన అట్టి బృందావనమును ఎవరు ఆశ్రయింపక ఉండగలరు ? (అందరు ఆశ్రయింతురని భావము!)

**విందంతి యావత్ ప్రణయం న మందా వృందావనే ప్రేమవిలాస కందే**
**తావన్న గోవింద పదారవింద స్వచ్ఛంద సద్భక్తి రహస్యలాభః 69**

మూఢుడు ప్రేమ విలాసమునకు మూలమైన బృందావనములో ఎప్పటి వరకు ప్రేమప్రాప్తిని పొందడో అప్పటి వరకు శ్రీగోవిందుని చరణకమలముల యందు నిస్సంకోచమైన విశుద్ధ భక్తి రహస్యమును కూడ పొందలేడు.

**స్మారం స్మారం నవజలధర శ్యామలం ధామ విద్యుత్**
**కోటిజ్యోతి స్తనులతికయా రాధయా శ్లిష్యమానమ్**
**ఉచ్చైరుచ్చైః స రససరసం ప్రోజ్ఝులీ జృంభమాణ**
**ప్రేమ్ణావిష్టో భ్రమతి సుకృతీ కోఽపి వృందావనాంతః 70**

ఒకానొక పుణ్యాత్ముడే కోటి విద్యుల్లతలను తిరస్కరించు దేహకాంతి కల రాధాజీచే కౌగిలించుకొనబడిన నీలమేఘ శ్యాముడైన శ్రీకృష్ణుని స్మరిస్తూ ఉంటాడు.

రసాలమున కన్న మధుర రసాలమైన, అత్యున్నత, ఉజ్వల, రసపూర్ణ, ప్రకాశవంత, ప్రేమపూర్ణ బృందావనములో అట్టి సుకృతియే సంచరిస్తూ ఉంటాడు.

**రాధాపదాంక భూషిత వృందారణ్యాం స్థలీషు నిర్భర ప్రేమ్ణా**
**హరిహరి! కదా లుఠామి ప్రతిపదం గలదశ్రురుల్లసత్ పులకః 71**

హరిహరీ! శ్రీరాధాచరణకమలములతో భూషితమైన బృందారణ్య ప్రదేశములలో ప్రగాఢ ప్రేమరసముతో, ప్రతిచోట అశ్రువులు జాలువారుతూ ఉండగా పులకితుడినై ఎప్పుడు నేను ఆధూళిలో పడుదునో కదా!

**పూర్ణోజ్జ్వల ప్రేమరసైక మూర్తిర్యత్రైవ రాధా విజయీ హరీతి**
**తదేవ వృందావనమాశ్రితానాం భవేత్ పరం భక్తిరహస్యలాభః 72**

పరిపూర్ణమైన, ఉజ్వల ప్రేమరస అద్వితీయ మూర్తియైన శ్రీరాధయు, విజయియైన శ్రీకృష్ణుడును శ్రీధామములో నిరంతరము విరాజమానులై ఉన్నారు. అట్టి బృందావనమును ఆశ్రయించిన వారికి పరమ ప్రేమభక్తి యొక్క నిగూఢ భావము తప్పకుండ ప్రాప్తిస్తుంది!

**సర్వం త్యక్త్వా సరస విశద ప్రేమ పీయూష సాంద్రే**
**వృందారణ్యాఽద్భుత తరులతా గుల్మకాద్యైర్మనోజ్ఞే**
**రాధాకృష్ణోజ్జ్వల గుణగణాన్ గాన మత్తాలి కీరైః**
**నీరేణాపి స్థితిమిహ తనోరధ్యవస్యా వసంతు 73**

శ్రీబృందావనములో విశుద్ధ రసాల ప్రణయామృత స్వరూపులైన శ్రీరాధాకృష్ణుల ఉజ్వల గుణములను ఉచ్చై స్వరముతో గానం చేస్తూ మత్తిల్లిన భ్రమరములు, చిలుకలు విరాజితమై ఉన్నాయి. అద్భుతమైన తరులతా గుల్మాదికముతో భూషితమైన ఈ మనోహర బృందావనములో సర్వమును త్యజించి, జలములతో దేహయాత్ర చేస్తూ నివసింపుము!

**శ్రీరాధాయాః కనక రుచిర జ్యోతిరంగచ్ఛటౌఘైః**
**శుద్ధ ప్రేమోజ్జ్వల రసమయైః సేవ్యమానం సమంతాత్**
**గోవిందస్యాంబుదరుచితనోర్జ్యోతిరంభోధి పూరః**
**సాంద్రానందాత్మభిరాపిచిత నౌమి వృందావనం తత్ 74**

శ్రీబృందావనము రాధాజీ యొక్క విశుద్ధ, ఉజ్వల, ప్రేమరసమయ స్వర్ణవర్ణ అంగకాంతి పుంజములతో నిరంతరము సేవింపబడుతున్నది. అట్లే గోవిందుని సాంద్రానంద నవీన నీల వర్ణ జ్యోతి సాగరముతోను పరివ్యాప్తమై ఉన్నది. అట్టి బృందావనమునకు నమస్కరిస్తున్నాను.

సాక్షాత్తు శ్రీరాధాగోవిందుల కాంతిపుంజములతో బృందావనము సేవింపబడుతున్నదట! అట్టి బృందామహిమ ఊహింపతరమా!

**నిందావాతుతిరేవ వా బహువిపత్ సంపత్తిరేవాస్తు వా**
**పాండిత్యం బత మూర్ఖతాపి యది వా రాగో విరాగోథవా**
**యత్ కించిద్భవతు శ్రుతేరపి మనాక్ లక్ష్యం నయత్ వైభవమ్**
**తత్ బృందావిపినం న జీవనమిదం స్వప్నేஉపి హాతుం క్షమః 75**

నిందయైనను, స్తుతియైనను; విపత్తుల యందైనను, సంపత్తులయందైనను; పాండిత్యమైనను, మూర్ఖత్వమైనను; రాగమైనను, విరాగమైనను; ఏదైననుకాని, కాకపోనీ; ఎవరి మహిమను వేదము బిందుమాత్రముగానైనను ఎరుగదో అట్టి జీవన స్వరూపమైన శ్రీబృందావనమును స్వప్నమందైనను త్యజింపజాలను!

**చండాల శ్వఖరాదివత్‌యది జనాః కుర్వంతి సర్వేతిర**
**స్కారం దుర్విషహంచ తేన నహి మే ఖేదస్తనీయానపి**
**దేవాదేవ్య ఇమే చ భూత నివహాః ప్రాణాశ్చదద్యుర్మహా**
**స్నేహాత్తుష్టిమతో న మే గురు తృషో వృందావనీయే రసే 76**

లోకులు అందరు నన్ను చండాలునిగ, కుక్కగా, గాడిదగా, నీచునిగా తిరస్కరించినను నాకు కొంచెము కూడ దుఃఖము లేదు. ఇచటి గోపేశ్వరాది దేవగణములు, బృందాది దేవీ గణములు, దృశ్యమానమైన పశుపక్ష్యాది వృందావన వాసీ గణము మొ॥నవి అన్నీ మహాస్నేహముతో బృందావన రసప్రాప్తికై మిక్కిలి తృష్ణతో ఉన్న నాకు సంతోషమును ఇవ్వకుండునా! (తప్పక ఇచ్చునని భావము.)

**భ్రాతః సమస్తాన్య సాధనాని విహాయ వృందావనం స్వాశ్రయస్వ**
**యథాతథా ప్రాక్తన వాసనావశాచ్ఛరీరం వాణీ హృదయం విచేష్టతామ్ 77**

సోదరా! ప్రారబ్ధవాసనలకు వశీభూతమైన శరీరము, మాట, హృదయము చేష్టారహితముకాగా; సమస్త సాధనలను పరిత్యజించి బృందావనమును ఆశ్రయింపుము!

అవగుణములు ఎన్ని ఉన్నను, బృందావనమును ఆశ్రయించిన మాత్రమున సాధకుడు రక్షింపబడుతాడు.

**తాదృక్ కామో భవతు భగవన్ యేన కస్యాంచిదేణీ**
**దృశ్యాసక్తోఽ స్పృహహ న బహిర్యామి వృందాటవీతః**
**తాదృక్ దంభోఽ ప్యుదయతు తథాఽ హం కృతిశ్చాపి మే స్యాత్**
**యేనాప్యస్మిన్ రసమయ వనే రోచయే నిత్యవాసమ్ 78**

హే భగవాన్! అనిర్వచనీయ మృగనయనియైన శ్రీరాధా చరణకమలముల పట్ల ఆసక్తితో ఉండునట్టి పనిని నాకిమ్ము! బృందావనము నుండి అన్యత్ర వెళ్లవలెనని నేను కోరుకొనుట లేదు. నాలో దంభము ఉదయింపవచ్చును, అహంకారము కూడ కలుగవచ్చును. ఎట్లయినను ఈ రసమయ బృందావనములో నిత్యనివాసము ఉండవలెనను రుచి కలుగునుగాక!

**వరం వృందారణ్యే హరిహరి కరే ఖర్పరభృతో**
**భ్రమామో భైక్ష్యార్థం శ్వపచగృహ వీథిషు దినశః**
**తథాపి ప్రాచీనైః పరమ సుకృతైరత్ర మిలితమ్**
**న నేష్యామోఽన్యత్ర క్వచిదపి కథంచిత్ వపురిదమ్ 79**

హరిహరీ! శ్రీబృందావనములో చేతిలో భిక్షాపాత్రను ధరించి చండాలుని ఇంట భిక్షను స్వీకరించుటను సత్కార్యముగా భావిస్తాను. కాని, పూర్వకృత మహాపుణ్య ఫలముగా ఈ బృందావనమునకు వచ్చిన శరీరాన్ని మాత్రము ఎట్టి పరిస్థితులలోను బృందావనమును దాటి వెలుపలికి వెళ్లనివ్వను!

ఎన్ని ఇబ్బందులు ఎదురైనను బృందావనమును విడువకుండుట అను అనన్యనిష్ఠను సాధకుడు కలిగి ఉండవలెనని శ్రీప్రబోధానందులు ఇచట చెప్పుచున్నారు.

**జరత్కంథామేకాం దధదపి చ కౌపీనమనిశమ్**
**ప్రగాయన్ శ్రీరాధామధుపతి రహః కేలిలహరీమ్**
**ఫలం వా మూలం వా కిమపి దివసాంతే కబలయన్**
**కదా నేష్యే వృందావన భువి దశాం జీవనమయీమ్ 80**

జీర్ణించిపోయిన ఒక వస్త్రమును, కౌపీనమును ధరించి నిరంతరము శ్రీరాధామాధవుల గుప్తరసకేళీ తరంగములలో తేలియాడుచు; ఉచ్చైస్వర, భావములతో కీర్తిస్తూ; సంధ్యాసమయమునకు ముందుగా ఫలమూలాదులను భుజిస్తూ ఎప్పుడు నేను ఈ బృందావన భూమి యందు జీవితమును గడుపుతాను ?

**ప్రకృత్యుపరి కేవలే సుఖనిధౌ పరబ్రహ్మణి**
**శ్రుతి ప్రథిత వైభవం పరపదం వికుంఠాభిధమ్**
**తదంతరఖిలోజ్వలం జయతి మాథురం మండలమ్**
**మహారసమయం సఖే! కలయ తత్ర వృందావనమ్ 81**

ప్రకృతికి ఆవల శుద్ధ పరబ్రహ్మానుభూతిమయ సుఖ సముద్రమునందు వేద ప్రసిద్ధ మహిమాయుక్తమైన వైకుంఠ నామక పరమ పదము స్థితమైయున్నది. దానికి పైన సర్వోజ్వలమైన మథురామండలము జయయుక్తముగా విరాజితమై ఉన్నది. ఓ సఖా! అచట స్థితమైయున్న, మహారసమయమైన శ్రీబృందావనమును ధ్యానింపుము!

**కదా వృందారణ్యం శ్రవణ రసన స్పర్శన నిరీ**
**క్షణ ఘ్రాణాద్యైర్మే భవతి రససింధు స్రవదివ**
**కదా వా తల్లోకోత్తర రసమదాంధో మధుపతేః**
**గుణానుచ్చైరుచ్చైః సరసమిహ గాస్యామి పరితః 82**

శ్రీబృందావనము శ్రవణ, రసన, స్పర్శా, దర్శన, ఘ్రాణాదుల ద్వారా ఎప్పుడు నాపై రస సముద్రమును వర్షిస్తుంది ? ఎప్పుడు నేను ఆ లోకోత్తర రసము నందు ప్రేమాంధుడినై శ్రీరాధాపతి గుణములను ఉచ్చైస్వరముతో సర్వత్ర పాడుతూ తిరుగుతాను!

**స్వానంద సచ్చిద్ఘన రూపతామతిర్యావన్న వృందావనవాసి జంతుషు**
**తావత్ ప్రవిష్టోఽపి న తత్ర విందతే తతోఽపరాధాత్ పదవీం పరాత్పరామ్ 83**

శ్రీబృందావనవాసులైన ప్రాణులయందు అవి స్వానంద సచ్చిద్ఘన రూపములు అను బుద్ధి ఎప్పటి వరకు కలుగదో అప్పటి వరకు బృందావనములోనే ఉన్నప్పటికీ ఆ అపరాధము వలన 'శ్రీరాధా దాస్య పదము' అనెడు పరాత్పర పదవి లభింపదు.

శ్రీరాధా కైంకర్య పదవి లభింపవలెనన్న కేవలము బృందావనములో నివసించుట మాత్రమే చాలదు. శ్రీధామమునందలి సమస్త ప్రాణుల యందు అవి 'ఆనందపూర్ణమైన సచ్చిద్ఘన స్వరూపములు' అను ఎరుకతో ఉండవలెనని శ్రీప్రబోధానందులు చాటి చెప్పుచున్నారు.

**యద్దైవ సచ్చిద్రసరూపబుద్ధి వృందావనస్థ స్థిర జంగమేషు**
**స్యాన్నిర్వ్యలీకం పురుషస్తదైవ చకాస్తి రాధాప్రియ సేవిరూపః 84**

బృందావనమునందలి స్థావర జంగమాత్మక ప్రాణులయందు కపటములేని సచ్చిద్రస రూపబుద్ధి ఎప్పుడు కలుగుతుందో అప్పుడే మానవునికి శ్రీరాధా ప్రియసేవా యోగ్యత లభిస్తుంది.

**సకల విభవసారం సర్వధర్మైక సారమ్**
**సకల భజనసారం సర్వసిద్ధ్యైక సారమ్**
**సకల మహిమసారం వస్తు వృందావనాంతః**
**సకల మధురిమాంభోరాశిసారం విహారమ్ 85**

శ్రీబృందావనములో సంచరించుట సమస్త సంపదలకును సారము; సమస్త ధర్మములకు, సమస్త భజనలకు సారము! సమస్త సిద్ధులకు, సమస్త మహిమలకు సారము! సమస్తమైన మాధుర్య సముద్రమునకును అదియే సారవస్తువు!

**దైవీవాక్ ప్రతిషేధినీ భవతు మే స్యాత్ వా గురూణాం గిరామ్**
**శ్రేణీశాస్త్ర విదామహోస్తు బహుధా యః కోఽపి కోలాహలః**
**త్యక్త్వా సాధ్య సాధన జాతమఖిలం లగ్నంతు మే రాధికా**
**క్రీడాకాననవాస సంపది మనాక్ వ్యావర్తతే నో మనః 86**

శ్రీబృందానివాసమును నిషేధించు మాట దేవతా వాణియైనను, గురుజనుల మాటయైనను; శాస్త్రజ్ఞులు అనేక ప్రకారములుగా విషయములను కోలాహలముగా నా చెవినిపడునట్లు చేసినను పట్టించుకొనను! సమస్తములైన సాధ్యసాధనములను పరిత్యజించి; శ్రీరాధాక్రీడా కాననము నందు నివసించుట అను సంపదలో లగ్నమైన నా మనసు లేశమాత్రముగ నైనను దాని నుండి మరలదు.

"గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః ...... " అనునది మన సంప్రదాయము! కాని బృందానివాసమును నిషేధించినచో అట్టి గురువును కూడ త్యజించుట తప్పుకాదు. ఎందుకంటే సద్గురువు ఎన్నటికినీ శ్రీబృందావనమును తిరస్కరింపడు! తిరస్కరించాడు అంటే అతడు కుహనాగురువు అని అర్థము.

**ప్రగాయన్ నటన్నుద్ధసన్ వా లుఠన్ వా**
**ప్రదాయన్ రుదన సంపతన్ మూర్ఛితో వా**
**కదా వా మహాప్రేమ మాధ్వీ మదాంధ**
**శ్చరిష్యామి వృందావనే లోకబాహ్యః 87**

లోకలజ్జను వదలి, మహాప్రేమ అనెడు మకరందమును పానము చేసి మత్తిల్లి; ఉచ్చస్వరముతో గాన, నృత్య, అట్టహాసాదులను చేస్తూ నేను ఎప్పుడు వ్రజభూమిపై పొరలాడుతాను ? ఎప్పుడు నేను బృందలో పరుగులు తీస్తూ, రోదిస్తూ భూమిపై పడి మూర్ఛితుడినౌతాను ? ఇట్టి భావములతో నేను ఎప్పుడు బృందావనములో ఆయా ప్రదేశములలో సంచరిస్తాను ?

**న లోకం న ధర్మం న గేహం న దేహమ్**
**న నిందాం న స్తుతిం నాపి సౌఖ్యం న దుఃఖమ్**
**విజానన్ కిమప్యున్మదః ప్రేమమాధ్వ్యా**
**గ్రహగ్రస్తవత్ కర్హి వృందావనే స్యామ్ 88**

లోకమును, ధర్మమును, గృహమును, దేహమును, నిందాస్తుతులను, సుఖదుఃఖాదులను దేనిని పట్టించుకొనక; బృందావనములో ఒకానొక అనిర్వచనీయమైన ప్రేమమధువును పానము చేసి ఉన్మత్తుని వలె, గ్రహగ్రస్తుని వలె ఎప్పుడు నేను ఉంటాను!

**హరే కృష్ణ కృష్ణేతి కృష్ణేతి ముఖ్యాన్ మహాశ్చర్య నామావలీసిద్ధమంత్రాన్**
**కృపామూర్తి చైతన్యదేవోపగీతాన్ కదాభ్యస్య వృందావనే స్యాం కృతార్థః 89**

కరుణావతారులైన శ్రీచైతన్యులు గానం చేసిన "హరేకృష్ణ హరేకృష్ణ" ఇత్యాదిగానున్న మహాశ్చర్య నామావళీరూప సిద్ధమంత్రమును అభ్యసిస్తూ, అభ్యసిస్తూ ఎప్పుడు నేను శ్రీబృందావనములో కృతకృత్యుడిని ఔతాను ?

**హేమ స్ఫాటిత పద్మరాగరచితై ర్మాహేంద్రనీల ద్రుమైః**
**నానారత్నమయ స్థలీభిరలిఝంకారైః స్ఫుటత్ వల్లిభిః**
**చిత్రైః కీరమయూర కోకిలముఖైర్నానా విహంగైర్లసత్**
**పద్మాద్యైశ్చ సరోభిరద్భుతమహం ధ్యాయామి వృందావనమ్ 90**

శ్రీబృందావనము హేమ స్ఫటిక పద్మరాగాదులతో విరచితమై, మహేంద్ర నీలమణి జటితమైన వృక్షములతో శోభిస్తూ, నానా రత్నమయ ప్రదేశములతో సజ్జితమై, భ్రమరఝంకారముతో కూడిన పుష్పిత లతలతో విభూషితమై, విచిత్రమైన శుక మయూర కోకిలాది పక్షులతో గుంజారితమై; వికసిత కమలములతోను, సుగంధిత సరోవరములతోను అలంకృతమై ఒప్పుచున్నది. అట్టి అద్భుత బృందావనమునే నేను ధ్యానిస్తున్నాను.

**తాంబూల పానక మనోహర మోదకాది**
**రమ్యే లసన్మృదుల పల్లవ చారుతల్పే**
**ద్వారస్థితాలిభిరహో సుహృదావవేక్ష్య**
**వృందావనం స్మర నికుంజ గృహేర్మనోజ్ఞమ్ 91**

శ్రీధామములో తాంబూల, పానక, మోదకాది ఖాద్య పదార్థములనుగొని సుహృద్భావుకులైన సఖియలు కోమల రమ్య పల్లవములతో అలంకృతమైన

శయ్యపైనున్న శ్రీయుగళమును ద్వారము చెంతనిలచి చూచుచున్నారు. అట్లు బృందా నికుంజలో మనోహరులైయున్న శ్రీయుగళమును స్మరింపుము!

**క్వచిద్రతి విమర్దిత ప్రసవ తల్పకైః కుత్రచిత్**
**రతోపకరణాన్విత ప్రియమృదు ప్రసూనాస్తరైః**
**క్వచిత్ ప్రమద రాధికా మధుపతి ప్రవృత్తోత్సవైః**
**సదా నవ నికుంజకైః స్మర సుమంజు వృందావనమ్ 92**

శ్రీబృందావనములో ఒకచోట ప్రేమమర్దిత పుష్పశయ్య ఉన్నది. వేరొకచో ప్రేమవిలాసమున ఉపయోగించు సామగ్రితో, ప్రీతికరమైన సుకుమార పుష్పములతో ఏర్పరచిన శయ్య ఉన్నది. ఇంకొకచోట ప్రేమమూర్తులైన శ్రీరాధాకృష్ణుల క్రీడోత్సవము జరుగుతున్నది. ఇట్లు నిత్యనూతన కుంజలతో మంజులమైన శ్రీబృందావనమును నిత్యము స్మరింపుము!

**రాధాకృష్ణరహః సుహృత్ క్షితిధరరస్యోపత్యకాసు స్ఫురన్**
**నానాకేలి నికుంజ వీథిషు నవోన్మీలత్కదంబాలిషు**
**భ్రామంభ్రామమహర్నిశం ననుపరం శ్రీరాసకేలి స్థలీ**
**రమ్యాస్వేవ కదా ప్రకాశితరహః ప్రేమ్ణా భవేయం కృతీ 93**

హా! శ్రీరాధాకృష్ణుల గుప్తలీలా సాధనమై హితకరియైన గిరిరాజ సానువులలో (లోతట్టు ప్రాంతములో) స్థితులై, నవ వికసిత కదంబ కుసుమములతో సువాసితమైన అనేక కేళీ నికుంజలలో అహర్నిశలు విహరిస్తూ, పరమరమ్యకేళీస్థలమైన బృందావనములో శ్రీయుగళకిశోరులు గుప్తలీలలు ప్రకటిస్తున్నారు. ఆ గుప్తలీలలను ప్రేమతో దర్శించి నేను ఎప్పుడు ధన్యాతిధన్యుడిని ఔతానోకదా!

**అలం క్షయిా సుఖ ప్రదైర్యవతి పుత్ర విత్తాదికైః**
**విముక్తి కథయాప్యలం మమ నమో వికుంఠశ్రియే**
**పరం త్విహభవే భవే భవతు వార్షభానవ్యథ**
**వ్రజేంద్రతనయో వనే లసతి యత్ర తస్మిన్ రతః 94**

అశాశ్వత సుఖమునిచ్చు స్త్రీ, పుత్ర, ధనాదికము వలన ఏమి ప్రయోజనము ? ముక్తిని గూర్చిన చర్చ వలన ఫలమేమిటి ? వైకుంఠధామము నందలి మహా ఐశ్వర్య సంపదలకు కూడ ఒక నమస్కారము! వృషభాను నందినియైన శ్రీరాధ, వ్రజేంద్ర నందనుడైన శ్రీకృష్ణుడు ఎక్కడ నిత్యక్రీడ చేస్తారో కేవలము ఆ బృందావనమునందే జన్మజన్మలకు నాకు ప్రీతి!

**నమామి వృందావనమేవ మూర్ధ్నా వదామి వృందావనమేవ వాచా**
**స్మరామి వృందావనమేవ బుద్ధ్యా వృందావనాదన్యదహం న జానే 95**

శ్రీబృందావనమునకు శిరస్సు వంచి నమస్కరిస్తాను. బృందావనమునే కీర్తిస్తాను. బుద్ధితో బృందావనమునే స్మరిస్తాను. బృందావనము వినా అన్యము నేదియు నేను ఎరుగను.

మనసా, వాచా, కర్మణా త్రికరణ శుద్ధిగా శ్రీబృందావనమునకే అంకితమైన ధన్యులను ఆ తల్లి కూడ విడువదు.

**రాధాపతి రతి కంద వృందావనమేవ జీవనం యేషామ్**
**తచ్చారణాంబుజరేణోరాశామేవాహమాశాసే 96**

శ్రీరాధా ప్రాణపతియైన శ్రీకృష్ణుని ప్రీతికి మూలమైన శ్రీబృందావనమే ఎవరికి జీవనాధారమో అట్టి వారి చరణకమల పరాగ ప్రాప్తికై ఆశతో ప్రార్థిస్తున్నాను.

**గుణంతి శుక శారికాః సుచరితాని రాధాపతేః**
**తదేక పరితుష్టయే తరులతాః సదోత్ఫుల్లితాః**
**సరాంసి కమలోత్పలాదిభిరధుశ్చ యత్ర శ్రియమ్**
**తదుత్సవ కృతే మనః స్మర తదేవ వృందావనమ్ 97**

బృందావనము నందలి శుక శారికలు శ్రీరాధాకాంతుని ప్రేమ కథను పలుకుతూ ఉంటాయి. తరులతాదులు కేవలము ఆతని తృప్తికోసమే నవనవ పుష్పములతో పుష్పిస్తూ ఉంటాయి. శ్రీరాధాపతికి ఆనందోత్సవమును ఇచ్చుటకే సరోవరములు కమలములు, ఉత్పలములతో మహాసౌందర్యమును సంతరించు కుంటాయి. ఓ మనసా! అట్టి బృందావనమునే స్మరించుము!

**నానాకేలి నికుంజమండపయుతే నానా సరోవాపికా**
**రమ్యే గుల్మలతాద్రుమైశ్చ పరితో నానా విధైః శోభితే**
**నానాజాతి సముల్లసత్ ఖగమృగైర్నానా విలాసస్థలీ**
**ప్రోన్మీలన్మణిరోచిషి ప్రియ! కదా ధ్యేయోఽసి వృందావనే 98**

హే ప్రియా! (మనసా) శ్రీబృందావనము అనేక విధములైన క్రీడానికుంజ మండపములతో మండితమైనది. అనేక సరస్సులు, బావులతో రమణీయముగనున్నది. అక్కడక్కడ నానా గుల్మ, లతా, వృక్షములతో శోభిస్తున్నది. నానా విధములైన, ఆనందమయములైన ఖగమృగములతో ఉల్లసితమైనది. అనేక ప్రకారములైన విలాస ప్రదేశములతో మహామణిమయ జ్యోతి ప్రకాశముతో వెలుగుతున్నది. అట్టి బృందావనములో ఎప్పుడు ధ్యానము చేయగలవు!

**యత్రైవాతి రసోన్మదం విహరతే మత్ప్రేష్ఠ వస్తుద్వయమ్**
**భక్తిః క్వాపి మహారసోత్సవమయీ యత్రైవ నిష్యందతే**
**యత్రైవ ప్రవిశంతి నైవ నిగమ శ్రేణీ గిరాం భంగయ**
**స్తస్మిన్నేవ మమాస్తు ధీః ప్రణయినీ వృందావనే పావనే 99**

ఎక్కడ అత్యంత రసోన్మత్తులైన నా ప్రియతమ యుగళము నిత్యవిహారము చేస్తూ ఉంటుందో, ఎక్కడ మహారసమయ ఉత్సవ పూర్ణమైన భక్తి నిరంతరము ప్రవహిస్తూ ఉంటుందో, ఎక్కడ వేదోపనిషత్తుల వాణి ప్రవేశింపలేదో అట్టి పావన బృందావనములో నా బుద్ధి ప్రీతిరసము నందు నిమగ్నమగునుగాక!

**వాణ్యాగద్గదయా కదా మధుపతేర్నామాని సంకీర్తయే**
**ధారాభిర్నయనాంభసాం తరుతల క్షోణీం కదా పంకయే**
**దృష్ట్వా భావనయా పురోమిలదివ స్వాంతైకభోగ్యం మహో**
**ద్వంద్వ హేమ హరిన్మణిచ్ఛవి కదా నంస్యే ముహుర్విహ్వలః 100**

హా! ఎప్పుడు నేను గద్గద స్వరముతో మధుపతియైన శ్రీకృష్ణుని నామావళిని సంకీర్తన చేస్తాను ? ఎప్పుడు కన్నీటి ధారలతో వృక్షముల క్రింది భూమిని పంకిలము (బురదగా) చేస్తాను ? తీవ్ర భావావేశముతో విద్యమానమైన శుద్ధ అంతఃకరణ కల భక్తులకు ఆస్వాదనీయులుగా ఉండు స్వర్ణనీలమణి ప్రభా స్వరూపులైన జ్యోతిర్మయ శ్రీయుగళమును ఎప్పుడు దర్శించి, ప్రేమ వివశుడినై మాటిమాటికి వారికి నమస్కరిస్తాను!

**వృందారణ్య నికుంజ సీమని వసన్ ప్రేమాతురశ్చింతయన్**
**స్వప్రాణైకధనం కిశోర మిథునం ద్రక్ష్యామ్యకస్మాత్ కదా**
**శ్యామాః కంచన చంద్రికారసమయీ గౌరీశ్చ కాశ్చిచ్ఛటాః**
**పశ్యామి శృణుయాంచ శీతమధురాః కశ్చిన్మిథో వాక్సుధాః 101**

శ్రీబృందావన నికుంజ సీమలో నివసిస్తూ, ప్రేమాతురుడనై సేవా చింతనను చేస్తూ చేస్తూ, ఎప్పుడు అకస్మాత్తుగా నా జీవనాధారమైన శ్రీయుగళ కిశోరులను దర్శించుకుంటాను ? అనిర్వచనీయమైన ఘనశ్యామవర్ణ మధురకాంతిని (శ్రీకృష్ణుని), రసమయ గౌరవర్ణ కాంతిని (శ్రీరాధను) ఎప్పుడు చూస్తాను ? ఎప్పుడు వారి చల్లని మధుర సంభాషణా సుధను ఆస్వాదిస్తాను ?

**వృందారణ్యే కిమపి జనతా దుష్ప్రవేశం ప్రదేశమ్**
**గత్వా ప్రోచ్చైర్నిజ దయితయోర్నామ జల్పన్నుదశ్రుః**
**అత్యంతాత్యాం వికలవికలో దివ్యమూర్త్యా కయాఽపి**
**శ్రీశ్వర్యాజ్ఞాకర మృగదృశా వాక్యసుధాస్వాసితః స్యామ** **102**

శ్రీబృందావనములోని ఒకానొక నిర్జన ప్రదేశములో ఆనందాశ్రువులను కార్చుచు; నా ప్రియతమ యుగళనామమును ప్రకృష్ట భావముతో, ఉచ్చైస్వరముతో కీర్తిస్తూ; అత్యంత వినయముతో మిక్కిలి విహ్వాలుడినై రాధాజీ యొక్క దివ్య మృగనయనియైన దాసి పలుకుచుండు వచనామృతముచే ఎప్పుడు ఊరటను పొందుతానో కదా!

**ఏతత్ కారుణ్య పుంజం కతిదిన కలిత స్వాశ్రయ ప్రౌఢ రాధా**
**కృష్ణాంఘ్రి ద్వంద్వగూఢ ప్రణయభర రసాభ్యంచితోదారదృష్టమ్**
**శ్రీమద్బృందావనం మే నిజపరశ్రీ చమత్కారి రూపేణ సాంద్రా**
**నందౌఘ స్యంది వప్రోచ్చలిత మధురిమైకార్ణవేనావిరాస్తామ్** **103**

ఈ ప్రకారముగా కరుణామయియైన శ్రీబృందావనము తన ఆశ్రయము నిచ్చిన తరువాత, శ్రీరాధాకృష్ణుల నిగూఢ స్నేహము చేత అభిషిక్తులైన ఉదార వ్యక్తులకే దృష్టి గోచరము ఔతుంది. సాంద్రానందమును ప్రవహింపజేయు శ్రీబృందావనము సాటిలేని, అవధులు లేని మహామాధుర్య సాగర స్వరూపమైన తన పరమ చమత్కార రూపమును నాహృదయములో ఆవిర్భవింపజేయును గాక!

**కదా సుదృఢ భావనోదిత నిజేష్టరూపం మనా**
**గపి స్మృత శరీరకేనిహ రసే ప్రవిష్టోద్భుతే**
**క్షణం కిమ్ ముహూర్తకం కిమథయామ మేవాస్థితో**
**బహిర్దృగపి ముగ్ధవత్ వ్యవహరామి శ్రీవృందావనే** **104**

దృఢమైన భావనాబలముతో ఉదయించిన నిజ ఇష్ట రూపమైన మంజరీ రూపమును స్మరించి, ఆ మంజరీ శరీరముతో అద్భుతమైన రాధా దాస్యమునందు ప్రవిష్టుడనౌతాను. ఒక క్షణము లేదా ఒక ముహూర్తకాలము, లేదా ఒక యామము పాటు బాహ్యదృష్టి ఉన్నను ఒకానొక విముగ్ధ స్థితిలో ఎప్పుడు నేను శ్రీబృందావనములో స్థితుడిని ఔతాను ?

**నాన్యత్ వదామి న శ్రుణోమి న చింతయామి**
**నాన్యత్ వ్రజామి న భజామి న చాశ్రయామి**
**పశ్యామి జాగ్రతి తథా స్వప్నేఽపి నాన్యత్**
**శ్రీరాధికారతి వినోదవనం వినాహమ్ 105**

శ్రీరాధారతి విలాసవనమైన బృందావనమును గూర్చి కాక ఇతరమును మాట్లాడను, ఏదియును వినను, అన్యవిషయచింతన కూడ చేయను. అన్యత్ర వెళ్లను, ఇతరమును భజింపను. అన్యాన్య దేవీదేవతలను ఆశ్రయించుట కూడ చేయను. జాగ్రదవస్థలోను, స్వప్నములోనైన ఇతరమైన దానిని దర్శించను.

శ్రీబృందావనము పట్ల అద్భుతమైన అనన్య నిష్ఠ! ఈ శ్లోకభావము శ్రీరాధాసుధానిధిలోని "రాధాకేళినికుంజ వీథిషుచరన్......" (138 శ్లో.) అను శ్లోక భావమును పోలియున్నది. ఇదియే కాదు, అనేక శ్లోకములలో 'శ్రీరాధాసుధానిధి' గ్రంథ ప్రభావము కనిపిస్తున్నది. రసికమహాత్ముల భావము, నిష్ఠ శ్రీధామమునందే లగ్నమై ఉంటాయి కదా!

**కిం మాం ఖేదయసే విముంచ వసనం తల్పోత్తమేఽస్మిన్ సుఖే**
**నాగత్య స్వపిహ త్యజ త్యజభుజం శ్లిష్యామి కాంతే! సకృత**
**ఆః కిం నిర్దయ ముంచముంచ న కిమప్యా పీడయే రాధికా**
**కృష్ణాలాపమిమం కదాను శ్రుణుయాం వృందాటవీ కీరతః 106**

నాగరి (శ్రీరాధ) : "ఎందుకు నువ్వు నన్ను గట్టిగా పట్టుకున్నావు ? నా వస్త్రమును వదలు".

నాగర్ (శ్రీకృష్ణుడు) : "ఉత్తమమైన ఈశయ్యపైకి సుఖపూర్వకముగా రమ్ము. కొద్ది సేపు శయనింపుము".

నాగరి : "నా చేతిని వదిలిపెట్టు, వదిలిపెట్టు".

నాగర్ : "ప్రియతమా! ఒక్కమారు ఆలింగనము చేసికొమ్ము".

నాగరి : "ఓ నిర్దయా! విడువుము, విడువుము".

నాగర్ : "నేను నిన్ను ఏమాత్రము బాధించుట లేదు కదా!"

శ్రీరాధాకృష్ణుల ఇట్టి పరస్పర ప్రేమ సంభాషణమును బృందావన శుకరాజము పలుకుచుండ వినగల భాగ్యము నాకు కలుగునా!

**కదా వా స్వచ్ఛందం దినరజని వృందావన వనే**
**చరన్నేకః స్వస్యద్భుత నవ నికుంజాలిషు విశన్**
**అకస్మాదేవాలౌకిక మధురకైశోర సువయాః**
**"ఇతో న త్వం యాయా" ఇతి మృదుగిరా వారయతి మామ్ 107**

రాత్రింబవళ్లు శ్రీబృందావనము యొక్క పన్నెండు వనములలోను స్వేచ్ఛగా సంచరిస్తూ, ఇంతకు మునుపు చూడని ఒక అద్భుత నికుంజలోనికి ఒంటరిగా వెళ్తే, అట ఒక మంగళకరమైన అదృష్టం సంభవిస్తుందా ? అకస్మాత్తుగా ఒకానొక అలౌకిక, మధుర కిశోరి మృదువైన మాటలతో "ఈ కుంజలోనికి నీవు పోరాదు" అని నన్ను ఎప్పుడు వారిస్తుంది ?

**కదా వా తూష్ణీకః శిథిలిత సమస్తవ్యాహృతి**
**స్త్యజన్ దీర్ఘశ్వాసం కథమపి గృహీతైక కబలః**
**సదా జాగ్రత్ప్రాయః క్షణముదిత తంద్రోఽ తి మధురమ్**
**తదాలోకే వృందావన భువి నిజ ప్రాణ మిథునమ్ 108**

శ్రీబృందావనములో మౌనముగా ఉంటూ, సమస్తములైన బాహ్య విషయములను వదలి; దీర్ఘ శ్వాసను తీసుకుంటూ, అతికష్టముతో ఒక్కముద్దను మాత్రమే భుజిస్తాను. ఈ విధముగా నిరంతరము జాగరూకతతో ఉంటూ, కొంతకాలమునకు వృద్ధాప్యము, తంద్రావస్థ (తల తిరుగుట వంటిది) పైబడి ఉన్నపుడు అయినా అతిమధురమైన ప్రాణయుగళకిశోరులను దర్శించుకుందునా!

**అకస్మాదేకస్మాన్నవ లలిత కుంజాత్ బత బహి**
**ర్భవత్ స్మిత్వా నవ్యం తరుణ మిథునం లౌకికమివ**
**గతోదూరం దృష్ట్వా పునరథ నివృత్య స్వదయితౌ**
**విలోక్యస్యాం వృందావనభువి మహాప్రేమ వికలః 109**

ఈ బృందావనములో హఠాత్తుగా ఒక నవలలిత నికుంజ నుండి చిరునవ్వులు చిందిస్తూ బయటికి వచ్చి, లౌకిక వ్యక్తులవలె ప్రకటితమైన నవీన యుగళ కిశోరులను చూచి; నేను ముడుచుకొని కొంత దూరము వెళ్లాను. తిరిగి, వెనుకకు మరలి నా ప్రియతమ యుగళ కిశోరులను దర్శించి మహాప్రేమతో వివశుడినౌతాను. ఎప్పుడు ఇట్టి భాగ్యము నాకు కలుగుతుంది ?

శ్రీ ప్రబోధానందులు శ్రీరాధాకృష్ణులను తనివితీరగా భావదర్శనం చేసుకుంటూ; రసోపాసకుడు ఎట్టి ఆకాంక్షతో ఉండవలయునో ఈ శతకములో వరుసగా బోధిస్తున్నారు.

**కదాపూర్ణ జ్యోత్స్నా రజతి ధవలే రాసవలయే**
**చరన్నేకో వృందావన పతివిలాస స్మృతి పరః**
**అకస్మాదానందాంబుధి లహరి కోలాహలమివ**
**ధ్వనిం దివ్య వేణోర్వలయ రసనాదేశశ్చ శ్రుణుయమ్ 110**

పూర్ణచంద్రకాంతిలో ప్రకాశిస్తున్న రాత్రివేళ, శ్రీరాస మండలములో శ్రీబృందావనపతియైన శ్రీకృష్ణుని విలాసాదుల స్మరణలో చిత్తమును నిలిపి; ఒంటరిగా సంచరిస్తున్నప్పుడు; ఆనందసాగర తరంగముల కోలాహలము వలె అకస్మాత్తుగా వినవచ్చు వేణువలయ, కింకిణీ, నూపురాదుల అలౌకిక ధ్వనిని ఎప్పుడు వింటాను ?

ఆహా! రసిక మహాత్ముల పట్ల శ్రీరాధాగోవిందులు ఎప్పుడు, ఎటువంటి ప్రేమవర్షమును కురిపిస్తారో ఎరుగలేము! శ్రీరాధాసుధానిధిలో హితసఖి శ్రీరాధాలీలలనన్నిటినీ దర్శిస్తూకూడ, ఎప్పుడు దర్శించుకుంటానో అని ఆకాంక్షించినట్లు శ్రీప్రబోధానందులు కూడ శ్రీదర్శనానుభూతిలో తేలియాడుతూ కూడ, మరీమరీ దానినే కోరుకుంటున్నారు. తద్వారా రసోపాసకులకు మార్గ నిర్దేశము చేస్తున్నారు.

**కదావా కస్యాపి స్ఫుట నవ కదంబస్య విటపే**
**స్ఫురత్ గోపీ భర్తుః కిమపి కలయే స్మర వదనమ్**
**కదా శ్రీరాధాయాః కుసుమచయ లోలంచ లలితమ్**
**కరం వీక్షే వృందావన భువి లతౌఘే క్వచిదపి 111**

ఈ భౌమ బృందావనములో ఒకానొక వికసిత కదంబ శాఖపై విరాజమానుడైన గోపీవల్లభుని అనిర్వచనీయ మృదుమందహాసముతో వెలుగుచున్న ముఖమును ఎప్పుడు చూస్తాను ? ఇంకెప్పుడు ఒకానొక ప్రదేశములో లతల నుండి పూవులను సేకరించుచున్న శ్రీరాధ యొక్క చంచలమైన, లలితమైన కరకమలమును చూస్తాను ?

శ్రీప్రబోధానందులు భౌమ బృందావన దివ్యప్రకృతిలో మమేకమై వెలుగుచున్న శ్రీశ్యామాశ్యాములను దర్శిస్తూ, మనపట్ల కాతరులై ఆ దర్శన వైభవమును అందిస్తున్నారు.

**ఇదం మే కిం భావి! ద్రుతకనకగౌరచ్ఛవి హరి**
**న్మణి శ్యామం ధామద్వయమిహ మిథోంఽసార్పిత భుజమ్**
**నిరీక్షేతత్ స్మేరం మమ బహువిధ ప్రేమవిసృతమ్**
**సుఖం పశ్చాచ్ఛాయా ద్వయమథ పురోమూర్ఛయతి మామ్ 112**

హా! ఎప్పటికైనా నాకు అటువంటి భాగ్యం కలుగుతుందా ? పుటము పెట్టిన స్వర్ణము వలెనున్న గౌరకాంతితోను, ఇంద్రనీలమణి వలెనున్న శ్యామకాంతితోను వెలుగుతున్న శ్రీయుగళము ఒకరి భుజములపై మరొకరు చేతులు వేసుకున్న దృశ్యమును చూడగలనా! మృదుమందహాసముతో, ప్రేమ పూర్వకముగా సుందర ముఖమండలమును ప్రకాశింపజేస్తూ ఒకరికి ఎదురుగా మరొకరు కూర్చుండి ఎప్పుడు నన్ను విమూర్ఛితునిగ చేస్తారు ?

**అతిప్రేమౌత్కంఠ్యాత్ క్షితిషు విలుఠత మే వపురిదమ్**
**కరేణ స్పృష్ట్వా మాం విలుఠయతి రాధా ప్రియ యుతా**
**అహో వృందారణ్యేఽద్భుత మహిమ సీమన్యపి సుదు**
**ర్ఘటాశా కాఽప్యేకా సముదయతి హా కిం న భవితా 113**

ఓహో! అద్భుత మహిమకు సీమయైన శ్రీబృందావనములో ఒక అనిర్వచనీయమైన, అత్యంత అసంభవమైన ఆశ నా మనసులో కలుగుతున్నది. ప్రియతమునితో కలసి వచ్చుచున్న శ్రీరాధ మిక్కిలి ప్రేమోత్కంఠతతో నేలపై పడియున్న నన్ను చూచి తన శ్రీకర కరకమలముతో నన్ను లేవనెత్తి, తన చరణ కమలముల చెంత పడియుండునట్లు చేస్తుందా! హా! నా యీ ఆశ సఫలం ఔతుందా!

శ్రీ ప్రబోధానందులు ఇప్పటివరకు శ్రీయుగళమును దర్శించిన అనుభూతులను మనతో పంచుకొనినారు. ఇక ఇప్పుడు శ్రీరాధా కరస్పర్శను, చరణ స్పర్శను కోరుకొనుచున్నారు. ఆ కోరిక ఎంత అసంభవమైనది అయినను

అమ్మ తప్పక ఆ రసిక మహాత్ముని ఆకాంక్షను సఫలీకృతం చేసి ఉంటుంది. భక్తానుగ్రహకాతర కదా!

**కదా వా కాలిందీ తటనికట వృందావన లతా**
**నికుంజాంతః సుప్తం తదతి సరసం ప్రేష్ఠ మిథునమ్**
**మిథోగాఢశ్లిష్టం మృదుమృదు మయా లాలితపదమ్**
**ముదా వీక్ష్యే స్వప్నేఽప్యహహ సుఖనిద్రాం గతమహమ్ 114**

యమునా తీరములో శ్రీబృందావన నికుంజలో నిద్రిస్తున్న సరస ప్రియతమ యుగళ కిశోరులు గాఢాశ్లేషబద్ధులై ఉండగా, ఎప్పుడు నేను మృదుభావముతో (సఖీభావముతో) పదసంవాహనము చేస్తూ వారిని సుఖనిద్రావశులగునట్లు చేస్తాను ? హా! స్వప్నములోనైనా ఎప్పటికైనను అట్టి (సఖీభావమును పొందు) మహాభాగ్యము లభిస్తుందా!

శ్రీసరస్వతీపాదులు సఖీభావములోనున్న తనను రాధాజీ స్పృశించుటయే కాక, తాను అమ్మ చరణకమలములను స్పృశించి, సేవించు భాగ్యము నర్థిస్తున్నారు.

**మహైశ్చర్యానంత స్వమహిమ బలాదేవ సకలా**
**ధామస్యాప్యాశానాం వ్యతికరమసంభావ్యమపిమే**
**కదా వృందారణ్యం స్వవసతి కథామాత్ర ప్రవహత్**
**కృపాపూరం సంపూరయతు పరతోఽప్యర్బుద జనేః 115**

ఈ ధామములో నివసించుటకు ప్రార్థింపవలెనను సంకల్పమాత్రమున అత్యధికముగా కృపావర్షము కురుస్తున్నది. అట్టి శ్రీబృందావనము నావంటి అత్యంత అధముని అసంభవమైన ఆశలను అనంతమైన తన మహామహిమతో కోటికోటి జన్మలకైనను పరిపూర్ణము చేయునుగాక! ఇదియే నా ప్రార్థన!

**స్వకర్మస్రోతోభిః సతతమభి తశ్చాలిత మముమ్**
**ప్రభో! జీవం యత్ర క్వచిదపి నయాత్యంత వివశమ్**
**పరంత్వేతావన్మే భవతు భవదుఃఖార్దిత హృదోఽ**
**ప్యవిశ్రాంతం వృందావన పదపరైవాస్తు రసనా 116**

హే ప్రభూ! నా కర్మపరంపరలచే నిరంతరం బాధితుడినై, అశక్తుడినైన నన్ను నీ ఇచ్ఛానుసారము ఎటు అనుకుంటే అటు తీసుకొనివెళ్లు. కాని సంసార దుఃఖం చేత పీడితుడినై ఉన్నాను. అయినను ఎప్పటికీ నా నాలుక 'శ్రీబృందావన' నామమును, బృందావన గుణ కీర్తనను చేయుచుండునుగాక! ఇదియే నా ప్రార్థన!

**న సత్యాఖ్యేలోకే స్పృహయతి మనో బ్రహ్మ పదవీమ్**
**న వైకుంఠే విష్ణోరపి మృగయతే పార్షద తనుమ్**
**పరం శ్రీమద్బృందావన సరస భావోత్సవ వతామ్**
**నివాసే ధన్యానాం సుబహు కృమిజన్మాపి మృగయతే 117**

నా మనసు సత్యలోకములోని బ్రహ్మపదవిని స్పృశించుట లేదు. వైకుంఠములో శ్రీవిష్ణుపార్షదునిగా ఉండవలెనను అభిలాష కూడ లేదు. కాని, కేవలము శ్రీబృందావనములో ప్రేమరసమయ భావోత్సవపరాయణులైన మహాభాగ్యశాలుర ఇంటిలో మాటిమాటికి క్రిమి జన్మ లభించినా చాలునని ఆకాంక్షిస్తున్నాను.

**శ్రీమద్బృందావిపిన కుసుమామోదవాహీ సమీరో**
**యస్మిన్ దేశే సరతి తదవచ్ఛిన్న కృష్ణాప్లుతో వా**
**యేషాం వృందావనమను సకృత్ గ్రీవయా సన్నతం వా**
**తత్రైవాస్తాం మమ ఖలు జనిర్ధ్వంత తేషాం గృహేఽపి 118**

ఏ దేశములో శ్రీబృందావన పుష్పసౌరభముతో కూడిన, యమునా జలములతో కూడిన వాయువు ప్రవహిస్తూ ఉంటుందో; ఏ దేశములో బృందావనమునకై ఒక్కమారైనను శిరస్సును వంచుట జరుగుతుందో ఆ దేశములో, ఆ యింట నేను జన్మింతునుగాక!

**మమాపి స్యాదేతాదృశమిహ దినం కిన్ను పరమమ్**
**యదా వృందాటవ్యాః కథమపి కృతస్పర్శనమపి**
**అహో దేహం దూరాదపి సమవలోక్యాంత జనుషామ్**
**మహూర్ధన్యం మన్యేధరణి పతితః స్యాం కృత నతిః 119**

ఓహో! నా వంటి అధమునికి ఈ జన్మలో శ్రీబృందావనములోని ఏదో ఒక వస్తువును స్పృశించుట, దూరము నుండియే శ్రీబృందావనమును దర్శించుట అనుభాగ్యము లభిస్తుందా ? ఆ భాగ్యము లభించి నేను ధన్యాతిధన్యుడనని తెలిసికొని, భూమిపై పడి నమస్కారము చేస్తానా!

**యదపి చ మమ నాస్తి శ్రీల వృందావనీయే**
**మహిమని న సమో సర్వే హంతవిశ్వాసగంధః**
**యదపి చ మమ తస్మిన్నాస్తి వాసైషణాపి**
**ప్రసరతు మమ తాదృశ్యేవ వాణీ తథాపి 120**

సర్వోత్కృష్టమైన శ్రీబృందావన మహిమ పట్ల విశ్వాస గంధము కూడ నాకు లేదు. అక్కడ నివసించటానికి తగిన వాసన కూడ లేదు. హాహా! శ్రీబృందావన మహిమ, అక్కడ నివసింపవలెనను ఇచ్ఛతో కూడిన మాట నాలో స్ఫురించును గాక!

**అచైతన్య ప్రాయం జగదిదమహో సర్వవిదపి**
**ప్రథీయః శ్రీవృందావన మహిమ వీథీ జడమతిః**
**అహో భ్రామ్యత్ దృష్ట్యా విధి సదసత్ వర్త్మసు తథా**
**న పూర్ణః తస్యైవ ధ్రువమిహ నిషేవ పదరజః 121**

అహో! ఈ జగత్తులోని వ్యక్తులు ఎక్కువ మంది చైతన్య రహితులు, అంటే శ్రీచైతన్యమహాప్రభు చరణములను ఆశ్రయింపనివారు. కనుక వారు సర్వ శాస్త్రములను ఎరిగిన వారైనను శ్రీబృందావన మహామహిమా రూపమైన వీథుల విషయములో జడమతులు! అంటే శ్రీవన మహిమా మార్గమును వారు ఎరుగరు. హా! నేను కూడ మాయావాదము ఆదిగా కల సత్, అసత్ మార్గములలో తిరుగుతూ, నా మనోరథమును పూర్ణము చేసుకొనలేకపోయాను. కనుక, నేను శ్రీబృందావన చరణ రజమును సేవిస్తాను!

**హా వృందావన! హా మహారసమయ ప్రేమైక సంపన్నిధి**
**హా రాధారతి నాగర స్మరకలా సాక్షిన మదేక ప్రియా**
**హా రాసేశ్వర! విశ్వమూర్ఛన! లతావల్లీఖగాద్యద్భుత**
**శ్రీమన్! హా ప్రకృతే పరాదపిపర! త్వం మే గతిస్త్వం గతిః 122**

హే బృందావనమా! హే ఏకమాత్ర మహారసమయ ప్రేమ సంపత్ సాగరమా! హే శ్రీరాధారతినాగర స్మర కళాసాక్షీ! నా ఏకమాత్ర ప్రియా! హే రాసేశ్వరా! హే విశ్వవిమోహనా! లతావల్లీఖగాదిక అద్భుత సంపద్యుక్తా! హే ప్రకృతి పరా! శ్రీధామ వృందావనమా! నీవే నాకు ఏకమాత్రగతి! నీవే నాకు ఏకమాత్ర ఆశ్రయానివి!

**నమోస్తు వృందావన సుందరాభ్యాం నమోస్తు వృందావన విభ్రమాభ్యామ్**
**నమోస్తు వృందావన జీవనాభ్యాం నమోస్తు వృందావన నాగరాభ్యామ్ 123**

శ్రీబృందావన సుందర యుగళ కిశోరులకు నమస్కరిస్తున్నాను. బృందావన విహార యుగళమునకు నమస్కారము! బృందావన జీవన ప్రాణయుగళమునకు నమస్కారము! శ్రీబృందావన నాగర యుగళమునకు పునః పునః నమస్కృతులు!

**నమోస్తు వృందావన సత్కృపాభ్యాం నమోస్తు వృందావన సద్రసాభ్యామ్**
**నమోస్తు వృందావన పూర్ణతాభ్యాం నమోస్తు వృందావన గోచరాభ్యామ్ 124**

బృందావన కృపా స్వరూపముగా, బృందావనరసస్వరూపముగా, బృందావన పూర్ణత్వముగా బృందావనములో గోచరిస్తున్న యుగళకిశోరులకు పునః పునః నమస్కారములు!

శ్రీబృందావనము పట్ల శ్రీ ప్రబోధానందులకు గల తీవ్ర అనురాగము, ఆసక్తి, భక్తి శతకములన్నిటిలోను పరివ్యాప్తమై ఉన్నను; ఈ చివరి శతకములో చివర చివర మరింతగా అమృతత్వమును సంతరించుకున్నవి.

**వృందారణ్యోత్తమం నాస్తి నాస్తి మత్తోఽధమం క్వచిత్**
**రాధానామ్నః ప్రభావేణ యది స్యాన్మేలనం తయోః 125**

శ్రీబృందావనమున కన్నను అధిక శ్రేష్ఠమైనది మరొకటి లేదు. నాతో సమానుడైన అధముడు ఇంకొకడు లేడు. "శ్రీరాధా శ్రీరాధా" అను నామమును ఉచ్చరించు ప్రభావము చేత ఒక వేళ ఈ యిరువురికి (శ్రీబృందావనము, నేను) సంయోగము కలుగవచ్చును. (అన్యథా జరుగదు). శ్రీరాధానామము వినా బృందావనముతోడి సంయోగము, బృందా నివాసము ఎన్నటికిని జరుగదు.

**శ్రీమద్బృందావనేశ్వర్యాః సకృన్నామైక మంగళమ్**
**సర్వాశ్చర్యానంత శక్తిముఖే విజయతాం మమ 126**

శ్రీబృందావనేశ్వరిని (రాధాజీని) ఒక్కమారు "శ్రీరాధ" అను నామముతో తలచిన చాలును సమస్త మంగళములు ప్రాప్తిస్తాయి, అనంతమైన సమస్త శక్తులు వికాసమానమౌతాయి. అట్టి శ్రీరాధా నామము నిరంతరము నాజిహ్వాపై జయ యుక్తమై విరాజమానమగునుగాక!

సాధకుని ఆధ్యాత్మిక పురోగతికి సద్గురు చరణ కమలములే మూలాధారము! శ్రీప్రబోధానందులు ఆయా సందర్భములలో తమ గురుదేవులైన శ్రీచైతన్య మహాప్రభువును స్మరించినారు. శ్రీసరస్వతీ పాదులు "శ్రీబృందావన మహిమామృతము" అను దివ్యరసగ్రంథములోని (లభించిన) 17 శతకములలోను సాధకుల పట్ల కరుణను, ఆదరమును చూపించినారు. జగత్తులోని సుఖములు అనుకుంటున్న సాంసారిక విషయాదులు ఎంత దుఃఖకరములో, అశాశ్వతములో ఎలుగెత్తి చాటి చెప్పుచు; సాధకుని మనసును ఊర్ధ్వముఖముగా మరలించుటకు ప్రేమతో ప్రయత్నించినారు. శ్రీబృందావనము పట్ల వారికి గల గాఢమైన భక్తి ప్రపత్తులు వర్ణనాతీతము!

శ్రీబృందావనము రాధాజీకి రెండవ రూపమని నిర్ధారించుచు, ఆ అభిన్నత్వమును వారు సోదాహరణముగ ప్రకటించినారు. సాక్షాత్తు శ్రీకృష్ణచంద్రుడు బృందావన మృత్తికను నోటిలో వేసుకొనుటయే శ్రీధామ మహిమను, రసార్ద్ర లక్షణమును చాటిచెప్పుచున్నది. బృందావనమనిన రాధాజీకి ఎంత ప్రీతియో గ్రంథమందంతటను స్పష్టమగుచున్నది.

రాధాసఖీ స్వరూపులైన మన గురుదేవుల అనుగ్రహము వలననే బృందావన మహిమామృతమును ఆస్వాదించు మహాభాగ్యము మన అందరికీ లభించినది. ఇక మన మాతాజీ చెప్పినట్లు అందిన ఆ రస వస్తువును మననము చేసికొనుచు, బృందానిత్యనివాస భాగ్యమును పొందుదుముగాక!

**జయ జయ శ్రీరాధే**



శ్రీ రాధామహాలక్ష్మి అమ్మ

శ్రీరాధే

# శ్రీబృందావన మహిమ

శ్రీరాధాజీకి రెండవ రూపమైన శ్రీబృందావనములోనే శ్రీరాధా ఆరాధన ఫలిస్తుంది. శ్రీబృందావన విషయంలో తర్క, వితర్కాలతో కాని; పాండిత్యంతో కాని పని లేదు. ఎందుకంటే అపౌరుషేయములైన వేదములే 'నేతి నేతి' అంటూ నమస్కరించాయి. బృందావన నిత్యనివాసానికి కావలసిన యోగ్యత ద్వంద్వములకు అతీతులవ్వై, శ్రీరాధాగోవిందులయందే మనసును నిలుపుకొనుట!

సాక్షాత్తు శ్రీరాధాకృష్ణులకే శ్రీబృందావన శోభను చూచినకొద్దీ చూడవలెనను లోభము కలుగుతుందట! వారు తమ కన్నులతోనే నమస్కరిస్తూ ఉండే బృందావన మహిమ వర్ణింప శక్యముకాదు. బృందావనములోని ఉజ్వల రసమునకు శ్రీరాధాకృష్ణులే ఆశ్రయము! శ్రీమన్నారాయణుడు కూడ లక్ష్మీసహితుడై శ్రీధామమును పొందుటకు లోభంతో ఉంటాడు. శ్రీబృందావనానికి ఆత్మసమర్పణ చేసికొనవలెనను ఇచ్ఛను కలిగి ఉండటమే కోటి చింతామణులను పొందుటతో సమానము! త్రికాలములలోను శ్రీబృందావనమునకు అభిముఖముగ నిలచి, ఆ రజమునకు మాటిమాటికి నమస్కరించుట ఉద్ధరింపబడుటకు రాజమార్గము!

శ్రీబృందావనము పవిత్రతను పవిత్రం చేస్తుంది. అది మంగళములకు మంగళకరము! సారమునకు సారము! అత్యంత మహిమాన్వితమైన శ్రీబృందావనము పట్ల విడువరాని అనుబంధం ఏర్పడిన వ్యక్తి మహాత్ములకు మహాత్ముడు! అట్టివారికి శ్రీరాధామాధవులు తమ రసధారను అనుగ్రహిస్తారు. శ్రీబృందావనము రాధాజీకి అత్యంత ప్రీతిపాత్రమైనది. ఆధామమును శ్రీరాధ స్వయంగా స్తుతిస్తూ గానం చేస్తూ ఉంటుందట!

ఇట్టి నిగూఢ విషయాలను శ్రీప్రబోధానందులు దర్శన ప్రమాణంతో "బృందావన మహిమామృత" గ్రంథములో అందించినారు.

**జయతు జయతు శ్రీబృందావనధామ్!**